విష్ణుమాయానాటకము

చింతలపూడి యెల్లనార్యుఁడు.

౫౦౦ ప్రతులు.

శ్రీ విద్వజ్జన మనోరంజనీ ముద్రాశాల,
పీఠాపురము.
1937

పీఠిక

—:o:—

ఆంధ్ర సారస్వతము చరిత్రములో శ్రీకృష్ణదేవరాయల కాలము స్వర్ణయుగ మని చరిత్రకారు లనేకు లభిప్రాయపడి యున్నారు. పెలయున నాంధ్రమహాకవులలో పెక్కురు ఆ రాజన్యుని పోషణమునఁగాని యాదరణమునఁగాని బడసి నూతనగ్రంథరాజములను రచించి యాంధ్రసరస్వతిని బహుముఖములఁ గ్రొత్త నానందమునఁ దేజరిల్లునట్లు చేసిరి. శ్రీకృష్ణరాయచక్రవర్తి స్వయముగ నొక యాంధ్రప్రబంధగ్రంథమును "ఆముక్తమాల్యద" యను పేర రచించి తన యాస్థానకవులను దానిఁ జూపెను. తన యాస్థాన కవులలో నగ్రేసరుఁ డగు అల్లసాని పెద్దన్నయే మనుచరిత్రమును రచించి దానిని రాయ సంకిత మొసంగెను. అట్లే యాస్థానమునందుఁ బ్రాముఖ్యము నొందిన మరియొక కవివరుఁ డగు ముక్కు తిమ్మనార్యుఁడు రచించిన పారిజాతాపహరణ కావ్యమునకుఁ గృతినాయకుఁ డయ్యెను. ఇంతియ గాక మాదయ్యగారి మల్లన్న, ధూర్జటి మున్నగు కవిపుంగవులు తాము రచించిన గ్రంథములను రాయల వారి కంకితమొసంగినను, చక్రవర్తి యాస్థానమం దుండి వారిచేఁ బోషింపఁబడినట్లు చరిత్రాధారములు గాన్పించుచున్నవి. ఈకవు లందఱును వారి గ్రంథరాజముల మూలమున నాంధ్రులకుఁ జిరపరిచితులై తమ నామధేయములను, ఆంధ్రుల హృదయపీఠములం దజరస్థాయులుగాఁ జేయఁగలిగిరి.

వీరికి సమకాలికుఁడై వీరివలెనే శ్రీకృష్ణరాజేంద్రుని కొలువున నుండి, ఆ జేని మన్ననలకుఁ బాత్రుఁడైన యొక కవిశేఖరుఁ డింతదనుక విధివిపాకమున నాంధ్రుల దృష్టిలోఁ బడక యజ్ఞాతవాసమును జేయవలసివచ్చెను. అతఁడు చింతలపూఁడి యెల్లనార్యుఁడు. ఎల్లనార్యుఁ డొక యాంధ్రమహాకవి. అతఁడు శ్రీకృష్ణదేవరాయల యాస్థానమున నుండి తాను రచించిన రాధామాధవమను ప్రబంధరాజము నా కవిచక్రవర్తికి వినిపింప దాని యనదృశమనోజ్ఞత్వమునకు నచ్చెరువొంది యారసజ్ఞశేఖరుఁ డాకవికి "రాధామాధవకవి" యని యొక విశిష్టనామమును బిరుదముగా నిచ్చెను. అట్టి యద్భుతకావ్యప్రణేత ప్రాచీనగ్రంథాగార వివరములలో ననాదృతస్థితిలో నుండి కొలఁది కాలముక్రిందటివఱకు నాంధ్రుల యెఱుకలోనికి రాకుండుట మిక్కిలి శోచనీయమైన విషయము. భూగర్భమున నిక్షిప్తమైన కోహినూరువజ్రమును వెలికిఁ దీసినట్లు, ఈమహాకవిని చెన్నపురివిశ్వకళాపరిషత్తువారు తొలుదొల్త బయలుపఱచి యతని యుత్తమగ్రంథ మగు విష్ణుమాయానాటకమును విపులపీఠికతోఁ బ్రకటించిరి. అటుతర్వాత గోదావరీమండలమున నున్న కపిలేశ్వరపురాధినాయకుల యౌదార్యమూలమున నీకవియొక్క ప్రథమప్రబంధ మని చెప్పనొప్పు రాధామాధవము ముద్రితమై ప్రచురింపఁబడినది. అంతట, విద్వత్ప్రభువులును, మనోజ్ఞకావ్యరసికశిఖామణులును అగు శ్రీపీఠికాపురరాజ్యరమాధవు లగు శ్రీరాజా రావు వేంకటకుమార మహీ

పతి సూర్యారాయబహద్దరు మహారాజులుంగా రీ కవివరే ణ్యుని కావ్యరసాస్వాదనముఁ జేసి మరందబిందునిష్యందమంజరీ యుతము లగు నీకావ్యవల్లరుల కచ్చెరువొంది యిట్టియసమాన భాసమానకవితాప్రావీణ్యము గల కవి విశుద్ధయశఃప్రతిష్ఠ కర్హుఁ డు గాక తక్కొరు లర్హు లగుదురా యని తలపోసిరి.

మదరాసు విశ్వకళాపరిషత్తువారు ముద్రింపించినదియు నీ కవీం ద్రునిచే రచిత మైనదియు నైన విష్ణుమాయానాటకమును శ్రీ పిఠాపురము మహారాజావారు చదివి దానియందుఁ గొన్ని స్ఖాలి త్యము లుండుట గనిపెట్టి, యుత్తమప్రాచీనాంధ్రకవీశ్వరులలో నొకరిచే రచింపఁబడిన యీయుత్తమగ్రంథమున కిట్టి యవస్థ తగ దని యోచించి వారి యాస్థానమందలి కవీశ్వరులగు శ్రీయుత ఓలేటి వేంకటరామశాస్త్రిలవారిచే సమగ్రపరిశోధనముఁ జేయించి యేతద్గ్రంథమును బునర్ముద్రితముఁ గావించి తమసంస్థానమునఁ సంగ్రథిత మైనయాంధ్రగ్రంథమాలలో నొక నూతనప్రసూనముగఁ జేర్పించిరి.

శ్రీవారు ముద్రింపించిన యేతద్గ్రంథమును మదరాసు విశ్వ కళాపరిషత్తువారు ముద్రింపించిన గ్రంథమును సహృదయులు పరి శీలించిన నుభయగ్రంథముల తారతమ్యమును దేటతెల్ల మగును. పైనఁజెప్పినరీతిని మదరాసువిశ్వకళాపరిషత్తువారు ప్రకటించిన ప్రతి యందుఁ గాన్పించెడు తప్పులలోఁ గొన్ని ముద్రితపత్త్రముల నందం దు సూక్ష్మపరిశీలనము చేయింపక పోవుటచే ఘటిల్లిన వని తెలియ

వచ్చినను గొన్నిదోషము లన్వయప్రమాదాదులవలనఁ గలిగిన వని స్ఫురింపక మానవు. ఈ పునర్ముద్రణమున సంస్కరింపఁబడిన తప్పులలోఁ గొన్నిటినిమాత్రము మచ్చునకిచ్చుటఁ జేర్చితిని.

ప్రథమముద్రణపాఠము:—

ఉ. ఇందు కులప్రభూతపృథివీశ్వరుఁ పొదల పట్టభద్ర ల
క్ష్మిందనరారె యెక్కఁగఁ బ్రసిద్ధికి నెక్కను యూసముజ్వల
త్సుందరరత్న సింహముల శోభిలుచున్న పసిండిగద్దెఁ బెం
పొందఁగ నింద్రులీలఁ గొలువుండె సమస్తనృపదీపితాంఘ్రుఁడై
ఆ౧. ౫౧

సంస్కరింపఁబడిన పాఠము:—

ఉ. ఇందుకులప్రభూతపృథివీశ్వరు లొందలఁ బట్టభద్ర ల
క్ష్మిం దనరారి యెక్కఁగఁ బ్రసిద్ధికి నెక్కనయాసముజ్జ్వల
త్సుందరరత్నసింహముల శోభిలుచున్నపసిండిగద్దెఁ బెం
పొందఁగఁ నింద్రులీలఁ గొలువుండె సమస్తనృపదీపితాంఘ్రియై

ప్రథమముద్రణము.

వ. ఇవ్విధంబున వినోదించుచు రుక్మిణీదేవి తనమనంబున నిట్లనియె.
ఆ౧. ౧౭౧

ఉ. నాకును బారిజాతము మనంబెసలారఁ గనిచ్చెఁ బ్రేమతో
నాకడనే యహర్నిశము నాయకుఁ డుండఁగ వంతఁగుందుచున్
వ్యాకులితాత్మయై యెటులు వర్తిలుచున్నదొ సత్యభామనేఁ

డాకత చూతమంచు దరహాస విలాస విభాసితాస్యయై.

ఆ౧. ౧౬౨

వ. ఒక్క చతురసంచారికం బిలిచి క్రొవ్విరి పారిజాతమంజరులు
గొన్నికోయించి......... ఆ౧. ౧౬౩

సంస్కరింపఁబడినపాఠములు:—

సీ. ఇవ్విధంబున వినోదించుచు రుక్మిణీదేవి తన మనంబున

ఉ. నాకును బారిజాతము మనం బసలారఁగ నిచ్చి ప్రేమతో
నాకడనే యహర్నిశము నాఁడుకుఁ బుండెఁగ నింతఁగుందుచున్
వ్యాకులితాత్మయై యెటులువర్గిలుచున్నదొ సత్యభామ నేఁ
డాకత చూతమంచు దరహాసవిలాసవిభాసితాస్యయై.

వ. ఒక్క చతురసంచారికం బిలిచి క్రొవ్విరి పారిజాతమంజరులు
గొన్నికోయించి.........

పరిశీలనముద్రణము.

క. ఏమార్గంబున వచ్చెనో
యీమాయావేషధారి యిచటికి నీకాం
తామణి నెప్పుడు దలఁచెనో
కామకుశల నింతహృదయకంజంబలరన్. ఆ౧. ౧౬౪

సంస్కరింపఁబడిన పాఠము.

క. ఏమార్గంబున వచ్చెనో
యీమాయావేషధారి యిచటికి నీకాం

తామణి నెప్పుడు దనిపెనో
కామకళల నింత హృదయకంజం బలరన్.

ఇట్లే యనన్వితము లైన యనేకపాఠములు ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమునందలి మాతృకనుబట్టియు నాంధ్రసాహిత్య పరిషత్కార్యాలయమునందలి తాళపత్ర ప్రతినిబట్టియు మిక్కిలి జాగరూకతతోఁ బరిశీలించి సంస్కరింపఁబడినవి. మఱియును ముద్రణాదిదోషము లెన్నియో సవరింపఁబడినవి. గ్రంథవిస్తర భీతిచే స్థాలీపులాకన్యాయముగ నివిమాత్రమే చూపఁబడినవి కాని యింకను మఱి యెన్నియో కలవు. వాని నన్నిటిని పాఠక మహాశయులు పరికింతురుగాక !

చింతలపూఁడి యెల్లనార్యుఁడు శ్రీవత్స గోత్రమునకుఁ జేరిన విప్రవంశసంజాతుఁడు; కృష్ణభట్టారకుని పౌత్రుఁడును, రామనార్యునకును లచ్చమాంబకును జననమొందిన పుత్రుఁడును. ఈతని జన్మస్థానమునుగుఱించి పలువురు విమర్శకులు పలువిధముల నభిప్రాయపడుచున్నారు. ప్రథమమున మ॥రా॥రా॥ శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు తాము వ్రాసిన విష్ణుమాయానాటకపీఠికలో నీ విషయమునుగూర్చి విపులముగాఁ జర్చించి సహేతుకముగా నీ కవి బహుశః తూర్పుగోదావరిజిల్లా అమలాపురముతాలూకాలో నున్న చింతలపూఁడిగ్రామస్థుఁడుగ నుండవచ్చు నని నిర్ణయించిరి. తరువాత కీ. శే. నడకుదుటి వీరరాజుగారు తమ రాధామాధవ ప్రబంధపీఠికలో నొక విచిత్రవాదము చేసియీకవీశ్వరుని మూఁడు

జిల్లాలకు ముడిపెట్టిరి. ఇట్లుండ మ॥రా॥రా॥ శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు తాము వ్రాసిన రాధామాధవగ్రంథ విమర్శనములో *నీ కవి విశాఖపట్టణముజిల్లా సిరివల్లె తాలూకాలో నున్న చింతలపూండి గ్రామనివాసి కావచ్చునని యూహించిరి. ఈ నిర్ణయమునకుఁగాను వారు చూపిన యుపపత్తులు విశేషాద రింపఁ దగిన వని నా యభిప్రాయము. ఇది యిట్లుండ ఎల్లనార్యుని గ్రంథములనుండి మనము నిదర్శనములకొఱకు వెదకి చూచినచోఁ గొన్ని కాన్పించుచున్నవి.

ఎల్లనార్యుఁడు రాధామాధవములో శ్రీనాథుని స్తుతించి వ్రాయుచు:—

శా. సూనాస్త్రప్రమదామదస్ఫురిత వక్షోజాత కాంతిస్మయూని
బూనం జాలు వచోవిలాసముల నేర్పుం గాము ఆసి కిన్నెటుక
తన్మనాథేంద్రునకంగివిభ్వనిజయోగా స్నేహంబుం గనొన్న మా
శ్రీనాథుం గవిసార్వభౌముఁ గొలుతున్ సేవాంజలుల్ గ్రే
లోన్ కూనన్.

అని "మా శ్రీనాథుఁ" డని నుడివెను. ఇట్లు చెప్పుటలో శ్రీనాథునితో బంధుసంబంధమేమైన నుండెనేమో యని యను

---

* ఆ. సా. ప. ప. సంపుటము 25 సంచిక 2.

చింతలపూండి యను యింటి పేరు గల బ్రాహ్మణ కుటుంబములు వేంకటరావుగారు దెల్పిన ప్రదేశములలో నున్నట్లు నా [illegible] రాలేదు.

మానము గలుగుచున్నది. శ్రీనాథుఁడు పుట్టుకచే గుంటూరు నెల్లూరు జిల్లాల వాఁడయ్యును గొంతకాలము గోతమీతీరమున రాజమహేంద్రవరపట్టణమందు రెడ్డిరాజులకడఁ గడపినాఁడు గాన గోదావరిజిల్లావాఁడైన యెల్లనార్యుఁ డామహాకవిలోఁ గొంత బాంధవ్య ముండినట్లు చెప్పుకొనుటయుం దేమియు వింతె యుండదు. ఈ కవి తన తారకబ్రహ్మరాజములోఁ గృతిపోషకుఁ డగు నంజ తిమ్మయను వర్ణించుచు నిట్లు చెప్పెను.

ఉ. నావుడు నీకు నంకితమొనర్పఁ దలంచినవాఁడ బంధుసం
భావన నీకు నిష్టముగ బ్రహ్మమయుం డగు రామభద్రధా
త్రీవరమౌళి కంకిత మిదే యొనరించిన మంచి పైఁడికిం
దావి ఘటిల్లె నేమి యన నంజయతిమ్మ వివేకభూషణా!

ఈ పద్యమందును నంజ తిమ్మయవలన 'బంధుసంభావనము' నొందినట్లుగాఁ జెప్పికొనెను. ఇచ్చటి బంధుత్వము రక్తసంబంధమైన దైనయెడలఁ గర్ణాటబ్రాహ్మణుఁ డగు నంజ తిమ్మయతోఁ పాటు నీ కవియు బళ్లారి సీమప్రాంతములవాఁడై యుండవలెను. బహుశః ఇచ్చట సూచింపఁబడిన బంధుసంభావనము బంధుత్వముతో సమానమైన మైత్రియే యని యూహించుట లెస్స.

వీనియన్నిటికంటె నెక్కువయైన యాధార మొకటి యాతని కడపటిగ్రంథ మగు విష్ణుమాయానాటకమునుండి మనము చూపఁ గలము. ఆ గ్రంథమునందలి పంచమాశ్వాసమును బరిశీలించి చదివినచో నచటఁ గొంత సూక్ష్మాంశములతోఁ గూడిన స్థానికజ్ఞానము

మనకుఁ గాన్పించుచున్నది. ఆ స్థానికజ్ఞాన మచ్చట నివసించిన వారికిఁ గాని యితరులకుఁ గలుగుట దుర్లభము. ఏలయనఁగా నా స్థానికవిషయములు పురాణములందుఁ గాని మఱి యితరగ్రంథము లందుఁ గాని చెప్పఁబడియుండలేదు. కావున నానిరాధార మీ జన్మస్థాననిర్ణయములో నెక్కువగా నుపకరించునదిగా నున్నది.

పంచమాశ్వాసములో నారదమహామునిప్రాభవమును జెప్పునప్పుడు మహావిష్ణువు సర్పవరక్షేత్రమున నొక బైరాగి వేషము ధరించి యొక యాశ్రమము నేర్పఱచుకొనెనని నుడువఁబడినది. ఆసందర్భమున సర్పవరక్షేత్రస్థానమును వర్ణించుచు నప్పు డీ కవి యీక్రింది విధముగ వ్రాసెను.

క. నేదిష్ఠపటిష్ఠనాళా
స్వాదురసాభార్ద్రతుల్యభోగాబ్జాళా
మోదభరితహంసాళిన్
సాహ్లాదారావమ్ములఁ గేళిఁ జేసెన్.

క. సనిధిప్రాచీనమునన్
లవణజలధిఘుమఘుమితకలధ్వని కెనయౌ
సవనస్థశ్రోత్రియసుముఖ
వివిధరవం బావనమున వినులఁ దనిపెన్.

పైపద్యములందుఁ గ్రింద గీతలు గీచినపదములు చక్కఁగ యోచించుకొన్నచో సర్పవరక్షేత్రస్థలనిర్ణయము బహుసూక్ష్మపరిశీ

ళనములతోఁ జేయఁబడిన దని స్పష్టముగ గోచరించుచున్నది. ఇది యేపురాణములనుండియు సంగ్రహింపఁబడినట్లు గాన్పించదు. కావున స్థలపరిచయము పూర్తిగాఁ గలిగిన మానవుఁడే యీ యుధాస్థితి వర్ణనము చేయఁగలఁడు. ఈ హేతువున నీ కవీశ్వరుఁడు తూర్పుగోదావరిజిల్లావాఁడు గాని విశాఖపట్టణపు జిల్లావాఁడు గాని కావలయును. ఈ క్షేత్రవర్ణనమునకుఁ దోడు మఱియొక విశేషాంశము విష్ణుమాయానాటకమునఁ జూడనగును. మూఁడవ యాశ్వాసమునఁ బుండరీకుని కథ నభివర్ణించుచు యమునానదీతీర వాసియు నౌత్తరాహుఁడు నగుపుండరీకుఁడు మహాక్షామము తన దేశమును బీడించుచుండ సుభిక్షమగు నొండుదేశమునకుఁ దాను బోవ నుద్దేశించి యిట్లు వాకుచ్చెను.

గీ॥ పాలఁతి! విను పూర్వదక్షిణభూము లెల్ల
నెపుడు దుర్భిక్షదోషంబు నెఱుఁగ వండ్రు
బహునదీమాతృకలు గాని ప్రతిదినంబు
దివి నిరీక్షించు దేవమాతృకలు గావు.

సీ॥ కర్ణాటరాజ్యంబు గంభీరతుంగభ
ద్రాజలౌఘంబులఁ దఱచు పండు
ద్రావిడదేశ ముత్తరళోర్మిరమ్యకా
వేరి కాలువల ముక్కాఱుఁ బండుఁ
దైలింగ్యమధ్యభూతలము కృష్ణాగౌత
మీప్రవాహంబుల మిగులఁ బండుఁ

గాళింగమధ్యదిక్ఖండంబు లాంగూల
శారదానదులచేఁ జాలఁ బండు

గీ|| తెండియును జలిఁ బ్రవహించు కృష్ణవేణి
నంబుజాక్షి ! సభాసభాస్వప్రదానమున
వర్ష మొసఁగ్రర గౌతమి వరద నిచ్చుఁ
బార్శ్వములయాంధ్రుఁ బడసేలుఁ బాడు సస్యము.

సీ|| పల్లెకుఁ జూచిన పాత్రస్థ సలిలాన్న
సత్త్రశాలాజనసంభ్రమంబు
లేయూరఁ జూచిన నెల్ల ధాన్యంబులు
కొరుపట్లను ప్రజ్ఞాఘోషంబు
లేయిండ్లఁ జూచిన సంధరాశరసంత
త్రసవాఘోరగాభ్యవయరేఖ
లెవ్వరిఁ జూచిన నిన్నాటి ల్లను వారం
దానసౌజన్యవిద్యాసనాథి

తే|| యెచటఁ జూచినఁ గనుపండువ పంపువదన !
. నారికేళామ్ర పనస పున్నాగ ముఖ్య
భరితశృంగార వనపరంపరలచేతఁ
గోరికలు మించు గౌతమీతీరభూమి.

తే|| దివ్యమై తగు గౌతమీతీరభూమి
భోగభాగ్యంబులకు జన్మభూమి సువ్వ

జన్మసంస్కారఫలవిశేషంబు గలుగు
వారలకుఁ గాని గలుగ దన్వసలిసుఖము.

భారతదేశమందలి పూర్వ దక్షిణ భాగములలో నున్న నదీ మాతృకప్రాంతములను బేర్కొని గౌతమీపరిక్షాళితదేశ మన్నిటికంటె సమస్తభోగభాగ్యములతోఁ దులఁ దూఁగు చుండు నని నిశ్చయించి తన భార్య వనితనుఁ గుమారునిఁ దీసికొని గౌతమీ ప్రాంతమునకు వచ్చి యామహానదియం దవగాహనముఁ జేసి యెదుటిదరిఁ జేరి యచ్చట నున్న వేటగ్రామ మందు భిక్షకోలకుఁ దిరుగాడె నఁట. ఈభాగమంతయుఁ జదివిన గోదావరీనదీప్రాంత పువా రెవ్వరో జన్మస్థలాభిమానివైయుండు రచించి యుండు నని యభిప్రాయము గలుగక తప్పదు. ఈ బలమైన రెండుపపత్తుల సాహాయ్యమున నీకవీశ్వరునిజన్మస్థానము నిర్ణయించినచోఁ దూర్పు గోదావరిజిల్లాలో నున్న అమలాపురముతాలూకాయందలిచింతల పూఁడిగ్రామమువాఁ డేమో యని ప్రబలమైన యనుమానము గలుగుచున్నది. కృష్ణదేవరాయలు కళింగదేశమును జయింపఁ గోరి పురుషోత్తమగజపతితో యుద్ధము చేసి యోడించి సింహాచలమువఱకు వచ్చి యచ్చట పొట్నూరియొద్ద జయస్తంభమును బ్రతిష్ఠించిన విషయము చరిత్రాత్మకమే. ఆమహాపురుషుఁడు మగుడి తన దేశమునకుఁ బోవునపుడు కళింగదేశమునుండి పండితులనుఁ గవులనుఁ గొందఱిని వెంటఁ దీసికొనిపోయె నని కూడఁ జరిత్రాధారములవలనఁ దెలియవచ్చుచున్నది. అట్టివారిలో నీ

కవీశ్వరుఁ డొకఁడు కావచ్చును. విశాఖపట్టణముజిల్లాతో పాటు తూర్పుగోదావరిజిల్లాకూడఁ బూర్వము కళింగదేశమందలి యంతర్భాగమే. కావునఁ జింతలపూఁడి యెల్లనార్యుఁడు తూర్పు గోదావరిజిల్లాలో నున్న చింతలపూఁడి గ్రామస్థుఁడై యుండె నేమో యని యభిప్రాయపడుట ప్రస్తుత మున్న ప్రమాణములఁ బట్టి సమంజస మని తోఁచుచున్నది.

కృష్ణరాయ సందర్శనార్థము యెల్లనార్యుఁడు విద్యానగరమునకుఁ బోవఁగా నాంధ్రకవితాపితామహుఁడును రాయలయాస్థాన మహాకవియు నైన యల్లసాని పెద్దన్న 'నగరు, తగరు, తొగరు, వగరు' అనుపదములను ప్రాసస్థానములం దుంచి రామాయణ భారత భాగవతపరములుగఁ బద్యము చెప్పు మని యెల్లనార్యుని గోరెనఁట. అంత సింహాసనమున నున్న యెల్లన యీక్రింది విధముగఁ బద్యముల నాశువుగాఁ జెప్పెనఁట.

1. రామాయణము:—

చ. 'నగరు పగాయె, నింక విపినంబుల కేఁగుఁడు, రాజ్యకాంక్షకు నీ
దగరు కుమారులార!' యని తల్లి వగ ల్మిగులంగఁ దోఁపఁగాఁ
దొగరున రక్తిఁ గట్టి మదిఁ దోఁచక గుప్తదశాస్యకంఠ ద్రు
వగరుచుచున్నఁ జూచి రఘువంశవరేణ్యుఁడు తల్లి కిట్లనున్.

2. భారతము:—

చ. తొగరుచి కన్నుదోయిఁ గడుఁ దోఁచఁగఁ గర్ణుఁడు భీమసేను పైఁ
దగరు ధరాధరంబుపయిఁ దాఁకినభంగిని దాఁకి నొచ్చి తా

వగరుచుచున్ వెసం బరుగువాజిన నచ్చటిరాజలోకముల్
నగరు సుయోధనాజ్ఞ మది నాటుటఁజేసి ధరాతలేశ్వరా!

3. భాగవతము:—

చ. వగరుపుమాత్రమే వరుఁడు వశ్యుఁడుకాఁడు సఖీ! సఖుల్వ మి
న్నగరుడవాహనుండు మము నాఁడటు డించుట యెల్ల నుద్ధవా
తగ రని కాక మోహపులతాతను వైన విడంగఁ జూతురే
తొగరుచి యోషధీశునకుఁ దోఁపఁగఁ జేయునె వీడనాడఁగన్

చింతలపూఁడి యెల్లనార్యుఁడు రచించిన గ్రంథములలో మన కిప్పటి కుపలబ్ధము లైనవి మూఁడుమాత్రమే. 1. రాధామాధవము 2. తారకబ్రహ్మరాజము 3. విష్ణుమాయానాటకము. ఈగ్రంథముల రచనాక్రమముగూడ నిదియే యని తోఁచు చున్నది. ప్రథమమున రాధామాధవము రచించి శ్రీకృష్ణదేవ రాయలను మెప్పించి యాతనివలన రాధామాధవకవి యను బిరుదము నొందెను.

శా. రాధామాధవ మచ్యుతాంకితముగాఁ బ్రౌఢక్రియం జెప్పి తా
మాధుర్యంబునఁ గృష్ణరాయవిభుఁ గర్ణాటేశు మెప్పించి నా
నాధాత్రీపతిమానసత్కృతులతోనన్ భూషణశ్రేణితో
రాధామాధవనామ మందినజగత్ప్రఖ్యాతచారిత్రుఁడన్.

ఈ బిరుదమునే మిగిలిన రెండు కావ్యములలోను జేర్చు టచే నా కావ్యములు దీనితర్వాత నితనిచే వ్రాయఁబడిన వని యూహింపవలసియున్నది. ఇంతియె గాక రెండవ కావ్య మగు

తారక బ్రహ్మరాజమందు, అచ్యుతదేవరాయలను బేర్కొను టచే నా గ్రంథము రాధామాధవము తర్వాతనే వ్రాయఁబడిన దని నిశ్చయముగాఁ జెప్పవచ్చును. విష్ణుమాయానాటకరచనా కాలము నిర్ణయించుట కిట్టి చారిత్రికాధారము లెంతమాత్రము ను లేదు; గాని శైలినిబట్టియు శిల్పమునుబట్టియు నా గ్రంథ మీ రెంటికంటెఁ గడపటి దని నిర్ణయముచేయుట సరిగా నుండును.

రాధామాధవ మైదాశ్వాసములుగల శృంగారప్రబంధము. దానియందలి కథ రాధామాధవుల ప్రణయజీవితము. ఇట్టి కథనే గీతగోవిందము, లేక, అష్టపదులు, అను సంస్కృతకావ్యమున జయదేవుఁడను కవి యత్యంతమృదుమధుర మగుభాషతో వర్ణించెను. ఆకావ్యముయొక్క శృంగారగీతాలాస్య మహత్త్వ కీర్తిని క్రీ. శ. పండ్రెండవశతాబ్దమునందలి గౌడదేశప్రభు వగు లక్ష్మణసేనమహారాజు విని యా కవిని దన యొద్దకు రప్పించి తన సమక్షమున దానిని బాడించెను. అంతటఁ దన్మయుఁడై యా గ్రంథమందలి "పద్మావతీచరణచారణచక్రవర్తి" యను చరణ మునే యాకవికి బిరుదనామముగా నొసంగెను. అట్లే శ్రీకృష్ణ దేవరాయలుగూడ నీయాంధ్రజయదేవుఁ డగు ఎల్లనార్యునకుఁ దన గ్రంథనామమును బిరుదనామముగా నొసంగెను. ఎల్లనార్యు నకు జయదేవునియం దున్న గౌరవాభిమానములు రాధామా ధవమునందలి యీక్రింది పద్యమువలన విదితము లగుచున్నవి.

క. నుతియింతు వాగ్విశేష
స్థితి రాధామాధవంబుఁ జెప్పిన విద్యా
చతురాననుఁ నీలాచల
పతిహితు జయదేవసుకవిపంచవ్రిదరున్.

అట్లైనను, ఎల్లనార్యుఁడు రచించిన రాధామాధవప్రబంధమునకును జయదేవకవి విరచితమైనగీతగోవిందమనెడు రాధామాధవమునకును * నామమాత్రసామ్యము తప్ప వేఱు సాదృశ్యము పొడఁగానము. గీతగోవిందములో నున్నరాధ గోపికాగణములోనిదై మాధవునకు నిత్యానుసారిణియైన పరకీయ నాయిక. మాధవునియందలి యసదృశప్రణయమహిమచే నామె యాతనియందు జీవితతన్మయత్వము నొందినది. ఎల్లనార్యుని రాధామాధవమునందు రాధ కృష్ణుని పరివారగోపికాజనములోనిది గాక వేఱె యొకరాజకుమార్తె. సరస్వతీనారదుల

* గీతగోవిందము వ్రాసిన జయదేవకవి రాధామాధవ మను కావ్యమును రచించియుండునేమో యని యొకరూహించిరి; కాని యది సమంజసముగ నున్నట్లు దోఁపదు. గీతగోవిందమందు రాధను బరకీయకన్యగాఁ జిత్రించిన జయదేవకవి తాను రచించిన మఱియొక గ్రంథములో నామెను మాధవవివాహితయగు స్వీయఁగాఁ జిత్రించుట పొసఁగదు. అట్లుచిత్రించినఁగాని యా గ్రంథము ఎల్లనార్యుని ప్రబంధమునకు మాతృకగా నుండదు. పోనీ, మఱియొక జయదేవకవిని యెల్లనార్యుఁడు పేర్కొనెనా యని యూహింతమన్న సాహిత్యలోకమునఁ గీర్తిఁగన్న జయదేవుఁ డొక్కఁడే గీతగోవిందకర్తయే. వేఱొకని కంత ప్రశస్తి లేదు.

దాత్త్యములవలనఁ జేసియె కృష్ణునియందు మోహా మగ్గల ముగ నొందెను. ఆకారణముననే శ్రీ కృష్ణకారుణ్యముఁ జాటించి నను, అన్యయుగము ... జనించెను. కావున నీమె స్వకీయనాయిక. దీనిఁబట్టియె యెల్లనార్యుఁడు రాధిక నెంతొ మాత్రమును జయదేవకావ్యముననే గ్రహించిన స్వామిభా వమునను మధురభావమును మాత్రమే గ్రహించెనని తెల్లమ గుచున్నది. ఎల్లనార్యుని రాధామాధవ కథయును ఛాయా బ్రహ్మవైవర్తపురాణమున నున్నది; కాని యీకథాకథనమునందును నాపురాణమునుండి సంగ్రహింపక కవి స్వయముగ శ్రీనాథ పోతనాదుల ప్రబంధములతీరునఁ బెంచి రచించెను

ఎల్లనార్యుని రెండవ గ్రంథమగు తారకబ్రహ్మరాజము చాలవఱకుఁ దన్నామక మగు గీర్వాణకావ్యమునుండి యాంధ్రీక రణ మని కవివాక్యములఁబట్టియె నిర్ణయింపవచ్చును.

గీ. యతివరేణ్యుండు నారాయణాశ్రములు మ
హానుభావుఁడు నొడివిన యట్టి మాట
పరిచితంబైన తారక బ్రహ్మరాజ
మఖిల (వేదాంతసారాంశమైనదాని)

క. ఆ ధీరునిగతిఁ జెనఁగున
రాధామాధవుని సుకవిరత్నము చెప్పెన్
వేధోమునివరబుధ గం
గాధరజపమ్యంబుఁ దారక బ్రహ్మంబున్.

పరమ భాగవతోత్తముండును, ప్రయాగక్షేత్రవాసియు నగు 'నారాయణాశ్రములు' అను నొకమహాయతీంద్రుఁ డీ కావ్యమును సంస్కృతమున రచించె ననియు దాని నీతఁ డాంధ్రీకరింపఁ దత్కృతిసమర్పణమునకు నంజ తిమ్మరుసు తన్నుఁ వేఁడె ననియు నెల్లనార్యుఁడే తన గ్రంథపీఠికయందుఁ జెప్పుకొనెను. ఆ నంజ తిమ్మరుసు, అచ్యుతదేవరాయలయొద్ద కందాచారలేఖకుఁడును మంత్రియు నై యుండెనఁట. అతని ప్రేరణవలన నీకావ్యకృతి సమర్పణము రామభద్రునకే చేసెను. తారక బ్రహ్మరాజమం దలికథ ముఖ్యముగ శ్రీరామనామముయొక్క తారక ప్రభావమును జాటుచున్నది. శ్రీరామనామమంత్ర తారకమాహాత్మ్యమును విశదీకరించుటకు ననేకమునిపుంగవుల ప్రసంగములను రామేశ్వరతీర్థ యాత్రాఫలము మున్నగు వాని ననేకములను జెప్పుచు సందర్భవశమున నొక విలక్షణ మైనకథనుగూడ నారాయణాశ్రములవారు తమగ్రంథమున రచించిన కారణమున నా కథనే యీకవియు సంగ్రహించి యభివర్ణింపవలసివచ్చినది. కథయందలి గుణదోషములెవ్వైనను నారాయణాశ్రములవారివే గాని మన కవీశ్వరునికిఁ జెందఁజాలవు. ఒక విప్రోత్తముఁ డొక బోయవనిత తగులములలోఁ బడి దానిని భర్తృగృహమునుండి లేవఁదీసికొని దేశాంతరమునకుఁ బోవ నాభర్త వారిని వెన్నంటి యాదేశపురాజుసమక్షమున వారిని వధింప నా రాజా బోయనాయకునికి మరణదండన విధించెను. మృతినొందిన వీరు ముప్వ

రును మరణసమయమున రామనామ ముచ్చరించుచున్న చిలుక పలుకులు విని మోక్షము నొందిరి. ఈ కథ కొంత యేవగింపు గలుగఁజేయుచున్నను గథనాసామర్థ్య మద్భుతరసావహముగ నుండుటచే నెల్లనార్యుని కవితాశిల్ప మీప్రబంధమునం దెక్కువ చాతుర్యముఁ గనఁబఱచుచున్న దని నిర్ణయింపవచ్చును. ఈగ్రంథ మిప్పటికిని యసమగ్రముగ దొరకి యముద్రితస్థితిలో నున్నది.

ఎల్లనార్యుఁడు రచించిన మూఁడవ గ్రంథము విష్ణుమాయానాటకము. ఈగ్రంథమున కవతారిక దొరకుటలేదు. కొందఱు విమర్శకు లీగ్రంథము నవతారిక లేకయే కవి రచించె నని యభిప్రాయపడిరి; గాని యది నాకు సమంజస మని తోఁచదు. ఏలయన మనపూర్వకవు లేగ్రంథము రచించినను వంశాదివర్ణన లున్నను లేకపోయినను దేవతాస్తుతి పద్యములైనను వ్రాయక యుండలేదు. ఈప్రబంధమం దట్టి పద్యములును లేవు గాన నవతారికాభాగము లభ్యము గాలేదనియే యూహించుట సరియైన దని నానమ్మకము. ఈప్రబంధమును మొదటిదైన రాధామాధవమును మదనగోపాలాంకితములే. ఈరెంటిని యొకకవియే రచించె నని యనుటకు వానియందలి యాశ్వాసాది పద్యములును, ఆశ్వాసాంతగద్యమును సమానముగా నుండుటయే ప్రబల నిదర్శనము. ఈగ్రంథమును గడపటిదిగాఁగ విరచించి యుండు నని యోజించుటకుఁ దగు కారణములను వెనుకనే సూచించితిని.

దీనికి నాటకమని కవి పేరిడినను నిక్కముగా నిది ప్రబంధమే గాని రూపకభేదము గాదు. దీనియందు మహావిష్ణువు సూత్రధారియై విశ్వమాయానాటకము నెట్లు నడిపించుచు దేవమానవసంఘముల నెట్లాడించుచున్నాఁడో తెలుపుటకే యిట్టి పేరీయఁబడినది.

ఇది వైదాఖ్యానముల ప్రబంధము. అన్నియాఖ్యానములందును విష్ణుమాయను నిరూపించెడి కథలు రసోచితముగ వర్ణింపఁబడినవి. ఈ గాథలు ప్రత్యేకముగ నేయొక్కపురాణము నుండియుఁ గవి గైకొనినట్లగపడదు. కొన్నిటిని స్థలపురాణములనుండియుఁ, గొన్నిటిని మహాపురాణములనుండియుఁ గవి స్వీకరించియుండెనేమో యని తోఁచుచున్నది. అన్నిటియందును విష్ణుమాయ మాత్రము సామాన్యలక్షణమై యున్నది. కథలన్నిటిని వేఱువేఱు స్థలములనుండి సంగ్రహించినను వాని కూర్పును, రచనయుఁ బ్రత్యేకముగా నెల్లనార్యునిదే యని మనమురూఢిగా నమ్మవచ్చును. గీర్వాణ వాఙ్మయమున విష్ణుమాయానాటకమను కావ్యముగాని నాటకముగాని యెచ్చటను గాన్పింపదు. కావున నీ గ్రంథము తారక బ్రహ్మరాజమువలె భాషాంతరీకరణముగాక స్వతంత్ర గ్రంథ మనియే యూహింపఁదగినది.

ఎల్లనార్యునికిఁ బూర్వము గొంద ఱాంధ్రకవు లిట్టి కథాగుచ్ఛములను బ్రబంధములుగా వ్రాసిరి. శ్రీనాథుఁడు హరవిలాసమందును, నిశ్శంక కొమ్మన శివలీలా విలాసమందును, శివభక్తి ప్రతిపాదకములైన కొన్ని యద్భుతగాథలను స్థలపురాణ

ములనుండియు నితర గ్రంథములనుండియు సేకరించి వానికి శివ
ప్రభావమే కారణసూత్రముగఁ జేసి కథాప్రసవమాలలుగా
రచించిరి. కృష్ణదేవరాయలును, తాళ్ళపాక చిన్నన్నయుఁ దమ
యాముక్తమాల్యదయందును పరమయోగివిలాసమునందు నిట్టి
యాయాస్థలములనుండి విష్ణుభక్త ప్రతిపాదకములగు కథల నేర్చి
భక్తిసూత్రమునఁ గూర్చి విష్ణుప్రశస్తిజనకములగు ప్రబంధము
లను * రచించిరి. ఎల్లనార్యుఁ డాత్రోవనే పోయి తన విష్ణుమా
యానాటకమును సమకూర్చెను. ఇతని [illegible]నినవా రందఱ
కంటెఁ గథాకథనమునఁ దాను మిన్నయని తోఁచునట్లు కథా
ప్రస్తావన మొక యనన్యసదృశ విధముగఁ గల్పించి కథలకు మఱి
కొంత ప్రాణము పోసెను. ఆ విషయము ముందుముందు కథా
నిర్మాణసందర్భమున విశదీకరింపఁబడును.

ప్రథమాశ్వాసమున రుక్మిణీ సత్యభామల సాపత్న్య
విషయమును జూపుచు సత్యభామకు శ్రీకృష్ణుఁ డొసంగిన
పారిజాత వృక్షకారణమున గర్వాతిశయము హెచ్చుటచే నా
మెకు గర్వభంగముఁ జేయుటకు సాక్షాత్తు విష్ణుస్వరూపుఁ డగు
శ్రీకృష్ణుఁడు గావించిన మాయాపటల నిర్మాణమును తత్సా
ధనమున సత్యభామకుఁ గలిగిన గర్వపరిహారమును వర్ణింపఁబడి
నవి. రెండవయాశ్వాసమున మహావిష్ణువు తన ముఖ్యదేవియగు

---

* ఆంగ్లేయ వాఙ్మయమునఁగూడ నిట్టి గ్రంథము లున్నవి. టెన్ని
సను అర్థరురాజు కథలు (Idiylls of King Arthor) మున్నగునవి.

నాదిలక్ష్మికిఁ గావించిన గర్వభంగ మభివర్ణింపఁబడినది. ఇందిరా దేవి యొకనాఁడు ద్యూతపరాజితయై కినిసి తన ప్రాణవల్లభునకుఁ గొంతయవమానముఁ గలిగింపనెంచి ముల్లోకములందు వ్యాపించియున్న తన ప్రభను దా నుపసంహరించుకొని చరాచరప్రపంచ మంతయు దైన్యము నొందునట్లు చేసెను. అంతఁ బద్మాక్షుఁ డామెయుద్దేశముఁ గనిపెట్టి యొక కృత్రిమలక్ష్మిని సృజించి లోకముల కేమియు లోటువాటిల్లకుండ వానిని యథాస్థితిలో నుంచి తన మాయచే మహాలక్ష్మికిఁ గృత్రిమలక్ష్మియం దీర్ష్యాసూయలను గలిగింపఁజేసి యామెకుఁ బరాభవముఁ గావింపఁ గలిగెను. మూఁడవయాశ్వాసములో నహంకరించిన పితామహునకు గర్వభంగ మొనరించెను. కొండొకకాలమున హిరణ్యగర్భుఁ డహంభావమున నీచరాచరప్రపంచ మంతయుఁ దన శక్తిమహిమాతిశయమున సృజింపఁబడినది గాని మహావిష్ణువున కేమియు దీనియం దధికారము లేదనియుఁ దా నాతని కెంతమాత్రము నధీనుఁడు కా ననియు గర్వింపఁగా నారాయణుఁడు దా నావిరించికిఁ దన యప్రమేయసార్వభౌమత్వముఁ జూపింప నెంచి యొక మాయాసరస్వతిని గల్పించి యామె కృత్రిమమోహన విలాసములలోఁ జతురాననుని బడఁద్రోసి కొంతకాల మట్లు వినోదించి తరువాత బ్రహ్మకు నిజస్థితిని దెలియఁబఱచి తన యద్వితీయ త్రైలోక్యనాథత్వమును బ్రకటించుకొనెను. నాల్గవయాశ్వాసములో సదాశివునకు నట్టి భంగపాటే కావింపఁబడినది. మున్ను సాగరమథన

సమయమున విష్ణువు మోహినీవేషమున నవతరించి యమృతము కొఱకుఁ దగవులాడుచున్న సురాసురుల కయ్యమును దీర్చుచు నసురులను భంగపఱిచి సురలను గాపాడిన తెఱఁ గంతయు ముక్కంటి విని తా నొక్కఁడే విష్ణుని మోహినిభ్రమములలోఁ బడక తన ధైర్యస్థైర్యముల నిలుపు కొనఁ గల నని యతిశయింపఁగా నప్పుడు పుండరీకాక్షుఁ డాతనికిఁ దన మాయావిచిత్ర్యముల రుచిచూపి యాతనిని మోసగింపనుద్దేశించినవాఁడయ్యెను. రుద్రునికోరికమీఁదఁ దటాలున మోహినీవేషము ధరించి యా పార్వతీవల్లభుని బరమ ముగ్ధుఁ డగుకాముకునిగాఁ జేసి తన వెంటఁ జాలఁగాలము త్రిప్పుకొని మతిభ్రమ గావించి యంతర్ధానమయ్యెను. అంతఁ బినాకపాణి యిది యంతయు విష్ణుమాయ యని గ్రహించి శ్రీమహావిష్ణుని ప్రభావమును గీర్తించెను. కడపటియాశ్వాసమున నిరంతరవిష్ణుభక్తుఁ డగు నారదమునికి యిట్టి యవష్టంభభంగము గావింపఁ బడినది. రుద్రునివలెనే నారదుఁడును దా నొక్కఁడే విష్ణుమాయను గనుఁగొనఁగల నని ప్రగల్భములు పలుకఁగా నామునికిఁ దన మాయామోహనశక్తిని జూపఁ దలంచి సర్పవరక్షేత్రమున నొక జడదారివేషము ధరించి నారదు నచ్చటికి రావించెను. తన యాశ్రమముదగ్గఱ నున్నకొలనిలో నామునిని స్నానముచేయు మని కోరఁగా నతఁ డాకాసారమున దిగి వెంటనే యొక నారీమణిగా మాఱెను. అట్టిస్థితిలో నుండఁగా

చంద్రకేతుఁ డను రాజచ్చోటికి వచ్చి యామెను జూచి మోహించి పరిణయమాడెను. అంత వా రిరువురికి నూరుగురు సుతు లుద్భవించిరి. వా రందఱును వివాహములు చేసికొని సంతానములు గని సకల సౌఖ్యములు ననుభవించుచుండ నొక శత్రురాజు వారిపైఁబడి వారిని సంహరించి రాజ్యమును స్వాధీనము చేసికొనెను. చంద్రకేతువును, అతని సకల సంతానమును మరణించిరి. ఒక్క స్త్రీ రూపమున నున్న నారదుఁడు మాత్రమే మిగిలెను. ఆమె పతి పుత్రపౌత్ర నాశనమునకు శోకించుచు క్షుద్బాధకుఁ దాళఁజాలక యా సమీపమున నున్న మామిడి చెట్టున నొక ఫలముఁ జూచి దాని నందుకొనఁగోరి యా శవముల నొకదానిపై నొకటి చేర్చి యా దొంతిపై నిలుచున్నను ఫలము నందుకొనలేకపోయెను. అట్లాశాభంగము నొంది విలపించుచున్న స్త్రీచెంత కొకవృద్ధబ్రాహ్మణుఁడు వచ్చి యామె దుఃఖకారణ మంతయుఁ దెలిసికొని "ఓపెట్టిదానా! యిట్టి స్థితిలో నీవు ప్రాణత్యాగము చేసికొనుటయే లెస్స" యని యుపదేశింపఁగా నామె దగ్గఱనున్న సరస్సులోనికి స్నానము చేయఁబోయెను. అవగాహనము చేసినవెంటనే నారదునకు స్త్రీరూపముపోయి నిజరూపము వచ్చెను. అప్పు డది యంతయు విష్ణుమాయ యని తెలిసికొని మహావిష్ణుని యద్వితీయప్రభావమును గుర్తెఱిఁగి వెనుకటివలెనే పురుషోత్తముని స్తుతించుచు నావలఁజనెను.

క థా ని ర్మా ణ ము :—

ఏతత్ప్రబంధనిర్మాణమునందు బ్రతిభాశాలి యగు నీ కవి ప్రస్తావన, లేక, పూర్వరంగ మను నొక్కవిధముగా నొక విచిత్ర కల్పనతోఁ గథాకథనముఁ బ్రారంభించెను. సాధారణముగఁ బౌరాణిక గాథలను బ్రబంధరూపముగ వ్రాసిన యాంధ్రకవులు, ఏ శౌనక మహర్షియో, యే వైశంపాయనుఁడో [illegible] చెప్పి నట్లుగా వర్ణింతురు. ఈతఁ డట్లుగాక [illegible] హాలమును బరిహాసమును గలుగు [illegible] గోవిందశర్మ యను నాజన్మబ్రహ్మచారిపాత్రను గల్పించి యాతఁడు శ్రీకృష్ణునకు విశ్వాసపాత్రుఁడు నర్మసఖుఁడు [illegible], కృష్ణుని యంతఃపుర మున నిర్నిరోధసంచారి [illegible] నీకథలను జెప్పించెను. ఈ [illegible] గల్పించు టచే మనకు శ్రీకృష్ణుని [illegible] నుచున్నాము [illegible] శ్రీ [illegible] వైషమ్యముగాఁడు [illegible] నుచున్నాము [illegible] పుట్టుచున్నది. ఈ [illegible] జదువుటచే [illegible] విస్మయముచున్నవి. ఈప్రకారముగఁ గథాముఖమును గల్పించుటలో నీ కవి యుప్ప రినే ననుకరించిన ట్లగపడదు.

ఈప్రబంధమందలి మఱియొక విశేష మేదన విష్ణుమాయాద్యోతకము లగు కథలు గొన్ని గుత్తిగా దీనియందుఁ గూర్పఁబడిన వని మున్నే తెలిసికొనియుంటిమి. ఈ కథ లన్నియు నొక్కవిధముగనే యుండక వేఱువేఱు మాదిరులుగా నిరూపింపఁబడినవి. అన్నిటియందు విష్ణుమాయయుఁ దన్మూలముగఁ బరాభూతిఁ జెందిన నాయికయో నాయకుఁడో సామాన్యలక్షణములు. ఈపరాభవము లన్నియు శృంగారరససాధనములతోనే చేయఁబడినవి. అన్ని కథలయందును శృంగారరసభావలక్షణములు సమానము లయ్యును పాఠకులకుమాత్ర మట్లు తోఁపక మనోహరమగు వైవిధ్యమునే యెప్పటికప్పటికిఁ జూపుచున్నవి. ఏకథ చదివినను దాని కదియే ప్రత్యేకకల్పనలు గలిగి విసుఁగు పుట్ట నీయదు. మొదటి రెం డాశ్వాసములయందును దన దేవేరులగు సత్యభామా లక్ష్ములను స్త్రీసైజ మగు నీర్ష్యాహంభావముల నాధారపఱుచుకొని మహావిష్ణువు మృదుమధురముగఁ బరాభవించెను. ఈ రెండుకథలయందును సాధనము లొక్కటే యైనను గల్పనలువేఱుగా నుండి మనోహరముగా నున్నవి. అట్లే మూఁడు నాలు గాశ్వాసములయందుఁ దనతో సమానులై యహంకరించిన బ్రహ్మరుద్రుల యవజయములు వేఱువేఱు విధములుగ నిరూపింపఁబడినవి. ఆ నిరూపణలో నా జగదీశ్వరు లిరువురకును గౌరవ మెంతమాత్రమును జెడకుండ శృంగారరససాధనములో నైనను మృదుత్వము దప్పకుండఁ దనమాయ విదిత

ము. గావింపఁబడినది. కొదున భక్తాగ్రేసరు లగు పుండరీక నారదుల విషయములో నెక్కువ స్వతంత్రించి మహాకవిప్పు కఠిన పరీక్షలకు వారిని బాల్పడఁజేసెను. ఇష్టదాళ్వానములలోను మూఁడుజంట లగు కథలు గాన్పించుచున్నవి.

ఈ కథాప్రణాళికల కన్నిటికిని లక్ష్య మొక్కటియే యైనను ప్రతికథయందు నొక్కొక్క నూతన విధానమును గల్పించి కథావైవిధ్యముఁ జేకూర్పఁగలిగినశక్తి ఈ కవియం దున్నట్లు మఱి యొకనియందుఁ గానము. శ్రీనాథుని హరవిలాసమందుఁ గథలు స్వతః భిన్నరూపములుగానే యున్నవి. వానియందు లక్ష్య మొక్క టైనను స్వరూపము లన్నియు వేఱే. అట్టి సందర్భములో వైవిధ్య ముండుట స్వాభావికమే. కాని యట్టి యవకాశములేని యీ కథావిషయములలో విసుఁగు గలుగఁజేయని నానాత్వమును గల్పించిన యీ మహాకవిశక్తి వర్ణనాతీతము.

రసము — నీతి :—

విష్ణుమాయానాటకము విష్ణుభక్తిప్రతిపాదక మైన ప్రబంధము. చింతలపూఁడి యెల్లన్నకవి మదనగోపాలోపాసకుఁడు. కాఁబట్టి యాతఁడు రచించినగ్రంథము లన్నియు వైష్ణవభక్తిస్ఫోరకములే. మొదటిగ్రంథ మగు రాధామాధవమందు, రాధాకృష్ణులగాఢప్రేమబంధమును వర్ణించి జయదేవునకు సమానుఁ డనిపించుకొనెను. రెండవ గ్రంథ మగు తారకబ్రహ్మ

రాజముగూడ విష్ణ్వంశసంభూతుఁ డగు శ్రీరాముని మాహాత్మ్యము వర్ణించుటచే నదియు వైష్ణవభక్తిని నిరూపించునదియె. మూఁడవగ్రంథ మగు విష్ణుమాయానాటకము ప్రత్యేకముగ విష్ణుస్వరూపమును, విష్ణుమాయను, కేవలవిష్ణుభక్తిని అద్యంతముగ నుద్ఘోషించుచున్నది. అయితే యీ కవియందలి విష్ణుభక్తిస్వరూప మొక విశిష్టలక్షణమును నహించియున్నది. అది యే దన నీ కవిమతమందు విష్ణుభక్తి నాయికానాయక ప్రేమానురాగముగ నుండవలె నని. కావుననే యీతనిగ్రంథము లన్నిటియందును బంధుర మగు శృంగారరససంబంధమున విష్ణుభక్తిపరిణామము నిరూపింపఁబడుచున్నది. ఈవిధముగ శృంగారరసభక్తిరసములను రెంటిని, అవినాభావసంబంధమున జోడించి కథలను నడిపిన కవిగ్రామణి మదనగోపాలోపాసకుఁ డగుటయం దాశ్చర్య మేమియు లేదు. ఈ కవిదృష్టియందుఁ బరమాత్మస్వరూపుఁడగు కృష్ణభగవానుఁడు దుష్టజనశిక్షకుఁడును శిష్టజనరక్షకుఁడును గాక మానవాత్మ యను నాయికయందు నిత్యప్రణయోత్సేకము నుద్భవింపఁజేసెడు మహాశృంగారమూర్తి యగు న్నాయకుఁడే. కాఁబట్టి యీకథలయం దెచ్చటను నొక యుద్ధము గాని పోరాటముగాని యుండక యెచ్చటఁ జూచినను శృంగారప్రాధాన్యము లగు మోహనలీలలు, ప్రణయకలహములు, మానినీవిలాసినుల విభ్రమచేష్టితములు నిత్యాదులే కానంబడుచున్నవి. ఈ కవివరుఁడు నిక్కముగఁ గళింగదేశపువాఁడై నచోఁ

దన కాలమందుఁ గళింగదేశమున నూతనముగా వ్యాపించుచు న్న చైతన్యమతాభిమానియై తత్సంప్రదాయమును మోహన కృష్ణోపాసనకు నలవడి యుండును.

ఎల్లనార్యుఁడు రచించిన యితర గ్రంథములలో వలెనే యేతద్గ్రంథమందును భక్తిరసముతో పాటు శృంగారరసమును నిత్యానుసంధాయిగా మేళవించినను, ఈ గ్రంథమం దెచ్చటను శృంగారరసమునకుఁ బ్రత్యేకప్రాధాన్యముగాని యశ్లీలకరమగు నత్యాధిక్యముగాని యొనఁగుటలేదు. ఒకప్పుడు శృంగారవర్ణనలలోఁ బాఠకుని మనస్సుఁ జిక్కుకొని యానంద పారవశ్యముఁ బొందుచున్నను భగవద్భక్తిభావము లాతని హృదయమున నాతనిని గూడఁ బ్రసరించుచునే యుండును. కాబట్టి శృంగారరస ప్రాధాన్యములగు రాధికాసాంత్వనము, రంభామాధవ సంవాదము మున్నగు గ్రంథములందువలెఁ బ్రదర్శన ముత్కటముగాక నీతి మర్యాదలకు లోఁబడి పండితులకు సంతోషామోదము నొడఁగూర్చునదియై యున్నది. ప్రథమాశ్వాసమందలి సత్యాభామా శ్రీకృష్ణుల మాయా విడంబనము సతీపతుల సరస సంగతులనే నిరూపించుచున్నదికదా. రెండవ యాశ్వాసమునందలి లక్ష్మీనారాయణుల ప్రణయకలహప్రసంగమును మాయాలక్ష్మీకల్పనచే, నుత్తమనాయికా నాయక సంబంధము నెంతమాత్రము నతిక్రమింపక పునీతమార్గమునే యనుసరించినది. మూఁడవ యాశ్వాసమందలి పరమేష్ఠిపరాభవకథయును మాయాసంస్కృతి

కల్పనచేఁ బదోన్మద్భవుని శీలము పరమానందకరముగఁ బో షింపఁబడినది. నాల్గవ యాఖ్యానమందు మాయామోహినీ రూపధారి యగు మహావిష్ణువే పరమేశ్వరునికిఁ జిత్తక్షోభముఁ గలుగఁజేసిన వినోదదృశ్యము శివకేశవసామరస్యమును స్థిరపఱిచినది. అయిదవ యాఖ్యానమందు నారదుఁడును మూఁడవయాఖ్యానమం దానుషంగికముగఁ జెప్పఁబడిన పుండరీకుఁడు ను భక్తులుమాత్రమే కాన లక్ష్మీసత్యలును బ్రహ్మరుద్రాదు లవలెఁగాక విష్ణుని కఠినతరపరీక్షకు లోనైరి. కేవలమును శృంగార మోహావశ్యు లగుటయేకాక స్త్రీయైన నారదుఁడు భర్తను సం తానమునంతను గోల్పోయి యేకాకియై దుఃఖనివేదనమునఁ బరితపించినఁగాని మాయావిముక్తుఁడు కాలేకపోయెను. రెండవ వాఁడగు పుండరీకుఁడు విలోమవివాహము చేసికొని సకుటుంబ ముగ క్షామార్తిచే దేశాంతరమునకుఁ బోయి భిక్షాటనము చేయ వలసివచ్చినది. ఇట్టి కడగండ్లు తక్కినవారి విషయములోఁ గల్పింపఁ బడలేదు.

ఇట్లు ప్రత్యాఖ్యానమున నెవరో యొక రహంకరించిన మాత్రముననే దత్తదుచితముగ విష్ణుమాయకు లోనై మోహ పాశములలోఁబడి వ్యాకులచిత్తమున నుండఁగా మహావిష్ణువు ప్ర సాదించి మాయామోహపటలమునుండి వానిని రక్షించి విము క్తుని జేయుచుండెను.

భగవద్గీతలో శ్రీకృష్ణభగవానుఁడు చెప్పినవిధముగా—

శ్లో. దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా
మామేవ యే ప్రపద్యన్తే మాయామేతాం తరన్తి తే.
(౭ అధ్యా ౧౪ శ్లో)

ఆలాగున నీ విష్ణుమాయోపాఖ్యానమున మహావిష్ణువనాశ్రయణముకంటె యాత్మోద్ధరణమునకు, రాజసమునఁ గాని, తామసమునఁగాని యహంకరించిన ప్రతివ్యక్తియు సద్గురుకృప మయమగు ప్రకృతిమాయయందో బడవలెను తాను స్త్రీగ మారినది వర్గ పరవశునిగ మహావిష్ణువు చేయుచుండెను. ఎట్టి కష్టబాధల ననుభవించి తిరిగి విష్ణుస్మరణముఁ జేసిన వెంటనే వారి నంద అను మోహవిభ్రమమునుండి తొలఁగించి వారికి నిజవ్యక్తిత్వము ననుగ్రహించుచుండెను. దీనినే కృష్ణభగవానుఁడు భగవద్గీతా పరమరహస్యముగ నర్జునునకు నివేదించెను.

శ్లో. సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచ.
(౧౮ అధ్యా ౬౬ శ్లో)

అను నీ గీతావాక్యమునకుఁ జక్కని దృష్టాంతములే యీ గ్రంథమందలి కథలన్నియును. కర్మజ్ఞానయోగములను స్పృశింపక భక్తియోగమునే ప్రతిపాదించుచున్న యీప్రబంధసారము నిత్యమును విష్ణుభక్తి మోక్షసాధన మనియు వేఱొండుసాధనము లేదనియు నుద్ఘోషించుచున్నది. ఈప్రతిపాదనమును మృదులముగాను మధురముగాను మనోజ్ఞముగాను సంగీతసాహిత్య

విధానముననే యీయెల్లనార్యుఁడు తన గ్రంథమున నిరూపించెను.

శైలి :—

ఎల్లనార్యుఁడు రాధామాధవప్రబంధమును జెప్పినదాదిగా నొక ప్రత్యేకవ్యక్తిత్వము గలిగిన మహాకవి యనిపించుకొనెను. ఈవ్యక్తిత్వమున రెండులక్షణములు ముఖ్యముగఁ గాన్పించుచున్నవి. ఒకటి, భావవిషయములోను, రెండు, భాషావిషయములోను. భావవిషయములో మదనగోపాలపరబ్రహ్మోపాసకుఁ డగు నీ కవి శృంగారమునకు నుత్కృష్టస్థాన మిచ్చుటయందు వైపరీత్య మేమియు లేదు. ఈప్రపంచ మంతయు నాయికానాయకానురాగసమన్విత మగు విష్ణుమాయ యని గోచరింపఁజేసికొని తాను రచించిన గ్రంథము లన్నిటిలోను శృంగారరసమునకు నున్నతస్థాన మిచ్చుచుఁ దానిని భగవద్భక్తికి ముఖ్యసోపానముగఁ జేసినవాఁ డయ్యెను. కావున నీతని భావానుభావములు శృంగార రసోచితములై మార్దవమును మాధుర్యమును గలిగి సమస్తావస్థలయందును స్నిగ్ధరసభూయిష్ఠములుగ నున్నవి. భావము లెట్లో భాషయు నట్లే; మృదుమధురపదములతో నలరారుచు వేణునాదమువలె సుకుమారసుస్వనముగలిగి శ్రవణపేయముగను హృదయానందదాయిగ నున్నది. తన యిష్టదైవ మైన మదనగోపాలమూర్తియే తనకు "సుఖసంపదాస్పదం బైన మధురపదం బిచ్చెద నని వరం బొసంగి కవి

తాకల్పవల్లి యను ద్వాదశాక్షరకలితం బగు తన దివ్యమంత్ర రాజం బుపదేశించె నంట" (రాధామాధవము ౧ ఆ.)

ఈతని శైలియందు నిమ్నోన్నతభేదములు గాన్పింపవు. ప్రబంధాదియం దెల్ల భావాగమ్యతయుఁ బదగుంభనప్రాశస్త్యమును ప్రకటితము లగుచున్నవి. యట్టి ప్రబంధాంతమునందును జక్కని చిక్కదనమును నిండుసోయగమును గలిగి కమ్మచ్చునఁ దీసిన సువర్ణపుఁదీఁగెలవలెఁ బద్యములు సరళవేగమున సాగి మనోహర వాఙ్మరందరుచులను మన సుబ్బఁ జిమ్ముచుండును. గ్రంథమందే భాగము యాదృచ్ఛికముగఁ దీసినను శైలీసౌకుమార్యమును భావమధురిమయును దప్పక పాఠకులకు విం దొనరించుచున్నవి. అల్లసాని పెద్దన్నయందును, కృష్ణరాయకవీంద్రునియందును ఇట్టి శైలీసమత సామ్యత గానఁబడ దని పెక్కురు విమర్శకాగ్రగణ్యులు నుడివియున్నారు. రాయలకాలమునాటి కవికుంజరులలో శైలీసౌభాగ్యము నిరవిచ్ఛిన్నవిద్యుల్లేఖలవలెఁ గావ్యమంతయు నావరించి యుండుట యీ యెల్లనార్యునియందును ముక్కు తిమ్మన్నయందును ముఖ్యముగఁ గానవగును. ఈ యుభయ కవులును దమ కవిత్వమందుఁ బ్రసాదమాధుర్యగుణములకుఁ బ్రాధాన్య మొసంగి యెచ్చటనైనను దల్లక్షణములను విడనాడ లేదు. ముక్కుతిమ్మన్నయందుఁ బ్రసన్నతతో జాణతనమును జాలువాఱి యున్నది. ఎల్లనార్యునియందుఁ బ్రసన్నతతో విలాససంపత్తి పరిపూర్ణతఁ బొందియున్నది.

రాధామాధవమందుఁ బ్రతిభగల యువ కవ్యుద్రేకమును దిలకించు మధురభాషావిజృంభణము, ప్రసిద్ధవీణానిక్వాణనిపుణు లగు కీ. శే. తుమురాడ సంగమేశ్వరశాస్త్రి యద్భుతరసావేశమున విపంచీతంతువులను మందాకినీమృదులోర్మిరేఖలవలె స్ఫురింపఁజేయుచుండ నుద్భవించెడి మధురధ్వానపుంజమును స్ఫురింపఁజేయుచుండును. సుపర్వుల వాణియగు సంస్కృతవాణి తన మంజులభాషానిధి నంతయు నీ కవివర్యుని కైవసముఁ జేసెనో యనునట్లు సంస్కృతశబ్దమాధుర్య మమృతవర్షమువలెఁ గురియుచున్నది. తొంటిమహాకవుల యాదర్శకమార్గముల ననుసరించి వారి కల్పనలను గొన్నిటినిస్వీకరించి యా పోకడలకుఁ దన యనుపమ వాగ్ఘరీ మనోహరస్వరము మేళవించి యికావ్యమును మధురరసపూరితముగఁ జేసెను. కావున దీనిని బరిమళపుష్పకరండ మనికాని, మధురఫలమంజూష యనికాని భావించినఁ దప్పు లేదు. కాలక్రమమున నభ్యాసానుభవముల నలవడు వచస్సమ్మితత్వమును రససంగతియందలి సమవ్యాప్తియు దీనియందుఁ జాల కున్నను, మహాకవి కుండవలసిన సకల శక్తులు నిస్సందేహముగ దీనియందుఁ గాన్పించుచున్నవి.

తారకబ్రహ్మరాజరచనాకాలమునాఁటికిఁ గొంత కావ్యపరిశ్రమచేసిన యభ్యస్తహస్తుఁ డగుటచే దానియందలి శైలి కొంతవఱకుఁ బక్వతఁ బొంది మంజులపదబాహుళ్యము తగ్గి రస

భావావిష్కరణ మెక్కువ సులభముగఁ గలుగుచున్నది. ఈ కావ్యమందుఁ దన్నుఁ గూర్చి:—

క. రాధాధరాధరోరుప
యోధర కాశ్మీర రస రసోదయు కవితా
మాధుర్యధుర్యు నన్నున్
రాధామాధవుని సుకవిరత్నముఁ బలికెన్.

అని కవీశ్వరుఁడే చెప్పుకొనినాఁడు. కావునఁ దన కవిత్వ మందు మాధుర్యగుణమే ముఖ్యలక్షణముగా నున్న దని కవియే గుర్తించుకొనినట్లు స్పష్ట మగుచున్నది.

దండ్యాచార్యులు తన కావ్యాదర్శమున మాధుర్యగుణ లక్షణ మిట్లు నిర్వచించెను.

శ్లో. "మధురం రసవద్వాచి వస్తు న్యపి రసస్థితిః
యేన మాద్యంతి ధీమంతో మధు నేవ మధువ్రతాః."

దీనికి కీ. శే. అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రిలవారి తెనుఁగు సేత యిది:—

తే. గీ. రసయుతంబగు మధురంబు రసము సూక్తు
లందునున్ వస్తువుననుఁ బొల్పారుచుండు
మధువుచే మధువ్రతములమాడ్కి విబుధు
లలరుచుండు రెద్దానిచే నదియె రసము.

పై శ్లోకముయొక్క సారాంశ మేమనఁగా:—

"మాధుర్యగుణము రససంబంధ మైనది. అరసము శబ్ద మునందును వస్తువునందునుగూడ నుండవలయును. తేనెటీఁగలు తేనెను గ్రోలి యె ట్లానందించునో యట్లే పండితు లిట్టిగుణము గలకావ్యమును జదివి యానందింతురు."

కావున మాధుర్యగుణము ప్రత్యేకముగాఁ గథయందు మాత్ర ముండినఁ జాలదు; లేక ప్రత్యేకముగా శైలియందు మాత్ర ముండినఁజాలదు. ఈ రెంటిసమన్వయము ననుకూలముగ నుండినఁగాని యాకవి మధురకవి యనిపించుకొనఁ జాలఁడు. గోపికాహృదయాపహారి యగు మదనగోపాలమూర్తి తన జగన్మోహన వేణుగానమునుండి యొక నాదబిందువుఁ బ్రసాదించెను గాన నీ మహాకవి తత్ప్రసాదఫలితముగ సంగీతమాధుర్యమున కెనయగు కవితామాధుర్యము నాంధ్రుల కర్పించెను.

విష్ణుమాయానాటకము కావ్యమాధుర్యగుణమున కొక యుత్కృష్ట నిదర్శనము. కథావస్తు వంతయు మధుర రస సమన్వితము. పైనఁ జూపిన విధముగ నన్ని యాశ్వాసములందును శృంగార రసానుప్రాణితము లగుభక్తి రస పూరిత కథలే యున్నవి. కావునఁ గావ్యవస్తువునందు మాధురీగుణము మెండుకొని యున్నది. దానికిఁదోడు, ఎల్లనార్యుని భాషాసంఘటన మంతయు మృదువుగను, శ్రవణీయముగను నున్నది. దానంజేసి కావ్యమాధుర్యమున కీగ్రంథ మామూలచూడముగ నొక దృష్టాంత మని చెప్ప నొప్పు.

రాధామాధవము సంస్కృత పద జటిల మగు శైలి నెక్కువగఁ గవి యుపయోగించినను సృష్టపదములను ప్రాచీనంపు లగుపదములను వాడక ప్రౌఢ్య మగుభాషనే యుపయోగించెను. విష్ణుమాయానాటక రచనాకాలమునకు సిద్ధహస్తుఁ డగుటచే సంస్కృతభూయిష్ఠ మగు శైలిని విడనాడి గీర్వాణాంధ్రసమ్మిశ్ర మగు శయ్యను వాడి చక్కని శిల్పచాతుర్యము జూపఁగలిగెను. శ్రీనాథునికాలమునుండియు నాతని మూలముగ వాడుక లోనికి వచ్చిన పాండిత్యప్రకర్షితమగు కావ్యసాంకేతిక శైలిని పాటింపక సులభగ్రాహ్యము లైనవియు, సలక్షణము లైనవియు నగు దేశీయపదములను గవిత్వములోనికిఁ జేర్చుకొనెను. కావున నీ కవీశ్వరుని శైలి యప్రయత్నముగాను, నైసర్గికముగాను, హృదయమునుండి యూటలై ప్రవహించుచున్న దని పాఠకులు సులభముగ గ్రహింపఁగలరు. ఈ విషయమున నాంధ్రకవు లందఱిలో నగ్రగణ్యుఁ డగు పింగళి సూరనార్యునకు దారిఁ జూపినవాఁ డీమహాకవి యెల్లనార్యుఁడే. ఆంగ్లేయవాఙ్మయమున "మార్లో" అను నాటకరచయిత నాటకశైలీశిల్పముల షేక్స్పియర్ మహాకవి కెట్లు మార్గదర్శి యయ్యెనో యట్లే మన యెల్లనార్యుఁడు కావ్యశైలీవిషయమున సూరివరేణ్యుఁ డగు పింగళి సూరనార్యునకు మార్గదర్శకుఁ డయ్యెను.

సీ. హరియును నీవు నెయ్యముతోడ నిచ్చోట
నుండఁగాఁ గనుఁగొంటి నుల్ల మలర

నచ్చోటఁ గంటి నెయ్యముతోడ రుక్మిణీ
లోలుగాఁగ సరోజలోచనుండు
నచటి కె ట్లరిగెనో యచటివాఁ డిచటికి
నేలాగు వచ్చెనో యే నెఱుంగ
నీవ యెఱుంగుదు నీలవర్ణుని మాయ
కాంత ! యే మందు నీకంటె మిగుల

గీ. రాజసంబున రతిరాజరాజ్యకళయుఁ
గలిగి విభుతోడ నున్న యాచెలువచెలువు
మన్మథునిఁ గూడి రతి యున్న మహిమ దోఁచె
మగువ ! యే మని నమ్మె దీ మాయకాని. ”

క. నీ కిచ్చెఁ బారిజాతము
లోకంబు లెఱుంగ మున్ను లోలుండై నేఁ
డాకంజాక్షికి నిచ్చెను
నీకంటెను గూర్చు నావనిత గృష్ణునకున్.

క. ఆవెలఁది నీకుఁ బంపిన
పూవులనెత్తావి చూడు బూమెలవలపుల్
గావించిన పతిఁ జూడుము
నావచనము కల్లగాదు నమ్మవయేనిన్.

క. చెలి నొకతె నంపు రుక్మిణి
నిలయమునకు నిపుడె యనఁగ నిశ్చయముగఁ బు

వ్వలు గొనిపోయిన యంగఁణు
చెలు లొక్కట వచ్చి యట్ల సెప్పిరి నతితోన్.

పింగళి సూరనార్యుఁ డీవిధ మగు ప్రాసంగిక శైలినే వాడి దానిని దన యద్వితీయప్రతిభచే మఱింత రసవత్తరముగ నుండునట్లు చేసెను. అట్లయినను నూతన మార్గమును గని పెట్టిన కీర్తి యెల్లనార్యునికే చెందవలయును.

ఈవిధ మగు మార్గ్రౌక పద్యభాగముననే కాక గద్య భాగమందును నీకవిచేఁ జేయఁబడినది.

మన పూర్వకవుల కావ్యములలో నచ్చటచ్చటఁ జేర్పఁ బడిన వచనములయందలి శైలి కొంచె మించుమించుగ యతి ప్రాసలులేని పద్యశైలియే యని చెప్పవలసియున్నది. అట్టి గద్యశైలిని నిరసించిన మొదటి మహాకవి శ్రీకృష్ణదేవరాయలు. అటు తరువాత సులభశైలిని వచనభాగములు వ్రాసిన రెండవ కవి మన చింతలపూఁడి యెల్లన్న. ఈతని వచనములలోఁ దఱచు చిన్నచిన్న వాక్యములును విస్తారముగ సుగ్రాహ్యము లగుశబ్దములును గాన్పించుచున్నవి. ఇట్టి శైలి ముఖ్యముగ విష్ణుమాయా నాటకమునఁ జూడనగును.

" ఇ వ్వటుండు ద్వారకా నగరంబు వాఁడు. కృష్ణుని యంతఃపుర స్త్రీలకు రుక్మిణ్యాదుల కుబుసుపోవఁ గథలు చెప్పు గోవిందశర్మ యనువాఁడు. వీనియందు సత్యభామామహాదేవి

యనుగ్రహం బతిసమగ్రం బై యుండు. కడమ నలువురును సనక సనందన సనత్కుమారనారదులు. మీ రెఱింగినవార. వారి రాకయు నిర్వ్యాడక యని తోఁచుచున్నయది. అనినఁ గృష్ణద్వైపాయనుండు నట్లు నిశ్చయించి యీ గోవిందశర్మయనువాఁడు మహాతపస్వి, సకల కథాప్రవీణుండు, మన ముపక్రమించిన విష్ణుమాయారహస్యంబు లన్నియు విశదంబుగాఁ జెప్పనేర్చు, నిక్కడి కథాప్రసంగంబు తన దివ్యచిత్తంబున నెఱింగి వాసుదేవుండే పంపినవాఁడు. తదనుమతంబునఁ దద్దేవమునులును వాని వాక్పాటవంబును దదీయమాయాప్రభావంబును విను వేడుకఁ జనుదెంచినాఁ రనిన నందఱుం గుతూహలాయత్తచిత్తులై తదభిముఖాగమన ప్రత్యుత్థాన ప్రయత్నాభిముఖు లగుచుండి రంత (వారు) ననంతమార్గంబు డిగ్గి తత్సభాసమీపంబున నిలిచిన."

రసప్రదీప్తియు, భావప్రకటనమును ముఖ్యలక్షణములుగా నుండు మధురకవితఁ జెప్పిన చింతలపూఁడి యెల్లన్న అయ్యలరాజు రామభద్రునివలె శ్లేషయమకాదిధుర్య మగు శుష్కకవిత్వమువంకఁ గన్నెత్తక నిరంకుశ భావనోత్పాద్యము లగు నుత్ప్రేక్షాదుల వైపు బుద్ధిఁ జలింపనీయక యీగ్రంథము నామూలాగ్రముగ స్వాభావికకల్పనలతో రచించెను. ఏ యవస్థయందు, నే సందర్భమందును గథాప్రణాళికకు దీర్ఘమగు నంతరాయములు గలుగనీయక కథాపురుషుల క్రియాకలాపములందుఁ గౌతుకము వృద్ధినొందున ట్లచ్చటచ్చట సమయోచితవర్ణనము

లను జొప్పించి యీావర్ణనములను స్వభావసిద్ధములుగఁ జేసి తన యపారవిజ్ఞానానుభవమును వెల్లడిచేసికొనెను. శృంగారవర్ణనల యందీకవిది పెట్టినపేరు. అన్నియుఁ గథలయందును సందర్భమునుబట్టియు, నవసరమునుబట్టియుఁ, గథాపురుషుల గౌరవప్రతిష్ఠలనుబట్టియు సమయోచితముగ వానిని మార్చుచుండెను.

మాయాలక్ష్మి :—

సీ. "శుద్ధసువర్ణంబు సొబగు మించిన మేన
బాలసూర్యప్రభల్ ప్రజ్వరిల్లఁ
బార్వణ చంద్రబింబముఁ బోలు మోమున
సుప్రసాదశ్రీల సొంపు నింప
వెలిదామరల మీఱు వెడఁద కన్గవలను
గారుణ్యకందళుల్ లంకురింప
నమృతపూరముఁబోలె నలరు చిత్తంబునఁ
గరుణారసార్ద్రిత గడలుకొనఁగ

గీ. లలిత శుభలక్షణాంఘ్రిపల్లవములందు
దివ్యనారీ కిరీట సందీప్త రత్న
దీప్తి పుష్పోపహారముల్ దీటుకొనఁగఁ
బతికృపాలబ్ధవిభవ శ్రీ పద్మముఖికి."

బోయవనిత :—

సీ. "పచ్చగాజులరొప్పు పచరించు చేతుల
సంకటుంగరముల చాయ లెనఁగ

నిగనిగల్ దొలఁకాడు బిగువుచన్నులమీఁద
గురువిందపూసల సరము దనర
ధవళతాళపలాశతాటంకరుచి మించు
చెక్కులఁ జిఱునవ్వు జీరువాఱఁ
గొప్పున కందని కురుల నించుక దోఁచు
నుదుటి జేవురుబొట్టు కుదురుమెఱయ
గీ. సన్నవలిపెంపుటొల్లియ సగము గట్టి
సగము ముసుఁగిడి యొయ్యారముగ మెఱుంగు
కంచుమెట్టెలు మొరయంగఁ గడఁక వచ్చు
నవ్విలాసినిఁ దగ మెచ్చె నవనిసురుఁడు."

మోహినియందు రుద్రుఁడు ముగ్ధుఁ డగుట:—

సీ. "మదశిఖావళి యొక్కపొదలోనఁ దొలఁగినఁ
దొయ్యలి యని ఖోయి తొంగిచూచుఁ
గలకంఠనాద మెక్కడనైన వినఁబడ్డఁ
జెలువభాషణ మని చిత్తగించు
నెలదేఁటితండ మెయ్యెడ గ్రమ్మఁ బొలసినఁ
బడఁతుకనెఱు లని పట్టఁదివురు
గాడ్పునఁ బైవ్రాలు కలికిమై దీఁగె నం
గన వచ్చె నని పట్టి కౌఁగిలించుఁ
గీ. జెదరి పూఁదేనె వాతెఱఁ జెంద నిందు
వదనయధరామృతం బని వలసిగ్రోలుఁ

చేతనాచేతనజ్ఞాననిఖిలహృదయుఁ
డగుచు మదనారి సుఖశయనమందినాఁడు.”

ఇ శ్లిష్టపద్యము [illegible] మిన్నవి.

ఉపసంహారము—కవి ప్రశస్తి :

ఇట్లు శృంగార [illegible], [illegible] నామముల [illegible] మును రచించిన యీ యెల్లనామాత్యుని [illegible] దియో యింక నరయుదము.

సరస సమస్యాపూరణముచేఁ గృష్ణదేవరాయభూపాలుని యాస్థానమునఁ బ్రవేశించి [illegible] రాధామాధవబిరుదము నందిన యీ కవి [illegible] రాయల [illegible] కవియై యుండుట కవకాశము గలుగను గదా. పెద్దన్న, తిమ్మన్న, మల్లన్న మున్నగు కవులతో పాటు [illegible] ణాలో నుండుట క్షేమాత్రము [illegible] ముగచెప్పవు. ఏది యైనను రాజాశ్రయమును గుఱించి రాజసమ్ముఖముననే యీ కవి చెప్పినపలుకుల నాలకింపుఁడు.

క. “నాయకరత్నము లక్ష్మీ
నాయకు హరి నిష్టదాతి నాకృతికిఁ బతిం
జేయుదు భూముల కగు భూ
నాయకులను బరులఁ గైకొనక పటుబుద్ధిన్.”

(రాధామాధవము. ఆ 1.)

ఈ పలుకులు "కవితాప్రావీణ్య ఫణీశుఁ" డగు కృష్ణరాయల కైనను, ములుకులవలెఁ జుఱుక్కు-న మనమున నాటియుండవా? ఇట్లు రాజసమక్షమున సాహసించి పలికిన కవి విరాగియో లేక వెంగలియో యై యుండనోపు. వెంగలి యైనఁ గడిందిదిట్ట యగు కావ్యప్రణేత యెట్లయ్యెను? కావున విరాగియే యై యుండవలయును. మఱియుఁ దన యైహికలాభ విముఖత్వమును, నాముష్మిక భాగ్యనిరీక్షణమును నింతమాత్రమునఁ బ్రకటించుటతోఁ దృప్తి నొందక స్వాతంత్ర్యాభిమానమున మఱియొక మెట్టెక్కెను.

చ. "సరసులు చిత్తగింపుఁ డని చాటను మామకవాణి సన్మనో
హర యగునేని వారి హృదయంబుల కిం పొసరింపకున్నె? యె
వ్వరు పిలువంగవచ్చి యళివర్గము లాత్మలఁ జొక్కఁ దేనియల్
గురియు ప్రసూనగుచ్ఛభరకుంచితమల్లిమతల్లి కావనిన్?"

(రాధామాధవము. ఆ 1.)

తా నొకరి నాశ్రయించి తన కావ్యమహిమఁ బ్రకటించుకొను నావశ్యకత లే దనియుఁ దన కావ్యమనోహరత్వమూలమున సరసులు తనకై వెదకులాడుచు వచ్చెద రనియు, రాజసమ్ముఖమున ఘంటారవముగ నీ కవి చాటెను.

ఇట్టి నిశ్చలనిర్భయధీమంతుఁడును సదా వసంతారామములలోఁ దిరుగాడు కోకిలవలె విహరించు స్వతంత్రుఁడును రాజాశ్రయమున కెట్లు లొదుక్కొనఁగలఁడు? కావునఁ గృష్ణ

రాయల కభిమాన మున్నను నీ మహాకవి రాజపోషణాసౌఖ్యము ననుభవించియుండకపోవచ్చును. తరువాత "తారకబ్రహ్మరాజము"లో నైన, నంజ నెమ్మిరసును కొం ప్రబంధముఁ గృతినియ్యఁ దలంచియు నామాత్రపలనఁ దాను బుధునిఘ వేఁ బొందినట్లు చెప్పికొనెను గాని యాశ్రితుఁడు పోషకునియెడలఁ గనఁబఱచు వినయసంపత్తిఁ గనఁబఱుపలేదు. ఈ రాజు దృష్టాంతములఁ బట్టి యుఁ దన గ్రంథముల నన్నిటిని భగవదర్పితములఁ జేయుటచేతను నీ మహాకవి పెద్దనాదులవలె రాజాశ్రయమును నుండక భగవదాశ్రయపరుఁడై యుండె నని స్పష్ట మగుచున్నది.

లోకోత్తర మనీషి యైన కాళిదాసు సైతము:—

శ్లో. "ఆపరితోషా ద్విదుషాం
న సాధు మన్యే ప్రయోగవిజ్ఞానం
బలవ దపి శిక్షితానాం
ఆత్మ న్యప్రత్యయం చేతః."

అని తన యాత్మసంశయమును, విద్యావినయమును జూపించుట యోగ్య మని తలంచెను. మన యెల్లనమాత్ర మట్టి సందేహమున కెడ మీయలేదు. తన కవిత్వము మనోజ్ఞమైనది కావునఁ దనయం దభిమానముగలవా రుండకపో రని దృఢమైన యాత్మవిశ్వాస మతనికిఁ గలిగి యుండెను. అంతియేగాని ప్రాపంచిక భాగ్యోన్నతియెడలఁ గొంత వైమనస్యము గలిగి సదా

విష్ణుభక్తిపరాయణుఁడగుటచే నీతఁడు పరాశ్రయపరాధీనతలలోఁ జిక్కుకొనలేదు.

శ్లో. "నిరాశ్రయా న శోభంతే, పండితా వనితా లతాః."

అను చాటూక్తి యితనియందు వర్తింపలేదు. అట్లయినను, ఎల్లనార్యునిమాటలే తుదకు యథార్థములైనవి. సరసకవితాప్రియులును, ఆధునికాంధ్రభోజులును, పీఠికాపురసంస్థానాధీశ్వరులును నగు శ్రీరాజా రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దరు మహారాజులుంగారు తమంతటఁ దామే యీ మహాకవి కావ్యామృతసారస్యమును రుచి చూచి యీతనిని దమ యభిమానకవులలోఁ జేర్చి విద్వద్గౌరవసంభావనమును జూపిరి. కాన నాలుగు శతాబ్దములు గడచినను నీ మహాకవి పంతమే నెగ్గినది.

కరుణారసమూర్తి యగు పరమేశ్వరుఁ డీయాంధ్ర సరస్వతీప్రియుఁ డగు "రాజర్షిని" ఆయురారోగ్యైశ్వర్యముల నిచ్చి చిరకాలము రక్షించుఁగావుత.

వేమమల్ల అచ్యుతరావు

ఎం. ఏ. యల్. టి.

శ్రీరస్తు

విష్ణుమాయానాటకము

---:o:---

ప్రథమాశ్వాసము

క థా ప్రా రం భ ము

తే. భాగవతముఖ్యుఁ డగుశుకబ్రహ్మచేత
భాగవతసత్కథావరబ్రహ్మవిద్య
నెలమి వినుచుఁ బరీక్షిన్నరేంద్రచంద్రుఁ
డచ్యుతక్రీడ లాత్మ కింపారఁ బలికె. 1

చ. కనుఁగొన నింద్రనీలమణికాంతి నొకప్పుడు, పూర్ణచంద్రచం
దనరుచి నొక్కవేళ, నరుణద్యుతికుంకుమదీప్తి నొక్కచోఁ
దనరి గుణత్రయాత్ముఁ డయి తాన సమస్తము నైనదేవునిన్
వనరుహనాభుఁ బల్మఱు మనంబున భావనచేసి, కొండియున్

సీ. అఖిలంబు నిండి ప్రహ్లాదప్రమాణోక్తి
వెలయంగ నిలిచినవిశ్వమయుత
యాబ్రహ్మకీటశూన్యం బైనపెన్ బ్రైటి
నీటిలోఁ దేలుమేటికినము

కంసకారాగృహాంగణమున రుద్రాది
జయనాదములఁ గన్న జననకేళి
నిర్వికల్పస్థితి నిర్లేపుఁడై పర
బ్రహ్మంబు దానైనభవ్యమహిమ
తే. దలఁప నచ్చెరు; వంబుజోదరునిగుణము
లన్ని వర్ణింపఁ దరమె పద్మాసనునకు?
నిట్టిపరమాత్ము నాద్యుని నెఱుఁగునాతఁ
డతఁడు దా నౌట నిస్సంశయంబు మదికి. 3

వ. అని వెండియుం బుండరీకాక్షునియక్షయగుణంబు లొక్కొక్క సమయంబున నపార గంభీర పారావార తరంగ సంఘంబుల చందంబునఁ దండోపతండంబులై పొడముచు, నొక్కొక్క వేళఁ గాళరాత్రినిబిడనీరంధ్రితమోనిశాతాతపజ్యోత్స్నాది జ్యోతిఃకలాపంబులరూపంబున స్వకీయమాయాంతర్గతంబులై నిలుచుచు, నొక్కొక్కకాలంబున జగత్ప్రాణ ప్రసరణప్రవీణత్వంబున దీపకత్వనిరూఢంబులై సకలంబునం బ్రవర్తించుచు నవాఙ్మానసగోచరప్రభావంబున నుండుటకు నరిదిపడి హర్షవిస్మయస్వరూపం బగుమనంబున నమ్మునీంద్రు నవలోకించి పరీక్షిదీశ్వరుండు ప్రాంజలియై యిట్లనియె. 4

మ. మునినాథోత్తమ! విష్ణుదివ్యకలనల్ మోదాద్భుతాపాదక
త్వనిరూఢిన్నిగమాంతభావితుఁ బ్రభుం దత్త్వస్వరూపున్విభున్
మననధ్యానసమర్చనాభిమతసన్మానస్థితిం బొల్చు యుం
డు నశేషక్రియలందు నమ్మనిగరిష్ఠుల్ చాల సేవింపఁగన్. 5

వ. ఇవ్విధంబున ననన్యాదివసామాన్యతేజోవిలాసంబుల వెలయు నిఖిల భువనైకనాయకుం డైన విష్ణుండు పరమపురుషుం డని యుపనిషత్సూత్రంబులవలనఁ దెలిసి వేదసిద్ధాంతరహస్యవేదు లగుమహామునులు, సర్గస్థితి ప్రళయవికారకలితంబులు నశేషప్రాణిగణసంకీర్ణంబులు నగు లోకంబులం బరివర్తించుచుండఁగ, తదనన్యవిష్ణుధ్యేయతేజోరూపంబు తుదిముట్టం గాంచి, తదాత్మకత్వంబునుం బొందక, మనంబు బహువిధకర్మవ్యాపారంబులకుఁ బ్రేరేచి, త్రివర్గఫలభోగంబు లనుభవించు నల్పసుఖానుసారు లగుచుండురు. దీనికిఁ గతం బేమియో సర్వంబు నధ్యాహరించి సంశయవిచ్ఛేదంబు గా నెఱింగింపవే మహాత్మా! యని ప్రార్థించిన నవ్వివేకనిధికి శుకబ్రహ్మ యిట్లనియె. 6

క. అవు నీవు చెప్పినట్లన
భువనైకస్వామి సకలపూజ్యుఁడు హరి వే
దవిచారణీయపరత
త్త్వవిలాసము సృష్టి నడుపువాఁడును నరయన్. 7

ఆ. అతని నైజతత్త్వ మగుతేజ మిట్టిది
యతనిగుణము లిట్టి వతనిక్రీడ
లిట్టి వని నుతింప నెఱుఁగవు వేదవే
దాంతములును నిశ్చయంబుగాను. 8

తే. శ్రుతు లనంతము లని యెన్ని చూడ, నందు
నర్బుదాంశంబ యేమొ సహస్రగతుల

నాదిలో బ్రహ్మవక్త్రపద్మాంతరముల
నిండి ఘోషించు మధుకరనినదలీల! 9

క. అం దొక పరమాణ్వంశము
నం దైన సకృత్స్నముగఁ దదర్థము దెలియం
బొందుపడదు వ్యాసమహా
ర్షిందుప్రముఖులకు నైన నృపకులతిలకా! 10

ఉ. వ్యాసమునీశ్వరుం డపరవారిజనాభుఁ డతండు నిష్ఠ న
బ్జాసను దేవలోత్తము మహామతిమంతుని సుప్రసన్నునిం
జేసి తదీయశిక్ష నొకచేరికఁ గైకొని కొంత వేద మ
భ్యాసము చేసెఁ దాను జతురాస్యము లై చననాల్గు వేదముల్.

సీ. ఆవేదములు నాల్గు నవగతంబులు గాఁగఁ
జదివి తదర్థముల్ వెదకలేమిఁ
దదనురూపముగ శాస్త్రము లాఱు నష్టాద
శపురాణములు నోలి సంఘటించె
వేదబీజాక్షరవిన్యాస సరణి గా
యత్ర్యాదిమంత్రంబు లనువుపఱిచె
మతశాస్త్రములు యోగమార్గశాస్త్రంబులు
నతిరహస్యములుగా జతనకట్టె

తే. నమ్మహాభాగుఁ; డిట్టి వేదాదులందుఁ
దనరు నర్థంబు వివిధభేదముల నడచు
దాన మతములు పెక్కయ్యెఁ దన్మతంబు
లన్నిటికిఁ గల్గె నధిదేవతాంతరంబు. 12

క. తామసరాజసమతములు
భూమి ననేకములు, బహుళములు, తదధీనం
బై మెలఁగు జగము; సాత్త్వికి
మామతములలోన సూక్ష్మమై వర్తించున్. 13

క. మతములు మంత్రింబులు *వాం
ఛితములు సేవార్చనములు శిష్టాచార
వ్రతములును బదవిభాగ
స్థితులును భిన్నంబు లగుచుఁ జెల్లు ధరిత్రిన్. 14

శా. ఈమార్గంబున శాస్త్రవాక్యములు ప్రత్యేకార్థయుక్తంబులై
భూమిం బెక్కు మతంబుల†న్నడునఁగా బుద్ధివికారోన్నమ
త్సామర్థ్యంబున నెల్లవారు బహువాదప్రౌఢి నాయామతం
బే మేలంచు భ్రమించుచుండ్రు తమకే దిష్టంబు తన్మద్రతోన్.

క. అందఱకు నన్నిమతముల
నందముగాఁ దదధిదేవతాకృతులను గో
విందుఁడె యుచితఫలప్రా
ప్తిం దుదిఁ బొందించుఁ దద్విదితలోకములన్. 16

క. సారస్వతసంపద్భో
గారూఢము లగుచుఁ దలఁపు లావర్తించుం,
గోరికలతమకమున మో
హారంభము లేదు పద్మజాదుల కైనన్. 17

* వాం, ఛితములు సేవార్చనవ్రతంబులు దమకుం, గతి మెలఁగఁజేయు భోగస్థితులును—వ్రాఁతప్రతి. † నడపఁగా—పాఠాంతరము.

క. కేవల నిర్వాణమునకుఁ
దావల మది సాత్త్వికంబు, తత్పతి హరి, యా
తోవకు సేరికిఁ జిత్తము
దోవదు తన్మతయుగంబులోవకుఁబోలెన్. 18

క. కావున నుత్తమసాత్త్విక
ధీవిభవము గలిగి తదధిదేవత యగునా
శ్రీవిష్ణుని నతినిర్మల
భావంబున నిలుపవలయు భక్తి నిరూఢిన్. 19

శా. ఈరీతిన్ నిజసాత్త్వికక్రియలతో నేకాగ్రనిష్ఠన్ మహా
ధీరుండై హరిమూర్తి నాత్మ నిడునాధీమంతుఁ డామూర్తి సం
స్కారంబొప్పఁగనచ్చసంభ్రతిమ యోజం జెందుచుండానఁ దే
జోరూపంబున ముక్తుఁడై వెలఁగుఁ బో క్ష్మోణీతలాధీశ్వరా!

క. విను సహజసాత్త్వికత్వ
మ్మున నిర్మలహృదయపద్మమునఁ దిరముగ వి
ష్ణుని నిలుపుచుఁ దాదాత్మ్యం
బునఁ బొందుట దుర్లభంబు భూవరచంద్రా! 21

ఆ. అంతసాత్త్వికక్రియయు నంతనిశ్చల
సూక్ష్మదృష్టియును విశుద్ధమతియు
సంభవించు మానసం బన్యమతముల
వారలకున్న పరమవైష్ణవులకు. 22

చ. కమలదళాక్షుఁ డింతటికిఁ గారణ మావెడగానియింద్రజా
లము భువనత్రయంబు, సకలక్రియలుం దదభీష్టకేళితం

త్రము లరయుంగ, నాతనిమనంబున కెట్టులు దోఁచె నట్లు వి
శ్వము చరియించు, నెన్నఁటికి నిక్కము స్వేచ్ఛాభరంబునొందఁగనె?

వ. మహామాయానాటకసూత్రధారుం డగునప్పరమపురుషుండు చూపుదివ్యకేళీకృత్యంబులు బహువిధవిచిత్రప్రహ్లాదకారణంబు లవి వినవలసినవేని సావధానంబుగ నాకర్ణింపుము. 24

సీ. వాగీశ్వరుం డయ్యు వనరుహాగర్భుండు
శ్రుతికదంబము లెక్కఁ జూడఁగలఁడె?
భానుసహస్రసంపద గలభానుండు
తిమిర మంతయును భేదింపఁగలఁడె?
భువనత్రయము నేలుదివిజాధినాథుండు
చిత్తతృష్ణావధి సేయఁగలఁడె?
వేగగరుజ్జవరేఖఁ బరఁగుఖగేంద్రుండు
గగనంబుకడ ముట్టఁగాంచఁగలఁడె?

తే. యట్ల తేజోగుణోత్కృష్టు లైన యనంతుఁ
డైనవిష్ణునిమాయావిహారకేళు లను
నమరగంధర్వసిద్ధవిద్యాధరులు
యక్షరక్షోగణంబులైన నరయఁగలరె? 25

మ. ఇదిమధ్యం బిదియాది యంతమిది రూపిట్టింగి యిట్టెట్టు త
త్పదమంచున్ వారియున్నరూపు శ్రుతులున్ భావింపలేవన్న నే
నిద మిత్థమ్మని చెప్ప నోపుదునె భక్తానసఖ్యాను నా
సదయాత్మున్ మదినిల్పు నిక్కప్రతిభాసంయుక్తి భావించవన్.

వ. అని యంతర్నేత్రమనంతపరధ్యానయోగాధీనంబు గావించి

యుదంచదోగ్రిమాంచకంచుకిత దేహుండును, సంతోషరస స్రవదశ్రుధారామధూళీబిందుసుందరదృగరవిందద్వంద్వ పునః పునఃప్రకటీభూతహరిభక్తిసుధాప్రవాహుండును, గరతల ముక్తాఫలీకృతపాగ్ర్యచర్చాచూడాప్రౌఢరహస్యవాస్సవ్యాదు పదిష్టభావికైవల్యలక్ష్మీవిలాసనర్వస్వసంగ్రహణావ్యగ్రుండును, మధురప్రబోధోదగ్రుండును నగునయ్యోగికులాగ్రణి రాజ కులాగ్రణి కిట్లనియె. 27

క. ధరణీశ్వర 'మమమాయా
దురత్యయా' యనియె నరునితో హరి మును ద
త్పరమోక్తికి ననుగుణమై
పరఁగెడు తన్మాయవిధముఁ బ్రకటింతుఁ దగన్. 28

వ. అని తత్ప్రకారంబు ప్రపంచించునప్పుడు. 29

—♦ విష్ణుమాయాప్రభావంబు శుకయోగి చెప్పంబూనుట. ♦—

సీ. క్రతుదీక్షితద్విజసంతతికి దుగ్ధరసంబు
గురియునాకనివాసిసురభివోలె
సస్యాభివృద్ధికిఁ జాలంగ వర్షించు
ప్రావృట్పయోధరపటలివోలె
వేలాతటంబున విబుధరత్నార్థంబు
ప్రభవించు నమృతకుంభంబువోలె
సత్యభామామనస్స్వామికి నభివాంఛి
తము నిచ్చు పారిజాతంబువోలెఁ

తే. పారికాంక్షి పరీక్షిన్నృపాలవర్య!
మధుకరస్వాంతసంతోషమునఁ దాము గాన
కోరికల *నించు శుకముఖాంభోరుహంబు
నందనందనగాథామరందధార. 30

క. మనసునకు గోచరింపని
వనజోదరుతత్త్వకలన వాగ్వైఖరి వ
ర్ణనసేయ నోరు లెట్లగు
సునిశితవిజ్ఞాననిధికి శుకునికిఁ దక్కన్? 31

వ. ఇట్లు చాటుకారవాక్యపరంపరాసంపాదనకళాకలితముఖుండయ్యుఁ జతుర్ముఖ సహస్రముఖ జంఘాలగిరాగర్వనిర్వాపకం బగు శేముషీవిశేషంబున సరస్వతీలలనాగ్రగణ్యంబు లగు రత్నం బులుం బోలె నామ్నాయమండలగర్భస్థంబు లై సమాధిగా సందోహంబులు గూడం దిగిచి, వసంతసమయ సమారంభ విజృంభమాణసురభికుసుమనిచయంబులవలన సమాలక్షించి నెట్లుఁ బుణ్యగంధంబులు వెదచల్లుచు, సత్పురుష స్వాంతానంద దాయినికాయంబుల నాకర్షింప సమర్థుం డగు ప్రసిద్ధకాంక్షి యిట్లనియె. 32

క. శ్రీయుక్తరవివిష్ణుమహా
మాయానిబిడాంధకారమండలి ఖద్యో
తాయితతేజోమూర్తులఁ
దోయజభవముఖులు దిరుగుదురు వినుమధిపా! 33

---

* ముంచె, మించు—పాఠాంతరములు.

చ. జననసమృద్ధినాశములు చంద్రికళావళి కెట్టు లంబరం
బునఘటియిల్లు; నట్లన యమోఘదురత్యయవిష్ణుమాయయుం
దనవరతంబు లోకనివహంబునకుం బ్రవాతంబు; గావునన్
జనవర! సర్వమున్ జలజనాభుని కైతవమగ్న మారయున్. 34

చ. ఉరగవరైకదండకలితోజ్జ్వలలోకపరంపరన్ సురా
సురముఖజంతుకోటి నిడి చూడ్కికి యుక్తకరండమట్టులై
పరఁగఁగఁ జేసి యెల్లెడల భక్తమనోనిలయాంగణంబులం
దిరముగ నిల్పి వేడుకలఁ దేలుచు వైష్ణవమాయ భూవరా!

ఉ. నీలపయోధరావలి వినిర్భరదీధితు, లాడ కాదకుం
గోలమెఱుంగుతండములఁ గొల్చి గ్రహించెడుమాడ్కి భానుతే
జోలవచంద్రికాంశువులఁ జూపుచుమాపుచునుండువిష్ణుమా
యాలలితేంద్రజాలము నిజాశ్రితకోటికిఁ బ్రీతిసేయుచున్.

క. భూయోజ్యోతిర్వైష్ణవ
మాయానాటక*విధానమంజులపాంచా
లీ యవనిక, భాగవతని
కాయాంతర్నేత్రకౌతుకము †నొదవించున్. 37

తే. ఆచతుర్ముఖకీటపర్యంతజంతు
సంతతులు విష్ణుమాయోరుజాలపటలిఁ
‡దగులుకొనుచుండుదురు మత్స్యతతులువోలె
వితతతృష్ణాబ్ధి నీఁదుచు విను నరేంద్ర! 38

* విధానుమర్దర — వ్రా. ప్ర. † పొదలించున్ — వ్రా. ప్ర.
‡ దగిలిపోచుండుదురు — వ్రా. ప్ర.

మ. అరిషడ్వర్గగుణత్రయేంద్రియధరణ్యాకాశవాత్యాదులన్
న్మరుదాశాంతరవత్సరర్తుకలనామాసాహ్నరాత్ర్యాదులన్
ర్మరతిక్షాంతితిరస్క్రియామదనిశాహంకారభ్యవస్థాగతుల్
చరియించున్ హరిమాయ ప్రాణినిత్యయనుస్యూతవృత్తిన్ సమస్తస్థితిన్

మ. హరిమాయావిభవంబు రాజ్యపదవిద్యాకీర్తిసౌభాగ్యసంపా
త్తరుణాశానుభవోత్సవవ్యయగృహోద్యానాదిసంప్రీతియు
పరమాపత్సుఖ సంపదార్తిగతులై ప్రాపించు లోకంబులన్
సురమర్త్యాసురముఖ్యజంతుతతిఁ దేల్చున్ *దాల్చుఁ దూ
ల్చు నృపా. 40

—♦ ప్రకృతిపురుష స్వరూపంబులు. ♦—

ఆ. మానవేంద్ర! వినుము మాయ నాఁ బ్రకృతి, త
త్కర్త పురుషుఁ, డతఁడు దాని కిష్టుఁ
డతఁడె మొదలి దేవ, మామీఁద మఱి లేదు
దాని నెఱుఁగు నిగమతత్త్వవేది. 41

సీ. పంచేంద్రియములనఁ బగములుట్లయుండు
నర్థంబు లఖిలపదార్థయుక్తిఁ;
నర్థంబులకు నెక్కుడై తనర్చు మనస్సు
నిఖిలప్రవర్తననియతి గలిగి
మనసున కధికమై మలయు సద్బుద్ధి ని
శ్చలసూక్ష్మదృష్టికి నిలయ మగుచు

*దాల్చుఁగూల్చున్ నృపా.—ప్రా. ప్ర.

బుద్ధికి నుత్కృష్టభూమి యై విలసిల్లు
నాత్మ విజ్ఞానసీమాంత మగుచు

తే. నాత్మ కతిరిక్త మగుచు మహత్తు వెలయు
నంతకంటెను నవ్యక్త మతిశయిల్లు
నవలఁ బురుషుండు పరకాష్ఠ యై వెలుంగుఁ
బ్రకృతిలో నంబుధరగర్భ భానునట్లు. 42

వ. ఇట్లు పరబ్రహ్మతేజంబున వెలుంగుపురుషుండు ఘట నిహితప్రదీపంబునుం బోలె నిబిడమాయావరణమధ్యస్థుం డై నిజతేజంబు సకలంబున కగోచరం బని కేలీసంచార పరాయణత్వం బపేక్షించి, యనేకకాలవళితంబై పరి భ్రమించుకులాలచక్రంబుకరణిఁ దిరుగు స్వకీయమాయా కాలచక్రంబున నావర్తించుబ్రహ్మాదులకుఁ బావక*శిఖాం కూరంబువలన నంకురించు దీపపరంపరలవగిది నిజతేజో లవంబున మత్స్యకూర్మవరాహనారసింహాదిబహువిధరూ పావతారంబులఁ బ్రతిఫలించుచు, సౌందర్య వీర్య శౌర్య ధైర్యప్రతాపప్రభావనిగ్రహానుగ్రహదాక్షిణ్యంబు లత్యు త్కృష్టంబులై వెలయ శంఖచక్ర గదాపద్మపీతాంబర కౌస్తుభ వనమాలికాశ్రీవత్స ప్రముఖ లాంఛనంబులతోఁ జతుర్దశ భువనంబులం బ్రవర్తించుచు, సర్గస్థితిప్రళయ కర్తృత్వంబునఁ బ్రాణివర్గంబుల నడుపుచుండు, నయ్యవతారంబులలో మిక్కిలి, శ్రీకృష్ణావతారవిలసితుం డగువిష్ణుండు సహజ

* శిఖా—పాఠాంతరము.

మాయామానుషవేషధారి యై తత్పురుషప్రభావంబు గలిగి విహరించుచుండు, నతండె కాఁడె కౌరవకులం బాహుతిగాని ధర్మనందనుఁ బట్టంబుగట్టి భువనస్వాంతంబు నిలిపినధర్మ కృపగ తంత్రుండు! తత్కపటకేళీకృత్యంబులు నున్న మాయా విధానంబులు; నీకుం జెప్పనమకట్టెన కథాప్రసంగంబు నదియు, వినుము! 43

క. భూమిన్ "సర్వం హ్యస్తి ప
దే మగ్న" మ్మనెడుమాడ్కిఁ దెలియఁగఁ దన్మా
యామగ్నము శివ విధి ర
క్షోసురమాయావిధంబు నవనీనాథా. 44

— విష్ణుమాయాతిశయము. —

తే. దేవ గంధర్వ యక్షాది దైత్యతతికిఁ
గలవు మాయలు విను మల్పకాలగతులు
సలిల*జని బుద్బుదాంబుదచ్ఛాయలట్లు;
లన్నిటిని మ్రింగి హరిమాయ యతిశయిల్లు. 45

క. జలరుహనాభుని మాయా
విలసనమున నుల్లుగొనినవిధ మది వినవే
జలజజ శివ వాసవముఖు
లలవడి సుడిగాలిఁ బడినయాకులుపోలెన్? 46

తే. జాతిపుష్పంబునందు వాసనయుఁబోలె
దీపమునఁ బ్రభపోలె నా దేవదేవుఁ

* నిజ—వ్రా. ప్ర.

గలసి యన్యోన్య సౌభాగ్యగతిఁ జరించు
సిరియు గర్వించి హరిమాయఁ జిక్కువడియె. 47

వ. ఇవ్విధంబున ననవరత సన్నికృష్ట సాంగత్యంబున నద్దేవునికిఁ బ్రాణేశ్వరి యై విశాలవక్షస్స్థలకౌస్తుభరత్నసింహాసనంబున భాసిల్లు సంపద్విలాసినియును, నిరంతర సందర్శన పారాయణ ప్రారంభంబున నయ్యంభోరుహనాభునాభ్యంభోరుహంబునన బంభరాయమాణుం డై యుండునంభోరుహసంభవుండును, నమేయ కల్యాణగుణ సాదృశ్యంబున వేఱులేనిమచ్చికలతో హరిహరు లేకాకృతియనుటకు నాద్యుదాహరింగూడి దంటలై నిలిచిన ఫాలలోచనుండును, సతతంబును నారాయణాష్టాక్షరీ మంత్రసంస్మరణశ్రవణ కుతూహలతాల్యంబున నప్పురాణ పురుషు నాశ్రయించి తన్మంత్రముఖరిత యగువీణం గైకొని పరమభాగవతుండై భవపంకంబునం బడక నిరాతంకసుఖ యోగంబునం జెంది, మోహాయత్తవిషయరససంజాతప్రభూత రోషకషాయితస్వాంతులై పోరలువారింజూచి ప్రహసించుచు హర్షించుచుఁ జరియించు నారదమహామునీంద్రుండును, మొదలుగాఁ గలమహామహిమాఢ్యులు లోకంబుల నల్ప ప్రాణిమండలంబుల తేజంబులం దమతమ తేజంబుల చేతం గుదియించుచు, నిశానమయ జ్యోతిరింగణ గణద్యుతుల నయ్యెకోలంది మాయించునతిస్థూల సూక్ష్మ ప్రదీపాంకురం బులమాడ్కిం బ్రదీపించుచుఁ దమలోన లీలారూపధరుం డై తన మూలరూపంబు జూచి కలసి మెలసి వర్తించు

నయ్యచ్యుతుని నాఁగసి [illegible] కాలము [illegible]
పరిభాషరుసన్న [illegible] మున్న [illegible]
కథలు గలవు. [illegible] 48

— ◆ [illegible] ◆

క. మీఁతాఁత ధర్మనందనుఁ
డాతత*విఖ్యాతిఁ గౌరవాం[illegible]
కాతపవారణముగ నను
ధాతల మొక్కరుఁడ యేలె ధర్మస్థితుల్. 49

సీ. ధర్మదేవతకు నుద్భవ మొంది యుర్వినెల్ల
ధర్మపరాయణత్వమునఁ నిలిచె
రాజసూయ మహాధ్వర మొనర్చెఁగఁ బూని
§ గుఱుతుగా రాజులఁ జేతులు మోడ్చి
సత్యప్రతిజ్ఞ విశ్వము నిండ బలనంతుఁ
డయ్యును వనవాస మాచరించె
†రాజిత ఖడ్గధారా జలౌఘంబునఁ
గౌరవవంశపంకంబు గడిగె
తే. నిఖిలదిఙ్మండలాధీశ నిత్యదత్త
వస్తువిస్తారపూరితవాజిమేధ
యాగభాగాదినందితేంద్రాదిదివిజ
నిర్మితఖ్యాతి నొప్పునాధర్మసుతుఁడు. 50

* విద్యాదిగౌ[illegible]—సా. దాం. § గురుతుగా—ప్రా. ప్ర.
† తేజిత—ప్రా. ప్ర.

వ. అతం డొక్కనాఁడు. 51

ఉ. ఇందుకులప్రభూతపృథివీశ్వరు లాఁదలఁ బట్టభద్రల
క్ష్మిం దనరారి యెక్కుఁగఁ బ్రసిద్ధికి నెక్కి నయూనసముజ్జ్వల
త్సుందరరత్నసింహాముల శోభిలుచున్న పసిండిగద్దెఁ బెం
పొందఁగ నింద్రులీలఁ గొలువుండె నమన్నృపదీపితాంఘ్రియై.

సీ. కౌరవాధీశోరుకాండద్వయద్రోహి
పటుగదాహస్తుండు పవనజుండు
కర్ణవక్షఃపీఠఘట్టనచణబాణ
జనకగాండీవపాణి సవ్యసాచి
చటులకౌరవ్యపక్షక్షత్త్రనిగ్రహ
వ్యగ్రశౌర్యుఁడు మాద్రియగ్రసుతుఁడు
కైతవద్యూతవిగ్రహాకారిసౌబల
హననధుర్యుఁడు నకులానుజుండు

తే. ననుఁగుఁదమ్ములు నలుగురు నర్థిఁ గొలువ
నింద్రునకు గీష్పతియుఁబోలె *నెలమిఁ దనకు
ధౌమ్యుఁ డుచితాసనమున సద్ధర్మకథల
వలన రాజర్షిమార్గముల్ దెలుపునప్పుడు. 58

—♦ వ్యాసముని ధర్మరాజునొద్దకు వచ్చుట. ♦—

ఉ. కౌరవపాండవేయకులకర్త, కళిందసుతాంతరీపవి
స్ఫారతరాకరోద్భవ లసద్రుచిసాంద్రమహేంద్రనీల, మం

* నెనయ—ప్రా. ప్ర.

భోరుహసంభవాన్వయుని, విమోహతమోహరణప్రవీణవి
ద్యారవిమండలోదయము, వ్యాసమహామునిఁ దోఁచె ముందటన్

సీ. జమున పుంభావ [illegible] వనో
లలిత మహేంద్ర నీలములప్రోవొ
నవ్యసాలగ్రామనగశృంగ మలరెనో
సుస్మేరనీలాబ్జసూనవనమొ
కోమలపల్లవాంకురితతాపింఛమో
ఘనతరామృతమేఘఖండభరమొ
సామాధిదైవతోద్దామవిలాసమో
హరిమూర్తి నచ్చొత్తినట్టి రూపొ

తే. యనఁగ దూర్వాంకురశ్యామలాంగదివ్య
కాంతిచకచకలాశలఁ గడలుకొనఁగ
నిష్టదైవంబపోలె సమిద్ధకరుణ
నెదుటఁ దోఁచిన వ్యాసమునీంద్రుఁ గాంచి. 54

క. మానసము నిండి వెలువడు
నానందరసంబువోలె నశ్రులు దన క
న్గొనలఁ దొరఁగఁగ గద్గద[illegible]
నా నరపతి గద్దె డిగ్గి యంఘ్రుల కెఱఁగెన్. 55

మ. సకలక్ష్మావరసార్వభౌమపదవీసామ్రాజ్యసింహాసనస్థుఁ డిం
దుకులగ్రామణి ధర్మనందనుఁడు, [illegible]
ప్రకరంబు న్నిఖిలోగ్రపాలకసుహృద్వర్గ[illegible]
త్నకిరీట ప్రసమార్చనం [illegible]

వ. ఇట్లు సహజన్మసామంతసుహృత్సంతానంబుతోఁ బ్రణమిల్లి
వినయ వినమిత శరీరముకుళీకృతహస్తారవిందద్వంద్వ సందర్శిత
భక్తితాత్పర్యంబులతోఁ దోడ్కొని వచ్చి సభామండప
మధ్యప్రదేశంబున సమున్నతకుశాసనంబున నునిచి పూజించి
తదనుమతంబున నిజసింహాసనాసీనుండై తగినవారల †నయ్యై
నెలవుల నుచితపీఠంబుల నుండ నియమించి ప్రాంజలియై
యభిముఖుం డగు నాధర్మతనయు నవలోకించి కృపాయత్త
చిత్తంబున నమ్మునికులోత్తముం డిట్లనియె. 57

—♦ వ్యాసుఁడు ధర్మరాజును శ్లాఘించుట. ♦—

మ. జననాథోత్తమ! ధర్మనందన! హరిశ్చంద్రక్షమాభర్తతో
నెనయై నిల్చితి సత్యవాక్యమున ధాత్రీశోత్తమశ్రేణిలో
నని ‡నిన్నెంచెద; రట్లకాదె, సుజనుండైనట్టి వాఁ డార్యవ
ర్తన వర్తించినఁ గీర్తియున్ సుకృతముం బ్రాపింపఁజేయుంగదన్?

శా. ప్రాలేయాంశుకులావతంసములలో, భాస్వన్వయోద్భూతభూ
పాలశ్రేష్ఠులలోన రామునికిఁ బ్రియన్ భాస్వద్ఘనబ్రహ్మవి
ద్యాలక్ష్మీవిభవంబు శౌర్యనయయుక్త భ్రాతృసౌజన్యముం
ద్రైలోక్యంబున నెన్నఁగా వెలసి తార్యస్తుత్య! ధర్మాత్మజా!

క. జలరుహసంభవముఖులకుఁ
గొలఁదియు నెఱుఁగంగరానిగోవిందుఁడు నీ
కులమునకుఁ గూర్మిచుట్టముఁ
జెలికాఁడును నయ్యె; నేమి చెప్పుదు నింకన్? 60

†తగిన నెలవుల,- ‡నని నిన్మెచ్చెద-అనిమున్మెచ్చెద. పాఠాం.

వ. అని హరిం దలంచి తద్భక్తవత్సలత్వంబు నూహించి. 61

తే. భక్తపరతంత్రుఁ డైన యాపద్మనాభుఁ
డేడుగడయును దాన యై యెల్లయెడల
మిమ్ముఁ బ్రహ్లాదుఁ బోలె నమ్మినకరుణఁ
*దగిలి రక్షించె ఘోరదుర్దశలవలన. 62

సీ. కావఁడే మానంబు కౌరవసభలోనఁ
బాంచాలి కక్షయాంబరము లొసఁగి
యాఁకొన్నదుర్వాసునలుకఁ జెడకుండ
నరయఁడే నినుఁ బులాశార్థి యగుచు
రవి గ్రుంకకుండ సైంధవుఁ ద్రుంచుసవ్యసా
చిప్రతిజ్ఞ నిలుపఁడే చీఁకువెట్టి
ధృతరాష్ట్రుకౌఁగిట మృతి మాన నుక్కుగం
బముచేతఁ బ్రోవఁడే పవనసుతుని

తే. †నాశ్వసింపఁడె నారాయణాస్త్రవహ్ని
బలము దెగకుండ ద్రౌణిశాసంబువలన
నుద్ధరింపఁడె మీవంశ ముర్వి నడఁగ
కుండఁ గృష్ణునివంటి హితుండు గలఁడె. 63

వ. వెండియు, నాఖండలాదులయిన సురులుం బోలెఁ బావనగుణు
లైనధార్తరాష్ట్రులు మీమేలు సహింపఁజాలక యాగర్భంబు
వైరంబు నూఁది కర్ణసౌబలుల దుర్మంత్రంబునను మిమ్ముఁ
గపటవ్యాపారంబున హింసింప సమకట్టి చేయునిష్ఠురంబు

* గలిగి రక్షించె ఘోరదుఃఖములవలన, †ఆదరింపఁడె. పాఠాం.

లన్నియు మీ రెఱుంగకుండ సర్వాంతర్యామి గావున నయ్యు నంతుండు దూరస్థుం డయ్యు నికటస్థుండునుంబోలె నిరర్థకం బులు గావించుచుండు. మీ రెల్ల నచ్చెరువడి చూడ భగ దత్తుండు వైచిన దేవాసురనిరంకుశం బగు వైష్ణవాంకుశంబు విజయునిం బొలియింపకుండ నడ్డమై ముందట నిలిచి దానిం దన కౌస్తుభగ్రైవేయక లక్షితం బైనవక్షస్థలంబున వైజ యంతికి దండ యగు ప్రాదండగా ధరియించియు, నింద్ర దత్త యగు నుగ్రశక్తిం బార్థునిమీఁద వైవకుండఁ గర్ణదు ర్యోధనాదులకు మఱపు పుట్టించియు, నారాధేయుం డలిగి యేసినయమోఘనాగాస్త్రంబు తాఁకునం బోకుండ రథంబు గ్రుంగ నదిమి ప్రత్యస్త్రశూన్యం బైననరునితలఁ గాచియు, భీష్మద్రోణకృపాశ్వత్థామకృతవర్మప్రభృతిమహావీరపురుషు ల మంత్రవీర్యానంతంబు లగు ననన్యవార్యశౌర్యదివ్యాస్త్ర సంఘంబు లసంఖ్యంబులై విలయసమయధారాధరఖండం బులవలనం దొరంగు వేఁడిపిడుగులచందంబునఁ బైపయిం బడునప్పు డతనిదేహంబు దహింపకుండఁ దదీయతేజోవహ్ను లంతర్ధానంబు నొంది యుండం దోడ్తోన సంస్తంభింపఁ జేయుచుఁ, బోరితుది ధనంజయుం దొలఁగించి యయ్యనల శిఖాముఖంబులకుఁ దురగసహితం బగురథంబు నాహుతిగాఁ జేసియుఁ, బుత్రశోకార్తిం గుందు గాంధారి క్రూరశాప వ్యథాభారంబు మీయందఱకు లేకుండం బరిహరించి తానే వహించియు, నపారకౌరవకులపారావారంబు నిశ్శేషంబుగా

శోషింపం జేసియు నశేషసముద్రముద్రితవసుంధరాభారధౌరం
ధర్యంబు నీకుం బాలుగ హితంబుగా ననుగ్రహించి నినుం గీర్తి
సుకృతంబులకుం బ్రథమగణ్యునిఁగాఁ బ్రసాదించె నదియునుం
గాక, 64

సీ. మేనత్త యని గొంతి మెయికొని పూజించు
నెమ్మి మఱంది నై నీకుఁ బ్రియము
ననుఁగు నెచ్చెలికాని యట్ల పావని మెచ్చు
నర్జునుఁ దనప్రాణ మని తలంచు
కవల సాత్యకియందుఁ గలకూర్మిఁ బాటించుఁ
బాంచాలిఁ జూచు సుభద్రఁ బోలె
నాత్మకృత్యములుగా నరయు నీపను లెల్ల
మేలు సేయున కోరు మీకు నెపుడుఁ

తే. దల్లిదండ్రులమీఁద సోదరులమీఁద
ధర్మపత్నులమీఁద నాత్మజులమీఁద
లేదు మీమీఁదఁ గల్గు ప్రేమానుభవము
ధర్మనందన ! దేవకీతనయునకును. 65

మ. అమరేంద్రార్యులచేత మెచ్చికొను నయ్యంభోజపత్రాక్షుఁడే
యమరేంద్రార్యులు చూడ నెమ్మి ప్రణతుండై కంటికిన్ రెప్పచం
దమునన్ నీకు సహాయుఁడై తిరుగుచున్నాఁ డిట్టి నీవంటి యు
త్తముఁ డాదివ్యులయందు నైనఁ గలఁడే ధాత్రీశ లింకేటికిన్ ? 66

వ. అని సాత్యవతేయుండు పలికిన సత్యవచనంబులు విని ధౌమ్య
పురోగము లైన గురువిద్వజ్జనంబులును, భీమార్జుననకుల

సహదేవులును, సేవాగతులై యున్న సూర్యసోమవంశసం
భవు లగునుత్తమక్షత్రియులును, హితామాత్యవర్గంబులు
నట్లయా నని పరస్పరాలోకనస్వీకృతాంగీకారులై యతి
హర్షంబునం బొంది దేవకీనందనుదయాదాక్షిణ్యంబుల నభి
నందించుచున్నం గొలువు భృంగసంగీతంబులతోఁ జెంగలువ
కొలను మెలంగినచందంబున నందంబయ్యె, నమ్మహారాట
శ్రేష్ఠుండును మునిగరిష్ఠునిముఖచంద్రబింబంబువలనం దొరం
గిన పుండరీకాక్షునినామాక్షరంబు లనునమృతబిందుబృందం
బులు శ్రుతిపుటంబులం బడినయప్పటినుండియు నంతర్నిరీక్ష
ణంబున నుత్ఫుల్లపులకకలికాభిరామాంగంబుతో నంతరం
గంబు నిరంతరానందరసనరసీతరంగంబుల నోలలార్చుచున్న
వాఁడై సుఖపారవశ్యంబువలనఁ గొండొక దెలిసి బ్రహ్మ
ధ్యానానంతరంబున యోగిపుంగవుండునుం బోలెఁ గన్నులు
విచ్చి యందఱం గలయ నాలోకించి యమ్మహాభాగున
కిట్లనియె. 67

—♦ ధర్మరాజు శ్రీకృష్ణప్రభావము వర్ణించుట. ♦—

క. ఆహా ! కృష్ణునిసుగుణ
వ్యాహారము లింత యొప్పునా విన నవము
క్త్యాహారకలాపములకు
సాహాయ్య మొనర్చు మీవచస్సామగ్రిన్! 68

క. హరినామోత్కరములు శుభ
కరములు, త్రైలోక్యవిజయకరములు, శ్రీయ

స్కరములు, హితకార్యవశీ
కరములు, సత్పురుషసౌఖ్యకరములు వినఁగన్. 69

చ. కలమృదువల్లకీరవముకంటె వసంతవిహారచారుకో
కిలనినదంబుకంటె నళికీరరుతంబులకంటెఁ దాళసం
కలితమృదంగశబ్దములకంటె మనోహరకామినీవచః
కలనలకంటె నింపొసఁగుఁగా, చెవికిన్ హరినామసన్నుతుల్ 70

క. మీ రానతిచ్చినట్లన
నారాయణుఁ డార్తరక్షణపరాయణుఁడు; దా
ద్వారవతీపురపతియా
ధారము లేకున్న బ్రతుకఁ దరమే మాకున్? 71

క. జలరాశి మగ్నవసుధా
తలమెత్తిన క్రోడమూర్తి తాఁ గావున నా
కుల ముద్ధరించె హరి యి
మ్ములఁ గౌరవార్ణవమున మునిఁగినదానిన్. 72

ఆ. భక్తితోడఁ దన్ను భావించుదీనుల
నెమ్మితోడఁ బ్రోచు నెనరు గలిగి
కోరి తన్ను వెదకువారికిఁ బెన్నిధి
యట్ల తోఁచి ప్రోచు నచ్యుతుండు. 73

వ. అంతియకాదు; ప్రబలతరతృణస్తంబసముచ్ఛేదనానంతరం
బున వర్షధారాభిషేచనంబుచేత సస్యభరంబును, విషవృక్ష
కంటకలుంఠనానంతరంబున వసంతసమాగమంబుచేత నుద్యా
వనంబును, సంసారసంకులవిషయభోగవైరాగ్యానంతరంబునఁ

జిదములానందలహరిచేతంబరమయోగిహృదయంబును, బహు
ళబహుదీర్ఘవ్యాధిమోచనానంతరంబున హితాన్నపానాదిక
ద్రవ్యవిభవంబుచేత శరీరంబును, దురహంకార కాకవి ద్విపా
త్పశుకంఠదారుణఘంటాఘణఘణత్కారనిరాకరణానంతరం
బున రసిక సుకవి కావ్యప్రసంగ గంభీరవచ స్సారస్యంబుచేత
నాస్థానంబు నెవ్విధంబున నభివర్ణింప నొప్పు నట్లన క్రూర
కౌరవ్యకులపంకకళంకక్షాళనానంతరంబునఁ జక్రధరునికరుణా
కటాక్షనిరీక్షణంబుచేత జగదేకపూజ్యం బైనకరినగరసామ్రా
జ్యంబు నాకు సిద్ధించినయది. అమ్మహాప్రసిద్ధియుఁ బ్రతి
యుగంబునఁ బ్రహ్లాదచరిత్రంబును, గజేంద్రమోక్షణప్రకా
రంబును, విభీషణపట్టాభిషేకపుణ్యకీర్తనంబును, ధ్రువోపా
ఖ్యానంబునుంబోలెఁ జంద్రసూర్యసాగరమేరుధరణీతలంబు
లుం గల కాలంబు వెలయ హరి సమకట్టిననాఁడు. మఱి
యట్టిప్రభావంబు బ్రహ్మరుద్రమహేంద్రగంధర్వయక్షరాక్షస
సిద్ధవిద్యాధరశ్రేణులలో నెవ్వరి కైనం గలుగుట యెందును
వినినైన నెఱుంగుదుమే? యిమ్మకుందుండే పరమపురుషుం
డది యెట్లంటేని. 74

చ. హరియును నేముఁ గూడినదియాదిగ నమ్మహనీయమూర్తి వి
స్ఫురదురుతేజ మాత్మఁ గని పొందుగఁ గేళి మనుష్యవేషసుం
దరుఁ డగునాదిపూరుషుఁడితండని మ్రొక్కఁదలంచి,యాతఁడే
పరువడి మ్రొక్కినం బరమబాంధవుఁడంచును గూర్మి
నేయుదున్. 75

ఆ. ప్రొక్కి నిలిచినపుడు మక్కువ మీఱఁగ గా
గారవించి శౌరి కౌఁగిలించు
వెనుక నితఁడు ద్రోవ మనుప్రీతి నాతిల్ల
భక్తి నుతియొనర్చు భావసిద్ధి. 76

మ. గురుభీష్మార్జునసూను లాజిఁబడినన్ క్షోభించి *మోహార్తిచేఁ
గొరలం, జూచుచు మందహాసవదనాంభోజంబుతో నుండెనే;
న్వారు నష్టంబుది మేలె కాఁ దలఁచు భావం♦బెట్లా! నీనామహా
పురుషుంజూచుచునుండునయ్యవేలుదాఁబోవుంవదాఁగోకసన్

క. సంధి యొనర్పవె కోరుదు
బంధుక్షోభమున కోడి పల్కెదు; నది ని
ర్బంధపరియత్న మని యను
సంధింపఁడు; పెంచు నీరసము యురువాఁగున్! (వంకసి?) 78

ఉ. అన్నలుఁదమ్ములుంగురులునాప్తులుమిత్రులునాశ్రితాళియుం
బన్నినపోరు ఘోర మగుపాతక, మేలని మానఁ జూచినన్
మిన్నక సాక్షిమాత్రములు మీరలు; దీనికి మూలమీవె; కా
నున్నది కాకపో దనుచు నుల్లము †సేర్పఁ దదీయబుద్ధికిన్.

చ. కురుకులసంక్షయంబు, నృపకోటులచావు, తదాప్తమిత్రసం
హారణము, తత్కులాంగనలయార్తరవోత్కటవహ్నిపాతని
ష్ఠురరభసంబు చూడ నతిశోకభరం బగు మాకు; నమ్మహా
పురుషుఁడు భార‡మి ట్లడఁగిపోయెనటంచు హసించునవ్వలన్.

---

* మోహార్తిచే; ♦ భావంబెట్లు—ప్రా. ప్ర, భావంబుట్ట—పాఠాం.
† దేర్పఁ దదీయబుద్ధిచేసి—పాఠాం. ‡ భారమెట్లడఁగి—ప్రా. ప్ర.

వ. అదియునుంగాక. 81

తే. కనకపీతాంబరంబుతోఁ గౌస్తుభంబు
తోడ నానందలహరి నై తోఁచు నపుడు
కమలనేత్రుండు నాకన్నుఁగవకు నెదుట
నిఖిలరూపంబులను జెంది నీడవోలె. 82

చ. జలదహాకోమలావయవసంపదతోఁ, బెలిదమ్మిరేకులం*
గలకల నవ్వుచున్న తెలిగన్నులతోఁ హరి వచ్చి ముందటన్
నిలిచినఁ జూతుఁ గొండొకవినిశ్చలదృష్టులఁ; జూడఁ జూడ ను
జ్జ్వలరుచిరాశియై, నవయవంబులు సూపక, యేమిచెప్పుదున్!

శా. ఆతేజంబును నీలపీతసితవర్ణాయత్తమై, క్రమ్మఱన్
శ్వేతంబౌ నరుణంబయౌ నసితమౌ వేఱ్వేఱ; ♦నిర్ద్దిదియో
చూతాత్మంచుఁ దలంప, నెప్పటిగతిన్ సువ్యక్తకృష్ణాకృతిం
జేతఃప్రీతియొనర్చుఁ; దద్భ్రమపరిచ్ఛేదంబు నానంతటన్. 84

క. ఇది యెల్ల నెఱింగియు నా
మదిఁ గృష్ణుం డాదిపురుషమయుఁ డనుతలఁ ప
ట్లాదవఁగఁ ||ద త్త్వజ్ఞానం
బది యేమొకో యనుచుఁ దలఁతు ననవరతంబున్. 85

—♦ కృష్ణుని యాథార్థ్యము వ్యాసులవారిని ధర్మరా జడుగుట. ♦—

వ. ఇవ్విచిత్ర కృత్యంబు లెట్టివి, యమ్మహానుభావుండు నిగూఢ తేజుండై శాణోత్తేజితంబు గాని మాణిక్యంబుచందంబున నున్నవాఁడు. దర్శితాదర్శితప్రభావుండై జలధిచిలోలవీచీ

* తోఁ. ♦ నిశ్చిట్టిదోఁ-షా; నిశ్చిన్నచున్-వ్రా.ప్ర. || నీవిజ్ఞానంబది. షా.

నిచయప్రతిబింబితప్రభాకరు ననుకరించుచుఁ బ్రవర్తించు. దీని విభజించి కృష్ణునికింగూడ సంశయము మీ దివ్యదృష్టిం బరామర్శించి వచింపుఁడు. మీరందఱు త్రికాలవేదులు, సకల విద్యాపారంగతులు, నిఖిలసదసద్వ్యవహారవిజ్ఞులు నగువివేకనిధులు. మీకు నగోచరంబు లెయ్యియు లేవు, పెద్ద కాలంబునుండి నామనంబు సందేహదోలాందోళాయ మానంబై యున్నయది. మాయాసత్యవాక్యకౌశలంబునం గైతవ చ్ఛాదితంబైన సత్యస్వరూపంబు, రాజహంసముఖంబున నుదకసమ్మిశ్రితంబైనదుగ్ధరసంబునుంబోలె నేర్పడు నని ప్రార్థనాపూర్వకంబుగాఁ దన్ను ధర్మనందనుం డడిగిన యపూర్వతాదృక్ప్రశ్నంబునకు సంప్రీతుండై వేదవ్యాసమహా మునీశ్వరుండు కొండొకతడవు నిష్పందనిస్తరంగతరంగ మాలియుంబోలె నూరకుండి తనయంతరంగంబున నిది విష్ణు మాయావిభ్రమం బని నిశ్చయించి యిట్లనియె. 86

—◆ సర్వము విష్ణుమూర్తిమాయ యని వ్యాసమునిరాజు చెప్పుట. ◆—

క. ఈయెల్ల §యదియు నాటని
మాయానాటకము; విష్ణుమాయ నెఱుఁగం
దోయజభవునకు నరిది; త
దాయత్తం బీజగత్త్రయంబును నధిపా! 87

చ. తనఘనమాయలోకము, నిదానముదానికిఁ దాన, కృత్యముల్
దనయవ, కర్త దాన, సఫలత్వముఁ బొందెడువాఁడు దాన,ధ

§ ఈయెల్లదియును—పాఠాం.

ర్మనియమకారి దాన, పరమం బగుతేజము దాన నై జగ
ద్వినుతుఁడు లోకముల్ నడుపు విష్ణుఁడు, సర్వము దాన కావునన్.

చ. నెఱి నిజతత్త్వ మేరికిని నిర్ణయ మొందఁగ నీఁడు; లీలమై
మెఱపును బోలెఁ గొందఱ కమేయదయాకృతిఁ జూపుఁ; జూపి త
న్నెఱిఁగితి మన్న మాయ ఘటియించు; నహంకృతిఁ బాసి భక్తిమై
నఱిగొఱలేనివారికి నిరంతరముం గనుపట్టు భూవరా! 89

వ. అతండు కపటనాటకుండు, తనమాయానిర్మితం బగు జగం
బెట్లు నడపవలయు నట్లు నానారూపవర్తనంబులఁ గార్యసం
సిద్ధిం బ్రవర్తించు నీ వడిగిన సంశయంబు లెల్ల నేర్పరించెద
వినుము. 90

— విష్ణుపరిభావము —

క. వనజాక్షుఁడు నీరూపునఁ
దనతేజము నిల్పి కొంత దనపనిఁ దీర్పన్
నినుఁ బెద్దఁ జేసి మ్రొక్కును
జనవర! *సహచరతఁ గార్యసఫలతకొఱకున్. 91

చ. అనలరవీందురుద్రజలజాసనవాసవులందు నున్న య
య్యనుపమదివ్యతేజమును నాహరియంశము కాదె? వారి వం
దనములఁ దన్పఁడే యతఁడు తద్విషయంబులఁ గూడి మర్త్యవ
ర్తనమున నేరికిన్ సహజతత్త్వముఁ జూపక మాయ పెంపునన్?

వ. కావున నీకు మ్రొక్కుట బంధుభావంబున నని తలంప
కుము, తనకుఁ దాన సన్మానించుకొనుటగా వితర్కింపు

*సహచరితకార్యసఫలత... వ్రా. ప్ర.

మతనికి నీవు నే నని భేదంబు లేదు. పూజ్యపూజకపూజా
రూపంబులు పిష్ణుండ. 93

క. ॥జనినిధనశోకసమ్మోలు
తనమాయాకృతము లగుటఁ దాఁ బన్నినమీ
లును గీడును జంతువు లో
దినఁ బరహిత మహిత మనఁడు నియమస్థితికిన్. 94

వ. భీష్మద్రోణాదులయందుఁ బితృ*భ్రాతృపుత్రపౌత్రాది జంతు
సంతతియందు నవ్వ రక్షన నది యతనికి సంతోషంబ
కాని దుఃఖకారణంబుగా; దమ్మహాపురుషుం డానందమ
యుండు గాని దుఃఖకలితుండు గాఁడు, మఱి మాయందు
ననుగ్రహంబు గలిగి మమ్ము సంరక్షించు చున్నవాఁ డని
పలికితి వది యె ట్లంటేని. 95

క. భక్తాధీనుఁడు గావున
భక్తుల నాపదలవలనఁ బనివడి కాచున్;
భక్తప్రవరుల మిము నా
సక్తిన్ రక్షించు టెంత చక్రధరునకున్. 96

వ. తొల్లి ప్రహ్లాదాదుల నెవ్విధంబునం బ్రతిపాలించె విన వె
యతనికిఁ బ్రపన్నపరిపాలనంబు వ్రతంబు. 97

క. విను భూభారముఁ దీర్పఁగఁ
బనిఁ బూనినచక్రధరుఁడు పని దీనవని యె

|| జనసాధనశాసనములు. వా. ప్ర. వనజాసనశాసనములు-పాఠాం.

* పితృమాతృకళత్రపుత్రాది—పాఠాం.

ట్లొనరించినఁ బాపము లే
దనఘాత్మా! సేయువాఁడు నచ్యుతుఁడ యగున్. 98

క. మనుజుం డేచందంబునఁ
దనచేయునఘంబు లైన ధర్మము లైనన్
వనజాక్షుచేఁత లని మన
మునఁ దలఁచిన నుభయకర్మముక్తుఁడగుఁ దుదిన్. 99

క. *మీారణకృత్యము విష్ణు
ప్రారంభము గానఁ ♦బరమపాతక మయ్యెన్
గౌరవపాండవవీరుల
కో రుత్తమ మనఁగ నెగడు భువనములందున్. 100

ఆ. హరికిఁ గాని యజ్ఞ మైన నసర్థంపుఁ
జేఁత; యచ్యుతునకుఁ బ్రీతి సేయు
బ్రహ్మహత్య యైనఁ బరమధర్మము, ధర్మ
శాస్త్రవాక్యమర్మసరణి వినుము. 101

వ. అత్యుత్తమసాత్త్వికజ్ఞానవంతుండవు గావున నీకు నట్లు కొంత కొంత నిజతేజోవిలసనంబు ప్రకాశంబు గాఁ జేయుట యనుగ్రహంబు. 102

చ. జననసహస్రపుణ్యఫలశంబరధారల నూని సాత్త్వికం
బనియెడు విత్తున న్మొలచు నచ్యుతభక్తిసురద్రువల్లి స
జ్జనహృదయాలవాలములసారెకుఁ బ్రోది యొనర్చుచుండ నం
దునఫలమైజనార్దనుఁడెతోఁచిఘటించుఁ దదీయసౌఖ్యముల్.

* ఈరణ:-వ్రా. ప్ర. ♦ పరమపాతకమయ్యెన్ — పాఠాం.

చ. అనుపమవిష్ణుభక్తియు సమంచితసాత్త్వికధర్మసక్తిప్
ధనతయుఁ గల్గునిన్ను హరి దాను దయన్ జగదేకపూజ్యుఁ గాఁ
గనియును నీకు నిట్లు ప్రోడకట్టుట మోక్షమునీఁదలంచి; యీ
యనువునఁ గాదె భక్తులఁ గృతార్థులఁ జేయుచునుండు నిచ్చలున్.

క. తగ " సర్వం విష్ణుమయం
జగ " త్తనుట వినవె *యతఁడు సర్వగతుఁడు త
త్త్వగరిష్ఠులకుఁ గనుపడుఁ
బ్రిగుణములై ♦యొందు నతని ప్రతిబింబంబుల్. 105

చ. త్రిగుణమయుండు గావునఁ బ్రదీప్తుఁడగుచు వివిధప్రభాప్తి ని
మ్నగనోకవేళ; నొక్క రొడమూఁటను §వేర్పడియుండు గేవలుం
డగు పురుషుండు గావునఁ; గ్రియాపరతంత్రుఁడు గావునన్ సమ
స్తగుణవిలాసమూర్తులఁ బ్రసక్తివహించి నటించు నొక్కచోన్.

వ. అని సర్వంబును దేటపడఁ బరాశరనందనుండు పలికిన ధర్మనందనుండు విని, మహాత్మా! మీహృదయంగమప్రమాణ వాక్యంబుల నా సందేహనివృత్తి యయ్యె. వాసుదేవుం డట్టివాఁడ యౌ, నైన నింక నొకటి యడిగెద నప్పురుషోత్తముండు నిజతేజంబు డాఁచి మాయామానుషవేషధారియై జగంబులు నడుపుచుండుఁ దద్విలసనం ‡బెట్టిదియును గాన బ్రమసి తిరుగుచుమునోంట్లు తుదిముట్టనెఱింగి ముక్తిఁ బడయఁ జాలరు గాక విజ్ఞానదృష్టిఁ బెక్కుదెఱంగుల నతని మొదలి తేజంబుఁ దెలిసి కృతకృత్యులైన మీ యిట్లు తత్త్వగను

* యట్లు; ♦ యందు; § నేర్పడి; ‡ బెట్టిదియు—పాఠాం.

సాయుజ్య ముక్తిం బొందక యుంటకుం గారణం బేమి? యనిన నమ్ముని యిట్లను. సకలంబు నతని మాయానటితంబు; తన్మాయాతిమిరంబు జగంబు లన్నియుం గప్పి సకలజనుల నజ్ఞానాంధులం గావించుచున్నయది; యది భేదింప నెవ్వరికి నలవి గాదు. దానంజేసి విష్ణుసాయుజ్యంబు దుర్లభంబు; క్రమక్రమంబున నతనియందు భక్తి యెక్కించిన పరమభాగవతులకు సిద్ధించు, నహంకారపరులైన వారు మాయాచక్రంబునంద పరిభ్రమింతురు. వీరు వా రన నేలను. సకలజనులు * పరిశాంతిభావశౌర్యవిద్యాపరిభానంబుల నహంకరించుచుంద్రు; గావున ముక్తి వడయ నోపరు. సాత్త్వికగుణంబు గలిగి యతని నెఱుంగుటయు నరిది; యహంకారగ్రస్తులై విష్ణుమాయం దిరస్కరించి బ్రహ్మరుద్రాదులు మోసపోయిరి మే మెంతవారము? మది యెట్లంటేని నే నెఱింగినకథలు గొన్ని చెప్పెద; విను మని పలుకుసమయంబున. 107

—◆{ధర్మరాజుసభకు గోవిందశర్మ యనెడు బ్రహ్మచారియును సనక సనందన సనత్కుమార నారదులును వచ్చుట.}◆—

ఉ. ద్వారకనుండి వచ్చె వటువర్యుఁ డొకండు వినీలకంధరాకారుఁడు, గోపిచందనవికస్వరఫాలుఁడు, పారిజాతమాలారమణీయవక్షుఁడు, మిళత్తులసీనవమంజరీశ్రవోహారి, ద్వితీయకృష్ణుఁ డన హాటకపుస్తకహస్తుఁడై దివిన్.

* పరిశిభాశౌర్య—పాఠాం.

క. సనకసనందననారద
సనత్కుమారులును వానిసంగతిఁ బిలువఁదన్
జనుదెంచిరి తద్గను ది
వ్యనితాంతద్యుతులు పర్వె నడిఁ గొలు వెల్లన్. 100

ఉ. వాసవనీలజాలము లవారణ రాలెడు మింటనుండి యుద్భాసి
తలీల వానిపిఱుఁద సన్నసనుంకజనాగరత్నము, జ్ఞానముదారగ
ముం దొరఁగెఁ గన్గొనుఁ డంచు నటు గాత్రమాంబుజా, తానన
జాంగదీధితుల కచ్చెరువందిరి సభ్యు లందఱున్. 101

వ. ఇట్లు తత్ప్రభాపటలంబులు కన్నుల మిఱుమిట్లు గొలుపుచు సొంపారుతద్భువన ప్రదేశం బాచ్ఛాదింపఁ గొలువువా రెల్ల నెద్దియు నిశ్చయింపఁజాలక, కొంత కౌతుకప్రాప్త హర్షవిస్మయ రసంబున నున్న, సర్వజ్ఞుండు గగనతలంబు నవలోకించి సాంద్ర మహేంద్రనీలనీలాకారుం డొక *మహాభాగుండును సూర్య సంకాశులైన వారొక మువ్వురును, బూర్ణచంద్రోపమానుం డొక్కరుండును నెవ్వరోకాని యేవురు దివ్యపురుషులు విజయంబుసేయుచున్నవా రని వెండియుం బరీక్షించి, యెఱింగితి నివ్వటుండు ద్వారకానగరంబువాఁడు, కృష్ణుని యంతఃపురస్త్రీ లగు రుక్మిణ్యాదులకు నుబుసుపోవం గథలు సెప్పు గోవిందశర్మ యనువాఁడు. వీనియందు సత్యభామా మహాదేవి యనుగ్రహం బతిసమగ్రింబై యుండుఁ, గడమ నలువురును సనక సనందన సనత్కుమార నారదులు మీ

* మహాబాహుండును. వ్రా. ప్ర.; బాలుండును. పా. ణాం.

రెఱింగినవారు. వారిరాకయు నిద్యోడకే యని తోఁచుచున్న యది యనినఁ గృష్ణద్వైపాయనుండు నట్ల నిశ్చయించి యీ గోవిందశర్మ యనువాఁడు మహాతపస్వి, సకలకథాప్రవీణుండు. మన ముపక్రమించిన విష్ణుమాయారహస్యంబు లన్నియు విశదంబుగాఁ జెప్పనేర్చు, నిక్కడికథాప్రసంగంబు తనదివ్యచిత్తంబున నెఱింగి వాసుదేవుండె పంపినవాఁడు. తదనుమతంబునఁ దద్దేవమునులును వానివాక్పాటవంబును, దదీయమాయాప్రభావంబును వినువేడుకఁ జనుదెంచినా రనిన నందఱుం గౌతూహలాయత్తచిత్తులై తదభిమతాగమన ప్రత్యుత్థానప్రయత్నాభిముఖు లగుచుండి రంత (నయ్యేవురు) ననంతమార్గంబు డిగ్గి తత్సభాసమీపంబున నిలిచిన. 111

శా. పారాశర్యుఁడు దక్కఁ దక్కిన మహాభాగుల్ సభాసీను ల
వ్వారాశ్యన్నమితోర్మిసంఘముల లేవన్నిల్చుడున్ సంభ్రమం
*బారన్ సానుజుఁడైనధర్మజుఁడు ప్రేమాయత్తచిత్తంబుతో
వారిం దోడ్కొని తెచ్చియిచ్చెఁ గడువిశ్వాసంబుతో నర్చనల్.

వ. ఇట్లు తగువిధానంబున సేవురం బూజించి సత్యవతీసుతుని సమీపంబున నబ్బాలుం డగ్రభాగంబునం గూర్చున్నఁ దక్కిన నలువురను సుఖాసీనులం గావించి తదనుమతంబునఁ గూర్చుండు సమయంబున. 113

* "బారం గద్దియ డిగ్గి పోయి ప్రణతుండై ధర్మజుం డర్థిమై—పాఠాం.

— ధర్మరాజుసభకు ఋషీంద్రులు వచ్చుట. —

సీ. కశ్యప కణ్వ మార్కండేయ భృగు వసి
ష్ఠ మతంగ జాబాలి జహ్ను పులహ
వాలఖిల్యాగస్త్య గాలవ మైత్రేయ
జమదగ్ని నారద శౌనక గర్గ
కపిల భరద్వాజ గౌతమ చ్యవన వి
శ్వామిత్ర మౌద్గల్య చండదమన
రోమహర్షణి పైల జైమిని మాండవ్య
వరతంతు శరభంగ వత్స కౌత్సు
తే. లాదిగాఁ గల పరమసంయములు వచ్చి
రందు గోవిందశర్మ ధర్మాత్మజునకు
విష్ణుమాయాప్రభావంబు విస్తరించు
ధీరమతి నంచు విజ్ఞానదృష్టి నెఱిఁగి. 114

వ. అట్లు సరిత్సాగరపర్వతారణ్యాశ్రమంబుల నున్నవారలును, *దిక్పాలలోక బ్రహ్మలోకవాసులును నగు తపోధనంబులై పాటలజటాభారదండకమండలు దర్భసూత్రాక్షమాలికాకృష్ణాజినప్రముఖలాంఛనంబులతో నారాయణనామోచ్చారణపరాయణు లగుచు వచ్చి ద్వారప్రదేశంబునం దోఁచిన. 115

క. కని దౌవారికముఖ్యుఁడు
వినయాంజలితోడ వచ్చి విన్నప మొనరిం

* దిక్పాలధరిత—బ్రా. ప్ర; & పాతాం. ([illegible])

చిన విని కృష్ణద్వైపా
*యనుఁడంపఁగ ధర్మపుత్త్రుఁ డతులప్రీతిన్. 116

క. అనుజులు దానును సంభ్రమ
మున నెదురుగఁ బోయి వినతిపూర్వకముగ స
ద్వినయమున నమ్మునీంద్రులఁ
గొని చని యర్చించి యునిచెఁ గుశపీఠములన్. 117

వ. తదనంతరంబ వారల యాశీర్వాదంబులతో సోదరామాత్య
పరివృతుండై కూర్చుండి సిద్ధమంత్ర తంత్ర కళా ప్రత్యక్షీ
కృతనిజాభిమత దైవతంబులసన్నిధి సిద్ధపురుషుండునుఁబోలె
నొప్పుచుండె నప్పుడు. 118

—♦ ధర్మరాజును నారదుఁడు శ్లాఘించుట ♦—

క. అందఱు సముచితపూజా
నందితులై యున్నఁ బలికె నారదుఁడు జనా
నందకరు ధర్మనందనుఁ
జందురునం దమృతరసము జాఱెడుభంగిన్. 119

ఉ. గొంతికి ధర్మదేవతకుఁ గూరిమి‡పట్టివి పుణ్యమూర్తి వ
త్యంతదయావిధేయుఁడవు తాపసముఖ్యులు నీగృహంబునన్
సంతతముం బ్రియార్చనల సంతస మందుచు నున్నవారు నీ
యంతటిభాగ్యవంతుఁడగయన్ మఱిలేఁడుజగ త్త్రియంబునన్.

---

* యనుఁ డుపాంగంగ నృపతి యతులప్రీతిన్—ప్రా. ప్ర.
‡ కూరిమిఁబుట్టినపుణ్యమూర్తివి—వ్రా. ప్ర.

తే. దేవగంధర్వయక్ష దైతేయరాజ
సభలు చూచితి నవియు నీసభకు సాటి
గావు; సురరాజసభయైన గాదు కొంత,
ధార్మికశ్రేష్ఠసంపూర్ణ! ధర్మతనయ! 121

సీ. వాసవదహనాంతకాసురవరుణాను
రు ద్యక్షనాయకరుద్రపుత్ర్య
లనుచరభూతగుహ్యకసిద్ధగంధర్వ
లేనోద్విపేంద్రమృగేంద్రమూర్తు
లమితశాపానుగ్రహప్రభావులు హరి
హరగేహను*గర్భాభు లఖిలవేద
శాస్త్రోపనిషదర్థసన్మంత్రదక్షులు
కల్పాంతరస్థు లనల్పమతులు
తే. సత్యసంధులు తత్త్వనిష్ఠాగరిష్ఠు
లిట్టిమును లిట్లు నీయింటి కేగుదెంచి
పూజ లందుచు నున్కి నీపుణ్యఫలము
తత్ఫలము నీకు హరి సువ్వె ధర్మతనయ! 122

సీ. అఖిలలోకైకనాయకుఁ డాదిపురుషుండు
త్రైలోక్యరక్షావిశాలబుద్ధి
శ్రీకృష్ణుఁ డనుపేరు చెవులకుఁ జల్లఁగా
భువి దేవకీదేవి కవతరించి

---

*గర్భాదు—వ్రా. ప్రే. & పాఠాం.

యనఁగుముద్దులబిడ్డఁ డగుచు నందయశోద
లకు నిహపరసౌఖ్యలక్ష్మి నొసఁగఁ
గంసాదిరాక్షసకౌరవ్యముఖపాప
కారులఁ ద్రుంచి భూభార మడఁచె
తే. వెలయ నక్రూరు ముచుకుందవిభుఁ గుచేలు
భీష్ము విదురుని మిమ్ము సంప్రీతి మనిచె
వెండియును నాపయోజనేత్రుండు మిమ్ముఁ
గూడి వర్తించుఁ బాయని నీడవోలె. 123

వ. అని నారదుండు పలికిన నట్లయౌ నని యశేషమహర్షిపుం
గవకులంబు సవిశేషభాషణంబుల ధర్మనందను భూషించిన
(తదీయవచనఘోషంబు) శేషపన్నగనహాస్రిముఖనిర్ఘోషంబు
ననుకరించెఁ దదనంతరంబ సనత్కుమారుండు తమయందఱ
నడుమ నుత్కృష్టతేజోభిరాముం డగుచు గ్రహామండలమ
ధ్యంబున బాలభానుండునుం బోలెఁ బ్రకాశించుచుఁ బ్రతిభా
విశేషంబున సభానందకందం బై యున్న గోవిందశర్మం
జూపి ధర్మనందనున కిట్లనియె. 124

ఉ. ఈవటుచక్రవర్తి హరికిష్టసఖుండు సమస్తశాస్త్రగా
భావిదుఁ డాత్మవేది సతతంబును నవ్విభురాణివాసముల్
భావము పల్లవించిబహుభంగులమెచ్చఁగఁజెప్పఁ*దత్కథల్
శ్రీవెలయన్ రహస్యకృతరీతుల మిక్కిలిఁ బ్రస్తుతించుచున్.
వ. ఇది యెఱింగి వినువేడుక మేము సలుపుచుము శ్వేతద్వీపంబున

*సత్కథల్ — వ్రా. ప్ర.

నుండి ద్వారకానగరంబునకు వచ్చి యచ్యుతునివేగ బహు
మానంబు వడసి. 126

ఆ. కృష్ణ! నీవిచిత్ర కేలివర్తనములు
కథలు చేసినంట ప్రగల్భబుద్ధిఁ
గూర్మి నీసఖుండు గోవిందశర్మ; నా
కవి వినంగవలయు నాదరమున. 137

వ. అనిన మందస్మితవదనారవిందుండై నందకపాణి గోవిందశర్మం జూచి నీవు నామీఁదిసౌహార్దంబునం జెప్పిన కథ లన్నియు, మత్ప్రియబాంధవుం డగు పాండవేయాగ్రణియు నిప్పుడు కరినగరంబున నిండు గొలువుండి వ్యాసభట్టారకుం డచ్చటికిఁ జనుదెంచిన నతనితో నన్నుం బ్రశంసించి నామీఁది వాత్సల్యంబునఁ బ్రసంగవశంబున హరిమాయాకేలిచరిత్రంబులు విన వేడుక యయ్యెడుఁ గొన్ని చెప్పుం డని యడిగిన నమ్ముని యేమేనియుం జెప్ప నుపక్రమించియున్నవాఁడు, నీ విమ్మానులం దోఁకొని యక్కడకు నరిగి యారాజునకుఁ బ్రియంబుగాఁ జెప్పు పొమ్మని యానతిచ్చి వీడ్కొలిపిన వచ్చితిమి యిక్కడికథాప్రసంగంబు నట్లయున్న యది యతనిసర్వాంతర్యామిత్వంబు ప్రశంసింప నరిది యింక నతని నీవు ప్రార్థించి మాహృదయంబులు ముదంబునం బొంద నిమ్మునిబృందంబునకుఁ గర్ణానందంబుగా నడిగి విను మనిన, సంతసించి కృష్ణార్థుండ నైతి నని హరిదయావిశేషంబు దలంచి పులకించి సత్యవతీసుతుని యనుజ్ఞ వడసి ధర్మపుత్రుం డి ట్లనియె. 138

తే. అనఘ ! భూసురతనయ ! గుణాభిరామ !
యచ్యుతునియట్ల నీవు మాకరసి చూడ
నీదువృత్తాంత మంతయు నెమ్మితోడ
నాకు నెఱిఁగింపు మున్ను వినంగవలయు. 129

క. అహితల్పునకుం దక్కఁ సు
మహితోజ్జ్వలపారిజాతమాల్య మొరునకున్
మహిఁ దాల్పరాదు నీకున్
వహింప నెట్లాదవె చెప్పుమ వటుకులతిలకా ! 130

—♦ గోవిందశర్మ తనవృత్తాంతము చెప్పుట. ♦—

మ. అనినన్ సంతసమంది,యానృపతియత్యైశ్చర్యముంబొంది క
న్గొనఁ, గర్ణామృతవాక్పరంపరల నాగోవిందశర్ముండు మ
న్ననఁజూడుండనియమ్మహామునులకున్ హస్తాబ్జము ల్మోడ్చిప
ల్కెఁ నితాంతప్రియగోపకాంత మురళీగీత ప్రబంధధ్వనిన్.

సీ. ఘనుఁడు *సాందీపని యనెడు విద్యాంసుండు
రామకృష్ణులకు గారాబుగురువు
ఆమహాభాగుని యగ్రపుత్త్రుండైన
ధర్మశీలునకు నందనుఁడ నేను
నాజన్మవేళ నందకపాణి వినుచుండ
నాకాశవాణి, "వీఁ డఖిలశాస్త్ర
వేది యత్యాశ్రమవిశ్రుతకీర్తి గో
విందశర్ముండు గోవిందమిత్త్రుఁ"

* దీపుడు నానెడు, వ్రా. ప్ర.

ఆ. తనుచుఁ బలికెఁ బలికి నట్లున బ్రహ్మచ
ర్యాశ్రమంబుఁ జమువు నలరియుండె
మైత్రిఁ గృష్ణునిగురు మరగి నత్రింగొను గో
విందశర్మ యనఁగ వెలయువాఁడు. 132

క. చెప్పుదుఁ గ్రొత్తలుగాఁ గథ
లప్పద్మదళాయతాక్షునభ్భార్యలకున్
జొప్పడ నంతఃపురిలో
నెప్పుడుఁ దక్కొలికలన తీర్పడి యుండన్. 133

—♦ పారిజాత పుష్పమాలికా ప్రాప్తి వృత్తాంతము ♦—

వ. మఱియుఁ బూర్వుదండ వచ్చినప్రకారంబునుం జెప్పెద నాక
ర్ణింపుము. 134

ఉ. ఆరయసత్యభామహృదయంబెటులుండునో యంచుమనోయువి
స్తారముచేసి శౌరి ప్రమదంబున రుక్మిణి యాదిగ్నునవం
కేరుహపత్త్రలోచనలకేళివనంబుల నొక్కొ క్కొ
పారఁగఁ బారిజాతనివహమ్ముల నిల్పె సమృద్ధి మీర్పడన్.

తే. అష్టమహిషులయిండ్ల సహస్రసంఖ్య
లైన గోపాంగనలయిండ్ల నందఱకును
నన్నిరూపంబులై కేలి నలరె విభుఁడు
పారిజాతప్రసూనసౌభాగ్యలీల. 136

క. ఇందీవరదళలోచన
లందఱుఁ దన్మాయ మెఱుఁగ కభ్భార్యలుడు నా

యంద యనురక్తుఁ డని యిం
పొంది తదాసక్త లగుచు నుండిరి ప్రేమన్. 137

వ. ఇవ్విధంబున నయ్యనంతుఁ డనంతరూపవిలాసంబుల దక్షిణ నాయకత్వం బవలంబించి యందఱియెడల మనోవాక్కర్మ విలాసకేళీలీల లొక్కచందంబుగా మెలంగుచు నుండె నంత నొక్కనాఁడు. 138

చ. దళమగు రూపయౌవనమదంబునఁ బైకొని చంద్రపావని
ర్మలకలధౌతసౌధమణిమండపకోమలపుష్పడోలికా
తలమునఁబద్మలోచనుఁడుఁదానురమించుచు సత్యభామదాఁ
దలఁచె మదీయకేళికె యితండు ప్రియుం డని నెమ్మనంబునన్.

వ. ఇట్లు దలంచి యనురాగంబు పెంచి. 140

క. తిలకించుచుఁ బులకించుచుఁ
గలుషించుచు నగుచు విభునిఁ గౌఁగిటఁ గోర్కెన్
నెలకొలుపుచుఁ గచభారో
ద్గళితోత్కట పారిజాతగంధం బెసఁగన్. 141

ఉ. చయ్యన శయ్య డిగ్గి యరజాఱెడువేణియు మందహాసమున్
బయ్యెదజీరుపాటు నవపాటలితాక్షులు మర్మసీమలన్
వ్రయ్యలువాఱియున్న నెలవంకలు నొప్పఁగ నాలతాంగి యొ
య్యొయ్యన వచ్చె వాకిటికి నుబ్బుచు నవ్విభుఁ గూడిక్రీడమై.

క. చనుదెంచి వికచపంకజ
వనబంధురసురభిగంధవాసితమై యిం

పొనరించు కేళిదీర్ఘిక
ననువున మజ్జన మొనర్చి యభిమతలీలన్. 143

వ. కనకపీతాంబరంబులు ధరియించి తత్తత్కాలోచితప్రసూనంబులు మనోహరమండనంబులుగా నలంకరించుకొని, పుష్పవాటి యలంది మధురసంబులు గ్రోలి యుపసంహారింపం జేసి యాడుచుం దదంతికచంద్రోపలవేదికాముఖ్యంబునం బుష్పస్తరణంబునం గూర్చుండి చంద్రికాశీతలంబు లగు మందపవనకందళంబులచేత సురతఖేదం బపనయించుచుండి రప్పు డమ్మహాదేవి తనమనంబున. 144

శా. నాతోఁ గూడి విభుండు సంగతము నున్నాఁ డిట్లు ప్రేమోల్లస
చ్చేతోమోద మెలర్ప దీనికి మదిన్ సిగ్గైన నెట్లున్నవా
రో తర్కింపఁగ రుక్మిణీముఖవరారోహల్; గదుద్యోగముల్
"చూతా"మంచు దరస్మితాంశుకలనాసుస్మేరవక్త్రాబ్జ యై.

తే. ఇంగితాకారచేష్ట లెఱింగి మనసు
లోన మెలఁగెడు సఖుల గారానఁ బిలిచి
యా సురద్రుమకుసుమచయములు గొన్ని
యేర్చి కోయించి వేర్వేఱ యేర్పరించి 146

తే. దివ్యమాణిక్యపాత్రికల్ దెచ్చి యిడినఁ
దత్ప్రసూనంబు లన్నియుఁ దగినకొలఁది
నోలిఁ బెట్టించి యిట్లని యొకతెతోడ
నలిననేత్రుండు దనలోన నవ్వుచుండ. 147

క. ఈపువ్వులు గొని రుక్మిణి
కేపారుకడంకతోడ నిచ్చి తదీయ
వ్యాపారము తలఁపును గని
రా ఘ మ్మని యానతిచ్చె రాజన మెప్పన్. 148

వ. అప్పుడు. 149

చ. సురతరులాభగర్వమును శోభనయౌవనగర్వమున్ మనో
హరనవరూపగర్వము ననంగవికారవిహారగర్వముం
బరమహితాత్మునై విభుఁడు పాయనిగర్వము సత్యభామకు
న్నరిపుపుఁబోఁడ్లలోనఁ గడుసాగుటకున్మదిఁబొంగిరచ్చెలుల్.

వ. ఇట్లు పారిజాతప్రసూనదానవ్యాజంబున రుక్మిణ్యాదులకుఁ
దనమహారాజసంబును, బ్రాణేశ్వరుతోడం గూడి యనుభ
వించుమదనసామ్రాజ్యవైభవంబును హృదయశల్యం బై
యుండవలయు నని కాదె ననుఁబోంట్లఁ బంపుట యని
యానంచారికారత్నంబు తన్మనఃప్రసాదంబున నెఱింగి,
చూపిన పుష్పపాత్రికం బుచ్చుకొని రుక్మిణీదేవి నగరికిం
జనియెఁ గడమసవతులయిండ్లకు నట్లు యాదేవి నియోగించిన
సఖీజనంబులుఁ బోయి రట మున్న పోయినది రుక్మిణీదేవి
కేళీభవనద్వారంబు ప్రవేశించినఁ దద్ద్వారపాలాంగన వాకిటికి
నడ్డమై నిలిచి దానితో నిట్లనియె. 151

క. ఏకాంతంబున దేవియు
శ్రీకాంతుఁడు నున్నవారు చిత్తజకలనా

వ్యాకులితేంద్రియు లై తమ
లోకంబై; పోవఁదగునె లోనికి సీసిన ? 152

క. ఇవ్విరు లెవ్వరు పంపిరి
యెవ్వరి చెలి వనిన నవ్వి యెఱుఁగనె యనుచున్!
ల్లి వ్విరు లెవ్వరికిం గల
*నవ్వారిజనేత్రునగరియతివలకో సఖి ? 153

వ. లేని యేకాంతంబులు గల్పించుచుఁ బువ్వు లెవ్వరు పంపి రెవ్వరిదాన వని నన్ను నిరాకరించి పలికెదు. పారిజాతప్రసూన సౌరభసౌభాగ్యంబు దేవేంద్రునినందనవనంబు చూఱవెట్టించి తెచ్చిన వీరపత్నీతిలకం బగుసత్యభామగారి దక్కఁ దక్కిన యీనగరిమగువలకుం గలుగనేర్చునే యని గర్వించి పల్కిన నవ్వేలఁది నవ్వొలయు నిట్లనియె. 154

ఆ. పారిజాత మేమి బ్రాఁతి ? యందఱియిండ్ల
నుండఁ జూడవే ? పయోజనేత్ర !
ముడుతు రిట్టిపువ్వు లుడిగలవారు మా
జననినగరిపారిజాత మొసఁగ ! 155

వ. అనిన నప్పలుకులకుఁ గసరి నవ్వుఁబలుకులుగాఁ దిరస్కరించి మాసత్యభామ మీరుక్మిణికిఁ బువ్వు లిచ్చి గమ్మని పంపినది. ఈ పువ్వు లిచ్చిపోయెదఁ బోవనిమ్మని పలుకుచునున్న వారిద్దఱసంవాదంబు నాలకించి యొక్క సుజాతిక లోనుండి

* ఇవ్వారిజనేత్రునగరియింతు లలో సఖి.

వచ్చి మహాదేవిమాయనతియయ్యె గమ్మని దానిం దోడ్కొని
పోయె నటమున్న యభ్యంతరమ్మున. 156

మ. సుమనోనిర్మితహర్మ్యనిర్మలశశిజ్యోత్స్నాంతరస్వచ్ఛప
ద్మమరీచిస్ఫుటవేది లేఁజిగురుపర్యంకంబునన్ రుక్మిణీ
రమణీరత్నము శౌరిఁ గూడి రతిసంరంభంబు చాలించి యా
కమలానాథుఁడుడింప శయ్య డిగియెం గాఁదీఁగ వేసోలఁగన్.

సీ. అంకుశనిర్భిన్న హస్తికుంభములట్లు
కొనగోటినొక్కులకుచము లమరఁ
గీరంబువాయి సోఁకినబింబ ఫలమట్లు
దంతక్షతాధరదళము దనర
నెత్తుటఁ దోఁగిననిశితబాణములట్లు
కరవాఁడికెంజాయకన్ను లెసఁగ
మృగయాంతమునఁ జిక్కుదగిలినవెడవిల్తు
నురులట్ల చెదరినకురులు బెరయఁ

తే. గేళిమై నట్లు వచ్చి దీర్ఘికకు డిగ్గి
పరిమదమున మజ్జనంబాడి పసిఁడిపచ్చ
పట్టు ధరియించి తత్తీరపారిజాత
కుసుమభూషణములు దాల్చి కోర్కి నిండ. 158

ఆ. పూవుఁదేనెఁ గ్రోలి పుప్పొడి యలఁది త
త్పారిజాతమండపంబులోన
నలరుఁబాన్పుమీఁద నాసీనులై యుండి
రింపుఁబవన మొలయ నెలమిఁ బొంది. 159

క. అక్కడ నక్కడ నాక్రియఁ
దక్కక హరిఁ గూడి సమ్మదం బెసలారం
జొక్కమయి యుండి రందఱు
నక్కట్టడ నేమి చెప్ప ? నచ్చెరు వెంచున్ ! 160

వ. ఇవ్విధంబున వినోదించుచు రుక్మిణీదేవి తనమనంబున. 161

ఉ. నాకును బారిజాతము మనం బెసలారఁగ నిచ్చె ప్రేమతో
నాకడనే యహర్నిశము నాయకుఁ డుండఁగ వంతఁ గుందుచు
న్వ్యాకులితాత్మయై యెటులు న్రతిలుచున్నదొ సత్యభామ నేఁ
డాకత చూతమంచు దరహాసవిలాసవిభాసితాస్యయై. 162

వ. ఒక్క చతురసంచారికిం బిలిచి కొన్నిదివ్యపారిజాతమంజరులు
గొన్ని కోయించి పసిండిపళ్లరంబునం బెట్టించి యవ్విరులు
సత్యభామకుం గానిమ్మని దానితో నేకాంతంబున. 163

క. మాకు నొకపారిజాతము
మాకృష్ణుఁడు దెచ్చినాఁడు మగువా ! యిదిగో
నాకల్పకతరువిరు, లివి
యేకడ లే వనుచుఁ జెప్పి యేతెర వగునన్. 164

వ. అని పలుకుచున్న సమయంబైయున్న నాసవత్నిసంచారిక
డాయంబోయి. 165

మ. కనియెన్ రుక్మిణిఁ బూర్ణచంద్రవదనం గంజాతపత్రేక్షణం, బారిజా
తనవీనాభరణాభిరామ నభిజాతస్మేరతారుణ్యయుం
డనలక్ష్మిన్ సురబాలసాంగి నతులానందస్ఫురన్మానసన్
ఘనపుష్పోదయపారిజాతనవిధగ్గారత్నవేదిస్థలిన్. 166

వ. కని వెఱఁగుపడి యవలోకించి.

క. ఏమార్గంబున వచ్చెనొ 167
యీమాయావేషధారి యిచటికి నీకాం
తామణి యెప్పుడు దనిపెనొ
కామకళల? నింత హృదయకంజం బలరన్. 168

క. మాయింటి పారిజాతము
నీయెలమి నహించి యుండ నెన్నఁడు నిది దా
నీయతివ కెపుడు తెచ్చెనొ
యీయధిపుఁడు సత్యభామ యొఱుఁగక యుండన్. 169

వ. అని ద్వారపాలిక చెప్పినమాట నిశ్చయం బని వెండియు
రుక్మిణిం గనుంగొని. 170

ఉ. తాను సత్యభామకు ముదంబున రుక్మిణి పంప నున్నదో
యీనవపారిజాతముల నిప్పుడు! సంభ్రమ మట్ల యున్న దా
నా నలదూతియుం గదిసి యల్లనఁ దా వినుచున్న దేటివో
కా నొక్కకొన్నిమాటలు వికాసముతోఁ జెవిలోనఁ జెప్పఁగన్.

క. ఏ నీ కొని తెచ్చిన విరు
లీనెలఁతకు నీగి మేలొ యీాక మగిడి పో
తే నే మేలో యొకగతి
నే నెయ్యది యాచరింతు నీయుభయమునన్. 172

ఆ. ఇచ్చి యున్న; మాకు నెన్ని లే? వేల తె
చ్చితివె? యనియెనేని సిగ్గు మిగుల

నీక మగిడి చనిన నీసతి నగుఁ జోవ
నిమ్మటంచు; నదియు నెగ్గ కాదె? 173

వ. అని సందేహంబు మనంబున నూటాడఁ గొంతకొక వితర్కించి, మహారాజపత్నినగర విహారించినపొగ్రష గాన, నది యప్పుడు దెచ్చి యిచ్చినట్లు నిర్వికారంబున నవ్వుచు నీపువ్వు లిచ్చి పోవుటయు కర్జం బని నిశ్చయించి, కనంక చెడక యాదేవి ముందటంబువ్వులు వెట్టి మీాకు సత్యభామ యంపించిన దనిన లక్షించి యవ్విరులు చూచి రుక్మిణి ప్రాణేశ్వరునితో నిట్లనియె.

క. నాళీకనయన! నీప్రియు
రా లంపినవిరులు గొనుము రతిరాజకళా
కేళికి లంచము సేయుం
బోలు నసుచు నీరసంబు వొడమునగవుతోన్. 175

క. అది చూడఁగ నవ్విరు ల
మ్మదనతి వల్లభునిమాళిమండలిఁ దుఱిమెన్
హృదయప్రణయామర్షణ
సదమలవ్యగ్రాగ్రసూత్రసంగతి మెఱయన్. 176

వ. అట్లు రుక్మిణి యారసికశిఖావతంసం బగు కంసారికిఁ బువ్వులు ముడిచి తన వయస్యచేతఁ బువ్వు లంపుట మాని యా పువ్వులు దానివల్లీరంబునం బెట్టించి దానికిఁ దనపారిజాతంబు చూపి విభునిఁ గన్నుగీటి నవ్వుచు నిట్లనియె. 177

తే. ఇంతి యీాపువ్వుఁజెట్టు మీాయింటిపారి
జాతమట్టిదె యదా నేఁము చక్కఁ జూడు!

మిందు పుష్పాల నెత్తావి యెందుఁ జూడ
మన్న దని చెప్పుమీ మీవయస్యతోడ. 178

వ. అని వీడుకొలిపిన నమ్మాట వాఁడిగసికన్నై మనంబు గాడినం
గనలి వెడవెడనవ్వుతో నమ్మగువ యిట్లనియె. 179

చ. అలవుఁ జలంబుఁ జూపి నరకాసురు గెల్చిన వీరసంపదన్
బలరిపు వీడు సొచ్చి భువనంబులు మెచ్చఁగ సత్యభామ సొం
పలవడఁ దెచ్చి యాత్మనిలయంబున నుంచినపారిజాత మో
చెలువ! తలంప మీ పెరటిచెట్టునకున్ సరిరాశ పోయెనే. 180

క. *నీ వేమి నేతు? మానిని!
యీవిభునాటకము గాక! †యిది కానీ! తా
నావెలఁదిబారిఁ బడినపు
డీవిధములు నూవకున్న యిపు డేమిటికిన్. 181

వ. అని పారిజాతంబునకై రుక్మిణి నెకసక్కియం బాడి నెఱవాది
తనమ్మున నమ్మురాంతకుఁ బంతంబులు వలికి యీపువ్వుల
దృష్టాంతంబులు చేసి యిచటివృత్తాంతం బంతయు నయ్యాది
గర్భేశ్వరికి విన్నవించి సేయంగల పనులు సేయింతు నని
మరలి శీఘ్రయానంబునం బఱతెంచె; నప్పు డక్కడ సత్య
భామయు, 182

క. దరహాసరుచులు నిగుడఁగ
గురుకుచములఁ బ్రియునురమ్ము గ్రుచ్చుచుఁ దొడపై

* నీ వేమి నేతు—పాఠాం. † ఇది కానీవే—పాఠాం.

నిరవుగఁ గూర్చుండి మద
స్ఫురణంబునఁ జెలికి నెదురుచూచుచు మదిలోన్. 183

ఆ. చెలియ రాక తడవు చేసె; రుక్మిణి, శౌరి
విరహభారవహ్ని వేఁగుచున్న,
నవసరంబు లేమి నట నుండెఁ గాఁబోలుఁ!
గాక పువ్వు లిచ్చి రాకయున్న? 184

వ. అని వితర్కించుచున్న సమయంబున. 185

శా. విన్నంబోయినమోముతో హృదయనిర్వేదంబుతో సంభ్రమ
స్విన్నాంగంబులతో విరాగకలనావేశంబుతో సిగ్గుతోఁ
జెన్నుంజేవయు లేక యల్లఁ జని చూచెన్ దూతి పాదప్రవాలం
గన్నారం దమసత్యభామను హరిం గౌతూహలోదాత్తులన్.

వ. కని వెండియు నాశ్చర్యంబు నొంది. 187

క. క్రమ్మఱ నిచటికి నేమా
ర్గమ్మునఁ బ్రత్యక్షమయ్యె రసికుఁ డితఁడు? చో
ద్యమ్మయ్యె! నింద్రజాలమొ?
యెమ్మెయి నిది చిత్ర! మనుచు నెలనవ్వ్వయున్. 188

వ. గమనసంభ్రమంబునం బదంబులు తడంబడ దగ్గఱ వచ్చి యమ్మచ్చెకంటిముందటం బుష్పపాత్రిక పెట్టి యేమియుం బలుకక యెద గలుగ నిలిచి నివ్వెఱపడి చూచుచున్న దాని ముఖవైవర్ణ్యం బుపలక్షించి సత్యభామ యిట్లనియె. 189

క. వెఱఁగుపడి భ్రమసి చూచెదు!
తెఱవా! యిది యేమివింత? ధృతి చాలక సాం

పఱియున్న దేమి నీమొగ ?
మెఱఁగింపుము! వింతపువ్వు లెచటివి నీకున్? 190

క. నాపుడు నది యిట్లను నా
దేవికిఁ, "బ్రియునట్లు నిన్నుఁ దేలించెడు నీ
దేవరఁ గృష్ణుని నడుగుము
నీ వడుగఁగ నోపితేని! నీరజనేత్రా !" 191

వ. అనుచుఁ బతిసమ్ముఖంబునం జెప్ప నోడి తొలంగి పోవ నిది యేమొకో దీనిమాటలవలనఁ గొంత వింతచందంబు పుట్టె నని కలుషించి, యాదేవి, విభుని నెఱింబొఱంజూచి, యీ భావంబు చెప్పు మని యడుగంబోయి, రోషంబున నడుగక, మణికంకణమంజీరమేఖలాకలాపఝుణఝుణత్కారంబు తోరం బై మదనధనుర్భృంగ శింజినీ భయంకరటంకారారావంబు ననుకరింపంజేయఁ, దోయజాక్షుని హృదయంబు చెదర నుదరిపడి, తదంకపీఠంబు పరిత్యజించి లేచి, పృథునితంబ బింబభారంబునను గురుకుచకుంభంబులవ్రేఁగునను గమన వేగంబునకుం జాలక తొట్రుపడుచు, నిలునిలు మని దానిం డాయంబోయి కరం బవలంబించి యొక్క కాంచన స్తంభంబు దండగొని యడిగిన నది దాఁపక తనకన్నవిధం బెల్ల నల్లనం జెప్పి వెండియు నిట్లనియె. 192

సీ. హరియును నీవు నెయ్యముతోడ నిచ్చోట
నుండఁగాఁ గనుఁగొంటి నుల్ల మలర

నచ్చొటఁ గంటి నెయ్యముతోడ రుక్మిణి
యును నాసరోజలోచనుఁడు నుండ
నచటి కెట్లరిగెనొ యచటివాఁ డిచటికి
నేలాగు వచ్చెనొ యేను నెఱుంగ
నీవ యెఱుంగుదు నీలవర్ణునిమాయ
కాంత ! యేమందు ? నీకంటె మిగుల

తే. రాజనంబును రతిరాజరాజ్యకళయుఁ
గలిగి విభుతోడనున్న యాచెలువ చెలువు
మన్మథునిఁ గూడి రతియున్న మహిమఁ దోఁచె
మగువ ! యేమని నమ్మ దిమ్మాయ కాని ?

క. నీ కిచ్చెఁ బారిజాతము
లోకంబు లెఱుంగ మున్ను; లోలుండై నేఁ
డా కంజాక్షికి నిచ్చెను
నీకంటెను గూర్చె నావనిత కృష్ణునకున్.

క. ఆవెలఁది నీకు నంపిన
పూవులనెత్తావి చూడు ! బూమెల వలపుల్
గావించినవతిఁ జూడుము !
నావచనము కల్లగాదు; నమ్మవయేనిన్. 195

క. చెలి నొకతె నంపు రుక్మిణి
నిలయమునకు నిపుడ యనఁగ, నిశ్చయము గఁ బు
వ్వులు గొనిపోయిన యందఱు
చెలు లొక్కట వచ్చి యట్ల చెప్పిరి సతితోన్. 196

చ. అనయము నేకవాక్యముగ నందఱు చెప్పినయప్డు నిప్పు సోఁ
కిన క్రియ వెచ్చి యంగలత కేవలతప్తసువర్ణమూర్తి యై
కనఁబడఁ గెంపుసొం పడరుకన్గవతోఁ దరళాక్షి మీనకే
తనమహితానలాస్త్రము విధంబున వచ్చె మురారిపాలికిన్.

వ. అట్లసూయాజాతపరిభూతగోపకషాయితస్వాంత యై తన తోన సకలసఖీవర్గంబు ననర్గళభంగిం బుష్పమణిపాత్రికలతో నేతేర, వనదేవతాసంతతితో నచ్చినవసంతలక్ష్మి యన నమ్మానవతీతిలకంబు హరిముందట నిలిచి, 198

క. విను! తాల్మి లేక యేడ్చుచుఁ
దనులత గంపింప గద్గదస్వరమున న
జ్ఞునిచేఁ బలికెడు వీణియ
కెనయై తడఁబడుచుఁ బలుకు లేర్పడకుండన్. 199

వ. ఇట్లనియె. 200

చ. నను నొక పెద్దచేసి భువనంబు లెఱుంగఁగఁ బారిజాతమ
య్యనిమిషనాథు గెల్చి నయమారఁగనిచ్చితి;నాఁటిమేలు,నా
నెనరుఁ గృపావిశేషమును నేఁ డొనరించితె పెద్దదేవికిన్?
మన మలరన్ వశీకరణమంత్రము గ్రొత్తగ నభ్యసించితో?

తే. పారిజాతంబు భువి సత్యభామయింటఁ
గాని మఱి యెం దొరులయిండ్లఁ గలుగ దనఁగఁ;
గలుగఁజేసితె తక్కినపొలఁతులిండ్ల?
నేమి మందుల వలపించి రింత నిన్ను? 202

ఆ. సత్యభామ పారిజాతపుష్పము లంపె
నంప సాటి కొరులు సంపునాదె?
యింకఁ గడచుమాట లేల? యీతరువు నీ
యిష్టసతికి లంచ మిచ్చుకొమ్ము! 208

వ. అని సపత్నీవిషయరోషవిషాదంబున శంకాతంకంబులు లేక
యప్పలుకు లన్నియు నన్నునిస్తు గగుపాటుపోలుంచి మంచల
హృదయంబునం గోపోద్దీపితయై, తత్సపత్నీదానంబు విచారించి
తన కేళీమందిరంబు చేరంబోవ, సవిగ్రహుండగు నవ్వుదు లేది
కూడముట్టి బోటికత్తె లవ్వ లివ్వలం దొలంగిపోవ సమ్మానిది
పయ్యెదచెఱంగు పట్టినం బట్టునపడక భ్రమణవేగంబున
నవ్వలున విడి జాఱ లోనికిం జని గ్రక్కునం గనకకవాటా
ర్గళంబు బిగియించి చేతోజ్క్ర చీనాంశుకంబు ధరియించి
చెంగలువపాన్పున నొను వైచి పొరలుచు, ఘుటనిహిత
క్షుధితపన్నగాంగనయుంబోలె రోఁజుచుండె, సట నొడుపు
దప్పినపద్మలోచనుండును మగిడి యుక్కబహిర్మండపరచిత
కుసుమశయనీయంబున శయనించి, తద్వయస్యలు సముచిత
సేవావిధానంబు లొనరింప, నయ్యింతిసంతాపశాంతికై విరహా
ధర్మం బవలంబించి యమ్మూర్తి నచట నుండి, రుక్మిణ్యాది
ప్రధానదేవీజనంబులయందును, షోడశసహస్రసుందరీసందో
హంబునందును ననురక్తిఁ దాల్చినరూపంబులఁ గ్రీడించుచుఁ
జిత్రకౌశలంబుల నారాత్రి గడపి ప్రభాతంబున నామాయా
రూపంబు లన్నియు నుపసంహరించి యూరకుండె నప్పుడు.

క. ఆలీలామిథునము త
త్కాలోచితవిధులు దీర్చి కడునడి నన్యో
న్యాలోకననదుపాయం
బాలోకించుచును దహాతహాంపడు చుండన్. 205

సీ. ఆవేళ నేఁ బోయి యది మెల్లఁ దత్పరి
చారికాజనముచేఁ జక్కఁ దెలిసి
హరిఁ గాంచ, నమ్మహాపురుషుండు దనకేళి
మాయావిధానంబు మందహాస
మెసఁగ నానతియిచ్చి యీ చేఁత లన్నియు
వెడపోక లని యీర్ష్య విడువఁజేసి
సత్యభామకుఁ గోపశాంతి సేయుము పొమ్మ
నావుడు, నలరి యాదేవికడకు

తే. సముచితక్రియఁ జనిన, నాజలజనేత్రి
నన్ను మన్నించి, కనకాసనమున నుంచి
తాను నానతి యిచ్చెఁ దద్వర్తనములు
నాత్మసంచారఫణితియు నర్మభంగి. 206

క. చెప్పిన నంతయు విని నే
నప్పుడు తల యూఁచి యమ్మహాదేవిమొగం
బొప్పారఁ జూచి నవ్వినఁ
గప్పరపడి నన్నుఁ బలికెఁ గౌతుక మెసఁగన్. 207

వ. కుమారా! దుగ్ధసాగరంబున నమృతపూరంబునుంబోలె
నీనవ్వు మన్మనఃప్రసాదహేతువై యుక్తివిశేషంబు దోఁచె

నభిప్రాయంబు, చెప్పు మనిన, నంబా! యీసకలంబును నాకపటనాటకునిమాయానాటకంబు. ప్రీతిమందిరపారిజాత విలసనంబును బహురూపకత్వంబును హారియింద్రజాలంబు, నీహృదయ గర్వసామగ్రి మీఁద సమకట్టినపని యింతప్రొద్దు నిన్ను భ్రమయించె, నింతియే కాని నిక్కంబు గా దని సంచారికలవలనఁ బరామర్శించి కల్ల చేయుక దీనిఁ గ నీవంటి మహాధీరనాయికారత్నంబులును సంచలింప నగునే? తొల్లియు శ్రీమహాలక్ష్మి ద్రుహిణ రుద్రాదులు నీవిభుని మాయా నాటకంబున భ్రమసి తిరిగి, రక్కథలు చెప్పెద నాకర్ణింపు మని చెప్పిన, సద్దేవియు నచ్చెరువంది పరిణమించె. నంత నిజవల్లభుండు ప్రణయప్రీతిపూర్వకంబు లైనవిధానంబులం దన్ను మన్నించి కూడుకొనిన నలరి యద్దేవదేవుని యనుమతి నన్నుఁ బుత్రవాత్సల్యంబున నారాధించి యాజగజ్జనని నాకు నీపారిజాతమాలిక యనుగ్రహించె నని గోవిందశర్మ ధర్మ నందనునకుం జెప్పె ననిన విని పరీక్షిత్తుం డట మీఁదటి వృత్తాంతం బెట్లయ్యె నని శుకబ్రహ్మ నడుగుటయును, 208

క. నారాయణ! దేవ! కృపా
పారాయణ! భక్తలోకపాలక! విద్యా
కైరవచంద్రోదయ! మా
యారమణీరమణ! యక్షయానందనిధీ! 209

ఉ. శ్రీతులసీస్రగర్చిత! పరిస్ఫుటకౌస్తుభ పద్మరాగ ర
త్నాంతతభద్రపీఠసముపాశ్రిత సింధుసుతాకటాక్షవీ

ఖ్యాతుహినాంశుదీప్తివికసత్త్రిజగత్కుముదప్రసూనగం
ధాతిథిబంభరాయితనిజానుచరేంద్రముఖాఖిలామరా! 210

మాలిని. ప్రకృతిపురుషమూర్తీ! బ్రహ్మయోగానువర్తీ!
సకలనయనరమ్యా! సాధులోకైకగమ్యా!
ముకుటకలితపింఛా! ముక్తసంగాతివాంఛా!
వికచకమలనేత్రా! వృత్రజిన్నీలగాత్రా! 211

ఇది శ్రీమదనగోపాలచరణకమలసేవాధురీణ, సత్కళాపారీణ, కృష్ణభట్టారకపౌత్ర, చింతలపూడికామయప్రభుసుపుత్ర, సుకవివర్య, రాధామాధవయెల్లనార్య ప్రణీతంబైన విష్ణుమాయానాటకంబునందు

ప్రథమాశ్వాసము.

శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ

శ్రీరస్తు

విష్ణుమాయానాటకము

ద్వితీయాశ్వాసము

క. శ్రీరాధాధరమధురసు
ధారసధారాపరిశాంతదారుణనిశిత
స్మారశరానల! ధీరో
దారగుణావాల! నవమదనగోపాలా! 1

తే. అవధరింపుము దేవ ! సంయమివరుండు
సకలవేదాంతవిద్యావిశారదుండు
శుకమహాయోగి పలికె నుత్సుకత మఱియు
నింపుగా నాపరీక్షిన్నరేంద్రుతోడ. 2

తే. ఈవిధంబునఁ బారిజాతావనీజ
కుసుమమాలిక తాఁ గయికొన్న తెఱఁగు
చెప్పి వెండియు నానృపశేఖరునకు
ననియె గోవిందశర్మ ప్రహ్లాద మెసఁగ, 3

క. ఆసాధ్వి చిత్తగించుటఁ
జేసి పవిత్రములు నతివిచిత్రంబులు నై

భాసిల్లె విష్ణుమాయో
ల్లాసచరిత్రములు విను మిలాతలనాథా ! 4

మ. హరిలీలామహనీయమై హరవిరించామర్త్యసంసేవ్యమై
పరమంబై బహుశాస్త్రసారతమమై ప్రామాణికగ్రాహ్యమై
నిరతానందసుఖైకహేతువయి యున్మేషించె మాయాప్రపం
చరహస్యం బగు తత్కథానివహ మశ్రాంతంబు లోకంబులన్

— విష్ణుమాయావిలాసకథాప్రారంభము —

క. శ్రీయుతమై విష్ణుమహా
మాయానాటకము నాఁగ మహి వెలసె మహీ
నాయక! తత్కథ లన్నియు
నాయతగతి నొకప్రబంధమై నాచేతన్.

మ. విను! విశ్వక్షితిపాలమౌళివలభీవిస్ఫారరత్నప్రభా
కనదుద్దామపదారవింద! త్రిజగత్కల్యాణచారిత్ర! పాం
డునరేంద్రోత్తమపుత్ర! యీమునిగరిష్ఠుల్ నీవునుంగూడియెం
దునకుం జిత్తముఁ బోవనీక హరియందు న్నిల్పి సంప్రీతితోన్.

వ. అని కొలువు సావధానంబు గావించి. 8

— వైకుంఠపురవర్ణనము. —

సీ. పాలమున్నీటిలోఁ బ్రభవించునుదయరా
గంబుతోడిసుధాంశుబింబ మనఁగ
మంచుగుబ్బలిమీఁద మించునుదంచిత
కమనీయధాతుశృంగం బనంగ

నిండుఁగొలంకున నిండార బెరసిన
ప్రత్యగ్రహల్లకప్రసవ మనఁగఁ
బటికంపురాసానఁ బైఁ బ్రోవుగా నిడ్డ
కాశ్మీరకర్దమకబళ మనఁగ

తే. ధవళకర్పూరరాశివిధంబు గలిగి
యందమై యున్న తెలిదీవియందుఁ దనరు
దివ్యమాణిక్యరుచిపుంజదీప్రవప్ర
గోపురోద్దామతరము వైకుంఠపురము. 9

ఉ. ఆరమణీయధామమున నాదిమవిష్ణుఁడు లక్ష్మియున్ మనో
హారిమణిప్రభాస్ఫురితహాటకకుట్టిమచంద్రశాలలో
భారతి యాదిగాఁ గలసుపర్వవధూటులు చేరి కొల్వ సొం
పారుచు జూదమాడుటకు నాత్మఁ దలంచిరి కౌతుకంబునన్

—♦ విష్ణుమూర్తియును లక్ష్మీదేవియును జూదమాడుట. ♦—

ఆ. చిత్తవృత్తి యెఱిఁగి యత్తఱిఁ బవడంపుఁ
బలకరత్నశారు లలవరించి
కనకరుచిరపాశకములు దన్మధ్యభా
గమున నునిచె దివ్యకాంత యొకతె. 11

క. సిరిచూడారత్నంబును
హరికౌస్తుభమణియుఁ బందెమయ్యె జయాశా
పరతంత్రబుద్ధి నపు డొం
డొరులకుఁ బెనఁగొనియె నేర్పు నుత్సాహంబున్. 12

క. గలగలసారెల మ్రోఁతయుఁ
గలకలకంకణరవంబుఁ గర్ణోత్సవ మై
చెలఁగఁగ, నాడిరి ద్రిస్త రి
పలుకులఁ బంతముల, నేర్పు పచరించి తగన్. 13

క. కాంతుఁడు జయ మందఁగ భూ
కాంతామణి గోరు; దివ్యకాంతాతతి, శ్రీ
కాంతజయము గోరును; వా
క్కాంత యుభయజయముఁ గోరుఁ గౌతుక మెసఁగన్.14

సీ. అడిగిన దాయంబు లందంద పడుచున్న
నుల్లంబులో శౌరి యుల్లసిల్లు
నొంటిన సారెకు నొనర దాయము వడ్డఁ
జంచలేక్షణ మూదలించి పొడుచు
నాటఁ గొంచెంపుదాయమునఁ గూడక సారె
చచ్చిన వెడ నవ్వుఁ జక్రపాణి
తనయాట నయమయ్యెఁ దగు పండుసా ళ్లెత్తు
దాయంబు రాకున్నఁ దరుణి కినలు,

ఆ. నాట సమముచేసి యాడించు దనుజారి,
పిక్క సారె మొదటఁ బెట్టు నతివ
హరి తిరస్కరించు నంగన గలుపించు
నాట నాగ్రహంబు లగ్గలింప. 15

క. అవమతి సప్తవ్యసన
వ్యవసాయము వలదు సుజనవరులకు సరస

వ్యవహారహాని గావున
నవనీశ్వర! జూద మిట్లు దన్నిటఁ జెఱచున్. 16

— ♦ ద్యూతనింద ♦ —

సీ. స్వామిభృత్యన్యాయసరణి నాక్షేపించు
గురుశిష్యభావంబుఁ బరిహరించుఁ
బితృపుత్రవాత్సల్యగతి మిథ్యఁ గావించు
నన్నదమ్ములపాడి నపనయించు
బాంధవమిత్ర సద్భావంబు భంజించు
బహుమానవినయతత్పరత నడఁచు
ధర్మశీలంబుల మర్మంబు భేదించుఁ
గీర్తిధనంబులఁ గేరడించు
తే. మచ్చరముఁ బెంచుఁ గోపంబు నెచ్చరించుఁ
బ్రాణహాని ఘటించుఁ మానంబు నించుఁ
గాన జూదంబు వల దభిమానధనుల
కాడి రేన్ బన్నిదమునకు నాడఁ జనదు. 17

వ. అవ్విధంబున నలుకఁ గొని తలంపులు స్థైర్యంబులుఁ గలంపఁ బరస్పరవిజయకాంక్షల నీడంబోక యాడుచున్నసమయంబున గలిమిబోటి యాట నయంబై (హారియాట) యోటు వన్నిదంబునకు వచ్చిన మెచ్చుచు, మేలుచే యయ్యె నని సంతోషించి యంతరంగంబు చెంగలింపం జేతివా టగుటం జేసి పాచికల్ వైచి గెల్వుం దలంచిన, 18

ఆ. ఆట డీలుపడిన యమ్మహామాయావి
చిత్తవృత్తి నగవు చెంగలింప
నీమృగాక్షిహృదయ మెట్లుండునో చూత
మంచు మాయ పన్నె నాత్మ నెంచి. 19

క. ఆ మాయావిభ్రమమున
నే మని చెప్పుదు నృపాల ! యిందిర కైవన్
భూమిఁ బడు పాచికలలో
నా మునుపటి లెక్క లుడిగి యున్యము లయ్యెన్. 20

క. లెక్కలు విపరీతము లై
యక్కామినిచేతిపంటె మది దప్పిన నా
పెక్కువ సెడి వెలవెల నై
గ్రిక్కున పాచికలు చఱచెఁ గనలుచుఁ జేతన్. 21

తే. నవ్వె భూకాంత, వాణి మానంబు దాల్చెఁ,
దద్వయస్యలు లజ్జించి తలలు వంచి,
రబ్జనాభుండు పరిహాస మాడె నపుడు
వానియన్నింట నుడికె నవ్వనితమనసు. 22

క. జననాథ ! జూదమున నో
డినవారిమొగంబు వ్రాయ డెప్పర మని చె
ప్పినమాట నిజము; కమలం
బునుబోలెడు శ్రీముఖంబుపోలుపునుఁ దఱిఁగెన్. 23

వ. ఇట్లు పరాజయపరాభవంబులు వాటిల్లె ననుచుఁ జెక్కు
చెమర్ప, నేర్పరులై సపత్నీభర్త లొనర్చు కెలనంబునకు

సొలయుచు ధర్మదేవతను దూఱి, యంతఁ గొంత
ధైర్యంబు దెచ్చుకొని యమ్మనస్విని నాయిక వివేకించి
దాయంబు రాకుంటుఁ గతం బే మని విభుండు దైవకుండఁ
గ్రిమ్మఱఁ బాచికలు పట్టి చూచి వానియందు ముందటి
లెక్కలున్న క్రమంబుగాక, తనయాటకుం గూడక నలువంకల
నొక్కలెక్కలై యధిపుని యాటకుం దగినవన్నిదం బగు
చున్న తెఱంగు నెఱుంగువడి చూచి, యది యతనిమాయగా
నెఱింగి, యద్భుతక్రోధరసరంజితం బగు మొగంబునం గటికి
నగవు చిగురుకొల్పి, యిట్లు కపటంబు సేయం దగునే యని,
మందస్మితవదనారవిందుండై యున్న నెన్ను నుద్దేశించి. 24

ఉ. జూదరి! కానిచందములు చూపితి వన్నియు మేలుమేలు! నీ
గాదిలిభూమిదేవికి వికాసముగా, జను లెల్ల నిల్లెడం
జూదము వాదహేతువను జల్లఁదనంబును బొందు నంట దాఁ
గా దనరాదు నిక్కముగఁ; గంటిమి నీవెడమాయ లచ్యుతా!

మ. నను వంచించి జయించినాఁ డిరమురత్నంబుం బ్రయత్నంబునం
గొని యావల్లభ కీఁ దలంచితివొ! నీ కంచెల్మిమ మట్లయ్యె నేఁ
గొను మే నిచ్చెదమాయలేల యిదినాకుం బ్రాఁతె రత్నాకరేం
ద్రునిపట్టిన్ సిరి నాౘెఱుంగనె జగత్తుల్ గోరి సేవింపఁగన్?

క. అల్పుల ననురులఁ గొందఱ
వేల్పుల మానవులఁ గొన్ని వెడవెడమాయల్
గల్పించి త్రిప్పు నీసం
కల్పము చెల్లునె మదంతికంబునఁ? గృష్ణా! 27

ఉ. కేవలమూఢజాతి నడకించెడునేర్పులు చూపవచ్చెనో!
నీవెడమాయ నాయెదుట నీళులవ్రాఁత, హిమంబు పెంపు, మే
ఘావరణంబు, బుద్బుదఘటావళి, వేసవియెండమావులై
పోవునెకాక, నిల్చునె యపూర్వవిశేషమె? శేషతల్పకా!

వ. ఆఁటవారిని భ్రమయింపనే నీమాయలు, నీమాయ కొలఁది
గాదు నామాయ లవి యెట్లంటేని వినుము. 29

సీ. హరవిరించిపురందరాదిబృందములకు
సిద్ధవిద్యాధరశ్రేష్ఠులకును
యక్షగంధర్వగుహ్యకకులాధిపులకుఁ
బన్నగకిన్నరపరివృఢులకుఁ
జారణఖచరరాజన్య వర్గములకుఁ
గనకాద్రి ముఖనగగ్రామణులకు
దైతేయదానవాధ్యక్ష సంఘములకు
విశ్వవిశ్వంభరాధీశ్వరులకుఁ

తే. బదవు లైశ్వర్యములు మహాప్రాభవములు
మత్కటాక్షమహామాయమహిమఁ గాదె
విస్తరిల్లుట? త్రైలోక్యవిభుత నీకుఁ
గలుగుటయు నీకు నేఁ గలుగంగఁ గాదె? 30

సీ. చంద్రబింబంబునఁ జంద్రిక, రవిమండ
లంబునఁ బ్రభ, యనలమున దీప్తి,
రత్నజాలంబున రంగు, సరోరుహ
వనముల శృంగారవైభవంబు,

పురమహోత్సవములు, కరి హయ రథ భట
సామ్రాజ్య సామగ్రి, చారుభూష
ణాంబర లావణ్యహావభావ విలాస
కలనలు, త్యాగభోగములగరిమ
తే. శ్రీమహాలక్ష్మి కళయున్న చెలువ యనఁగ
వినవె ? నామాయ లోకైకవిలసితంబు
నిఖిలమిథ్యాకరోపాయ నీదుమాయ
కంటివే రెంటి మేలును గమలనేత్రి ! 81

వ. అని యీర్ష్యాజనిత లజ్జావిషాదక్రోధంబుల నంతాపించి యంతట నిలువక. 82

శా. నీవైకుంఠమహోత్సవాభ్యుదయముల్, నీసుందిరాంతఃపురీ
లావణ్యాతిశయంబు, నీమణిగణాలంకార సౌభాగ్యమున్
నావిస్ఫూర్తులు, నే గ్రహించెద, భవన్మాయా విలాసంబు లె
ట్లె వర్తించునొ చూత మంచు నిజదివ్యాకార మేపారఁగన్.

—♦ లక్ష్మీదేవి కోపముచే వైకుంఠ విలాసము హరించుట ♦—

తే. ధరణి గంపింప లోకముల్ దల్లడిల్ల
భూతపంచక మాకాశమునఁ జలింప
శారదాదేవిప్రార్థన సరకుగొనక
మ్రింగె వైకుంఠసామ్రాజ్యరేఖ, లక్ష్మి. 84

సీ. ప్రాకారగోపురప్రాసాదమంటప
చంద్రశాలలపెంపు చటులువడియెఁ

పర్యంకభూషణాంబరపరిమళవస్తు
విస్తారములమేలు విన్నఁబోయె
సౌవర్ణమణిమయచ్ఛత్త్రచామరకేత
నంబులబిరుదచిహ్నంబు లెడలె
వారణహయభటవారితరథానేక
సైన్యసంకులగర్వచయము డించె
తే. రంగవల్లీవితానతోరణవిచిత్ర
దీర్ఘికారామవాటికాదివ్యకేళి
పర్వతప్రోల్లసత్త్వంబు పాడువాఱె
నట్టి వైకుంఠమున సిరి యాగ్రహింప. 85
తే. అవ్విధంబున సిరి తనయమృతదృష్టి
మరలఁ దిగిచిన వైకుంఠపురవరంబు
కువలయప్రియరుచి లేని కుముదసూన
మట్లు శూన్యత్వ మొందెఁ జంద్రాస్యయెందు ! 86
వ. వెండియుఁ జండక్రోధంబున భువనత్రయ విలాసంబును
గ్రహింప నుద్యోగించిన. 86
సీ. అంతయుఁ గని కడు నాత్మలోఁ గలుషించి
వేగిరపడక యావిశ్వకర్త
మాఁటవారల నాగ్రహం బింత సేయునే
యక్కటా యీఫలం బనుభవించుఁ
గా కేమి యని భావికపటకృత్యము గాన
రాకుండ మాయానురాగలీల

ననుపారఁ బరిరంభణముచేసి, కోపమి
ట్లేఁటికి? లోకంబు లేమి సేయు?

తే. నవ్వులాటలకై నీవు నివ్విధంబు
చనునె? యిఁకఁ జాలు, నీది త్రిజాతవహ్ని
శాంతిఁబొందింపు భూతపంచకము బెదర
కుండఁ, గరుణామృతము చల్లు ముత్పలాక్షి! 87

క. కోపము వచ్చిన నాపైఁ
జూపవలెం గాక మిగుల సుందరతరమై
చూపట్టెడు వైకుంఠము
హాపురసౌభాగ్య ముడుప నగునే నీకున్? 88

క. కంటివె వైకుంఠము నీ
కంటికృపాశ్రీలఁ బాసి కడు శూన్యంబై
యుంటె? యిది చాల కర్యో!
గెంటింపం దలఁచెదవు నిఖిలలోకములన్.! 89

వ. సర్వమంగళాధిదేవతయును లోకమాతయు నని బ్రహ్మాదులు
సేవింప నుండిననీవు లోకంబులపై నలుక దగునే? మనము
వినోదార్థం బాడ సమకట్టినజూదం బింత చేసి, సరసంబు
విరసంబయ్యె. నీ దేమి దోషంబు? జూదంబుదోషంబుగాక!
దీని కేమి? యింకఁ బ్రసన్నురాలవు గమ్మి; నీవ గెలిచితి
వనుచుఁ దన కౌస్తుభగ్రైవేయకంబు నయంబున నయ్యింది
రాదేవి సమున్నతకుచకుంభమధ్యంబున నలంకరించి కలంకఁ
దేర్చి, "యీదుర్ద్యూతవ్యసనదోషఖేదంబులు మానఁ గొంత

ప్రొద్దు సరసప్రాంతంబుపొంత విహరింతము రమ్మనుగ్రహంబు గలయప్పుడు వైకుంఠదివ్యమందిరంబు వెలింగెడుం గాక, శూన్యగృహంబున నుండఁ దగ" దని యెలయించి, కైదండ యిచ్చి తోడ్కొని యంతఃపురోద్యానమార్గంబున వెడలి చనియె నంతఁ గొంతదూరంబున. 40

— లక్ష్మీదేవియు విష్ణుమూర్తియు క్షీరసముద్రముఁ జూచుట. —

ఉత్సాహ. కమలయుం జనార్దనుండుఁ గాంచి రుర్వరా వచః
ప్రమదలున్ సురాంగనాళి పజ్జఁ దోడఁ గూడి రా,
విమలఫేనకాంతికాంతవిస్ఫురత్కళానిధిన్
ఘుమఘుమత్తరంగసంఘుఘోషభీషణాంబుధిన్. 41

వ. కని హరి నిజప్రియ కిట్లనియె. 42

మానిని. నీ దగుసోదరభావముఁ జెంది
యనిందితకీర్తి వహించె; సుధా
పాద సుధా తులసీ నవభాస్కర
భాస్వరకౌస్తుభరత్న మరు
త్పాదపపంచకకామగవుల్ బహు
భంగుల నెల్లజనుల్ పరమా
మోదముఁ జెందఁగ నీయమృతాంబుధి
ముద్దియ! చూడుము వేడుకతోన్! 43

స్రగ్విణి. నీరజాతేక్షణా! నీకటాక్షాంచలా
ధీరతాభ్యాస మర్థించి కాఁబోలుఁ జూ!

చేరి మీనాళి వే చిత్రమ్మె పాఁటెడుం
గోరికల్ మీఱఁ గన్గొంటివే వారిధిన్ ? 44

వనమయూరవృత్తము.

వేల్లితనవీనతరవిద్రుమలతోద్య
త్పల్లవవిలగ్న మయి భాసిలెడు ముక్తా
బల్లరి ! మృగాక్షి ! కలశాంబునిధిలో, నీ
యుల్లసిలుమోవికడ నొప్పుచిఱునవ్వై. 45

కుసుమితలతావేల్లితవృత్తము.

రాకాచంద్రాస్యా ! యమృతనిధి నం
రంభ మొప్పం బయోదా
నీకం బప్పారంబులు గడునడిన్
నిల్చి పానంబుసేయన్
వ్యాకంటే నీవిభ్రమరసము నే
వేడ్కన్ శ్రోత్రద్వయం బా
లోకశ్రీలం గోరెడు సువిహితా
లోలసంప్రీతిఁ జూపెన్. 46

ఉ. శాతకటాక్షి! చూచితివె శంఖ మొకండు నితాంతయాతనా
యాతతిరంగహస్తముల నావల నీవల నూచుచున్నద
త్యాతురవృత్తిఁ బావకగళాభ మటన్న సహింపరాదు మీ
తాత బహిష్కరింపఁగఁ బదంపడి పోవఁగ లేకయుంబలెన్.

వ. వెండియు మదభరంబున మదనమదనోన్మదనాదినిశితశరవరం
పరాకంపమానమానస లగుచు నేటిమదిరాక్షులు చక్షు

రుత్సవంబులైన మదకలకలహంసరశనాక్రేంకారసంకులపులిన ఘనజఘనబింబంబులును, సద్రులావర్త గంభీర నాభీతలంబులును, కోమల శైవాల రోమరాజిలతలును, సముత్తుంగరథాంగకుచకుంభంబులును, నాళీకనాళహస్తంబులును బ్రశస్త విలాసరేఖల మెఱయఁ, బుష్పంధయావళీధమ్మిల్లబంధంబులుం జెదరఁ, దీరదరుసురభికుసుమసౌరభ్యప్రవాహంబులతో డిండీరఖండసుందరమందహాసచంద్రికల కలంకారంబై లేఁదరఁగకటీవంకబొమల మురిపెంబుల నలరుకలికిగలువరేకుల కనుంగవకెలంకులం దళుకు లెసంగుబేడిసచూపులఁ దీపులు పుట్టించుచుఁ బాయక పైకొనిన, దక్షిణానాయకత్వంబున నందఱ నొక్కచందం బగుప్రేమంబున నుద్దామదీర్ఘతరంగ బాహుదండంబులు సాఁచి కౌఁగిలించి, తదీయపద్మవదన లదధరనిర్గళితమధుమధురామృతపానంబున నుప్పొంగు లీలా సంగతివలన శృంగారరసంబును, నిఖిలభువనైకసంభావితం బగుప్రాభవంబున విశ్వవిశ్వంభరా చక్రం బాక్రమించి సమున్నతాయతోర్మిహస్తస్ఫార పరిస్ఫాలనవిపాటితదిగంత దంతావళకుంభకూటం బైనపాటవంబువలన వీరరసంబును, నాఖండలదోర్దండమండితచండధారాక్రూరభిదురదురాపాత సంజాతప్రభూతభీతిం గ్రచ్చఱ శరణుసొచ్చిన శిలోచ్చయ నాయకుం డగుమైనాకుని రక్షించుదాక్షిణ్యంబువలనఁ గరుణ రసంబును, ప్రావృషేణ్యపయోవాహంబు లభ్రంబున నదభ్రనీలమణివిభ్రమంబులు నింద్రచాపదీపితదిగ్వటంకంబులు

నుం గఠినవిర్ఘాతపాతప్రకంపితజంతులోకంబులును విద్యు
ద్దండమండితాజాండ ఖండంబులును, మార్జయగర్జాగ్రగ్గి
రాపతాండవితశిఖండిమండలంబులు నై కుంభద్రోణవర్షం
బులు వర్షింప, మొల్లంబైన యున్నతినెల్లిన మొల్లకడలం
గడలుకొని యుప్పొంగి తరంగిణీముఖంబులం బ్రవేశించు
నప్పుడును, నిదాఘసమయ దీర్ఘదినకరకిరణసహస్రస్వీకృత
సరస్వత్సరోవాపీకూపపానీయంబై యుండి మహీమండలంబు
వ్రయ్యలువాఱునప్పుడును జెప్పరాని యగాధజలగాంభీర్యం
బున నుబ్బుసుబ్బులులేక యొక్క చందంబున నుండు
నఖండమహిమవలన నద్భుతరసంబును, సురాసుర పరివార
పురస్కృత మందరధరాధర మంథానమథన సంభ్రమణంబున
గంభీరగుణంబు చెడి వికలజీవనభంగప్రయాసగతనిశ్వాస
యాతాయాతసర్వతోముఖంబులం బొరలంబడుచు ఘోషింప
నెఱి దప్పి దెప్పరంబున నాఁటనుండియు మొఱపెట్టుచున్నదో
యనునాడికవలన హాస్యరసంబును, నిరంతరంబును దద్ద్వీపం
బులు నివాసంబులు చేసికొని కినుక ననేకపట్టనగ్రామవర్ణా
శ్రమవాసుల గోవృషభశిశుస్త్రీలోకంబులఁ జీకాకువడఁ
గసిమసంగి యసువులకుం బాపి రక్తమాంసమేదోమస్తిష్క
పంకపంకిలంబు లగుశవనివహంబులు దెచ్చుకొని విచ్చలవిడి
నిచ్చలుం బ్రమత్తు లగు నక్తంచరులు బుత్తులు గొనఁ దదీయ
పూతిగంధబంధురంబు లగు గంధవహప్రసరణంబులవలన
బీభత్సరసంబును, బరస్పరవిగ్రహపరిగ్రసనరసరభసక్రోధ

ధావనసంకులంబై నిశ్శంకంబు కుంభీరకుంభీనస తిమి తిమింగిల కమఠకర్కటాది*యాదఃపరంపరలు తెంపున విహరించు దురవలోకభీకరత్వంబువలన భయానకరసంబును, విలయకాలరుద్రవినిద్ర జగదాభీలమహోత్కీల ఫాలనయనానల జ్వాలాకరాళంబై విశాలజిహ్వాసంహతులం బయఃపూరంబులు గ్రోలుచుం బొగలం దగులక తెగలువడి భగభగ నిగుడు పొగరుచిగురుమంటలవెంట మింటికి నుప్పరం బెగయు నిప్పుల కుప్పలు చదలతుదలం జెదరి చామరధ్వజచ్ఛత్త్రాకారంబుల ప్రకారంబున నలువంకలం దూలి గ్రాలుచుండం బ్రచండ తేజంబున, బ్రహ్మాండమండలోర్ధ్వకర్పరపర్యంతంబు శత యోజన సమీపసంచర ద్దివ్యవిమాన విహంగముఖ ఖేచర నిచయంబుల భస్మసాత్కరించుచు ననవరతంబు నీడంబోక బలోత్కృష్టం బగు బడబాగ్ని వ్యగ్ర తాపోద్రేకంబువలన రౌద్రరసంబును, జంద్రచంద్రికాధవళశీతలస్వభావంబును నమృతరూపంబును నతివిమలాంతరంగంబును, ననేక సాధు బుధస్తవ్యమానస్థానంబును నగు సౌజన్యంబువలన శాంత రసంబును దనయందుం బ్రకాశింపం బెంపారు నపారగుణావారం బగుపారావారంబున వారాకర కుమారికి ననేకవిధ విచిత్రసుందరతరపదార్థసందోహంబులు సూపుచు నవ్వనమాలి లీలావిహారంబునం గొండొకదవ్వు చని. 47

* యూథపరంపరలు—వ్రా. ప్ర. పాఠాం.

—♦ వనధితీర వనవిహార వర్ణనము. ♦—

ఆ. తాళ పూగ నారికేళ హింతాల కే
తకి రసాల సరళ వకుళ కదళ
వనస సింధువార పారిజాతాది కా
వనిజ రాజి నొప్పు వనము చొచ్చి. 48

వ. అంత. 49

సీ. నిండారుపొన్నలనెత్తావిఁ గైకొని
పసిఁడి సంపెంగలప్పికి నెగసి
నెఱిమించు పొగడల నెత్తావి చేకొని
లీలమై బొండు మల్లెలకు నుఱికి
నిగుడుగొజ్జంగల నెత్తావి హరియించి
పొదిగొన్న చేమంతి పొదల కరిగి
నింపారుజాజుల నెత్తావి సవరించి
నవపారిజాతసంతతుల వ్రాలి

తే. మెలమిఁ దద్దివ్య గంధంబు లేర్పఱించి
మెలపుతో వాని నన్నింటి మేళవించి
యింపు నునుగాడ్పు కానుక యిచ్చె వారి
కాత్మగంధవహాత్వంబు సార్థకముగ. 50

చ. పరభృతసద్భటార్భటియు భానురకీరతురంగ హేషలుం
దరు రథవిభ్రమంబు సమదభ్రమరద్విరదోగ్రబృంహిత
స్ఫురణయు మీఱఁ బుష్పశరభూపతి సర్వజగజ్జయార్థమై
యురుగతివచ్చిదండువిగియున్నటులవ్వనమొప్పెఁజూడఁగన్.

సీ. ఈఱంబు లగుపొదరిండ్ల నీడల వలి
గ్రమ్ముచో శీత లక్షణము దోఁచుఁ
బూఁదేనె తుంపురుల్ పొరిఁ బొరి రాలుచోఁ
బ్రాలేయసమయసంపద గనర్చు
సహకారకిసలయాస్వాది కోకిలనాద
మెసఁగుచో నామని యింపు చూపు
నగరుకాశ్మీరగంధాన్వితోష్ణానిల
మడరుచో గ్రీష్మర్తు వతిశయిల్లు
తే. నమరు మధుకరగతుల మేఘాగమంబు
నెరయు విచికిలకిరణచంద్రిక శరర్తు
వవ్వనంబున; నట్టిమహావిభూతి
నాత్మ మెచ్చిరి సిరియు నయ్యచ్యుతుండు. 52
సీ. కమలాకమలగంధి కచబంధమున దోఁపెఁ
బారిజాతద్రుమప్రసవభరము
తనరుమహీమహీధరకాచ కుచముల
హరిచందనపరాగ మలఁదెఁ గలయ
రాణ వాణీశుకవాణి యాస్వాదించె
మందారమధురమరందధార
నెలమి సుపర్వపర్వేందువక్త్రిలు దాల్చె
రసలారు సంతానకిసలయములు
తే. కల్పకమునీడ భక్తసంకల్పదాయి
యయ్యనంతుఁడు గ్రోలె మందానిలంబు

మహితరతిరాజరాజసామ్రాజ్యలక్ష్మి
నలరు జలనిధి సవిధ వనాంతరమున. 53

క. కుసుమాపచయరసంబునఁ
గుసుమాయుధగురుఁడు వలపు గొలుపుచు లీలన్
గుసుమ*కుమారిన్ సిరి నవ
కుసుమిత తరు లతల వెంటఁ గూడి చరించెన్. 54

సీ. సఫలపూగశ్రేణిసౌభాగ్య మగ్గించి
యురగవల్లులదండ నుండి యుండి
గురివెందపందిళ్ల పరువంబు గొనియాడి
మల్లెపూఁబొదరిండ్ల మలసి మలసి
ద్రాక్షాఫలస్రవదస్రధార గొనని
గొజ్జంగపూఁదేనెఁ గ్రోలి క్రోలి
సహకారచారుమంజరులకుఁ దలయూఁచి
పొన్నపుప్పొళ్లు పైఁ బూసి పూసి
తే. భృంగభయదంబులైన సంపెంగవిరుల
ఘురువు ప్రకటించి జాజులు ముడిచి ముడిచి
వెలయువనలక్ష్మిగారాపువిందు లనఁగ
హరియు సిరియును గ్రీడించి రభిమతముగ. 55

సీ. ఘనవేణికాబంధమునకుఁ జుట్టపు శిఖా
వళి యంచు వనశిఖావళులు గేర

* సుకుమారి.

నయనవిస్తారమ్మునకు నయిదోఁడు సా
    రంగి యటంచు సారంగు లొలయ
మధురసల్లాప సంపదలకు ననుఁగుఁగో
    కిలబాల యంచుఁ గోకిలలు నలయఁ
గనక తులాకోటినినదంబునకుఁ దోడి
    యంచ యటంచు రాయంచ లలర
తే. నెలమి వనదేవతాలతాంగులు చెలంగి
చిగురుఁజేతులఁ బైఁ బువ్వుసేస చల్ల
నవ్విలాసిని చరియించు నవ్వనమునఁ
బద్మనాభునికన్నులపండు వగుచు. 56

మ. లవలీపుష్పసుగంధము ల్మరగి యేలాలాస్యముల్ చూచుచు
న్నవిదీప్తిప్రతిమానవిద్రుమవితానచ్ఛాయ రంజిల్లుచున్
ధవుడుం దాను సఖీసమూహములతోఁ దవ్వేఁగె లీలాగతిం
జివురుం గైదువుజోదుతల్లి జలరాశిప్రాంత వన్యావలిన్. 57

— విష్ణుమూర్తి లక్ష్మీదేవిని వంచింపఁదలంచుట —

వ. ఇవ్విధంబున నయ్యమృతపయోనిధాన సవిధ వనమార్గంబున ననేకవిధక్రీడారసపరాయత్తచిత్తయై యత్తమ్మివటూరుమిటారి కత్తె సవతియుఁ గోడలును మొదలయిన సఖీజనసమూహంబులతో విహరింపఁ దదీయకౌతుకలీల లాలోకించి వైకుంఠవల్లభుండు నెయ్యంపుజూదపుసయ్యాటంబునకై వైకుంఠంబు శూన్యంబు గావించిన నిర్దయురాలిని మోసపుచ్చుటకై

మెడరువేచి యున్నవాఁడు గావున నొక్క కపటకృత్యంబు సంస్మరించి. 58

క. బలసంపత్పౌరుషములు
గలిగియు విసయంబు లేనిగర్వాంధులు త
ద్బలసంపత్పౌరుషములు
పొలిదటుఁగాక పశులు గారు పొగ్గిఁదలంపన్. 59

క. సతి యైనను సుతుఁ డైనను
హితుఁ డైనను మేరఁ దప్పి యేచుఁగాక కడు దు
ష్కృతిఁ గావించిన వారిం
బ్రతినిధిఁ గుదియింపవలయుఁ బ్రాభవ మొప్పన్. 60

వ. అట్లగుటంజేసి. 61

ఉ. ఈమెలనాఁగ గర్వమున నీభువనత్రయరాజ్యలక్ష్మి యా.
త్మీయవిలాసలేశ మని తెంపున నన్ను గణింప కగ్గలిం,
బాయక, పద్మషండమున భస్మము లైనను విన్నఁబోనిశో
భాయతనంబుమద్భవనమంతియుశూన్యముచేసెదుష్కృతిన్.

క. తానును దనయైశ్వర్యక
ళానయసామర్థ్యములుఁ దలంపఁగ మన్మా
యానిర్మాణంబని మదిఁ
గానదు తా లక్ష్మి నసడుగర్వముచేతన్. 63

క. ఈరసమును నిర్దయతయుఁ
గ్రూరత్వము సతులసహజగుణములు మిగులన్

వారలలోఁ జంచల కడు
నారయ సిరి దుర్మదమున కాశ్రియ మగుటన్. 64

—♦ { విష్ణుమూర్తి లక్ష్మికిఁ బ్రతిలక్ష్మిని గల్పించి వైకుంఠము మిగులఁ బ్రకాశింపఁజేయుట. } ♦—

క. కావున నీదుర్మద గ
ర్వావిర్భావంబు మాన నతిచిత్రముగాఁ
గావింతు వేఱె యొక ల
క్ష్మీవిభ్రమకల్పనంబు కేవలమాయన్. 65

క. మున్నున్న కంటెఁ గ్రమ్మఱ
వన్నెకు నెక్కంగఁ జేతు వైకుంఠము దాఁ
గ్రన్నన హరియించితి నని
యున్న మహత్త్వము గుదింతు నొకనిముసమునన్. 66

వ. అని యనంతగుణగణవిలాసుండును బ్రహ్మాండనిర్మాణకర్మకుశలుండును, బ్రకృతిపురుషాధీశ్వరుండును, బరమేశ్వరేశ్వరుండును, నానారూపప్రవర్తకుండును, సర్గస్థితిప్రళయవికారకారణుండును, జగద్వంచనాకపటనాటకసూత్రధారుండును, బ్రహ్మాండకోటిబహిరంతర్దీప్తుండును, సురాసురగంధర్వబలపరాక్రమమాయోపాయనిరాకరిష్ణుండును నగు నవ్విష్ణుండు దన తేజంబు ప్రకటించిన. 67

—♦ వైకుంఠపురవర్ణనము ♦—

క. ఘోటకకరిరథభటసే
నాటోపము పౌరకలకలారంభము ను

ద్ఘాటింప నాఁటికంటెను
మేటిగ వైకుంఠపురము మెఱసెన్ సిరులన్. 68

సీ. పద్మసంభవు లెల్లఁ బరిభవించుపురుటిల్లు
ప్రళయదుర్దశ లంటఁబడనిభూమి
కాలాహి కోడిసి ద్రింగఁగరానివాకట్టు
తలఁప నచ్చెరు వైన తానకంబు
పారికృతుల్ చేరరాని యేకాంతదుర్గంబు
మహితసాత్త్వికకోటి మనికిపట్టు
కైవల్యలక్ష్మి చక్కని కేళిభవనంబు
పంచభూతములఁ గల్పించుగుఱుతు

తే. సహజతేజోలవగ్రస్తచంద్రసూర్య
పావకం బమ్మహాదివ్యపదము వైజ
లక్ష్మిఁ బాయునె యాకేళిలక్ష్మిచేత?
నిత్యలక్ష్మీశ్వరుఁడు హరి నిలుచునెలవు! 69

వ. ఇట్లమేయ కళ్యాణ గుణ సుందరం బగు వైకుంఠమందిరంబు
షడ్గుణైశ్వర్యసంపన్నుం డగు వెన్నునిమహాప్రసాదసామర్థ్యం
బున సిరికి నచ్చెరు వగుసిరిఁ దోలంకుచుఁ బంకజహితమం
డలంబునుంబోలెఁ దొల్లింటికంటెఁ గన్నులపండువై తేజ
రిల్లుటకు సంతోషాద్భుతరసంబుల జొత్తిల్లుచిత్తంబుల బ్రహ్మ
రుద్రాదిదివిజసిద్ధచారణగంధర్వజయజయనాదంబులతో దివ్య
కాంతలు పుష్పాంజలులు సమర్పించిరి వెండియు. 70

ఆ. సహజకఠినవజ్రసారమై విలయాంధ
కారనిబిడమై యగమ్యమహిమ
మహితదివ్యవిష్ణుమాయావిలాసంబు
పద్మనిలయఁ బెక్కు భ్రమలఁ గప్పె. 71

—♦ లక్ష్మీదేవి విష్ణుమాయామోహితయై పరిభ్రమించుట ♦—

క. హరిమాయామోహిత యై
పరమజ్ఞానంబు దివ్యభావము నెడలన్
సిరి ప్రాకృతసతి యై వడిఁ
దిరిగెన్ వనవీథిఁ బెక్కుతెఱఁగుల భ్రమలన్. 72

వ. అంత నవ్వనాంతరంబునఁ దన్మాయావశంబున. 73

క. కనుఁగొనియె నగ్రవీథిన్
వనజాలయ యొక్కదివ్యవనజాకరముం
దనుపు సెడి వాడఁబాఱిన
వనరుహకహ్లారకైరవంబులతోడన్. 74

సీ. నిండారఁ జిగిరించి నిగనిగల్ చాలక
వాడిన నవపల్లవములతోడఁ
గలయంగఁ బూచి తేనెలు చిందు నెత్తావిఁ
బొరయక కందినవిరులతోడఁ
బరిపాకమునఁ బండి సరసమాధురి లేక
పద నింకి పోయిన పండ్లతోడ

మెలఁకువ లూని కొమ్మల విన్ననై యున్న
యలిపోత శుకపికావలులఁ జూడఁ

తే. చిన్నవోయిన వనము వీక్షించి, లక్ష్మి
యనుఁగుఁ జెలులకుఁ జూపుచు, నరుదుపడుచు
నెన్నఁడును జూడ మిట్టువంటి హీనవనము
శూన్యమై యున్న దిది యేమిచోద్యమొకొ! 75

వ. అని యాదివ్యవనంబుఁ గలయ నాలోకించి యిది యపూర్వ
సిద్ధాశ్రమం బని మనంబున నభివర్ణించుచుఁ బ్రవేశించి శంకిం
చుచు నెట్టకేలకు నందఱితో నక్కొలంకు డగ్గఱి. 76

ఉ. నిండి తొలంకునాకొలని నెన్నడుమం గనకాంబుజాత మొ
†క్కొండు వికాసహీనమయి కొప్పర రేకులువాసి శూన్యమై
యుండఁ దదీయకర్ణిక ననూనహిమావృతి బాలభానుమ
న్మండలివోలెఁ గొంత ప్రభ మాసినదేవతఁగాంచె నొక్కతెన్

క. ఒకచేత నక్షమాలయు
నొకచేఁ జిన్ముద్రయును సమున్నతదోర్ద్వం
ద్వకలితముకుళీకరణముఁ
బ్రకటిల్లఁగ ధ్యాననియతిఁ బరఁగెడుదానిన్. 78

క. పరివేష్టించి సరోజాం
తరములపై నిలిచి దివ్యతరుణులు సేవా
పరికరములతో నయత
త్పరలై తనుఁ గొలువ నున్నప్రాభవమూర్తిన్. 79

† మొక్కొండు...కప్పరరేకులు వ్రాలి; వ్రాసి—పాఠాం.

సీ. పద్మాసనాంకాగ్రభాగాంఘ్రిశుభరేఖ
లఖిలలోకేశ్వరి యగుట నొడువఁ
జిన్ముద్రచేత మించినసమాధిక్రియ
కైవల్యలక్ష్మినిల్కడ వచింప
దీవ్యన్మహాతప స్తేజోవిభూతి ని
జాభిమతావాప్తియదను దెలుప
నాపూర్ణపరమయోగానందకళ మది
నిష్టదైవం బున్న యింపు చెప్పఁ
తే. గన్నులకు వెక్కసం బైన కాంతి గలిగి
మనసునకు నద్భుతం బైన మహిమ గలిగి
యైహికాముష్మికశ్రీవిహారభూమి
యగుచు నొప్పారు బ్రహ్మవిద్యావిధేయ. 80

వ. కని విస్మయం బందుచు నందఱుం గరారవిందాభినయంబునఁ
గ్రందుపడకుండ వారించి వారితో నిట్లనియె. 81

చ. ఉరుపరమాత్మయోగమున నున్నదియీశుభమూర్తిఁ గంటిరే!
యరుదగువిభ్రమాభ్యుదయమంగజుఁడాఁ గనినట్లయొప్పెడున్
బరిణతతాపసప్రతిభ బ్రహ్మముఁ డాఁ గనినట్ల యొప్పెడున్!
నిరుపమనవ్యదివ్యరుచి నిండి తొలంకెడు *నట్ల యొప్పెడున్.!

మ. సలిలాంతఃప్రతిబింబితార్కరుచియోజం బొల్చు ధూమచ్ఛటా
కుల†కృత్యత్నవహేతియ ట్లడరుచున్ గుప్తప్రభావంబు, నై౦

*నంగకంబులన్. †కాంతిన్నవ, కార్శ్యన్నవ—పాఠాం.

మలినత్వంబును గల్గి యోగనిరతిన్ బ్రహ్మ న్విలోకించునీ
యలఘుప్రక్రియఁ దొల్లి యేసతులయం దైనంగనుంగొంటిరే?

వ. అని వెండియు వాగ్దేవతకరం బవలంబించి యించువిలుకానితల్లి
యిట్లనియె. 84

క. ఈయుగ్రతపము సేయఁగ
నీమెలచిగురాకుఁబోఁడి కేమిటికో ము
న్నేయుగమునఁ జూడము లేఁ
బ్రాయంబునఁ దప మొనర్చుపాఁభనమూర్తిన్. 85

సీ. ఈరేడుజగముల నేలుటకో, యది
తనమహారాజసంబునకు నెంత!
రతికంటె విభ్రమోన్నతిఁ జెందనో, యది
తనమోహనాకారమునకు నెంత!
యఖిలాంగనారత్నమై యుండనో, యది
తనదివ్యసామర్థ్యమునకు నెంత!
బ్రహ్మంబు తానయై పరిణమింపనో, యది
తనచిన్మయానందమునకు నెంత!

తే. యేలకో యింత తపము వహించి సేయ!
నింత నిర్బంధమునఁ బొందనేలొ తనకు!
యక్షగంధర్వసిద్ధవిద్యాధరర్షి
తరుణులం దెవ్వరోకో? యీ పరమసాధ్వి! 86

సీ. బ్రహ్మాదిదేవతల్ ప్రణమిల్లరే! తన
కేఁటి కంజలి ఘటియింపఁ దాను!

దన కేది యభిమతార్థమొ కాని! యభిమతా
ర్థమునకు నభిమతార్థంబు దాను!
తనమెచ్చు నొక దైవతంబును గలదొకో!
యఖిలైకదైవత మరయఁ దాను!
దనుఁగూర్చి యందఱు తపముసేయుట గాక!
యొరుఁగూర్చి తపము సేయునటె తాను!

తే. ఈమహానిష్ఠఁ గృశియింప నేల తనకు!
నవశిరీషప్రసూనంబు నవఘళించు
మృదులతనువల్లి నేఁటి కిమ్మెయి నలంప!
సర్వకల్యాణియైన యీ చంద్రముఖికి! 87

ఉ. ఈలలనాశిరోమణికి నీశుభమూర్తికి నీలతాంగిక
య్యాలరి దైవ మేమిటికి నచ్చెరువైన తపోగ్ని కీలలం
దూలఁగఁజేసెఁ? జేసియును దూకొని దీనితపంబు పేర్మికిం
బాలనవృత్తి నీవలదె పాల్పడి క్రిమ్మఱ వాంఛితార్థముల్?

తే. హరిహరబ్రహ్మలకు నవ్వలైన దైవ
మెవ్వరో కాక, వారైన నీరె కోర్కి!
కోర్కె త్రైలోక్యమును నేలుకొలఁదికంటె
నెక్కువై యుండఁబోలు నీ యిందుముఖికి ! 89

క. నాకేశ్వరుసతికంటెను
భూకామినికంటె నద్రిపుత్రికకంటెన్
నీకంటెను నాకంటెను
లోకోత్తరచరిత యిది విలోకింపఁ దగన్. 90

వ. అని వెండియు వనం బవలోకించి. 91

ఉ. ఈవని పూచి కాచి ఫలియించి, శుకాన్యభృతాళిజాతితో
నీవిధిఁ జిన్నవోవుటకు నేమికతంబొకో! యీకొలంకు ప
ద్మావళియేలవాడె? నిది యచ్చెరు! వెన్నఁడుఁ జూడ మిట్టు లే
దైవము శాపమిచ్చెనొకదా యలుకన్ సతితోడఁ గూడఁగన్

వ. ఈ దివ్యవనదివ్యాంగనలకు నీమరనష్ట దైవశాపంబ కానోపు,
దైవశాపం బగునేని యింత యంతర్వికాసతేజంబు లెట్లు
సిద్ధించు? నీయపూర్వసిద్ధాశ్రిమంబున నిప్పరమపావని నిగూఢ
పరిభావంబున నుగ్రతపస్సామగ్రి నుండుట యద్భుతకథా
ప్రసంగంబు. ము న్నెన్నఁడు విన్న కన్న యది గాదు. చతు
ర్దశభువనంబుల నెక్కాలంబుల నిక్కట్టడ యెఱుంగము. దీని
విధం బంతయు నీ కాంతామణిచేత ధ్యానానంతరంబున నడిగి
తెలిసికొని పోవుదము గాక! కొంతకాలదడవునిలువుం! డని యా
జలధికన్యక పలుకునవసరంబున. 93

గీ. బ్రహ్మయోగంబు చాలించి పద్మగంధి
యూర్ధ్వబాహుత్వచిన్ముద్ర లుజ్జగించి
వెడఁదకనుదమ్ము లల్లన విచ్చి చూచె
నిందిరాముఖలలితపూర్ణేందుముఖుల. 94

క. ఆచంద్రవదన సుమధుర
లోచనరుచిచేత నావిలోలాక్షులు సొం
పేచిరి నవశిశిరాంశుమ
రీచి మహౌషధులువోలెఁ బ్రియయోగమునన్. 95

వ. అట్లు పరబ్రహ్మయోగంబు చాలించి యా పద్మాక్షి యక్షిణి
తపఃప్రభావాతిశయంబునం జేసి త్రైలోక్యపూజ్యలైన శ్రీభూ
నగస్వతుల నగ్రభాగంబున నిరీక్షించి సామాన్యస్త్రీలుగా
బరిగణించుచుం దనయున్న పద్మాసనంబు డిగక యాది గ
ర్భేశ్వరీత్వంబు వహించి సాదరంబుగ వారితో నిట్లనియె. 96

ఉ. ఎవ్వరుమీరు?మీయునికియెక్కడ?నామములెవ్విమీకు? మీ
రివ్విపినాంతరంబునకు నేఁటికి వచ్చితి? రింతులార! మీ
మవ్వము వింత! యచ్చరలో!మానవకాంతలో!యక్షకన్యలో!
యివ్వనదేవతామణులో!యించుక నా కెఱిఁగింపుఁడా తగన్.

వ. అని యయ్యుత్తమస్త్రీరత్నంబు పల్కినం జిత్తజాతజనని మా
ఱుత్తరం బిట్లనియె. 98

క. ఏ మమరస్త్రీలము మా
నామము లట్లుండనిమ్ము, నలినాక్షి! భవ
త్సామర్థ్యము విన వలతుము
ప్రేమంబునఁ జెప్పు నీదు పేరు మునుపుగాన్. 99

క. నీదీర్ఘతపముకలిమికి
నీదివ్యవిలాసమునకు నీదృఢమతికిన్
బైదలి! యచ్చెరు వయ్యెడు!
గాదిలిమైఁ జెప్పవమ్మ! కల తెఱఁగెల్లన్. 100

ఆ. మలినవస్త్రగుప్తమాణిక్యమును బోలె
నీఱు గప్పి యున్ననిప్పు బోలె

వెలఁది! నీమరూపు వెలి మాసి, లో నింపు
గలిగి యుంట కేమి కారణంబు? 101

క. నీవంటి దివ్యకామిని
కీవిధిఁ దప మాచరింప నేఁటికి వలసెన్?
దైవకృతం బే మన?; నీ
భావముఁ దెలియంగవలయుఁ బల్కు లతాంగీ! 102

వ. అని యాదిలక్ష్మి పలికిన నమ్మాయాలక్ష్మి యిట్లనియె. 103

—♦ మాయాలక్ష్మీవృత్తాంతము ♦—

ఉ. ఏమని చెప్పుదానఁ దరళేక్షణ! నామపురాణవృత్తముల్?
తామరసాసనేందుధర తామరసాక్ష పురందరాది స
ర్వామరకోటి కాత్మనయనాంచలమే విభవాధికారి నా
నామములక్ష్మియంచుభువనంబులెఱుంగ మహావిభూతిలోన.

తే. హరికిఁ బ్రియురాల నై భువనైకదివ్య
విభవముల కెల్ల మూలమై వెలయు నేను
దత్ప్రసాదంబు కలిమిగాఁ దలఁపలేక
ముదిత! గర్వించి యతనిచే మోసపోతి. 105

వ. అది యెట్లంటేని, తత్పరమరహస్యంబు నెఱింగించెద నాకర్ణింపుము. 106

చ. అరయఁగ మూఁడుమూర్తులకు నవ్వలిమూర్తియుఁ దానయై
మహాపురుషవరేణ్యుఁడై ప్రకృతిఁ బ్రోచుచుఁ జిద్విమల
స్వరూపుఁడై । పరఁగెడు విష్ణుదేవుఁడు ప్రపంచమునన్ బహు

రూపధారినై తిరుగుచు నుండు లోకములఁ ద్రిప్పుచు సర్వ
సురైకసేవ్యుఁడై. 107

ఆ. అతనివలనఁ బుట్టు నఖిలంబు; నాతని
యందు డిందు; నతఁడె యాదికర్త;
భూతపంచకప్రభూతపద్మభవాండ
మండలంబు నతనిమాయ సూవె. 108

వ. పరమేశ్వరుం డైన యద్దేవదేవుండు కల్పాదియం దనంతకోటి సూర్యచంద్రపావకప్రకాశంబున నతిశీతోష్ణం బై నయఖండ జ్యోతినై వెలుంగుచుఁ బెక్కు వేలు దివ్యవర్షంబులు నిలిచి తదనంతరంబ యవ్వెలుంగు సంస్తంభింపఁజేసి శుద్ధస్ఫటిక సంకాశం బైన రూపంబునఁ దానును, నీలజీమూతశ్యామల కాంతి యైన యొక్కవిలాసినియుఁ గవగూడి సాక్షాత్కరించి సృష్టి ఘటియించి దాని సంరక్షింప నప్పువ్వుఁబోఁడిం జాలించె. నదియ విష్ణుమాయ; యవ్విష్ణుండు పరమయోగానందంబునఁ గొంతకాలం బేకాకినై తిరిగితిరిగి, క్రమ్మఱ, లోకరక్షణార్థంబు నిలిపినయవ్వెలందియందు నేను నుదయించిన నన్నుం బరిగ్రహించి నామీఁది యనుగ్రహంబున, సకలంబును మత్కటాక్షవీక్షణంబున బహువిధసంపద్విలాసం బై వెలయ సమకట్టి లక్ష్మియను పేరు సుప్రసిద్ధంబు గావించి తన తోడు నీడగా మెలఁపుచు ననేకబ్రహ్మాండకోటులయందు యదృచ్ఛం జరించుచు నుండ నొక్కనాఁడు, 109

సీ. రుద్రేంద్రు పద్మగర్భులు గంధర్వులు
దిక్పతుల్ మునులు దైతేయయక్ష
పన్నగాదులు మహీపతు లాదిగాఁ గల
వారల ప్రాభవైశ్వర్యములకు
నేన నిదానమై నిఖిలనిగమాధి
దేవతాధీశ్వరి నై వెలయుచు
నఖిలదివ్యాంగనాభ్యర్చితమహిమాతి
శయమహారాజసశ్రీస్ఫురణగ
తే. నందఱకు నెక్కువై భువనైకవంద్య
నగుచుఁ బతిపెన్నురంబు సింహాసనముగ
సకలజగములు నేలుచు సర్వమంగ
ళాధిదేవత నై యుందు నబ్జవదన! 110
క. మానిని! యొక్కనవానికి
నేనిక గుజ్జంట నిక్క; మీఁగతిఁ బతి న
న్మానింప నుండి కన్నులఁ
గానఁగ తె నై తి నాదిగర్భేశ్వరి నై. 111
తే. అన్నిటికి నన్నుఁ బాలించి యధిపుఁ డూర
కున్నయనురాగ మెఱుఁగక యుత్పలాక్షి!
ధిక్కరించితి విభునిఁ దత్తేజ మదియు
నస్మదీయప్రభావంబ యని మనమున. 112
ఉ. ఆ జగదేకభర్తకుఁ బ్రియాంగన నైనమహానుభావతం
బూజకు నెక్కి యాదిమవిభూతికి నే నెలవైతి నాక నా

తేజము కాఁ దలంచితి మదిన్ భువనైకవిలాససిద్ధికిన్
రాజసదుర్మదంబునఁ గరం బభిమానముఁ దాల్చి యుగ్మలీ!

క. నాతలఁచిన తలఁ పది నిజ
మై తోఁచున్ సంతతంబు నంభోరుహాసం
జాతప్రముఖసుపర్వ
వ్రాతంబులు నాకు మ్రొక్క వనరుహనేత్రా! 114

వ. అట్టి సమయంబున నొక్కకల్పాదియందు. 115

చ. భువనము సృష్టిసేయఁ గమలభూ కమలారి కళాధరుల్ మహా
ర్ణవమున వంతుకుఁ దప మొనర్చిరి నిష్ఠ ననేకవర్షముల్
వివిధవిధిప్రయుక్తు లయి విష్ణుహితంబుగఁ దత్తపోగ్ని నిం
డి వెలుఁగఁజొచ్చెఁ బెన్ బయిట నిష్ఠురకీలలు గ్రాల నెల్లెడన్.

క. దానికి నించుక యేనియు
నానాథుఁడు కరుణ పూని నలినభవార్యా
జానులవర మొసఁగఁడు యో
గానందసుధాబ్ధిమగ్నుఁ డై యెలనాఁగా! 117

తే. భువననిర్మాణశక్తికై పూని విభునిఁ
గోరి తప మాచరించుట వీరితలఁపు,
వల్లభుం డేలొకో వీరివర మొసంగఁ
డనుచుఁ దద్దివ్యచిత్తంబు నరయలేక. 118

క. వర మీఁజాలకయో, ని
ష్కరుణాత్మకుఁ డయ్యొ, వేళ గాదో! తనకున్

హరిభావ మేమొకో యని
పరికించితిఁ గొంతతడవు భావమునందున్. 119

వ. అట్లు పరబ్రహ్మయోగానందానుసంధానశక్యంబునం దన్నుఁ దాన భావించుకొనుచు నాతపోధనులదెసఁ దలంపు లేక యూరకున్న విభుని యౌదాస్యంబును, వారల తపఃప్రయాసంబు నుపలక్షించి, వరదానసామర్థ్యంబు చాలక తడయుచున్నవాఁ డని తన్మాయామోహితయై తలంచి చండియు నాదు మహిమాతిశయంబున నింతవాఁ డయ్యెఁ గాక యితనియందు దైవసామర్థ్యం బేమి యున్న దనుచు నాసంపద్గర్వంబునఁ బతిం దిరస్కరించి నగవు దొలంకు నెమ్మొగంబుతో వారలకడకుం బోయి మీ యిష్టం బైన వరంబు నిచ్చెద వేఁడుం డనినఁ గపర్దికనకగర్భులు నాతో నిట్లనిరి. 120

క. కారుమెఱుంగులఁ బోలెన్
శారీరప్రభలు నిగుడ సమధికతేజ
శ్శ్రీరేఖఁ దోఁచితివి నీ
పే రెవ్వరు చెప్పవమ్మ! బిసరుహనేత్రా! 121

ఉ. ఎన్నఁడు జూడ మిట్టిప్రతిభ కెక్కినదేవత నర్కమూర్తి న
త్యున్నతవైభవాభ్యుదయ నూర్జితకారుణికాంతరంగ; న
స్మన్నియమాధిదేవతవొ మా కెఱిఁగింపఁగదమ్మ! నిన్ను నో
పున్నమనిండుఁజందురునిఁ బోలెడు ముద్దులమోముకోమలీ!

శా. కారుణ్యామృతవీచికల్ దొలఁకునీనేత్రాల్గన్గొనన్ సొంపు నిం
పారం గోర్కులవెల్లి పెల్లడరు శ్రేయశ్శ్రీలు శోభిల్లఁగా

నో రాజానన! యస్మదీయవరదానోత్సాహవై తెట్లు నీ
పేరుం జెప్ప వినంగఁగోరెదము సంప్రీతాత్మవై చెప్పవే. 123

క. మా వర మొసఁగఁగఁ జాలు ప్ర
భావము విష్ణునకుఁ గాక భామిని! తన్మా
యావిద్ధమతులకుం బెర
దేవతలకుఁ గలుగునే మదిం బరికింపన్? 124

తే. అయినఁ గరుణావిధేయవై యమితతేజ
మొప్పఁ బ్రత్యక్షమై మాకు నోడ కిట్లు
వర మొసంగుదు నని నీవు వచ్చినపుడ
యఖిలలోకైకజనని నీ వగుట దోఁచె. 125

వ. దేవి నీదివ్యచిత్తంబునం గరుణించి త్వద్వృత్తాంతం బెఱింగించి
మాకోరినవరం బొసంగు మనిన నవ్వి యవ్వారిజాననశశాంక
కళాధరుల కిట్లంటి. 126

సీ. న న్నెఱుంగరె భువనమ్ములు సృజియింప
మనుప మర్దింప సమర్థ నగుచు
సౌభాగ్యభోగరాజ్యకళావిభూతిప్ర
భావంబులకు మూల మై వసించి,
మే లెల్ల నాకృపాశ్రీలఁ గావించుచు
నిగ్రహానుగ్రహనిపుణ నగుదు
నాదిలక్ష్మిని బంకజోదరు జీవితే
శ్వరి జగన్మాతను శంభులార!

తే. మీవరంబులు కరుణింప మేటి నేన
కాక దైవంబు మఱి వేఱ కలదె జగతి?
విష్ణుఁ డరిదియు మీకు సన్నిష్ఠానమును
మత్కటాక్షంబు సుస్వ సామర్థ్యమునకు. 127

క. వావిరి బహుసృష్టిభవన
ద్దేవాసురమర్త్యపక్షితిర్యఙ్ముఖజీ
వావళి కలిమియు సొబగును
నావలనన మఱుఁగఁ గనరె నానాగతులన్? 128

క. జలరుహ ఫుల్లాఫుల్లత
జలరుహమిత్త్రోదయాస్తసంప్రాప్తులచే
బలెఁ ద్రిజగత్కలనాశం
నలు సంధిల్లును మదీయనయనాంచనలన్. 129

ఉ. ఆదిమశక్తి నేన పరమార్థవిలాసనివాస మేన, బ్ర
హ్మాదిసురేంద్రకోటులకు నాదరు వేన, సమస్తలోకసం
పాదనకర్త నేన, మది భావనసేయుఁడు, వేఁడుఁ డిష్ట;మా
హ్లాద మెలర్ప, విష్ణునకు నద్భుతభంగిగ, నిత్తు సత్కృపన్.

క. అని పలికిన నావలుకులు
విని జయజయనాద మెసఁగ వినుతించి ననున్
జననీ! మహాప్రసాదం
బని భక్తివిధేయవినతులై సంప్రీతిన్. 181

వ. మహాసంభ్రమంబున నన్ను వలగొని నిలిచి రప్పుడు బ్రహ్మ
దేవుండు ప్రాంజలియై యంబా! నీవు సర్వైకశరణ్య వగు

దేని నావిన్నపం బాలకించి జగత్సృష్టికరణవిద్యయు సకల సంపత్ప్రదాయిని యైన నీకళయును మదీయశాసనంబునం బ్రవర్తించుచుండవలయు, నివ్వరంబు కరుణింపు మని యడిగిన నట్ల యనుగ్రహించితి, నంత రుద్రుండును నవ్వరంబును వేఁడిన వివేకంబు లేక నిలుకడ దప్పి నీకును నిచ్చితి నని పలికితి. నావాక్యప్రమాణంబున నవ్విద్యాకళలు రెండును నొకరియందును నిలుకడ వడయరాక చంచలించి మూర్తిమతులై యిద్దఱి చెంత నడయాడుచున్న, వారు విఫలప్రయత్నులై దీనులై యున్నం గనుంగొని దీని కేమి సేయుదాన, భ్రమసి యిద్దఱకు నొక్కచందంబు వరం బుపన్యసించితి నని తెరవు లేక చీకాకుపడు చున్నసమయంబున దేదీప్యమాన మహేంద్రనీలమాణిక్యపుత్త్రియుంబోలె లీలామందహాసం బెసంగ విష్ణుమాయ సాక్షాత్కరించి నాతో నిట్లనియె. 132

మ. త్రిగుణాధారుఁడు విశ్వలోకఘటనాదీక్షాసమర్థుండు స
ర్వగతుం డాదికి నాది విష్ణుఁ డని నిర్వ్యాజంబుతో నిద్దఱుం
దగ నీదివ్యులు భక్తి నాహరికిఁ జేతఃప్రీతి సంధిల్ల దు .
ల్యగణిం జేయుచునున్నవారు తప, మిష్టావాప్తికై నిష్ఠతోఁన్.

ఆ. ఉగ్రతపము సేయుచున్న యీయిద్దఱ
యభిమతంబు నేక మరసి చూడ
వీరితమక ముడిపి వేర్వేఱ వరము లీ
వెదకుచున్నవాఁడు విష్ణుఁ డిపుడు. 134

వ. ఇట్లున్నచోటం దద్దివ్యచిత్తంబు గానక యతండు లీలార్థంబు సహచరిగా ననుగ్రహించి యనురాగంబునం బెద్దసేయుటం జేసి యాప్రియునందు నుండె మేలంబున మందబుద్ధివై లక్ష్మీ గర్వవిభవంబునం బతిం దిరస్కరించి. 185

క. భావింపంగ నీవును నొక
దేవతయునుబోలె మీఁదు దెలియక వర మొ
ట్టే వచ్చితి విచ్చినవర
మీవిధమున వ్యర్థమయ్యె నిది యిట్లుండెన్. 186

చ. పతి యననుగ్రహుం డంచు మతి భావనం జేసితి బ్రహ్మరోహిణీ
పతిశశిలాంఛనతంసులతపస్సులు విఘ్నముచేసి తద్వర
ద్వితయము వీటఁబుచ్చితివి విష్ణుహితంబుగ లక్ష్మి యంచు దు
ర్మతివయి యాత్మవల్లభపరాభవదుఃఖముఁ గంటిగా కీఁకన్!

వ. అని పలికి నీయందు దుర్మదకారణంబులైన రాజసతామస గుణంబు లుత్కృష్టంబులై యున్నయవి; దానంజేసి సదస ద్విజ్ఞానంబు పుట్టదు, శుద్ధసాత్త్వికప్రబోధసుధాసారస్యంబు గల్గుదాఁక నీలక్ష్మీగర్వవిభవంబు మాని, యంతస్తేజంబుతోఁ గొన్నిదివ్యవర్షంబులు తపంబు సలుపుము, నీవు వసించిన తపోవనంబు కిసలయకుసుమఫలలలితశుకపికభ్రమరసంకీర్ణం బయ్యును శూన్యంబై, చిత్రరూపంబు కైవసి నుండు; నెప్పుడేని యవ్వనంబు వికాసంబు నొందు, నప్పుడు నీకు శాపావధి యగుఁ, దత్క్షణంబ క్రమ్మఱం దివిజగణ్యం బైన వైభవంబుతో నిజప్రభావసామగ్రి గలిగి యొప్పటి

యట్ల యాపరమేశ్వరుం గూడి యుండఁగలవు. నీకు సహాయ పరిచారికలై శూన్యనిధానాధిదేవతలు ప్రవర్తింతురు. నీకు నిది విష్ణుశాసనం బలంఘనీయంబు, పొమ్మని పలికి, బ్రహ్మదేవునిం గని మీ రిద్దఱు నేకాభిలాషంబునఁ దప మాచరించుట తగదు. నీవు లోకంబు సృజియించుచు స్రష్టృనామధేయుండ వగుము; శివుండు జంతులోకంబుఁ గాలపరిపాకంబున హరించుచు హరుం డగు; విష్ణుండు దాను సర్వంబును రక్షించుచు జగద్రక్షకుం డనుదివ్యనామంబున వెలయం గలవాఁ డని యాజ్ఞాపించి విష్ణుమాయ మాయమయ్యె, న మ్మాయాశాసనంబున నమ్మువ్వురు నట్ల ప్రవర్తించుచున్నవారు, నేను నవ్విధంబున నాఁటనుండియుఁ దపంబు సేయుచున్నదాన,నివ్వనంబును నట్లన నావచ్చినయది మొదలు వికాసరహితంబై యున్నయది, యీకాంత లానిధానాధిదేవతలు,కరుణావిధేయుం డగునప్పరమేశ్వరుం డింక నెన్నఁడు ప్రసాదించునో కాని యిది మదీయవృత్తాంతంబు వినుమని యమ్మాయాలక్ష్మి యాదిలక్ష్మికిం జెప్పుచున్న సమయంబున.

మ. కలపుంస్కోకిల గర్వధూర్వహకుహూకారంబు, కీరాళిసం
కులనాదంబు లెసంగ నవ్వనము చక్షుఃప్రీతి గావించె మం
జు లతా పల్లవ వల్లరీ ఫలరసస్ఫూర్తుల్ ప్రవర్తింప నా
జలజాక్షీనిజదివ్యభాగ్యకలనాసంప్రాప్తి సూచించుచున్. 189

క. ఆవన నవ వికసన ల
క్ష్మీవిభవము చూచి మేలు చేకుఱె నని మా

యావనరుహావాసిని మో
దావహామతి యయ్యె లక్ష్మి యన్నుతి మించన్. 140

శా. 'ఓలోకేశ్వరి! యోజగజ్జనని! యోగాయోగీంద్రవంద్యప్రభా
వాలంకార! భవత్తపోమహిమచేనన్ సార్థంబులో నిప్పుడే
నాళీకేక్షణుఁ డాదిపూరుషుఁడు నీనాథుండు నీ కిచ్చెఁ, దా
నీలక్ష్మిప్రభ యంచు నాగగనవాణీదేవి పల్కెం దగన్. 141

వ. అంత. 142

క. గంధర్వమధురగానము
బంధురదుందుభిరవంబుఁ జెప్పె నాశా
సంధుల మొరయఁగ దక్షిణ
గంధవహము వీచె దివ్యగంధంబులతోన్. 143

చ. సురతరుపుష్పమంజరులసోనలు ముంచె మదాళిబాలరుం
కరణ పయోధరప్రకటగర్జనతాండవితాప్సరోవధూ
త్కర నవకేకిసంఘసముదంచితకిన్నరసిద్ధసాధ్యని
ర్జరఫణిచారణాశ్వముఖచాతకసంచరణాభిరామముల్. 144

క. కోరికలు వెల్లివిరియఁగ
నారదముని కుంచె విసరి నాట్యము సలిపెన్
స్వారాట్ప్రముఖదిశాధిప
వారిజలోచనలు గొలువ వచ్చిరి వేడ్కన్ 145

చ. జలరుహగర్భముఖ్యసురసంఘము గొల్వఁగ విష్ణుమాయ, యు
జ్జ్వలగరుడధ్వజంబు ధృతచామరలాలనదివ్యకామినీ

తిలకనిషేవితంబు నగుదివ్యవిమానముఁ దెచ్చి నిల్పె నా
నెలఁతుకదండ మండితమణిప్రభ లాశల నాక్రమింపఁగన్.

ఆ. ఆవిమానపూజితామరతరుపుష్ప
దివ్యగంధములకుఁ దేటు లెగసె
లక్ష్మి యున్న యాకొలంకుఁ గ్రొవ్విరిదమ్మి
పువ్వుఁదేనెఁ గ్రోలి పొదలి పొదలి. 147

సీ. దండముల్ వెట్టి రాఖండలాది దిగంత
నాయకుల్, ప్రణమిల్లె నాగకులము,
మ్రొక్కిరి గంధర్వమూర్ధాభిషిక్తులు,
ప్రాంజలు లైరి సుపర్వవరులు,
వందనం బొనరించె వాచంయమశ్రేణి,
యానతిచేసె గుహ్యకగణంబు,
అభివంధనముచేసె యక్షనాయకకోటి,
కరములు మోడ్చిరి గరుడపతులు

తే. చారుకరుణాకటాక్షవీక్షావిభూతి
పాలితాశేషభువనకు, బ్రహ్మముఖ్య
దివిజపూజ్యకుఁ, బరమసాత్త్వికమతల్లి
కాదిలక్ష్మికి, నిత్యకల్యాణవతికి. 148

వ. ఆ సమయంబున నమ్మహావిష్ణుమాయ తోయజాసనాదులు విన, దేవీ! నీతపంబు ఫలించె, నీ వల్లభుం డగు విష్ణుండు ప్రసన్నుండై నిజలక్ష్మీతేజంబు నీకు ననుగ్రహించె, నీకు

దివ్యవిమానంబు పుత్తెంచినవాఁడు. విజయంచేయు మని
పలికినఁ దద్వచనప్రమాణంబున, 149

తే. పంచభూతంబులును సముదంచితాభి
జాతనిర్ఘోష మొనరించె సకలదిశల;
దిశలు విశదప్రభలఁ బొందె దివ్యమహిమ
నమ్మహాలక్ష్మి నిజతేజ మాశ్రయింప. 150

క. హరికరుణాసంప్రాప్తిన్
సరసీరుహానయన యపుడు సంతోషరస
స్ఫురణమునఁ జూడ నొప్పెను
ఖరకరరుచిఁ బొదలు నబ్జకలికయుఁ బోలెన్. 151

సీ. శుద్ధసువర్ణంబుసొబగు మించినమేన
బాలసూర్యప్రభల్ ప్రజ్వరిల్లఁ
బార్వణచంద్రబింబముఁ బోలుమోమున
సుప్రసాదశ్రీల సొంపు నెరసె
వెలిదామరల మీఱువెడఁదకన్గొనలపై
నైశ్వర్యకందళు లంకురించె
నమృతపూరముఁబోలె నలరుచిత్తంబునఁ
గరుణారసార్ద్రిత గడలుకొనియె

తే. లలితశుభలక్షణాంఘ్రిపల్లవములందు
దివ్యనారీకిరీటసందీప్తరత్న
దీప్తిపుష్పోపహారముల్ దీటుకొనియెఁ
బతికృపాలబ్ధవిభవ కా పద్మముఖికి. 152

తే. నవనిధానాధిదేవతల్ వివిధకళలఁ
బొంది సేవించి రప్పు డప్పుడ్వుఁబోఁటి
నల వసంతాగమమునఁ బుష్పాభిరామ
లతలు వనలక్ష్మి నవరించులాగు దోఁప. 153

క. ఆమాయాలక్ష్మీమహా
సామర్థ్యము నిజమపోలె సమధికతేజో
ధామం బై త్రైలోక్య
ప్రేమాస్పద మైనఁ, గమల బెగడుచు మదిలోన్. 154

క. నేనే లక్ష్మీకాంతను
నానాథుఁడు విష్ణుఁ డఖిలనలినభవాండ
ప్రాణిగణరక్షకుం డని
మాననమునఁ దలఁతు దివ్యమాన్యవిభూతిన్. 155

ఉ. ఆదికి నాదియైన పరమాత్ముఁడు విష్ణుఁడు నీవిభుండు, నీ
వాదిమలక్ష్మి వంచును గృతానతులై యనిశంబు బ్రహ్మరు
ద్రాదులు వీరు, దివ్యులు నిజాభిమతార్థము లర్థిఁ గోరి న
న్నాదటఁ గొల్వవత్తు రిదియంతయు లోకమెఱుంగునేర్పడన్.

మ. అది మిథ్యాకథనమ్ము చేసి యిదిగో నాదేవతాధీశ్వరుల్
మది నుప్పొంగుచు నీశుభాంగిని మహాలక్ష్మీ! జగన్మాత! మ
మ్ము దయం జూడు మటంచు మ్రొక్కెదరు నా మ్రోలన్
మహాసంభ్రమం! బొదవన్! వేఱొక విష్ణుఁడున్ సిరియు నె
ట్లున్నారొకో మాపయిన్ ? 157

మ. కనిద్రమైనన్ వినిద్రమైన నే నెఱుఁగ నెక్కాలంబు నీపద్మలో
చన దా లక్ష్మిగ నటంచుఁ జెప్పినకథాచ్ఛాయాప్రకారంబుచూ
చిన సత్యంబయి తోఁచుచున్నయది; లక్ష్మిన్నే నమైయున్నదా
న, ననేకక్రియలం దలంప నిది గానన్ రాదు నిక్కంబుగాన్.

క. కలగంటినో! భ్రిమసితినో!
కలవరమో! యింద్రజాలకరపరికలనా
కులతయొ! యివి యన్నియు వృథ
యలవడునే యింత నిక్కమై, యట్లైనన్ ? 159

క. నాలక్ష్మికలనలు మి
థ్యాలీలలు గాని యాలతాతన్విజయ
శ్రీ లన్నియు నిక్కము ల
క్ష్మీలావణ్యప్రభావిశేషము లగుటన్. 160

క. ఇన్నియు నిట్లుండఁగ ని;
మ్మన్నఁగ వేఱొక్క విష్ణుఁ డీసతివరమీ
నున్నాఁడో! నావిభుఁడై
యున్నజగత్కర్త విష్ణుఁడో! భావింపన్. 161

ఉ. ఈనలినాక్షి యాత్మ గుఱియించిన విష్ణుఁడు నావిభుండయో
నేని, జగత్ప్రసిద్ధముగ నిమ్మహనీయవిభూతిసంపదన్
దీని వరించెనేని యిది దివ్యులు గొల్వఁగ నమ్మహాత్ము నిం
పూనఁగఁగూడి లక్ష్మియయియుండిన, నేమగుదాన నేనిఁకన్ ?

మ. నను మీఱి న్నుతి కెక్కునీవనిత నానాదివ్యనారీజనం
బును దద్వల్లభులుం గరంబువినయంబుల్ సేయుచుం గొల్వ,లో

ఘనపద్మాంచలచంద్రికారుచులచే సంపత్కళల్ నింపుచు
న్మనుచున్ లోకములింతయున్నిదమునై నావిష్ణునింగూడినన్.

తే. పెక్కువేలేండ్లు విష్ణునిఁ బ్రేమఁ గూడి
లక్ష్మినై యుంటిఁగాక! యీలక్ష్మిలీల
నిట్లు భువనైకచిత్రమై యెసఁగుమహిమ
కెక్కి యుంటిని గుఱుతుగా నెన్నఁడైన? 164

ఉ. ఇంతయు నేమి గాఁగలదొ యేర్పడఁ జూచెదఁగాక! చిత్రమై
యింతకు వచ్చునట్టిపని యెక్కడఁ బోయెడు నంచు నయ్యుద
న్వంతునిపుత్రిమానసమునం బెగడొందుచుఁ జూడ బ్రోసె నా
శాంతములన్ జయానకము లావెడలక్ష్మివిమానమెక్కఁగన్.

క. కాంచనపంకజ మెక్కెడు
కాంచనకలహంసివోలెఁ గమలాలయ యా
కాంచనపుష్పక మెక్కెన్
గాంచనమయదేహరుచులు గడలుకొనంగన్. 166

— ఆదిలక్ష్మి తేజస్సును మాయాలక్ష్మి హరించుట —

క. ఆమ్మాయిఁ బుష్పక మెక్కుచు
నమ్మాయాలక్ష్మి లక్ష్మి యందలి తేజం
బిమ్ముల హరియించెను లో
కమ్ముల్లను విస్మయంబుగాఁ గనుచుండన్. 167

ఆ. ఉదయభానుదీప్తి యొడిసిన సారంబు
దెరలి యున్న యోషధియును బోలెఁ

గపటలక్ష్మి సహజకాంతి హరింప న
య్యాదిలక్ష్మి విన్ననయ్యె నపుడు. 168

వ. వెండియు నమ్మహాభాగ్యలక్ష్మి, లక్ష్మి కనుంగుఁజెలు లై కూడి యున్న భూకాంతాసరస్వతులఁ జూచి నే నయ్యాదివిష్ణుం గూడి చతుర్దశభువనసామ్రాజ్యంబునుం బ్రీతి పాలించుచు వైకుంఠనగరంబున వివిధోపభోగంబు లనుభవించుచుండుదు, నింక మీరు నాసఖు లై యాదివ్యస్త్రీలు పరిచారిక లై సేవింప నుండవలయు నాయనుజ్ఞఁ గైకొని రం డని వారిద్దఱ నవ్విమానం బెక్కించుకొని బ్రహ్మరుద్రాదిబృందారకసందోహంబులును విష్వక్సేనప్రముఖదండనాయకులును బరివేష్టింప గంధర్వ మధురగానంబులు నప్సరో నృత్తావధానంబులు నాదరించుచు శంఖకాహళభేరీమృదంగపటహవీణానాదంబులు చెలంగఁ ద్రైలోక్యమహోత్సవంబుగా గగనమార్గంబున వైకుంఠపురంబునకుం జనియెఁ, దదనంతరంబ.

తే. అట్లు తేజోవిహీనయై యబ్ధికన్య
నిబిడనిర్వేదదైన్యముల్ నివ్వటిల్ల
నొంటిఁ బడియుండె విగతతారోగ్రతిమిర
జలధరాలీఢయామినీలలనవోలె. 170

క. త్రైలోక్యవినుతసాధ్వికి
శ్రీలక్ష్మికి నీయవస్థ సిద్ధించెఁ బతిన్
మేలమున నెన్నకుంటను;
నేలా గణియింప నింక నితరస్త్రీలన్? 171

మ. చెలులుం దేజమునుం దొలంగిన మహాచింతాపరిక్రాంత యై
పలుమాఱు న్విధిదూఱి యద్భుతభయప్రచ్ఛన్న యై యవ్వలి
న్వల నెవ్వారును లేక యొంటిఁబడి యవ్వామాక్షి పద్మాక్షుని
న్నలుచోట్లం బరికించి కానక మదిన్ శంకించి తా నిట్లనున్.

చ. కటకట! కూర్మి యైనచెలికత్తె లటంచును వీరి నమ్మి నే
నిటువలె నేల వచ్చితి నిజేశ్వరుసంగడిఁ బాసి యొంటి మై
నిట? కిడె నన్ను డించి చని రిందఱు వెంటనె వచ్చి; విష్ణుఁ డె
చ్చటనసియించె నొక్కొ సుమసౌరభసంభృత*కుంజవాటికన్?

వ. అని కొలంకు కెలంకులఁ గలయ నాలోకించి తనవచ్చినత్రోవఁ
గొంతదూరము మరలి వచ్చి యయ్యెడఁ దొల్లి కూచుండి క్రమ్మఱ
కొలంకు డాపలికిం బోయి వీక్షించి వెండియు మగిడి మార్గ
తరుశాఖ లన్వేషించుచు, నిక్కంబుగాఁ బ్రాణేశ్వరుం గానక
శోకంబునం జీకాకుపడుచు నేకడకుం బోవఁ గాల్లురాక
యా కలశసాగరకుమారిక దనమనంబున. 174

సీ. ఆ తపస్విని దివ్య లర్చింప లక్ష్మి నై
యాదివిష్ణునిఁ జెంద నరిగెఁ గడఁక
నాదేవి పిలిచిన ననుఁగు సైదోడు లై
నా సఖుల్ పోయిరి నన్ను విడిచి
యివ్వని ననుఁ గూడి యేతెంచి వంచించి
ప్రాణేశ్వరుఁడు డాఁగె నడవిలోనఁ

* పుష్పవాటికన్—పాఠాంతరము.

దొల్లింటితేజంబు దొఱఁగి విభ్రాంత నై
యొకటియు నెఱుఁగక యున్నదాన

తే. నమ్మహాలక్ష్మి కెనగూడు నాఁడువిష్ణుఁ,
డాత్మభర్తయ కానోపు, నవ్విధమున
సఖులఁ జేకొని యాసాధ్వి చనఁగ నిచట
విభుఁడు కనఁబడకున్న యవ్విధము చూడ. 175

క. నను నీయుగ్రాటవి విడి
ననరు విడిచి పోయె విభుఁడు నిష్ఠురుఁడై; నె
మ్మనమున నిండారెడు తమ
యనురాగము విడిచి రానయస్యలు దామున్. 176

ఉ. దూరమువచ్చితిన్ మిగుల, దుర్గమహాటవి నొంటి డించి యం
భోరుహలోచనుం డరిగె; బోటులు దామును వింతలక్ష్మి నిం
పారఁగఁ గూడి వేడుక దదర్థితదివ్యపదంబు చేరి; రె
వ్వారికిఁ దోడునీడ యగువారు తలంపఁగ నాకు నీయెడన్?

క. పతియాశ చెలులయాశయు
గతజలసేతువు దలంపఁగా, నిఁకఁ దద్వ
ర్జితమతి వైకుంఠపురీ
గతిఁ బోయెదఁ గాక యొంటిఁ గానల వెంటన్. 178

తే. ఎవ్విధంబున నైన నే నివ్వనంబుఁ
బాసి పురిఁ జేరి యుండఁగాఁ బ్రభుఁడు వచ్చు
నపుడు నా పడ్డపాట్లెల్ల నడలు గదురఁ
జెప్పి తనువు విసర్జింతుఁ దప్ప దిట్లు. 179

తే. చోరఁడు నే లేని వైకుంఠపురము భర్త,
యదియుఁ గాదు మహాశూన్య మగుటఁ జేసి;
విన్ననై యున్నదాన నవ్విధమువోలె
నేను నిఁక నంద యుండెద నేకతంబ. 180

వ. అని మోహాతిశయంబున నవ్విష్ణుమాయాసముద్రంబు దరి
యింపంజాలక యాలోకమాత, మిథ్యాలక్ష్మీమహోత్సవ
సంభ్రమంబును, ప్రియసఖీజనంబు వాసి పోవుటయును,
వల్లభుండు వియుక్తుం డగుటయుఁ దన మనంబున కసహ్య
దుఃఖకారణంబు లగుటంజేసి పరితపించి. 181

సీ. దప్పిఁ వచ్చుటయు మార్దవముచే నొర్వక
చరణముల్ పొక్కినఁ బొరలఁబడుచు
వ్రేఁగు పిఱుఁదుల, వీఁగు చన్నుల వడిఁ
దూఁగని నడకలఁ దొట్రువడుచు
ధృతిలేమిఁ గడు నుప్పతిల్లెడు శోకాగ్నిఁ
బొడమ నిట్టూర్పులఁ బొనుఁగువడుచుఁ
దగు సహాయత లేక దైన్యసంభూతాశ్రు
ధారలఁ జన్నులఁ దడుపఁబడుచు

తే. దుష్టమృగ దర్శనంబులఁ దొలఁగఁబడుచు
భ్రమసి మార్గము దప్పి సంభ్రమముపడుచు
నెట్టకేలకు నిబ్భంగి నేఁగుదెంచెఁ
దెలివ వైకుంఠసవిధాబ్ధితీరమునకు. 182

వ. ఇట్లు బహువిధప్రయాణగమనఖేదజనితస్వేదపూరాభిషిక్తంబై సత్త్వంబు సడలిన మేనుదీఁగెతో నల్లనఁ(౧) జనుదెంచి. 188

—•{ వైకుంఠపట్టణవిలాసముఁ జూచి యాశ్చర్యపడి యాదిలక్ష్మి యోజించుట. }•—

ఉ. అచ్చటనుండి చూచెఁ గలశాంబుధికన్యక నాఁటికంటెఁ గ
న్నిచ్చకువచ్చు తత్పురసమీహితలీలలు, సాల చంద్రశా
లోచ్చ్రయరత్నతోరణసమున్నతకేతనహేమకుంభము లే
మెచ్చొదవించుచు న్దిశల మించులు ముంచుచుఁ దేజరిల్లఁగన్.

ఉ. చారుమృదంగభేరిజయశంఖనినాదము లాసికాంఘ్రిమం
జీరఝుళంఝుళధ్వనివిశేషము గానకళామనోజ్ఞవీ
ణారవముం దురంగభటనాగచరద్రథపౌరలోకగం
భీరరవంబునుం జెవికిఁ బెన్కువ చూపెఁ బయోధికన్యకున్.

ఉ. నాలుగువంకలన్ సురలు నమ్రశిరంబులతో నమస్తది
క్కూలవిజృంభమాణజయఘోషముతో హరిపూజనార్థమై
పోలఁగ వచ్చుచున్ మగిడిపోవుచు నుండెడు సందడిం దివిన్
గ్రాలెడు రత్నభూషణపరంపర చిత్ర మొనర్చె లక్ష్మికిన్.

మ. హరిపూజాసమయార్పితాగరుముఖోద్యద్ధూపధూమోత్కరం
బురుసౌధోపరిజాలమార్గములయం దుద్భూతమై వీథులం
బరిసర్పించుచు గంధబంధురపురప్రాంతస్థలోద్యానముం
దరవాతాహతిఁ దూలుచుం బురికిఁ జిత్రశ్రీయొనర్చెం గడున్.

వ. వెండియు ననంతలక్ష్మీవిలాససదనంబై రాశీభూతదివ్యతేజఃపూరంబై యపరిమితమహోత్సవాభిరామంబై యపూర్వ

మణిమాలికాలంకృతంబై దివ్యనారీనరసేవ్యమానంబై వికచ కనకారవిందసుందరంబై త్రిభువనానందకరంబై యొప్పు నా వైకుంఠపుటభేదనంబు చూచి లక్ష్మి వీక్షితహృదయ యై తలయూఁచి నే నివ్విడుపు పాడుచేసి పోయితిఁ గ్రమ్మఱ నింత యైశ్వర్యవంతంబు గావించిన దివ్యప్రభావు లెవ్వరొకో యని యిది జగదేకాశ్చర్యంబు. నే నెలవుకొనియున్ననాఁడు నిట్టి సంపద యెఱుంగ, దీనితెఱం గెఱుంగవలయు ననుచుఁ దన్నికటపరిదేశంబునఁ బరివాళకిసలయచ్ఛేదం బొనర్చుచుఁ బారిజాతకుసుమమంజరులు గోయుచు నమృతసాగరతీర భూములందొట్టినముక్తాఫలంబు లేఱుచు లీలావిహారణంబులఁ బరిభ్రమించుచున్నతీఁగెఁబోండ్లఁ గొందఱ నాలోకించి వారి డాయంబోయి యిట్లనియె. 188

తే. ఏమి సేయుచు నున్నారు? భామలార!
యెంతదడ వాయెఁ బురినుండి యేఁగుదెంచి?
వార్త లే మంద్రు? నగరిలో వనజవాస
యును ముకుందుండు నేలాగు నున్నవారు? 189

వ. అని యయ్యిందిరాదేవి వలికిన నయ్యిందీవరాక్షు లిట్లనిరి.

ఉ. ఎయ్యెడనుండి వచ్చితివె? *యీపురిదానవు కావె, యైతివే
నియ్యెడ మమ్ము నిట్లడుగుదే? మఱివార్తలు మంచివన్నియున్,
నెయ్యముతో జనార్దనుఁడు నేఁడొకనూతనలక్ష్మిఁ దెచ్చినాఁ
డయ్యెలనాఁగ విభ్రమమహత్త్వము లెన్న వశంబె యేరికిన్?

---

*యీపురిదానవొ కావొ—పాఠాం.

ఉ. తొల్లొకలక్ష్మిఁగూడి పతి తోరపు కేలుననుండియుండి, యా
పల్లవపాణిపై విరిసిగి బ్రహ్మముఖుల్ దనుఁ గోరి కొల్వఁగా
నుల్లము సంతసిల్లఁ దన కొప్పఁ దసం బొనరించె నంచు నేఁ
డెల్లజగంబులుం బొగడ నింపులఁ గూడె నవాబ్జమందిరన్.

క. ఆ లక్ష్మితిలకంబు మ
హాలక్షణవతి యటంచు నతిభక్తిఁ బుర
స్త్రీ లర్చించిరి పతితోఁ
జాలఁగ దీవించి భాగ్యసంపద వెలయన్. 193

తే. అమ్మహాదేవి దివ్యాంగనాళి గొల్వ
భూసతీరత్నమును దాను బొత్తుగూడి
ముద్దుఁగోడలు వాగ్దేవి ముద మొనర్ప
నేలు వైకుంఠసామ్రాజ్య మేక హేళి. 194

—♦ మాయాలక్ష్మి వృత్తాంతము విని యాదిలక్ష్మి విచారించుట ♦—

క. ఇవిగో వార్తలు విను మని
యువిదలు తనదండఁ బాసి యుండెడ కరుగన్
నవలక్ష్మిలీలలకున్
ధవుఁడుం బురజనముఁ జేరిమఁ దగిలి రటంచున్. 195

చ. మనమునఁ గుందికుంది పలుమాఱు విశేషవియోగవహ్ని *పై
కొనఁ గడు గ్రమ్మి గ్రమ్మి పటుకోపమహాజ్వరపీడ దట్టమై

---

* తాఁకునఁ—పాఠాం.

మొనసినఁ గంది కంది యతిమోహతమంబునఁ గానదయ్యె న
మ్మనసిజుతల్లి, యవ్విభునిమాయలఁ జిక్కనివార లే రిఁకన్?

వ. అట్లు మాయాలక్ష్మీవిలాసలాలసుండై విభుం డున్నవాఁడ కాఁ దలంచి దృగంచలంబులం గన్నీరు వెడల నిట్టూర్పు నిగిడించి వెండియు నాదివ్యమందిరసౌందర్యంబు సందర్శించి యింక నవ్విభుని ముందటికి నే మని పోవుదానఁ, బోయిలినేని క్రొత్తబిత్తరిం దగిలిన యవ్విలాసి పరిహాసంబు సేయుంగాక నన్ను సమ్మానించునే, దీనికిఁ బరితపింప నేల, తపంబున మెప్పించి కాదె యీసాధ్వి యింత వైభవంబు వడసె, నట్లన యనాథనాథుండును కరుణాసాగరుండును భక్తవత్సలుండును నగు నవ్వైకుంఠవల్లభు నుల్లంబున నారాధించి తదీయతపస్సిద్ధిక్షేత్రంబై పొగ డొందిన యాకొలనిపసిండి కెందమ్మిపువ్వునంద నేనునుం దపంబుచేసి మెచ్చువడసెదం గాక యని నిశ్చయించి మగిడి కొలంకుచేరి కృతస్నానయై తత్కర్ణికాపీఠంబునఁ బద్మాసనబంధంబు దృఢంబు గావించి.

సీ. వేదాంతనూపురాన్వితచరణాంభోజు
హాటకపీతాంబరాభిరాముఁ
గౌస్తుభగ్రైవేయకమనీయకంధరు
శంఖచక్రగదాబ్జచారుబాహు
మకరకుండలవజ్రమణికిరీటవిలాసు
సురభిమాల్యాలేపసుందరాంగుఁ

కుందమందస్మితాంకురలోచనాంచలుఁ
గారుణ్యరససుధాగారహృదయు

తే. హృదయమున విష్ణు నాత్మేశుఁ బదిలపఱిచి
చిదమలానందబంధురసింధులహరి
నోలలాడుచు వసియించె నొక్క కొంత
తడవు శ్రీకాంత యేకాంతతత్త్వనిష్ఠ. 198

క. తోయధితీరవిహారము
మాయాలక్ష్మీవిలాసమయకృత్యములున్
మాయము గావించి విభుం
డాయెడ నొకవింతచంద మందముచేసెన్. 199

క. విను! ధర్మతనయ! కాంచన
వనరుహపీఠాగ్రయోగవర్జితమై య
ల్లనఁ గొంత పొద్దునకుఁ దన
కనుఁదమ్ములు విచ్చి చూచెఁ గడుఁ జిత్రముగాన్. 200

శా. ఆ వైకుంఠమునందు నెప్పటి మహాహర్మ్యంబున న్వేడ్కతో
నావిశ్వంభరునంకపీఠమున నెయ్యం బారఁ గూర్చున్న య
ట్లావారాకరపుత్త్రి యొప్పెఁ; గలగన్న ట్లయ్యె నమ్మాయ, లీ
లావిర్భూతదరస్మితుం డగుచు దైత్యారాతి మోదింపఁగన్.

క. కురిసెం బువ్వుల వానలు
వరుసం దుందుభులు చెలఁగె వైకుంఠమహా
పురి లక్ష్మీనారాయణు
లురులీలల నట్లు గూడి యుండినవేళన్. 202

క. ఈ లక్ష్మీనారాయణ
కేళీమాయావిలాసకీర్తనము యశః
శ్రీ లొసఁగు వినినవారికి
నాలవపురుషార్థసిద్ధి ననుపారంగన్. 203

వ. అని గోవిందశర్మ ధర్మనందనునకుం జెప్పె ననిన విని పరీక్షితుం డటమీఁదటి కథాప్రసంగం బె ట్లుండె నని శుకబ్రహ్మ నడుగుటయు. 204

ఉ. నందకశంఖచక్రనలినప్రతిభాసిత ! నందసుందరీ
నందన! నందనద్రుమహరణప్రియ! గోపవధూనవాస్ర గో
బృందకనత్కదంబవిటపి. వ్రజకేళివిహార! చారుసం
క్రందనచాపదీపితశిఖావళపింఛకిరీటలాంఛనా! 205

క. శ్రీవిభవ! బ్రహ్మవిద్యా
భావిత! బ్రహ్మస్వరూప! పరమపురుష! శ్రీ

గోవింద! నందనందన!

గోవర్ధనధర! ముకుంద! గోకులరమణా! 206

మత్తకోకిల. ధీర శంఖ సుదర్శనాద్భుతదీధితీసయుతాంబరా!
చారుశార్ఙ్గ సురేంద్రకార్ముక సంచరజ్జలదోదయా!
హారిహాటకచేల సాంధ్యమహా స్ఫురద్రజనీముఖా!
మారకోటివిలాస పుష్పసమగ్ర నందనకాననా!

ఇది శ్రీ మదనగోపాల చరణకమల సేవాధురీణ సత్కళాపారీణ
కృష్ణభట్టారకపౌత్ర చింతలపూడి కామయప్రభు సుపుత్ర
సుకవివర్య రాధామాధవయెల్లనార్య ప్రణీతం
బైన విష్ణుమాయానాటకంబునందు
ద్వితీయాశ్వాసము.

శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ

శ్రీరస్తు

విష్ణుమాయానాటకము

తృతీయాశ్వాసము

క. శ్రీరాధా నఖర క్షత
తారేశకళా నిరస్త దర్పక దర్పో
దారాంధకార! జగదా
ధార గుణావాల! నవమదనగోపాలా! 1

తే. అవధరింపుము దేవ! సంయమివరుండు
సకల వేదాంత విద్యా విశారదుండు
శుకమహాయోగి పలికె నుత్సుకత మఱియు
నింపుగా నాపరీక్షిన్నరేంద్రుతోడ. 2

వ. అవ్విధంబున శ్రీమహాలక్ష్మికథఁ జెప్పి గోవిందశర్మ ధర్మ
నందనునకు, బ్రహ్మదేవుండు విష్ణుమాయవలన మోసపోయిన
తెఱంగు విశదంబుగా నెఱిఁగింప సమకట్టె. 3

మ. విను! విశ్వక్షితిపాలమాళివలభీవిస్ఫారరత్నప్రభా
కనదుద్దామపదారవింద! త్రిజగత్కల్యాణచారిత్ర! పాం

దునరేంద్రోత్తమపుత్ర! యీమునిగరిష్ఠుల్ నీవునుంగూడియెం
దునకుం జిత్తముఁ బోవనీక హరియందు న్నిల్పి సంప్రీతితోన్.

వ. అని కొలువు సావధానంబు గావించి.

క. లోకవిహీనం బై జల
మాకాశము మోదియున్న యప్పు డంబుధిపై
నేకాంతంబున హరి పనుఁ
జీకటిఁ బవళించి యుండెఁ జిన్మయలీలన్. 6

తే. అట్లు సకలంబు నణఁచి యేకాంతరూఢ
పరమయోగాభిరతిఁ బరబ్రహ్మ బోధ
నవసుధాధార నానంద మవధరించి
లీల మై నుండఁగాఁ గొంతకాలమునకు. 7

—♦ విష్ణు నాభికమలమునందు బ్రహ్మ యుద్భవించుట ♦—

మ. హరినాభీ జలజాతరేణు పరమాణ్వంశంబునన్ బ్రహ్మ భా
స్వరహేమద్యుతిఁబుట్టె నాత్మకృతపూర్వప్రాజ్యపుణ్యోదయ
స్ఫురణ స్తన్మహనీయమాయ కెనయూచు న్సాధనం బై జగ
త్పరినిర్మాణవిధేయత న్నిగమతత్త్వజ్ఞాననిష్ఠేపమై. 8

తే. ఇవ్విధమ్మున జనియించి య వ్విధాత
బిసమహోన్నతకర్ణికాపీఠ మెక్కి
దేవదేవునిముఖమున దృష్టి నిలిపి
ప్రస్తుతించెఁ గరాంజలిబంధ మొప్ప. 9

శా. ఓనారాయణ! యోజగద్వరద! యో యోగీంద్ర! యోగీం
ద్రవ్రాత ధ్యానధ్యేయఫలాత్మ! యోజనక! యోమాయామ్నా

యతత్త్వార్థవి,జ్ఞానానందనివాస! యోపరమ! యోనశ్వర!
యోమోక్షల,క్ష్మీనిత్యాశ్రయ! యాశ్రితుండ నను నెమ్మిం
జూడవే సత్కృపన్! 10

క. నీయందె పొడముచుండును
నీయందె యడంగుచుండు నిఖిలము, వేదాం
తాయత్త తత్త్వవిద్యా
శ్రేయోనిధి వరయ నీవ చిన్మయపురుషా! 11

క. నీకంటె నితర దైవము
లేకుండుట కంబరావలీధృత మోర
త్నాకరములు సాక్షులు జగ
దేకాధిపకీర్తి నీక యొసఁగు మహాత్మా! 12

శా. సర్వాత్ముండవు సర్వలోకఘటనాచాతుర్యధీవర్తివిన్
సర్వవ్యాపివి సర్వపూర్ణరుచివిన్ సర్వైకసేవ్యుండవున్
సర్వోత్కృష్టమహాప్రభావుఁడవు నిన్నన్నీవ యున్నాటకున్
'సర్వంవిష్ణుమయంజగ' త్తనెడిశాస్త్రంబుల్ ప్రమాణంబులౌ.

సీ. బయలు నీయందు సంభవ మైనకతమునఁ
దోయజేక్షణ! యనంతుండ వైతి,
పృథివి నీవు సముద్ధరించినకతమున
దానవదమన! భూధరుఁడ వైతి,
వుదకస్వరూపవై యుండెడుకతమున
నుతకీర్తి! నారాయణుండ వైతి,

వఖిల తేజంబు నీయందున్న కతమున
సర్వేశ ! బ్రహ్మతేజంబ వైతి,

తే. వోలిఁ బ్రాణానిలంబ వై యున్నకతనఁ
బుండరీకాక్ష ! సర్వాత్మకుండ వైతి !
ప్రకృతిరక్షావిచక్షణ! పరమపురుష !
నిరుపమానంద ! సర్వంబు నీవ తలఁప. 14

తే. పంచభూతాత్మకంబు లై పద్మజాండ
మండలంబులు నీమహామాయయందు
నుద్భవించుచు డిందుచు నుండు సలిల
పూరమున బుద్బుదంబులుఁ బోలె నంద్రు. 15

సీ. నీవచఃకలనలు నిగమాదివిద్యలు,
జగములు నీయింద్రజాలలీల,
ద్వాదశాదిత్యులు, దహనుండు, శశి, ప్రజా
పతులు, రుద్రులు, సురల్, వవననసువు
లాదిగాఁ గల దివ్యు లందఱు సృష్టిబీ
జాత్మకు లగుచు నీయంద పొడము
చుంద్రు, నాశముఁ బొందుచుం; బ్రచ్యుతఖ్యాతి
నీయంద వర్తించు నిక్కువంబు

తే. కాలచక్రంబు నీకేళికల్పనంబు
పరమకూటస్థుఁడవు పరబ్రహ్మతేజ
మై వెలింగెడు తత్త్వంబు నరయ నీవ
యంతయును బరమాత్మ నీ వరసి చూడ. 16

—•{ బ్రహ్మకు విష్ణుమూర్తి ప్రత్యక్షమై సృష్టిసాధనములఁ బ్రసాదించుట. }•—

వ. అని బహు ప్రకారంబులఁ బ్రశంసించు విరించికిఁ బ్రసన్నుం
డై వెన్నుండు జగంబులు నిర్మించుతలంపున ననేకవిద్యా
రహస్యంబు లుపదేశించి సృష్టిరచనాచాతుర్యంబును వాక్సి
ద్ధియుఁ గామరూపకామసంచార ప్రభావంబులు ననుగ్ర
హించి తద్వచనానురూపంబుగ మాయ సంఘటించి యంత
ర్హితుం డయ్యెఁ; దదనంతరంబ. 17

క. హరి నిర్దిష్ట వివేక
స్ఫురణంబున గోచరించె భువనవిరచనా
పరిబోధము బ్రహ్మకుఁ ద
ద్గురువిద్యావిభవ మాత్మఁ గొనసాగంగన్. 18

వ. ఇట్లు ప్రబుద్ధుండై విద్యానాథుండు. 19

క. కోటీరదివ్య తేజము
దీటుకొనం జేసి యాత్మతేజోంశమునన్
హాటకమయాండ మొక్కటి
పాటించి యొనర్చి నీటిపైఁ దేలించెన్. 20

క. లోపల బయలై బరిణియ
రూపునఁ గర్పరము నాఁగ రూఢం బగుచున్
వ్యాపింపఁ దొడఁగె నంబుధి
లోపల నది పరపు లేక లోలోర్ములమై. 21

క. అంతర్గతుఁడై యపుడు త
దంతరమున నిలిపెఁ జవల ననిలంబు, నభ
స్స్వంతువలన నగ్ని, శిఖా
వంతువలన జలము, కుశమువలనఁ బృథివియున్. 22

క. పై సప్తావరణంబులు
భాసిల్లఁగఁ జేసె నవల పవమాన పయో
భూ సురవర్గాదులచే
నా సరసిజసంభవుఁడు తదండంబునకున్. 28

వ. ఇట్లు సృజియించి సకల భువనధురంధర యగు నివ్వసుంధరం దిరంబుగాఁ దద్బ్రహ్మాండంబుక్రిందికర్పరంబున నాలుగంచులు మోవ హత్తించి, బహుకోటియోజన విస్తీర్ణం బగు నందుఁ గొంతభాగంబుఁ గడపలచేసి, నట్టనడుమ నాలవాలంబుచందంబుగాఁ జక్రవాళంబు నిలిపి, తన్మధ్యప్రదేశంబున మేరుశైలంబు సుస్థాపించి, వెండియు, వెండికొండ మొదలైన కొండలు పెక్కులుగల్పించి, దిశాష్టకం బేర్పరించి యయ్యష్టదిక్కోణంబుల నైరావతాది వేదండాష్టకంబుఁ బ్రతిష్ఠించి యంతర్ద్వీపంబులతో నుదన్వంతంబులు సంతరించి యివ్విధంబునం బదిలం బైనమహీమండలంబు మొదలుగా నధోభువనంబు లేడును నిర్మించి. 24

క. పదునాలుగు లోకంబులు
సదనున వెలిఁగింప వేయు యంశువులకు నా

స్పదముగఁ ద్రిగుణాత్మకుఁ బెం
పొదవఁగఁ బుట్టించె నినుని నురుతేజమునన్. 25

తే. క్రిందిభువనంబు లేడింటి నంది వెలుఁగ
మీఁది భువనంబు లేడింటి నూఁది వెలుఁగ
వేయివెలుఁగుల సూర్యనారాయణుండు
చక్రవాళాద్రిపై మింటఁ జాగుచుండె. 26

క. అవధిగిరిమధ్యభూమిన
రవిమండల దివ్యదీప్తి రంజన; మనలం
దు విజృంభింపదు; తిమిరం
బవిరళమై యుండుఁ గజ్జలాకారమునన్. 27

తే. మేదినీకాంతముత్యాలమేలుకట్టు
మాడ్కిఁ జూపట్టునక్షత్రమండలంబు
గగనమున నిల్పి వెండియుఁ దగినచోట్లఁ
బెక్కు దివ్యాలయములు దీపింపఁజేసి.

క. ఈరేడులోకములఁ బరి
పూరితముగ జంతుచయముఁ బుట్టించె సురేం
ద్రారి నర పన్నగాదిక
మారూఢిగ నుచితకులగుణాకారములన్. 29

మ. తగులోకంబులఁ దద్విశేషవిహితస్థానంబులుం, దత్కులా
నుగుణవ్యాప్తులు జంతుసంతతులకున్ రూపించి,తన్నాశమున్
మగుడంబుట్టువుఁబృథ్విలోఁగలుగసంభావించెఁ గాలంబుతోఁ;
దెగుఁ దత్కాల మహర్నిశాబ్దగతి నాదిత్యప్రచారంబులన్.

క. అన్నిటికి నూర్ధ్వలోకం
బన్నలువకు నిలయ మయ్యె, హరియును మాయా
భ్యున్నత తేజోమూర్తుల
వన్నగ విహరించెఁ బెక్కు- వసతులయందున్. 31

క. హరియంశభేద మగు శం
కరుఁ డాత్మారాముఁ డగుచుఁ గైలాసమహా
గిరిశృంగాగ్రమునందుం
బరమచిదానందకేళివదమున నుండెన్. 32

సీ. మనువు, లింద్రాదిదిఙ్మండలాధీశ్వరు,
లాశ్వినేయులు, రుద్రు, లమరవరులు,
వసువులు, మునులు, రాక్షసులు, గంధర్వులు,
మానవుల్, మొదలైన జ్ఞానవిదులు
ఖగ మృగ పశు కీటకప్రాణు లైన య
ల్పజ్ఞానజీవులు, పర్వతావ
నీజాత గుల్మలతాజాతు లైన య
జ్ఞానిగణంబులు సంక్రమింప
తే. విష్ణుమాయా పరిభ్రమ ద్వివుల కాల
చక్ర విభ్రాంత మగుచుండె సకల జగము
బహుళ బహువిధ సంపత్ప్రభావ విలస
నముల నభివృద్ధిఁ బొందుచు నరవరేణ్య ! 33

వ. ఇవ్విధంబునఁ బ్రభవించిన నిఖిల ప్రాణిగణంబులును సత్త్వ

రజస్తమో గుణసంజాత శమ దయాహంకార దుర్మానమోహ
మాత్సర్యాదుల ననుసరించుచుఁ బ్రవర్తించుచుండు. 34

చ. తముఁ గడుముంచుకొన్న పటుతామసరాజసవృత్తిఁ బూనువా
రమిత మహోగ్రహాస్ఫురదహంకరణాదులఁ బాపకారులై
శమకరుణాప్రమోదములు చాలక వైష్ణవమాయచేత దు
ర్దమభవపంకమగ్నులయి క్రాలుదు రత్కటదుఃఖమగ్నతిన్.

చ. సుమహిత సాత్త్వికోదయ విశుద్ధమతు ల్వినయప్రకాశితో
త్తమకరుణాశమంబులు నుదార వివేకముఁ గల్గి మోహసం
తమస విదూరులై హరిపదస్థిర చిన్మయసౌఖ్యలీలలం
బ్రమదము నొందుచుందురు బహుభంగుల సత్పురుషుల్
నుతింపఁగన్. 36

క. కావున రాజసతామస
భావంబులఁ బొరలఁబడక పటుసాత్త్వికసం
భావితులై సత్పురుషులు
సేవింపఁగ మెలఁగుదురు విశేషవిధిజ్ఞుల్. 37

— బ్రహ్మదేవుఁడు రాజసగుణముచే గర్వించుట. —

క. రాజసగుణ కలితుండై
రాజీవభవుం డహంకరణ పరిణతుఁడై
తేజముఁ జూపుచుఁ ద్రిభువన
పూజితుఁడై పాత్రిభవంబు పొదలఁగ నుండెన్. 38

వ. ఇవ్విధంబున మహారాజసంబున లోకేశ్వరత్వం బవలంబించి,

శా. తానే బ్రహ్మను, బద్మజాండము స్వజాతంబౌటఁ దానొక్కఁడే
కా నన్యం బిఁక నొండు లే దనుచు సంకల్పించి యాస్రష్ట దు
ర్మాన శ్రీ నసలారె వైష్ణవమహామాయాకృతాజ్ఞానసాం
ద్రానీకంబు లనేకముల్ మఱియు నప్పు డచ్చోట్ల వర్తింపఁగన్.

క. ఆ పరమేశ్వరు మాయం
రూపంబు జగంబు, తదనురూపంబుగ ను
ద్దీపించితిఁ దా ననక, త
దాపిహిత నిజ ప్రబోధుఁడై విధి మఱియున్. 40

వ. ఒక్కనాఁడు సత్యలోకంబునందు నెనమండ్రు బ్రహ్మలును, మహామునులును, మనువులుఁ, బురందరాది బృందారక సందోహంబులును, యక్ష రాక్షస గరుడ గంధర్వ కిన్నర కింపురుష సిద్ధ విద్యాధ రాప్సరోవ్రాతంబులును, జంద్ర సూర్యగ్రహ తారకా సరిత్సాగర పర్వతాదులుం *బ్రవేశించి బహువిధ సేవాయత్తంబులగు చిత్తంబుల మొత్తంబులై కొలువ నలువ గొలువునఁ గూర్చుండె. 41

సీ. నాలుగువిధముల లీలాభినయములు
పొసఁగ నాడెడు నప్సరసలయొఱపు
సప్తస్వరములు మించ విపంచికలు మీటి
పాడెడు గంధర్వపతులమేలు
వేణునాదామృతవీచీపరంపర
నలరించు నాగకన్యకలచెలువు

---

* బరివేష్టించి.—పాఠాం.

లలితేంద్రజాల విద్యలు చూపి మెప్పించు
సిద్ధవిద్యాధరశ్రేణి సేర్పు
తే. "బ్రహ్మపురుష! సరస్వతీప్రాణనాథ!
సర్వలోకేశ! సర్వరక్షాధురీణ!"
యనుచు వినుతించు దివ్యజయారవంబు
నవధరించుచు సంతోష మావహించి. 42

క. తన సృజియించిన యింద్రా
ద్యనిమిషముఖదివ్యకోటు లవ్విధమునఁ దన్
గొనియాడుచుఁ బూజింపన్
ఘనరాజసమహిమ వెలయఁగా నిట్లనియెన్. 43

క. నాయంత వేల్పు గలఁడే
యేయెడల జగత్ప్రపంచ మిట్లొనరింపన్?
బాయక నడుపఁగఁ? ద్రిభువన
నాయకుఁడై బ్రహ్మపదమునన్ వర్తింపన్? 44

క. నాకంటె నధికుఁ డొక్కఁడు
లోకంబుల లేఁడు దివిజలోకములోనన్;
నాకల్పించినయవె ము
ల్లోకంబులు! నధికుఁ డింకులోనం గలఁడే? 45

ఉ. తానె త్రిలోకనాయకుఁడఁ దానె జగద్రచనాధురీణుఁడం
దానె జగత్ప్రపోషకుఁడఁ దానె జగత్పరిహర్తఁ బూజ్యుఁడం
దానె సమస్తదివ్యులకుఁ దాపసులార! మునీంద్రులార! యో
దానవులార! న న్నపరదైవముగా భజియించుచుండుఁడీ! 46

క. పదునాలుగు లోకంబుల
పదముల మిముఁ బుచ్చునట్టి పరిభువను నే నై
యొదవుచు సకలైశ్వర్య
ప్రదుఁడు స్వతంత్రుండు నాఁగఁ బరఁగుదు నెందున్. 47

ఆ. ఇంద్రియముల గెల్చి యొక్కటి నిర్విఘ్న
యోగచిత్సుఖామృతోపయోగి
నై యదృచ్ఛఁ దిరుగునట్టి యోగీంద్రుండు
నరయ నేన కాని యొరుఁడు లేఁడు. 48

క. ఎన్నఁడు నొండు దలంపక
నన్న పరబ్రహ్మ మని మనంబున నిడి యు
త్పన్నతిఁ దపములు సేయుచు
నున్న విశేషులకుఁ గలుగు నురుశుభపదముల్.

చ. అని తనుఁ దాన చెప్పుకొని హర్షసుధారసవారిరాశిలో
ననయము నోలలాడు హృదయంబునఁ దా ససలారుచున్న యా
వనరుహసంభవున్ భువనవందితు నుత్కట దివ్యతేజునిం
గనుఁగొని ప్రాంజలు ల్దనరఁగా సురలోలి నుతించి రొక్కటన్.

—•{ బ్రహ్మలు, దేవతలు మొదలయినవారు బ్రహ్మను స్తోత్రము సేయుట. }•—

సీ. బ్రహ్మ లయ్యోనమంద్రుఁడు పరమార్థ మని పల్క,
రిదమిత్థ మనియె మహాసేంద్రగణము,
లింద్రాదిదిక్పాలు రీలాగె యౌ నని,
రాదిత్యు లిది నిశ్చయంబ యనిరి,

తప్ప దీమా టని దానవు లాడిరి,
కల్ల గా దనియె యక్షవ్రజంబు,
సత్యోక్తి యనిరి నిర్జరసమూహంబులు,
గంధర్వపతులు నిక్కంబ యనిరి,

తే. యాశ్వినేయులు, మనువులు నాదియైన
వారు నట్లనె యనిరి దుర్వారఫణితిఁ
దన్మహాఘోష మపుడు మంథానమథన
సమయసాగర ఘుమఘుమస్వనము గెలిచె. 51

క. వనజభవు నంతవాఁడును
ఘనవైష్ణవమాయ కోలఁది గాఁ డటన్నం
గనునే ముంతెఁడు నీళ్లను
మునుఁగుచుఁ గాటఱపు లఱచు మూర్ఛం బొందున్? 52

—♦ మార్కండేయ మహాముని బ్రహ్మ నాక్షేపించి పలుకుట ♦—

వ. ఇవ్విధంబున విధాత జగదేకాధిపత్యంబు వహించి యాత్మస్తుతి చేసికొనిన నాలించి సింహగర్జనుం బ్రతిధ్వను లిచ్చు గిరి మహాగర్భంబులుం బోలె తదనురూపంబుగఁ గంఠశోషణంబుగా నుద్ఘోషించుచు నవ్విరించిం బ్రస్తుతించు విజ్ఞానవిహీనుల దేవదానవాది దివ్యయోనులం జూచి సహింపక లేచి మార్కండేయమహామునీంద్రుఁడిడు బ్రహ్మదండంబునుం బోనిదోర్దండం బెత్తి యండజుం గలయ వారించి ప్రజాపతి నవలోకించి. 53

ఉ. వేదపురాణశాస్త్రముఖవిద్యలు మూర్తి వహించి వచ్చి తాన్
సాదరతం బ్రమాణముగ నన్న క్రియం బరమాద్భుతంబుగా
నాదిమునీంద్రముఖ్యుఁడు చిరాయురుపేతుఁడు పూని వచ్చి సం
భోద గభీరనాదమున మోహనగీతుని నబ్జజాతునిన్. 55

మ. పరదైవంబును, బ్రహ్మయోగియుఁ, బరబ్రహ్మాత్మక తేజంబునుం,
బురుషుండున్, భువనైకనాయకుఁడు, నంభోజాననాండావలీ
పరినిర్మాతయు, హర్తయు, న్వరదుఁడున్ భావింప విష్ణుండ నై
పరఁగ, న్నిన్నునుతించుకొన్న, సుమతుల్ప్రాపింతురే పద్మజా!

ఆ. నిన్న గాదు మొన్న నీవు జనించుట
నిపుడె సంభవించె నీజగంబు!
నపుడె ప్రభుఁడ వైతి! వకట! మహాప్రభుం
డైన విష్ణుఁ డుంట యరయ వైతి! 57

క. నారాయణ నాభీసర
సీరుహమున సుకృతఫలవిశేషంబునఁ బెం
పారఁగఁ బుట్టుట మఱచితి
వే! రాజస మేల మఱవనీ దెట్లు నన్! 58

వ. పూర్వజన్మ సహస్రంబుల నేలాగుతపంబు లాచరించితివో తత్ఫల పరిపాకంబునఁ బరమపురుషుం డైన పద్మనాభుని నాభీపద్మంబున నుద్భవించి పద్మసంభవుం డను ప్రధాన నామంబు వహించి యమ్మహాత్ముని ప్రసాదంబున జగంబును సృజియించి స్రష్ట వై పర్యాయంబున బ్రహ్మాదినామంబులఁ బ్రసిద్ధుండ వై ప్రభావంబు వడసితివి. ఈమేలు ప్రకటించిన

బ్రహ్మణ్యదైవంబును, బ్రహ్మాండనాయకుండును, బ్రహ్మ యోగియుఁ, బరబ్రహ్మంబును, బ్రకృతిపురుషాధీశ్వరుండు ను, గాలాతీతుండును, గాలస్వరూపుండును, నిత్యుండును, సర్వవ్యాపకుండును, సకలజగత్సృష్టి కర్మకుండును, విష్ణుండ యని తగిన ధీమంతులఁ బ్రబోధించుచు, స్వామిభృత్య న్యాయంబున నద్దేవుని సేవించుచుండక, దురభిమానంబున నజ్ఞుండ వై నేనే దైవంబ నని యూఁదుకొనుట దగునే యని పలికిన, నప్పలుకులు క్రోధోద్బోధకంబులైన నిర్వే దించి (విరించి) యాసత్యసంధునితో నిట్లనియె. 59

—♦ బ్రహ్మ విష్ణుమూర్తి నాక్షేపించుట ♦—

చ. హరి పరమాత్ముఁడుం బ్రభుఁడు నయ్యెనయేని జగంబు
తాన పెంపరుదుగ సంఘటింపవల దంటివె? నావలె సర్వ
పూజ్యమై। పరఁగెడు బ్రహ్మపట్టమున భాసిలుచున్ సక
లైకసేవ్యుఁడై। యురువిభవాన్వితుం డగుచు నుండక యూ
రకయుండ నేఁటికిన్? 60

ఆ. అతనినాభియందు నవతరించిన మాత్రి
సంయమీంద్ర! పౌరుషంబు చెడెనె?
స్థాన మొకటి లేక జనియించునే యెద్ది*
యైన? దాని కేమి? యవల వినుము! 61

సీ. ఉదయింపఁడే సూర్యుఁ డుదయాద్రి? నుదయాద్రి
కంటెఁ ‡ దేజస్వియై కానఁబడఁడె?

---

* ఎట్టిదైన—పాఠాం. ‡ తేజంబుగా—పాఠాం.

పరిభవింపఁడే వహ్ని పాదపంబునఁ? బాద
పముకంటెఁ బరిభవాస్పదము గాఁడె?
యంకురింపదె ముత్తియము చిప్పఁ? నాచిప్ప
కంటె సత్కాంతిసంగతము గాదె?
యుద్భవింపదె ఫల మొక్కొగిఁ బుష్పమునఁ? బుష్ప
మునకంటె నుపయోగ్య మనఁగఁబడదె?
తే. జనన మందదె కర్పూర మనఁటి? ననఁటి
కంటె నిఖిలైకయోగ్యమై గడలుకొనదె?
యట్ల యేనును హరియందు నవతరించి
యంతకంటెను బూజ్యుండ నైతి వినుము! 62
క. నే జనియించినకతమున
నీజగములు గలిగెఁ గాక! యిన్నాళ్ల య్యం
భోజాతుఁడు సృజియింపఁ బరి
యోజకుఁ డగునేని యూరకుండునె చెపుమా! 63
క. నాకల్పించిన లోకము
గాక జనార్దనుఁడు వేఱె కల్పించిన యా
లోకము గల్గినఁ జెప్పుము
నీకన్నది గలిగె నేని నిఖిలము నెఱుఁగన్! 64
ఉ. ఈమును లీమరుద్గణము లీదనుజుల్ విని యూరకుండఁగా,
నే మని మించి పల్కితిటు లీసభలోపలఁ బద్మనాభుపైఁ
బ్రేమవహించి నాకు నొకపిన్నతనంబుగ నీవు పెద్దవై?
యామొయి నీకుబంటితెలి విక్కడ నేరికి లేకపోయెనే? 65

ఉ. "ఆరయ లోకనాథుఁడు! సురాసురపూజ్యుఁడు! కర్త! యీ
విధిం। జేరికి నైన నగోనక చెల్లునె యీ క్రియ దేవకోటిలో
నూరక నోటికొచ్చినన దురుక్తులు పల్కఁగ ?" నంచు నుం
డఁగా। నేరక ధిక్కరించితివి! నిన్నిఁక నే మన? వృద్ధతాపసా!

ఆ. అనిన మందహాస మాదంద రోచులఁ
జంద్రికామయూఖసదృశ మగుచు,
రత్నదర్పణాభిరామసముద్దామ
మృదుకపోలరుచికి మెఱుఁగు గాఁగ. 67

మ. అరోఁకదగ్రరుచిప్రకాశుఁడు ప్రభావాఢ్యుండు వేదార్థసం
పర్కప్రస్ఫుటసత్యవాక్యుఁడు మహాప్రామాణికశ్రేష్ఠుఁ డా
మార్కండేయమహామునీశ్వరుఁడు పద్మప్రోద్భవు, న్మాథ తా
కార్కశ్యం బెడలింపఁ గోరి, పలికెన్ గంభీరవాక్ప్రౌఢిమన్.

—♦ మార్కండేయుండు బ్రహ్మతో విష్ణుప్రభావమునుగూర్చి చెప్పుట ♦—

తే. హస్తిమశకాంతరము సహస్రాంతరంబు
విష్ణునకు నీకు, నిట్లు భావింపలేక
పలికితివి; నీవు, నీబ్రహ్మపదము నెంత
యతని దాసానుదాసుని ప్రతికి రావు. 69

ఉ. అక్కట! కన్నులారఁ గనినైన నెఱుంగవు, రాజసంబు పెం
పెక్కఁగ, వేద మేది నుతియించెడుఁ జూడవె ? తద్రహస్య
మున్। న్యక్కృత మయ్యె నీకతన నల్పవిచారుఁడ వౌటఁ

జేసి, నీ! వెక్కడ? విష్ణుఁ డెక్కడ? సహింతురె యార్యు లన
ర్హంపువాక్యముల్? 70

క. ఎన్న నినుబోఁటి బ్రహ్మలు
వెన్నునినాభీసరోజ వివరమునం దు
త్పన్ను లయి పద్మజాండము
లెన్నినొ సృజించుచుందు రీచందమునన్. 71

క. నా సంభవించినది యొక
లీసందునఁ జనిరి బ్రహ్మ లిరువురు విను! ప
ద్మాసన! తద్భువనద్వయ
మాసరసిజనాభమూర్తియందున డిందెన్. 72

వ. చిన్మయమూర్తి యగు నమ్మహాపురుషునియందుఁ బ్రాణి
గణసంకీర్ణంబు లగు బ్రహ్మాండంబులు సర్వతోముఖంబులు
తండోపతండంబులై యొండుకొని జంతుజాలంబులుంబోలె
నావిర్భవించుచుం గాలపరిపాకంబున భగ్నంబులై పోవు
చుండుఁ, గొన్ని బ్రహ్మాండంబులు గగనంబున నక్షత్రంబు
లుంబోలె దృశ్యాదృశ్యంబులై యుండు, నొక్కవేళ నమ్మహా
మాయానాటకుండు తనమాయవలన లోకంబులకుఁ బ్రళయ
దశలు గల్పించి వినోదలీలకై నినుబోఁటి బ్రహ్మలం
బెక్కండ్రిం బుట్టించి, (వారు), పడుచులు బొమ్మరిండ్లు
గట్టుకొని యాడునట్లు, తనప్రమోాల *నిటువంటి జగంబులు

* నిలువ నీవంటి—పాఠాం.

పన్నుకొని యాడుచున్న, వారిలో నొక్కండై తిరుగు
చుండు నతనిదివ్యప్రభావంబు లనేకవిధవిచిత్రకారణంబులు.

క. తన కపటకృత్య మఖిలము
ననక, జనుల్ బ్రహ్మసృష్టి యని భ్రమయుటకై
నినుఁ గని నీచే జగములు
జనియింపఁగఁజేసె హరి; విచారింపు! తగన్. 74

ఆ. విష్ణుమాయ గాఁగ వివరింపుదురు మహా
సూక్ష్మమతులు జగము; స్థూలమతులు
బ్రహ్మసృష్టి గాఁగ భావింతురు; కొంద ఱె
ద్దియును నెఱుకపడక తిరుగుచుంద్రు. 75

ఆ. హరికి, సృష్టికర్త వై జనించుటఁజేసి
యధిక దివ్యతేజ మడరె నీకు
నస్మదాది దివిజు లర్చింప వెలసితి
వింతవట్టు చాలదే? మహాత్మ!

—◆ { వటపత్త్రశయనుఁడైన విష్ణుమూర్తికి మార్కండేయు నకును జరిగిన సంభాషణము. } ◆—

వ. ఇంక నొక్కరహస్యంబు వినుము. 77

తే. నీవు పుట్టకమున్న మున్నీటిమీఁద
బాలవట పల్లవంబున బాలమూర్తి
నొంటిఁ బవళించి హరి దివ్యయోగలీలఁ
దన్నుఁ దా నాత్మ భావించు చున్నవేళ. 78

సీ. నే నొక్క-రుండ మున్నీటిలోఁ దో డెవ్వ
రును లేక చీకాకు గొనుచు నీట
నీఁదుచు మునుఁగుచు నెగయుచు గగ్గోలు
పడి పోరటిల్లుచు బ్రమసి విభుని
శివుని సంతతముఁ బూజింతు, నా దేవుఁ డె
య్యెడ డాఁగియున్నాఁడొ యింక నెట్లు?
సచరాచరంబులై జగములు పొలిసిన,
యీవేళ నాకు దిక్కెవ్వ రిందు?
తే. నెచట నా దేవుఁ గనుఁగొందు? నేని నేయు
వాఁడ నని కుమ్మరుచు నొక్కవలన, మాయ
నట్లు శైశవలీలావిహారరసిక
మానసంబు చిదానంద మందిరముగ. 79
సీ. పరితస్స్ఫురత్ప్రభోత్కరరత్నమునుబోలెఁ
గ్రొమ్ముంగుఁలు గింకిగొనెడువాని
నీటఁ దోఁగుచు నిగనిగ మను చిగుగు ను
త్త్రాకు పానుపున సొంపారువాని
మంజీరమేఖలామణిమయ గ్రైవేయ
మకరకుండలదీప్తి మలయువాని
వెలిదమ్మిరేకుచూపులఁ జిన్నినవ్వుల
లేఁతవెన్నెలఁ బుక్కిలించువాని
తే. బాలుఁ డయ్యును బ్రౌఢితోఁ బరఁగువాని
గోచరించియు బ్రహ్మమై తోఁచువాని

సృష్టి లీలాత్మకుండయి చెలఁగువాని
విపుల మాయాచరిష్ణు నవిష్ణుఁ గంటి. 80

వ. కని జగత్ప్రళయంబై మిన్ను మోచియున్న యిమ్మున్నీటి మీఁదఁ దేలియాడు మద్దిగద్దఱి బాలుం డెవ్వఁడో యాశ్చర్యంబై యున్నది! కపటబాలుండై వర్తించు నొక్క దివ్యపురుషుండుగాఁబోలు! నితనిచందంబుఁ గంద మని డాయంబోయి "సకలశూన్యంబైన చీఁకటిం గవిసియున్న పెంబైటి నీటిమీఁద నొక్కరుండవు వెఱపులేక యున్నవాఁడ వన్నా! నీ వెక్కడి పిన్నపాపఁడవు? నీవిధం బెఱింగించి నన్ను నూఱడింపుము. చేరుగడ లేక యున్నవాఁడఁ, జంద్రశేఖరుం డెచ్చట నున్నవాఁడు, నీ వెఱుంగుదువే?" యనిన నిందులో నున్నవాఁడు పోయి చూడు మని నోరు దెఱచిన నేను గిరిగుహా గర్భంబునుంబోని తదభ్యంతరంబు ప్రవేశించి యందుఁ జంద్ర సూర్య గ్రహ నక్షత్ర సరిత్సాగర పర్వత వన పవన దహన విలసితంబులును, బ్రహ్మాది దేవ దానవ మానవ ప్రభృతి జంతుకోటి సమ్మర్దంబులును, మహోత్సవాడంబరాభిరామంబులు నగు చతుర్దశభువనంబులు గాన వచ్చిన విస్మయం బంది కామసంచారంబున సకలంబును గలయఁ గ్రిమ్మరి యొక్కచోటఁ గైలాసవాసుం డగు నిందుధరుని సందర్శించి యారాధించి తత్ప్రసాదంబు వడసి, యచట నుండక వెండియుఁ గొంతతడవునకుఁ దద్వదన ద్వారంబున మగిడి వెడలి చూచునప్పు డప్పుండరీకాక్షుండు

వైకుంఠ దివ్యభవనశేషపర్యంకంబున లక్ష్మీసమేతుం డై దివ్యాంబరాభరణగంధమాల్యాలంకృతుండును శంఖ చక్ర గదా పద్మ శోభితుండును మధురమందస్మిత సుధాధారాభి షిక్తలోచనుండును నగుచు నానందించుచున్నలాగు కన్నులకు వెక్కసంబుగాఁ జూచి నలుదిక్కులు ప్రతీక్షించు నప్పుడు నీవు గల్పించిన యీప్రపంచంబు గానవచ్చిన నచ్చెరువంది, యాపరమానందస్వరూపంబునకు నభివందన సహస్రంబులు సమర్పించి, యుదంచితరోమాంచ కంచుకిత దేహుండ నై యానందాశ్రు కణంబు లురలం గరంబులు మోడ్చి. 81

క. ఓ దివ్యపురుష! యో కరు
ణోదధి! యో దేవదేవ! యో జనక! భవ
త్పాదారాధన యోగ్యుని
గా దృష్టింపనె మహాత్మ! కమలదళాక్షా! 82

చ. తనరు పురాణసంహితలతావలముం దగ మెట్టి శాస్త్రపుం
బెనుఁదలుపు ల్వడిం దెఱచి పెంపున నాగమసౌధమెక్కి యం
దనుపమయోగపీఠమున నంచితశీల వెలుంగుచుండు నిన్
గనుఘనయోగిపుంగవులకంటె సుఖస్థితి నిట్లు గాంచితిన్. 83

వ. అని నా నేర్చునట్లు వాక్పుష్పాంజలులు సమర్పించినం గనుంగొని నగి కొని (యోగీవిందుండు) మందస్మితంబు నిగుడ, మునీంద్రా! చంద్రశేఖరుం జూచితివే? యనిన విని, యంజలి బంధంబుతో, మహాపురుషా! చంద్రశేఖరుండనుననేల? విశ్వ

ప్రపంచంబంతయు నసంతవిలాసంబుతోఁ జూచితి. దేవరదివ్య ప్రభావంబుచూడ నేనెంతవాఁడ నని నమస్కరించిన, నీవు వీరశైవుండవు, నాయంశభేదం బగు శివునియంద భక్తి సలుపు మది నుదీయహితప్రవర్తనం బని కరుణించె. నాఁట నుండియు మృత్యుంజయుని సేవించుచుఁ దదీయవరప్రసాదసామర్థ్యంబున మృత్యువు గెలిచినవాఁడఁ గావున లోకంబున నద్దేవదేవుని మాయలు కొన్నికొన్ని యెఱుఁగుచు నిటువంటి మహత్త్వంబులు చూచుచు నిట్లున్నవాఁడ నివి నా చూచిన యర్థంబులు. తన్మాయాప్రభావంబు విజ్ఞానహీనులకుఁ దెలియనరిది. తనయందు భక్తిసల్పిన మహాత్ములకు మాయావిధానంబు చూపి తుదిం బరమసాయుజ్యంబునం గలుపుకొను నింక నొక్క యితిహాసంబు చెప్పెద. 84

— పుండరీకునికథ —

క. విను మును మధురాపురమున
ఘనుఁడు మహాభాగవతుఁడు గలఁ డతఁడు జగ
ద్వినుతుండు పుండరీకుం
డనువిప్రుఁడు సహజసాత్త్వికాచారుఁ డిలన్. 85

క. సావిత్రి యతని యంగన
సావిత్రికి సాటివచ్చు సాధ్వీతిలకం
బావెలఁదితోడ నాతఁడు
శ్రీవిలసితుఁడైన హరిచరిత్రము నొందెన్. 86

సీ. శాంతిసద్వృత్తులు సతతుగా నవరించుఁ
గారుణ్యసౌజన్య కలితుఁ డగుచుఁ
గర్మధర్మంబులఁ గవగాఁగ సలరించు
నన్వయాచారనయజ్ఞుఁ డగుచు
సత్యశీలంబులు సమముగా నవరించు
మితభాషణార్జవమిళితుఁ డగుచు
శ్రుతివాక్ప్రబోధముల్ ప్రీతిగాఁగ నొనరించుఁ
బ్రీతిభా విరక్తి సంపన్నుఁ డగుచు
తే. ఫాలమున గోపీచందనప్రభయు నళుత
జలరుహాక్షసరోజంబులు శ్రవణవీథిఁ
దులసిమంజరియును బలుకుల రమేశు
కీర్తనము నొప్ప వెలయు నా కీర్తిధనుఁడు. 87
సీ. ప్రాణంబుకంటెను బరమహితంబుగాఁ
బాటించు నేప్రొద్దుఁ బద్మనాభు
నాత్మసేవథ్య క్రియలకంటె సంప్రీతి
విష్ణుపూజలు గడు విస్తరించు
నిల్లాలికంటెను నుల్లంబునకుఁ గడు
నింపుగా హరిభక్తి నిరవుకొల్పు
లలిత పుత్రోపలాలనకంటె వైష్ణవ
ధర్మమార్గసపర్య కూర్మి నడుపు
తే. వేదపఠనంబుకంటెఁ బవిత్ర మనుచు
హరికథా తత్పరుం డగు యజ్ఞఫలము

కంటె ఫల మని తద్వ్రతక్రమము సలుపుc
బుండరీకుండు సుజనసంపూజ్యుc డగుచు. 88

క. ధీమహితుc డతcడు సాల
గ్రామ శిలాతలమునందుc గమలాక్షు రమా
రాముని నర్చించు మన
స్తామరసమునందుcబోలెc దద్దయు భక్తిన్. 89

—•{ పుండరీకునియొద్దకు నారదముని వచ్చి విష్ణుభక్తి ప్రభావము చెప్పుట. }•—

వ. ఇవ్విధంబున ననుకూలదాంపత్య సౌభాగ్యంబును సాధుబుధ సేవ్యమాన నిజకులోచిత వ్యాపారంబును, విష్ణుభక్తియు, నంతకంతకుం గొనసాగ, నాగమజ్ఞుం డగు నమ్మహానుభావుం డొక్కనాcడు స్వసమారోపిత తులసీకాననంబున యమునాతీరంబునc బిప్పల తరుచ్ఛాయ శీతల ప్రదేశంబున నిష్ఠాగరిష్ఠుండై సాలగ్రామ శిలార్చనం బొనర్చు వేళ యదృచ్ఛాగతుండైన నారదునిం బూజింప నతం డతని శుద్ధసాత్త్విక ధర్మంబునకు సంతోషించి యిట్లనియె. 90

ఉ. ఆరయ వేషభాషలు క్రియల్ మనమున్ సరియైన సద్గుణో
దారుcడుగల్గుటచ్చెరువు ధారుణి; నేcడిదె చూడcగంటిc బెం
పారcగ వేషభాషలు క్రియల్ మనమున్ సరియైన సద్గుణో
దారుని వైష్ణవోత్తముని ధన్యుని నిన్ను మహీసురాగ్రణీ!

క. ఇదిగో! గృహస్థధర్మం,
బిదిగో! నాచారపరత, యిదిగో! ముక్తి

ప్రిదమార్గము, సాలగ్రా
మ దృపతప్పూజనముఁ జూచి మది హర్షించెన్. 92

క. నీవును సాలగ్రామ శి
లావాసుం డైనయట్టి లక్ష్మీవిభుఁడున్
భావింప నొక్కరూపం
బై వెలిఁగెద రేమి చెప్ప? ననఘచరిత్రా!

శా. పట్టంబట్టఁగఁ బాఱు నింద్రియముల న్బంధించి వాంఛ ల్గడున్
బుట్టింపం బలు వైన తద్విషయము ల్పోఁద్రోలి దుర్మోహముం
బట్టై యుత్కటదుఃఖదుర్గతులకుం బ్రాపైన సంసారముం
గట్టల్కం దిగఁద్రోయ కేల కలుగుం గంజాక్షపూజారతుల్?

చ. సతులు, సుతుల్, సహోదరులు, సంగడికాండ్రు, పదార్థజా
లముల్ । ప్రతిపద దుఃఖమూలములు పాపసమాచరణాను
బంధముల్ । మతిఁ బరికింప నంచు గుణమాన్యులు తత్పరి
ముక్తమోహులై। యతులను ఖైక హేతు వగు నచ్యుతభక్తి
భజింతు రెంతయున్. 95

క. విను దీర్ఘస్వప్నము జగ
మనియుఁ బ్రపంచంబు మిథ్య యనియును సంసా
ర నిబద్ధబుద్ధి మరలిచి
నినుబోఁటులు విష్ణుభక్తి నిలుపుదు రాత్మన్. 96

ఉ. అంతయు విష్ణుమాయ జగ, మాత్మ నెఱుంగ, నసత్యలోకవి
భ్రాంతము లోకవర్తనము బ్రహ్మవిదు ల్గనుఁగొందు్రు దీని న

త్యంతవివేకదృష్టిఁ గని, తద్విరతి న్నిరతంబుఁ జిత్సుఖా
నంతవిలాససిద్ధికొఱ కచ్యుతభక్తి భజింతు రెంతయున్. 97

మ. పరిబోధాంజనయుక్త చిత్తనయనప్రవ్యక్త దుష్ప్రొల్లస
ద్గురుమాయావృతచిన్నిధానమనియాచ్యుల్విష్ణునింగాంచి దు
స్తరసంసారవిమోహదైన్య మెడలన్ సంతోష సంప్రాప్తిచేఁ
బరమబ్రహ్మపద ప్రకృష్ట సుఖసంపత్ప్రాప్తు లౌ చుండ్రిలన్.

క. హరిమంత్రజపనిరూఢియు
హరిపూజాసంభ్రమంబు హరికీర్తనముం
బరమ మగు సాధనము దు
స్తరభవవిదళన మొనర్చి తత్పద మొసఁగన్. 99

క. కావున నీవును నుత్తమ
ధీవిభవము గల్గి సన్మతిన్ సొలగాఁ
మాహాసుం గేశవుఁ దుల
సీవనమంజరులఁ బూజసేయుము భక్తిన్. 100

—♦ తులసీప్రభావము ♦—

ఆ. కల్పక ప్రసూన కన కారవింద మా
ణిక్యపూజనముల నెలవుకొనదు
జలజనాభు చిత్తజలజంబు తులసీ ద
ళార్చనమునఁబోలె ననఘచరిత! 101

క. తులసీకానన మెచ్చట
విలసిల్లుచునుండు నచట విష్ణుఁడు నుండున్

జలజాక్షుఁ డున్న చోటను
జలజాసన ముఖ్యదివిజసంఘము నుండున్. 102

ఆ. భక్తజనులయందుఁ బావనతులసీమ
హీజవాటియందు నెట్టివేళ-
(నుండు నట్టివేళ-) నుండఁడు హరి లక్ష్మి
యందుఁ బరమపదమునందు వినుము. 103

సీ. శ్రీతులసీమహీజాతాభిషేకంబు
పట్టాభిషేకసంపత్ప్రదంబు
శ్రీతులసీతీర్థసిద్ధరసార్ద్రత్వ
మవభృథస్నాన పుణ్యావహంబు
శ్రీతులసీమూలమృత్తికాతిలకంబు
యమనిశాచర పరిహారరక్ష
శ్రీతులసీనమస్క్రియ బ్రహ్మహత్యాది
పాపతిరస్క్రియా ప్రౌఢముద్ర

తే. తాపహరణంబుతులసీ ప్రదక్షిణంబు
శ్రీకరము నిత్యతులసీ విలోకనంబు
వేదశాస్త్రసనిమదర్థ విశ్రుతంబు
దీనిఫలమేమిచెప్ప? భూదేవవర్య! 104

సీ. తులసీమహీజంబు మొలవఁబెట్టినఁ గల్గు
ససముద్రభూదానసమఫలంబు
తులసీవనముదండ సలరు శ్రాద్ధంబు గ
యాశ్రాద్ధఫలదమై యతిశయిల్లు

తులసీవనంబునందు జపించుమంత్రి మొ
క్కటి కోటియై స్వసంకల్ప మొసఁగు
తులసీవిలాసంబు గల యిల్లు కలనైన
దర్శింప భయ మందు దండధరుఁడు

తే. తులసి దురితాహితాభేద్యదుర్గభూమి
తులసి సజ్జనగృహవాటికలకుఁ దొడవు
తులసి నిత్యమహోత్సవంబులకు నెలవు
తులసి కైవల్యలక్ష్మికిఁ దోడు నీడ. 105

క. గంగాకళిందజాది త
రంగిణులం దీర్థమాడఁ బ్రాపించుఫలం
బంగీకృత మగు శ్రీతుల
సిం గరముల నంటినపుడ చింతింపఁ దగన్. 106

తే. తులసి యెన్నలనెత్తావితులకు రాదు
కల్పవృక్షప్రసూన సుగంధభరము
తల్లసన్మంజరీ పూజఁ దన్నుఁ దనుపు
వారి కచ్యుతుఁ డచ్యుతావాస మొసఁగు. 107

వ. అని తులసీవనలక్ష్మిం బ్రశంసించి. 108

చ. ప్రతిదివసోపవాసములఁ బాయకబ్రిస్సియు సత్యదానస
ద్వ్రతములఁ బెద్ద లయ్యనుదురంతతపోనలకీలఁ గ్రాఁగియున్
గ్రతు నియమార్తి బ్రమాఁగియునుగానరు వైష్ణవదివ్యలోకమ
చ్యుతపదపంకజార్చకుల చొప్పున విప్రకులైకభూషణా!

మ. ప్రతిమాస్థండిలహృజ్జలాగ్నిరవిబింబస్థానలక్ష్యప్రకా
శితు నారాయణుఁ గొల్వ నుత్తమగుణుల్ సేవింతు రార్యుల్
ఘనుల్, ప్రతిభం గొందఱు నీవునుంబలె నెసాలగ్రామసాక్షాత్ప్ర
కా, శితు లక్ష్మివిభుఁ బూజసేతు రమృతశ్రీవాససౌఖ్యార్థులై.

—♦ సాలగ్రామ పూజా మాహాత్మ్యము. ♦—

క. ఏమిటియందును సాల
గ్రామస్థలియందుఁబోలెఁ గమలాక్షుఁడు తే
జోమహితుఁ డగుచుఁ బూజితుఁ
డై మోక్షశ్రీ నొసంగఁ డండ్రు మహాత్ముల్. 111

శా. ఉగ్రైనస్తిమిరార్కమండలము, నిత్యోత్కృష్ట దుఃఖాటవీ
న్యగ్రోదగ్రమహాదవాగ్ని, కుమతవ్యాపారదుర్మోహస
ర్పగ్రస్తాభయదానమానితకళావక్షీంద్రరూపంబు, సా
లగ్రామాచ్యుతపూజనంబు సుజనాలంకారచూడామణీ !

ఆ. కీర్తనీయ వజ్రకీటవినిర్మిత
చారుచక్రసుప్రసన్న మైన
విష్ణుదివ్యమూర్తి వెలయుసాలగ్రామ
మల్పమతుల కబ్బ దర్చ లొసఁగ. 113

క. విను సాలగ్రామ శిలా
ర్చన మెవ్వఁ డొనర్చు వాని సకల పితృగణం
బును బితృలోకంబునకుం
జను యమపురినుండ దైన సత్యం బనఘా. 114

ఆ. అనయకారియైన, నఘవంతుఁడైన, మో
హాంధకారమగ్నుఁడైన భక్తిఁ
బూని వేడ్క నెవ్వఁడేని సాలగ్రామ
పూజసేయు నతఁడు పూజ్యతముఁడు. 115

సీ. దివ్యసాలగ్రామదేవమందిరము ప్ర
త్యక్షవైకుంఠపుణ్యాలయంబు
దివ్యసాలగ్రామదేవోత్సవక్రీడ
త్రిభువనసామ్రాజ్యదివ్యపదవి
దివ్యసాలగ్రామదేవపూజానిష్ఠ
బ్రహ్మనిర్వాణసంపన్నలీల
దివ్యసాలగ్రామదేవతీర్థప్రసా
దములు త్రిలోకసేవ్యములు దలఁప

ఆ. నిది యెఱింగి నువ్వె యెపుడు సాలగ్రామ
పూజసేయువారు ప్రబుద్ధమతులు,
మ్లేచ్ఛ శూద్ర కుమత తుచ్ఛ చండాల నా
స్తికులు దక్క, వినుము ధీరహృదయ! 116

—♦ హరినామకీర్తన ప్రభావము. ♦—

క. హరినామకీర్తనమునకు
నరయఁగ నేకులజు లయిన నర్హులు పూజా
పరతఁ గల పుణ్యసంపద
హరి యొసఁగుం గీర్తనీయుఁడై వారలకున్. 117

క. విస్తారం బగుదుష్కృత
దుస్తరసంసారవార్ధితుదిఁ జేర రమే
శ స్తుతినారాయణాఖ్యుల
కస్తోకాత్ములకుఁ గాక యన్యులకు నగునే. 118

తే. పుత్రమిత్త్రకళత్త్రార్థ భూరివిషయ
సంకులం బగుసంసార చక్ర మెల్ల
విష్ణుమాయా మహామోహవిభ్రమంబు
దీని మదిఁ బాదుకొల్పు భూదేవవర్య! 119

తే. విష్ణుమాయాపరాధీనవిధివిధేయ
ధర్మ మెల్లార్థభోగ పరిదంబు వినుము
సర్వధర్మంబులును మాని చక్రధరుని
నాశ్రయింపుము చిత్సుఖావాప్తికొఱకు. 120

వ. అని యనేకపరమరహస్యంబు లెఱింగించి యబ్జభవనందనుం డంతర్హితుం డయ్యెఁ, దదనంతరంబ యమ్మహీదేవోత్తముండు చిత్తంబున లోకోత్తరుం డగునారదమునిసత్తముని సత్యవచనంబులు వేదప్రమాణంబు లని యాదరించి, తొల్లింటికంటెను బ్రతిదినప్రవర్ధమానసువ్యక్తభక్తితాత్పర్యంబులు గలిగి సాలగ్రామవిష్ణుపూజామహోత్సవంబు లొనర్పుచుఁ దదీయమంత్రపరతంత్రుండును దదీయనామస్మరణపరాయణుండును నై యనుకూలకులపాలికాసహాయుం డగుచు నిజకులోచిత ధర్మకర్మంబులు కృష్ణార్పణ బుద్ధిం దగనకొలంది విడువక నడుపుచుం దనలోన. 121

ఉ. నారద సంయమీశ్వరుఁడు నా కుపదేశ మొనర్చె విష్ణుపూ
జా రతియుం దదీయగుణసంస్మరణ స్తవమంత్రతంత్రవి
ద్యారమణీయభంగియుఁ గృతార్థుఁడ నైతి మదీయజన్మసం
స్కార విశేషసంపద జగంబుల వర్ణన కెక్కెఁబో! యిఁకన్.
వ. అని హర్షించి వెండియు. 123
క. ఇస్సీ! సంసారం బిది
లెస్సతనం బేమియును ఫలింపక మిగులన్
నిస్సారంబై తోఁచు, మ
నస్సంకల్పములు పెక్కు నాశముఁ బొందున్. 124

—◆ విష్ణుమాయంగూర్చి పుండరీకుఁడు సందేహపడుట. ◆—

ఉ. ఆమునినేతియున్ భువనమంతయు విష్ణునిదివ్యమోహ మా
యామయమంచుఁ బల్కె నిదియట్లనయయ్యెడుఁ జూడఁజూడ, మి
థ్యామమతన్ నిజంబుగఁ బదార్థవిసర్జన మాచరింపఁగా
లేమిన యాతలంపును జలించెడుఁగానియొకించు కాత్మలోన్.
వ. అని కొండొక పరమార్థంబు విచారించి విష్ణుమాయా విభ్ర
మంబున నవ్విచారంబు గొనసాగింపలేక ప్రపంచం బాలో
కించి. 126
శా. ఆలుం బిడ్డలు నిండ్లు నర్థములు నయ్యైయన్వయాచారముల్
నాళీకాసనసృష్టికర్తృకములై నానావిధానంబులై
యాలీలం బహుకాలముల్ గడవఁగా, నీ సర్వమున్ విష్ణుమా
యాలాస్యంబిదియాటకున్ మదికిదృష్టాంతంబునా కెట్లగున్?

శా. ఈభూమండలి యీసముద్రవలయం బీవాయు వీపావకం
బీభాస్వత్తుహినాంశుదీప్తగగనం బీజంతుసంపత్తి మా
యాభిన్నమ్ములటంటవెట్టులవిదృష్టాంతంబులై యుండఁగా?
నేభావంబున నిశ్చయింతు నొకటి నీతథ్య మిథ్యాద్వయిన్.

క. నాయాత్మకు దృష్టాంతం
బై యుండిన దాఁక మాయ యన లే దెపుడుం
దోయజభవ కల్పిత మగు
నీయఖిలము, మాట లింక నేఁటికి వేయున్? 129

క. ఈయాలును నీబిడ్డలు
నీయిండ్లును నీ కులంబు నిట్లుండఁగ వే
ఱే యొక సంసారస్థితి
యై యుండిన మాయ యనఁగ నగు నఖిలంబున్. 130

వ. అని యివ్విధంబున సందేహాదోలాందోళాయమాన మాన
సుం డగుచుఁ గ్రమ్మఱఁ బరబ్రహ్మవేది యగు నారదమహా
మునీంద్రుని సత్యోపదేశంబువలన సకలంబును విష్ణుమాయా
విలసనం బని వినిన తెఱంగు దృష్టాంతంబుగా నెఱుంగం గోరి
యప్ప టప్పటికి స్వామీ! నేనీభక్తుండ, నీవు భక్తవత్సలుం
డవు గావున నించుక నీమాయ చూపవలయు నని విష్ణునిం
బ్రార్థించుచున్నవాఁ డై యొక్కనాఁడు పితృదివసంబున
బ్రాహ్మణుల నిమంత్రణంబుచేసి, ధర్మపత్నియగు సావిత్రి
కృతస్నాన యై పాకయత్నంబు నడుపుచుండఁ దదీయోచిత

ద్రవ్యంబులు సంపాదించి మధ్యాహ్న సమయంబున నదికిం బోయి. 131

ఆ. తీర్థ మాడి విధులు దీర్చి సూర్యోపాస్తిఁ
జేసి విమల పులినసీమయందుఁ
బంకజాననమునఁ బదిలుఁడై విష్ణు నా
మత్రయము జపించి మఱియు నతఁడు. 132

క. కుందేందుధవళమూర్తిని
మందస్మితమధురవదనమండలు మాయా
సుందరు విష్ణునిఁ దనమది
సందేహనివృత్తికొఱకు స్మరియించె మదిన్. 133

వ. అంత. 134

—◆ పుండరీకుని విష్ణుమాయ యావహించుట. ◆—

తే. అన్ను నట్టినగతి, నిద్ర యలమినట్లు,
మూర్ఛ వచ్చినపగిదిఁ గన్మొగిచి చిత్త
మింద్రియవ్యాప్తి నుడిగి తదేకనిష్ఠ
నలరఁ గలవోలె హరిమాయ యాశ్రయించె. 135

తే. ప్రాణి జనియింపఁ, దొల్లింటిభవము తెలివిఁ
గప్పి, విపరీత వృత్తిమైఁ ద్రిప్పుచున్న
వినుతచారిత్ర మైన యావిష్ణుమాయ
విప్రసహజప్రకృతియును వేఱుచేసె. 136

వ. ఇట్లు పుండరీకుండును విగత విజ్ఞానుండై యుండు నవసరంబున

క. మారునిమోహన తీవ్రవి
కారము స్త్రీరూప మొంది కదిసినక్రియ సొం
పారి యొక బోయగుబ్బెత
చేరువఁ గనుపట్టె విప్రుచిత్తం బలరన్. 138

సీ. పచ్చగాజులయొప్పు పచరించు చేతులు
సంకుటుంగరములచాయ లొనఁగ
నిగనిగల్ దొలఁకాడు బిగువుచన్నులమీఁద
గురివెందపూ గుబ్బసరము దనర
ధవళతాళపలాశతాటంకరుచి మించు
చెక్కులఁ జిఱునవ్వు జీరువాఱఁ
గొప్పున కందని కుఱుల నించుక దోఁచు
నుదుటి జేవుఱు బొట్టు నుమురు మెఱయ
తే. సన్నవలిపంపుఁగొల్లెయ సగము గట్టి
సగము ముసుఁగిడి యొయ్యారముగ నొఱుంగుఁ
గంచుమెట్టెలు మొరయంగఁ గడఁకవచ్చు
నవ్విలాసినిఁ దగ మెచ్చె నవనిసురుఁడు. 139

క. ఆలీలావతివిభ్రమ
హేలాయౌవనగుణముల నెవ్వనితలఁ పొం
దోళింపదు ధైర్యచ్యుత
మై లోకమునందు నంగజార్తం బగుచున్ ? 140

తే. అట్లు ముందటఁ బ్రత్యక్షమైన మదన
దేవతయుఁబోలె నొప్పు నాతిఁగఁబోఁడి

మేలిమొలజవ్వనమునకు లోలుఁ డయ్యె
విగతలజ్జాభిమానుఁడై విప్రకులుఁడు. 141

క. కులశీలంబులు దలఁచునె
వలరాయనిబారిఁ బడిన వాఁడు నవీనో
జ్జ్వలయౌవనసంపద గల
కలికిమెఱుఁగువాలుఁగంటి కడఁ జూపట్టన్? 142

తే. దాని మదనోన్ముఖత్వంబు, దాని సొబగు,
దాని క్రొమ్మేని జిగి బిగి, దాని వయసు
మదనసామ్రాజ్యకళలట్లు మాఱుమలయఁ
జూచి పులకించె మమతలఁ జొక్కి దేర. 143

క. అది మాయావిలసన మని
మదిఁ గానకపోయెఁ గాక మఱి పాఱుఁడు దా,
నిది బోయత యనవలదే
తుది? భ్రమసినతలఁపు తెలివి దూఁకొన దెందున్. 144

—◆పుండరీకుఁడు బోయదానిని మోహించుట.◆—

వ. వెండియు. 145

ఉ. ఇయ్యెలనాఁగ యొంటిపడి యిక్కడకుం జను దెంచె లీల,నిం
కెయ్యెడ నైనఁ బోఁగలదొ యేమయినం బనిగల్గి! యిచ్చటం
దియ్యము చూపనుండునొ! మదిం బరికింపఁగ నంచు నాత్మలో
నయ్యవనీసురుండు వెడయాసల పెల్లునఁ దల్లడిల్లఁగన్. 146

ఉ. ఆచపలాక్షియుం గదిసి యాధరణీసురపంచబాణునిం
జూచె మనోనురాగగతి సొంపునఁ బొంపిరివోవు చూపునం

జూచిన చూపులోన మదిసోఁకెవికారము, మై చెమర్చెఁ బె
ల్లేచె నసౌఖ్యముల్ వలపులింపులుఁ గోర్కెకీఁదానలంబులై.

క. జవ్వనపు సిరుల మదమునఁ
గ్రొవ్వారుచు నున్న మెఱుఁగుగుబ్బలతోడన్,
నివ్వటిలుచున్నకన్నియ
యెవ్వనిఁ బైకొనదు రతికి నేకతమైనన్ ? 148

క. ఎలప్రాయము లావణ్యముఁ
గలిగిన స్త్రీపురుషు లొంటిఁ గదిసినచోటన్
వలరాయఁ డేల మానును
గులశీలము లడఁచి జోడు గూర్పక యెందున్ ? 149

వ. ఇవ్విధంబున నొకరియొకరితలంపులంగామకళాశంకలంకురింపఁ దమక తిమక తమకంబునం బట్టుకొన గమకించుచుండి రప్పు డప్పువ్వుఁబోణి యతనితలంపు దెలిసికొనం జూచి కొండొక ధైర్యంబు పట్టుకొని కట్టెదుర బిగువుచనుకట్టు పయ్యెద దిగ జార్చుచు నదీజలంబులఁ గాళ్లు, చేతులుఁ గడిగికొని యొక్క కెందమ్మిపూవుఁ దిగిచి పుష్పోడి చింద నందంద కరారవిందం బునఁ ద్రిప్పుచుఁ జక్రవాకమిథునసిధువన క్రీడ లాలోకిం చుచు, ముసిముసినవ్వులు నవ్వుచు మాటిమాటికిఁ గూటమి కాశలు గలుగ మగిడిచూచుచున్నఁ దదభిప్రాయంబు దెలిసి మనసిజుండు ప్రేరేపఁ బుండరీకుండు లేచి యాచమన వ్యాజంబున దాని డాయంబోయి. 150

ఉ. ఎవ్వరిదాన? వెక్కడకు నేఁగెద వాయితపాటుతోడ నీ
విప్వల నొంటిపాటున యథేచ్ఛ రతీశవిహారరేఖఁ దో
డెవ్వరు లేరె? ప్రాణవిభుఁ డెవ్వఁడు? నీకుల మెద్ది? చెప్పవే!
జవ్వని! నిన్నుఁ జూడమదిఁజాలఁగవేడుకతొంగలించెడున్.

తే. అనిన నించుక తలవంచి యాసనమున
నలఁతినవ్వును లజ్జయు నంకురింప
చేతి కందిన ఫలమట్లు చేరఁబడుచు
నెలుఁగురాల్పడ నొయ్యన నిట్టు లనియె. 152

— ♦ బోయత తన వృత్తాంతముచెప్పి పుండరీకుని వరించుట. ♦ —

ఆ. బోయవారిపడుచ భూసురోత్తమ! యేను
పెండ్లి లేదు నాకుఁ బెద్దవారు
గలరు ముసలివారు తలిదండ్రు లింతియు
యల్ల యేటిదాపుపల్లెదాన. 153

క. మావారిఁ దల్లిదండ్రిలఁ
బ్రోవను, నను గారవింపఁ బూం దైనపతిన్
భావించి కాని పెండిలి
గావించిన నొల్ల ననుచుఁ గడుఁ జింతింతున్. 154

ఆ. దానఁజేసి మగఁడు తన కెవ్వఁడును లేఁడు
తగినమగఁడు లేమి మగనియాశ
విడిచి యున్నదాన, విప్రపుంగవ! నీవు
మగఁడ వైతివేని మనసు వచ్చు. 155

క. ఆరూఢయౌవనం బిది
భారముగా దిన్నినాళ్లు పరికింప మహా
భార మయి తోఁచె నిప్పుడు
నీరూపశ్రీలు మీఁద నిగుడుచు నుండన్. 156

క. ఎన్నఁడు నెవ్వరిమీఁదను
గన్నానక యున్నచోటఁ గాముఁడు నీపైఁ
గన్నానఁజేసె, నిఁక నె
ట్లున్నదొ నాభాగ్యరేఖ? యుత్తమచరితా! 157

వ. అని పొలివోని నిండుజవ్వనంబునఁ గన్నులపండువై యున్న యక్కన్నియ నోరూరం జేయుచున్నచందంబు దొందంబును, జంద్రికారసపూరంబు చంద్రోపలంబునుం బోలె, ననురాగ రసమయంబుఁ గావించుచుండఁ బుండరీకుం డంతర్గతంబున.

ఉ. అక్కట! యింతచక్కని మృగాక్షిని బోయత నెట్లు చేసెన
వ్వెక్కురు దైవముర్విఁగడు విభ్రమసంపద నీటువారియం
దొక్కకళంక మేమయిన నుంచుఁ గృపావిపరీతబుద్ధియై
చక్కెరవిల్తునంతటి రసజ్ఞుని నంగవిహీనుఁ జేయఁడే. 159

ఉ. వాసన లేని మేలిమి సువర్ణము దీని మనోహరత్వ, మ
బ్జాసనుఁ డన్వవాయ మొక టల్పతరంబుగ సంఘటించుటం
జేసి విలాస విభ్రమ విశేషము మాన్పెడు నాకళంకమున్
భాసుర చంద్రబింబమునఁ బ్రిన్నని వెన్నెలకందునుంబలెన్.

తే. ఇంక నిన్ని విచారంబు లేడ కెక్కఁ
గంతుఁ డసిధార ధైర్యంబుఁ గత్తరింప

నాదరువులేక చిత్తమీ యబలమీఁద
వ్రాలియున్నది మగుడఁ ద్రిప్పంగరాక. 161

క. ఈ చేరికమాటలలో
నే చంచలనేత్రఁ బ్రేమ నెలయించి తదీ
యోచిత రతితంత్రసుఖ
ప్రాచుర్యం బనుభవింతు బ్రహ్మము మూట్లన్. 162

వ. అని కామోద్రేక జనితోన్మాదంబున లజ్జాభిమానంబులు విడిచి దానితో నిట్లనియె. 163

క. ఓ వెలఁది! నీ చరిత్రము
నీవచన విశేషగతియు నీ వినయము నీ
లావణ్య భావములు మ
ద్భావము మదనానురాగ పదముం జేసెన్. 164

ఉ. నీ యిటువంటి సద్గుణము నీ నవయౌవనరూప లక్షణ
శ్రీయుతిఁ జెందగల్గిన విశేష పురాకృత పుణ్య మేమనన్ ?
దోయజనేత్ర! నాదగు మనోరథమున్ ఫలియించు నీవు నా
ప్రేయసివై తివేని విధిపెంపున బోయతవైన నేమగున్? 165

క. నీ మనసులోనఁ దెలఁగెద?
నీమాటల కడుగుడాఁట నిక్కము వినుమా
కాముఁడు రతియును సాక్షులు
గా మ్మృష గా దబల! నమ్మి కైకొను నన్నున్. 166

చ. బిగిచనుదోయిక్రొమ్మెనల పెక్కువయక్కునఁజక్కనొత్తియి
ప్పగ నధరామృతం బొసఁగిపొందికమాటలగౌరవించుచున్,

దగ మదభీష్ట పుష్పశరతంత్రములన్ సుఖకేళిఁ దేల్పవే
మగువ! తదీయ తీరనవమంజుల వంజులకుంజవాటికన్. 167

క. అని యనుమానింపక మన
మున మనసిజ బాణపాతమునఁ బొడముడువే
దనఁ బడఁజాలక బాలికఁ
గనుఁగొని తమకించి పట్టి కౌఁగిటఁ జేర్చెన్. 168

క. మును వనితజవ్వనపుసిరిఁ
గని వంశము మఱచెఁ; బిదపఁ గౌఁగిటిలోసం
దను మఱచె బ్రాహ్మణుఁడు; రతి
నొనరిన నిఁక నేమి మఱచునో సుఖకేళిన్. 169

క. అదిరా! యిది, సాధారణ
మదిరామాత్రమున మఱచు మనుజుఁడు మదవ
న్మదిరాక్షీలీలోత్కట
మదిరా రస లహరి మేను మఱవఁడె యొందున్? 170

వ. ఇట్లు మోహపరవశత్వంబున బ్రహ్మకుల సంభవుండు సంభ్రమించి పరిరంభించి పులకకళికాకలిత గాత్రాభోగుండును బద్ధానురాగుండునునై కౌఁగిలి వదలక మదవతి నతిప్రియత్నంబున నొయ్యన నెయ్యంబుగాఁ దార్చికొని తన్నదీసవిధపుష్పితలతానికుంజ క్రీడంబున నిధువనక్రీడ లాచరించి తదనంతరంబ జోడువాయక వేడుకజొత్తిల్లు చిత్తంబుతోడఁ దద్గృహంబున కేఁగి, దానిజననీజనకు లగునత్తమామలకు నల్లుండ నని తనపేరు చెప్పి నమస్కరించి, వారి దీవె

నలు వడసి యింటికి సర్వంబును దానయై భోయకాఁపురంబు సేయుచుండె, నివ్విధంబునఁ గొంతకాలం బప్పావ్వఁభోణి జవ్వనం బనుభవించి యొక్కకొడుకు నొక్కకూఁతునుం గనియె నంత. 171

క. ఆయాలును నాబిడ్డలు
నాయిండ్లును నాకులంబు నాబ్రతుకును వే
ఱే యొక సంసారస్థితి
యై యుండెం గోరినట్లు యావిప్రునకున్. 172

—♦ పుండరీకుఁడు మాయాసంసారము సేయుట. ♦—

క. ఈరీతి న్మాయా సం
సారవృథాభ్రాంతిఁ బొరలె సదసద్విద్యా
ప్రారంభ ముడిగి విప్రుఁ డ
వారణ నత్యల్ప భోగ వాంఛాసక్తిన్. 173

తే. అల్పసంసారవిషయ సుఖానుభోగ
మభిలషింపుదు రధము లి ట్లధమగతికిఁ
దద్విరక్తి ప్రబోధ సుధాస్వరూప
చిదమలానంద మనుభవింపుదురు ఘనులు. 174

క. దుర్విషయ కలుషవార్ధ్యం
తర్వర్తులు గనరు మోక్ష ధామము, విద్యా
పర్వతశిఖరస్థితు లగు
నిర్వాహకమతులు గాని, నిశ్చయదృష్టిన్. 175

వ. అంతఁ దత్కాలంబున నతం డున్నదేశంబున 176

సీ. పగ లార్ద్రి పూనెఁ, బ్రాక్పశ్చిమంబుల గురు
కావ్యులు సమస్తకమున నుండ్రి
ధూమకేతువు దోఁచెఁ దూర్పుదిక్కున, బుధ
శుక్రమధ్యస్థుఁడై సూర్యుఁ డుండె
గ్రహరాజ భార్గవాగ్రగుఁ డయ్యెఁ గుజుఁడు, మీ
నమున వర్తించె శనైశ్చరుండు
దితిసుతాహితమంత్రి యతిచారగతుఁ డయ్యె
శశి రక్త పరివేష సహితుఁ డయ్యెఁ

తే. చంద్రికాచ్ఛాయ విద్యుత్తు సంభ్రమించెఁ
బ్రాతరారంభములఁ దుషారములు చిలికె
రాత్రిగగనంబు నక్షత్ర రమ్య మయ్యె
విను మనావృష్టిదోష మావిర్భవింప. 177

సీ. హరుని చిచ్చుఱ కంటిమురువున నిప్పులు
గురిసెఁ జండకరుండు గోచరముగ
నాడాడ నుగ్రదవాగ్ని శిఖాభీల
మై నీఱుచేసె వనాంతరములు
గండభేరుండాది చండమృగంబులు
గ్రామోపకంఠముల్ గదల వయ్యెఁ
బటుతరసంతాపభారకారణములై
వ్యాధులు జీవుల నలఁత ముంచెఁ

తే. గల్లరాజులు డెగిరి నిష్కారణంబు
దండుగలువట్టఁ బ్రజ నాత్మ ధరణివిభుఁడు
బందిపట్టులు తఱచయ్యెఁ బాపకారి
విధికృతంబైన యయ్యనావృష్టికతన. 178

ఆ. ఏఱు లింకెఁ గొలఁకు లింకె బొడ్డనబావు
లింకె నూతు లింకె నింక కున్న
యయ్యవగ్రహోదయమున నంభోరాశి
యైన నింకు ననిన? నబ్జగర్భ! 779

సీ. కడు వాడి కొన మాఁడి నుడి సచ్చి వే రెండి
వరులు పెంధూళులై ధరణిఁ గలిసె
యావనాళాది సస్యములెల్ల భూమిని
బదను లేకయె విత్తఁబడక యుండెఁ
బుష్పఫలాభిసంపూర్తిశూన్యత నెల్ల
తరువులు నీరింకఁ బిఱుఁదువోఱె
నీరసంబై నేల నెఱియలువాసినఁ
దూఁడుదుంపలు గ్రాఁగి మాఁడి పడియె

తే. నిగిడి కావిరి దిశలఁ బెన్పొగలు గవిసె
నెండమావులతో మంట లెగసెఁ జదల
నయ్యవగ్రహసమయచండాంశు కిరణ
ధగధగద్వహ్నికీలావితాన హతిని. 180

క. ధసి పలయిండ్లం గలిగిన
ధన మెంతయు నెత్తు కెత్తు ధాన్యముఁ గొనఁగాఁ

జన ధాన్యవాటికాతతు
లనలశిఖాఘోరబాధ నవి సరియయ్యెన్. 182

చ. దురితమలీమసాంగమును దుస్సహరోషకఠోరదంష్ట్రలున్
బరిభవదీర్ఘజిహ్వయును బంధురరోదనసింహనాదమున్
దర నిశితాసిధారయు నుదగ్రత మీఱి దరిద్రతానిశా
చరి,వికృతాకృతిం గసిమసంగుచుఁ బైకొనె జంతులోకమున్.

వ. మఱియు నకాండప్రళయం బైన యయ్యనావృష్టిదోషంబునం బ్రాపించిన మహాక్షామంబునం జేసి తద్దేశంబున రాజనంబు తేజంబు దూలంగ, దినసరి సరియయ్యె, సంబావు లావు దప్పెఁ, గర్పూరభోగి బాగుచెడె, బలుగుత్తి మొత్తంబడియెఁ, గాంబోది బీదరాలె, నవిసె ననసె, నెల్లి దుల్లెఁ, బ్రాసంగు గ్రుంగె, వంక డొంకె, మొట్టజీలుగు మాలుగయ్యెఁ, గావేరి కావరంబుడిగె, సత్తైనంగ సత్తువచెడె, వెలపడంబు వెలవెలం బాఱె,బుడుమ ముడివడె,వరగ సురిఁగెఁ,జాము కోమలత్వంబు విడిచె, *యవలఁ దెవులు గప్పె, గోధూమంబు నిర్ధూమం బయ్యె, నువ్వు క్రొవ్వఱెఁ, బెసర యెసుఱునకుఁ దప్పె, మినుము మునుము మునిఁగె, నను యనుమానంబయ్యె, ఉలవ సొలువుచూసె, బొబ్బర దబ్బఱయ్యె, ననంగ నలంగె, ముసిరి మిసిమిదప్పె, లంకలు బింకంబు దఱిఁగె, నావ ప్రభావంబు వదలెఁ, గందమూలంబులు నిర్మూలంబు లయ్యెఁ, జెఱకు గిఱుకవడె, నాకుఁదీఁగెలు చీకాకయ్యెఁ,

* యవల చెలువు దప్పె, ముద్రి. పా.

భోఁకమార్గికులు తేఁకువచెడెఁ, జూత పనస రంభా ఖర్జూర కపిత్థ తాళ హింతాళ నారికేళ నారంగ జంబూ జంబీర మాతులుంగ లవంగ ప్రముఖ ఫలపాదపప్రధానంబులు లూనంబు లయ్యె, నలాబు కూశ్మాండ కర్కటీ పటోలికా కారవేల్ల వృంతాక కోశాతకీ మూలక ప్రభృతి హితౌషధీ నికరంబు దుష్కరంబయ్యె, దధి క్షీర ఘృత తైల మధు శర్కరా స్తోమంబులు విరామంబు లయ్యె, క్షుధాతుర బాల వృద్ధ స్త్రీలోక భీరుక పరిదేవ నార్తనాదంబులును, ఘాన గ్రాస సలిలపానదారిద్ర్యంబునఁ గంటక ప్రాచీర నీరస తరు గుల్మలతానంతతులు నములుచుం గృశించు పశుగణంబు లొనర్చు నంభారవంబులు నుప్పొంగి గగనంబుఁ గబళింప, 'భిక్షాందేహి', 'నాస్తిగచ్ఛ'యను దీననిర్దయ జనాలాపంబు లును, 'దరిద్రస్య మృతస్యచ' యను దుఃఖార్తుల దీన లపితంబులును, 'కాలో వక్రగతిర్భవే' త్తను చింతావరిక్రాం తుల భయాయత్త భాషణంబులును, 'జాతస్య మరణం ధ్రువ' మ్మను దేహపరిత్యాగ వైరాగ్య భాషణంబులును, "రక్షంతి పుణ్యాని పురాకృతాని" యను ధార్మికుల ప్రమాణోక్తులును, 'దరిద్రతా ధీరతయా విరాజతే' యను సత్పురుషుల యభిమాన వాక్యంబులును, "నదేవా త్సృష్టి నాశన" మ్మను పౌరాణికుల యుపశమన వచనంబులును జెల్లుచుండం గరుణాద్భుతభయానకబీభత్సరౌద్రరసావహం బగుచుఁ గేదారక్షేత్రంబులు ధూళిమయంబు లయ్యె;

గ్రీమోప కంఠంబులు పశుశల్యమయంబు లయ్యె; గృహాంగణంబులు శవమయంబు లయ్యెఁ;బట్టణంబులు శుష్క భూత మృత కరి తురగ గర్ద భోష్ట్ర కళేబరకబళన వ్యాకీర్ణ కుర్కుర కంక గృధ్ర కాక సాలావృక కోలాహల మయంబు లయ్యె; మనుజలోకంబు పరస్పర ద్రవ్యాపహారణ వంచన తాడన మారణ తర్జన భర్జనాది వివిధ దుష్కర్మ మయం బయ్యె; దిశావలయంబు దుర్గంధమయం బయ్యె; నహోరాత్రసంధ్యా సమయంబులు పిశాచ మలినచ్ఛాయా మయంబు లయ్యె; నిల్లు మే లెల్ల నడంచి, భూమిఁ గలసారస్యం బెల్లఁ దీర్చి, చతుర్విధ పురుషార్థంబులను గావుపట్టుచు, వర్షప్రీతిక పర్జన్య దేవతాప్రీతిగా నొనర్చు మంత్ర తంత్ర జప తపో ధ్యాన హోమకర్మ కలాపంబులు విఫలంబులు గావించుచు, శాకునిక భాషణంబు లప్రమాణంబులు సేయుచు, ననన్య వార్యంబై యనాచారంబునకు నాధారంబును, నజ్ఞానంబునకు నిదానంబును, వర్ణసాంకర్యంబునకు నాకరంబును, నరిషడ్వర్గంబునకు నిసర్గంబును, జంతునాశంబునకు నివాసంబునై యావిర్భవించిన యాదుర్భిక్షకాలంబున. 188

సీ. పెట్టినతల్పులు పెట్టిన ట్లుండ దే
వాలయంబుల సమయార్చ లుడిగి
విప్రమందిరముల విధి దక్క స్వాహాస్వ
ధానమః పుణ్యాశబ్దములు లేక
రాజసౌధాంగణ తేజంబు చెడ వీర
భటఘోట గజవిజృంభణము వాసి

యంగళ్ల సొబగెల్ల నడఁగె వస్తుక్రయ
విక్రియంబులు మాని విజన మగుటఁ
ఆ. దల్లి బిడ్డ కిడని దశవచ్చె మగఁ డాలి
నమ్మియనెడునట్టి యలఁత వచ్చె
గురుసహోదరాది పరమబాంధవులకుఁ
బోరు పుట్టె లేమికారణమున. 184

మ. క్రతుదీక్షల్ వడుగుల్ వివాహకలనా ప్రారంభ సీమంతముల్ రతి తంత్రింబులు నాట పాటలు ప్రియాలంకార సారస్య ముల్। వ్రతముల్ వేదపురాణశాస్త్ర పఠనల్ వర్ణాశ్రమా చారముల్। హతసంస్కారము లయ్యె లేమి గడుఁ బెల్లై యెల్లెడన్ దోఁచినన్. 185

వ. అట్లు మానిసి మానిసిం దినుకఱవు దఱిమిన నుపాయ శూన్యులై సకల మహీజనులు నాఁకటిచిచ్చు పెచ్చున మలమల మాఁడి యెండి కుండబడుగులై పడుచుండ హత శేషులు పాడైనయూళ్లు విడిచి యన్యో నెలవులకుం బోవు చుండి; రట్టి ముట్టడి నత్త మామలుం గూఁతు నంతరించిన నంతరింపలేక యవ్విరించికులసంభవుండు దుఃఖాక్రాంతుండై ప్రియకాంతం జూచి కన్నీరు నిగుడ్చుచు నిట్లనియె. 186

చ. ఇరువదియేఁడు లయ్యె మన మిద్దఱముం గవగూడి యెందు నే మెరసును లేక యుంటి మిటు లీవఱకున్ విధి యింతమీఁద నే వెరవునఁ బెట్టునో యెఱుఁగ; వృద్ధులుఁబుత్రియుఁబోవదుఃఖసం భరితుల మైతి; మియ్యెడలు పాటునకంటెను లేమి నొప్పిడున్.

క. ఈదుర్భిక్షార్ణవమున
నేదరియుం జేరలేక యిదిగో ! జీకా
కై డెసపడుచున్నారము
పైదలి! యింక నెన్నిపాట్లం బడుదుమొ మీఁదన్ ! 188

ఆ. తోయజాక్షి ! నేఁటితో నీకు నాకును
దైవ మెడలుసేయఁ దలఁపఁబోలు
నిల ఋణాను బంధ మెన్నాళ్లో యన్నాళ్లె
కాక కూర్ప నేమి కారణంబు. 189

వ. అని మోహాతిశయంబున, వాత్సల్యంబున దైన్యంబుతోఁ బం బలికి యాఁకలి నీరువట్టులకు నోర్వక పురపురం బొక్కు-చున్న పిన్నబిడ్డనిం జూచి నిర్వేదించి యాశిశువును రక్షించుట మిక్కిలి ప్రయాసంబై యున్న, దేయుపాయంబున నైన శీఘ్రంబున నొండుదేశంబునకుం బోవుట కర్జంబు, మన్నివేశం బని యుండుట కార్యంబు గాదు, సురక్షితంబైన రాజ్యంబునఁ దిరిసికొని తినిమైన బ్రతుకవచ్చు, నని యూహించి, 190

తే. పొలఁతి! విను పూర్వదక్షిణభూమి లెల్ల
నెపుడు దుర్భిక్షదోషంబు నెఱుఁగ వంద్రు
బహునదీమాతృకలు గాని ప్రతిదినంబు
దివి నిరీక్షించుదేవమాతృకలు గావు. 191

సీ. కర్ణాటరాజ్యంబు గంభీరతుంగభ
ద్రాజలౌఘంబులఁ దఱచు పండు

ద్రావిడదేశ ముత్తరభాగస్మిరమ్య కా
వేరికాలువల ముక్కారుఁబండుఁ
ద్రైలింగ్యమధ్య భూతలము కృష్ణాగౌత
మీ ప్రవాహంబుల మిగులఁ బండుఁ
గాళింగమధ్యదిక్ఖండంబు లాంగూల
శారదానదులచేఁ జాలఁ బండు

తే. వెండియును జిత్ర మిట్లనావృష్టి యైన,
నంబుజాక్షి! నభోనభస్యద్వయమున
దర్ప మొప్పార గౌతమి దరులు ముంచఁ
బార్శ్వములయూళ్లు పదివేలు పండు నెపుడు. 192

సీ. ఏత్రోవఁ జూచిన నేప్రొద్దు సలిలాన్న
సత్త్రశాలాజనసంభ్రమంబు
లేయూరఁ జూచిన నెల్లధాన్యంబులు
కోరుపెట్టుడు ప్రజాఘోషణంబు
లేయిండ్లఁ జూచిన నిందిరాకరసంత
తోత్సవతోరణాభ్యుదయరేఖ
లెవ్వరిఁ జూచిన నివ్వటిల్లెడు దయా
దానసౌజన్యవిద్యానిరూఢి

తే. యెచటఁ జూచినఁ గనుపండు విందువదన!
నారికేళామ్రపనసపున్నాగముఖ్య
ఫలితశృంగారవనపరంపరలచేతఁ
గోరికల ముంచు గౌతమీతీరభూమి. 193

తే. వారిజానన ! గౌతమీతీరవసతి
భోగమోక్షంబులకు జన్మభూమి సుమ్వె
జన్మసంస్కారఫలవిశేషంబు గలుగు
వారలకుఁగాని కలుగ దవ్వసతిసుఖము. 194

వ. ఈ వృత్తాంతంబు మున్ను పెద్దలవలన విని యెఱుంగుదు నందులకుం బోద మని నిశ్చయించి. 195

సీ. కొడుకుఁ జంకిట నిడికొని భోయయిల్లాలిఁ
జక్కఁగా వీఁపున సంతరించి
గంజిచిత్తడికి సీఁగలు పోక ముసరెడు
నుగ్గంపుఁగుండఁ జే నొకటఁ బూని
యొక్కకరంబున నెక్కు డించినవిల్లుఁ
గోలలుఁ బిడియంబుఁ గూడఁబట్టి
నడునెత్తిపైఁ దాటిమడఁచి చుట్టినచింపి
యీఁతాకుచాఁప వహించి క్రుంగి

తే. పీనుఁగుల నెత్తుకొని నిజస్థానమునకు
జరుగు నెక్కురుబడుగుపిశాచ మనఁగ
మైలపట్టినమైచాయ మ్రాఁగి పడుచుఁ
బుండరీకుండు గౌతమీ భూమి కరిగె. 196

తే. అట్లు కతిపయదినముల కచట నచట
నాకలంబులు దినుచు నల్లల్లఁ జేరెఁ
బుండరీకుండు గౌతమీపుణ్యభూమి;
నంతఁ బాపక్షయమునకై యబ్జగర్భ ! 197

చ. చనిచని కాంచె విప్రుఁడు బిస ప్రసవప్రసరత్పరాగసం
జనితసుగంధబంధురలసజ్జలశీకరశీతవాతసం
తనిరుపమాన శైత్యనిరత ప్రతివర్ధిత సత్త్వసేవితా
దివియమ నైష్ఠికప్రతతి తీరములం గల గౌతమీనదిన్ (?)

వ. ఇట్లు కాంచి యనతిదూరంబునఁ గరంబులు మోడ్చి. 199

ఉ. రంగదనిద్రసుప్రవిరాజితపద్మసుగంధసమ్మిళ
ద్భృంగకనంగభంగకళి దీప్తకదర్ప కృశానుషంగ కా
శాంగనశీకరోత్కర సమగ్రతరంగకు మ్రొక్కె గౌతమీ
గంగ కభంగురాభ్యుదయకారణ కారుణికాంతరంగకున్ (?)

చ. తరఁగలపెల్లుఁ గ్రొన్నురువుతండము నొందుఁ జలత్కణావళీ
విరళతయున్ భ్రమీవలయవిభ్రమముల్ లహరీపరంపరా
సురుచిరభంగియుం జనముసొంపును బెంపెసలార వచ్చునీ
గరిమ త్రిలోకలోచన వికాసము సేయుఁగదమ్మ! గౌతమీ!

ఉ. కొండలు వ్రక్కలించి పటుకూలనిపాతము నాచరించుచుం
జండతరోగ్రనక్రముఖసత్త్వవిహారసముచ్ఛలన్మహా
ఖండతరంగహస్తములఁ గంకణముల్ వెదచల్లుచుం సము
ద్దండత వచ్చునీనిబిడదర్పము మెత్తుఁగదమ్మ! గౌతమీ! 202

వ. అని కొనియాడుచుం బుత్త్రకళత్రసహితుండై పుండరీకుండు
దత్పుణ్యవాహినీప్రవాహంబున నవగాహించి దప్పిదీఱ సలిల
పూరంబులు గ్రోలి దుష్కర్మవిముక్తికిం బాత్రంబై వెడలి
తత్తీరంబునఁ గొంతదూరంబు చని చేరువ నొక్కయగ్రహా
రంబు చూచి డాయంబోయి. 203

—♦ పుండరీకుండు భిక్షునకుం బోవుట ♦—

క. గ్రామోపకంఠమున నట
భూమిజ మొకం డున్నం జూచి పుత్త్రుని దారం
బ్రేమమున డించి భిక్షుని
భూమీసురుం డరిగెం బత్త్రిపుటహస్తముతోన్. 204

తే. బ్రాహ్మణుండు ధర్మపథము చేపట్టి యింక
*యువతిపుత్త్రావలోక నాభ్యుదయ మొంద
మనసు నుండుట దగ దని మాయసతియు
మాయబాలుండు నవ్వల మాయమైరి. 205

క. మాయాకారాగృహమున
బోయత యనుపాశబంధమునం బాపి రమా
నాయకుండు పుండరీకునిం
బాయక యింక దివ్యరాజ్యపదవియు నిచ్చెన్. 206

తే. అధికవిజ్ఞాననిధి యైన యవనిసురుండు
పుండరీకుండు త్రైలోక్యపూజితుండు
కోరికొని మాయ నీ దురాచారదశకు
వచ్చెంగాక యతండు దుర్వాంఛితుండె? 207

తే. ఉత్తమజ్ఞానశిఖి నేల్చు నొక్కవేళ
నురుకృపామృతమునం దేల్చు నొక్కవేళ
నెప్పు డెవ్వరి నటు సేయ నిచ్చగించు
నట్లు కావించు లీలార్థ మచ్యుతుండు. 208

* ప్రా. ప్రా, బంధుపుత్రా. (వలోకనభాగ్య మొంద?)

తే. ఉభయకర్మఫల ప్రాప్తి నొందఁజేయు
నుభయకర్మవినిర్ముక్తి యుగి నొసర్చు
నచ్యుతుఁడె కర్త యని యుండు నసఘమతికి
నొదవుఁ దుదియందు విష్ణుసాయుజ్యలక్ష్మి. 209

వ. ఆ సమయంబున. 210

క. తనమాయాపటలముదా
పున వారి సాక్షాత్కరింపఁ బూని వసించెన్.
విను! తెరలోపల వెలువడి
కనుపండువుగాఁగ నిలువఁగల నటులీలన్. 211

తే. జలధరచ్ఛన్ననక్షత్రసమితిఁబోలె
మాధవునిఁ గొల్చి తన్మహామాయతోన
నారదాది మునీంద్రబృందారకులును
జేరియుండిరి తత్కృపాశ్రీలు చూడ. 212

క. వా రున్నయట్ల నచ్చర
లారూఢవిమానలై సమంచితపుష్పా
సారములు గురియ నుండిరి
శ్రీరమణునియాజ్ఞ విప్రశేఖరుమీఁదన్. 213

వ. ఇవ్విధంబున భాగవతశ్రేష్ఠుండైన పుండరీకుండు, వేద
గ్రామంబున విష్ణుమంత్రాలయంబు ప్రవేశించి సంసార
క్షుధాతాపశాంతికై వైరాగ్యపాత్రంబున నుపనిషద్వాక్యం
బులచేతం గైవల్యలక్ష్మిం బరమానందామృతభిక్ష యడుగం
గోరియున్న యమ్మహాయోగి పుంగవుండు గావున నయ్యె

గ్రహారంబుఁ జొచ్చి యొక్క-పుణ్యగృహంబునకుం బోయి యభ్యంతరవర్తిని నయ్యిల్లాలిని 'భిక్షాం దేహి'యని పలికిన విని, యామె "యయ్యా వేళగాదు తిరిగి ర"మ్మనిన నాతండు వెండియు నిట్లనియె. 214

క. "అల్లదె! యాలును బిడ్డఁడు
నిల్లల నుడుకుచును నోర్వకున్నారు కడుం
బెల్లగునాఁకటిచిచ్చునఁ
దల్లీ! లేదనక భిక్ష దయ నిడు!" మనియెన్. 215

తే. పుండరీకుండు దాను నాపుచ్చుఁబోఁశి
తనకు లాంగన, యీయిల్లు తనది గాఁగ
నెఱుఁగనేరక భిక్ష దాఁ దఱిమి యడుగ
నాపతివ్రత పతిమాట పొట్టు యెఱిఁగి. 216

వ. ఇది యేమొకో భర్త నదికిం బోయి తీర్థం బాడి వేగిరంబ రాక తడవుచేసె మధ్యాహ్నంబు దిరిగెఁ, గుతపకాలంబు దప్పక బ్రాహ్మణుల నర్చింపవలయునని విచారించుచున్న దగుటంజేసి సావిత్రి యాలోననే "భిక్షాం దేహి" యనిన వేళగా దనినం బోక యాలుబిడ్డ లాఁకొన్నవా రని దయ దోఁప భిక్షార్థియై పలుక, నవ్వచనంబు తనమనసు చూడఁ బుండరీకుండు పలికిన కపటంపుఁబలుకు కని నవ్వుచు, నొక్క- తామ్రపాత్రంబు దోముచు నిల్లు వెడలి వచ్చి ముంగిట నున్నపతి నవలోకించి. 217

తే. ఎంతదడ వాయె యమునకుఁ నేఁగి మీరు
తీర్థమా డింత కపుడె యేతేరరాదె ?
పిదప నను నిల్లు భిక్ష వేఁడెదరు గాని
బ్రాహ్మణులఁ గొల్చి తెచ్చు శీఘ్రమునఁ బోయి. 218

వ. వేగిరంబ వచ్చి వంటయును వేళయును దప్పకుండ బ్రాహ్మణుల నర్చింపవలయు,నగ్నిహోత్ర దేవపూజా విధానంబు లాచరింప వలయు, నాయితము సేయు మనినవారు, నను నిల్లు బ్రమి యించుచు మాయలాడుచు వచ్చి మునివాకిట బెండువడి యూరకున్న వా రిది యే మనిన మాఱుత్తరం బీ నేరక కళవళించి. 219

చ. బ్రమసి యతండు నెండియును బట్టఁడు నా కశేసంబు పెట్టుము
త్తమసుచరిత్ర! తల్లి! యనిదైన్యముదోఁపఁగఁబల్కుచున్న నా
యమచలియించియేమియిదియక్కట!భూతముసోఁకఁబోలుఁద
న్నుమఱచియాడెడుంగడుమనోవ్యథయయ్యెఁడునేమిసేయుదున్

సీ. ధాతువుల్ దప్పిన తమకము చందమో
యక్షివిభ్రమము లే దదియుఁ గాదు
నీటిలో నకర్రంబు నిగుడ భీతిల్లెనో
యంగకంపంబు లే దదియుఁ గాదు
కార్యాంతరాసక్తి గల విలక్షణ్యమో
యార్తభావంబు లే దదియుఁ గాదు
బ్రహ్మవిద్యాతత్త్వభావనచలతయో
యానందలహరి లే దదియుఁ గాదు

తే. కానఁ దక్కిన వేమియుఁ గనుఁగొనంగ
నొంటి నది కేఁగి రాఁగ నత్యుగ్రభూత
వికృతి మైసోఁకుటయ తప్ప దకట ! దీని
కేది ప్రతికృతి చింతింప నెవ్వ రింక ? 221

సీ. ప్రత్యక్షవిష్ణురూపంబు సాలగ్రామ
మర్చించుభక్తి నిత్యైకనిష్ఠ
బ్రహ్మంబు హరియ కా భావించు నేకత
సావధానమున యోగానురూఢి
సంసారసుఖము నిస్సారంబుగాఁ జూచు
మృగతృష్ణికాజలముగఁ దలంచి
వైష్ణవమాయ సర్వముగ వితర్కించు
నారదాదుల బోధనంబు నమ్మి

తే. శుద్ధసాత్త్వికమూర్తి విశుద్ధబుద్ధి
సత్యసంధుండు కరుణాప్రసన్నముఖుఁడు
బ్రహ్మకులసంభవునకు నీపావనునకు
నిట్టిదురవస్థ ఘటియించితే విధాత ! 222

ఉ. ఈ దురవస్థ మాన్పి పరమేశ్వరుఁడార్యుఁ డనంతుఁ డచ్యు
తుం డాదివిధాత ధాత సకలాత్ముఁడు సర్వహితైకవర్తి దా
మోదరుఁ డార్తరక్షణగుణోదధి నా పతిఁ గాచుఁగాతఁ! ప్ర
హ్లాదు ధ్రువున్ గరీంద్రునిదయామతిఁగాచినయట్లయిత్తటిన్.

తే. భూతముల కెల్ల నాధారభూత మైన
విష్ణుఁ డీభూతవికృతి వే విప్పుఁగాతఁ !

బుండరీకుఁ డితఁడు నాపురుషుఁ డేని
యేఁ బతివ్రత నగుదునే నీక్షణంబ. 224

వ. అని, ప్రాకృతుల చందంబున నితరమంత్రతంత్రవిధానంబుల కుంబోక, యయ్యుత్తమపతివ్రతాతిలకంబు నిజపాతివ్రత్య మహాప్రభావజనితవిజ్ఞానవిశేషంబున సకలంబునకుం గర్త విష్ణుండ యని నిశ్చయంబు ప్రదీపించినం బులకించి యార్త జనశరణ్యుం డగు నారాయణుం బ్రార్థించిన. 225

—♦ పుండరీకునకు విష్ణుమూర్తి ప్రత్యక్షమగుట ♦—

మ. కురిసెం బువ్వులవాన లభ్రమున, దిక్కూలల్ నిండ శ్రావ్యంబులై
మొరసెందివ్యమృదంగనాదములు, సమ్మోదాప్సరోలాస్యముల్
బెరసెన్ దేవజయధ్వని స్ఫురణతోఁ బెంపారు తన్మాయయున్
విరిసెన్ ధర్మచరిత్రుఁడైన యతని న్వే ముంచి మంచుంబలెన్.

ఆ. సానఁబట్టినట్టి జాతి రత్నమువోలె
విప్రుహృదయ మపుడు విమల మయ్యె
విష్ణుమాయఁ బడిన విధ మెల్ల నింద్రజా
లముగఁ దలఁచి హరిఁ దలంచె నతఁడు. 227

వ. అంత. 228

సీ. వికచముక్తాఫలమకుటదీధితితోడ
ధవళలోచనములఁ దళుకు లెసఁగ
వజ్రకుండలసముజ్జ్వలగండకాంతితో
మందస్మితశ్రీలు మాఱుమలయ

నభినవకౌస్తుభప్రభలతో వక్షస్స
లస్థిరమాదీప్తిలతలు నిగుడ
స్వర్ణపీతాంబరచ్ఛాయతో జలరుహా
రాగకాంచీరుచిరాజి మెఱయ

తే. బాహుదండ సముద్దండ పద్మశంఖ
చక్రకౌమోదకీ మహాచ్ఛక్ర మొప్పఁ
దేజముల కెల్ల నుత్కృష్టతేజ మగుచుఁ
గరుణ లక్ష్మీశ్వరుండు సాక్షాత్కరించె. 229

వ. అట్లు డెందంబునకు వాక్కునకు నందరాని యమృతచిదానందస్వరూపం బగు నాదినారాయణదేవుండు ప్రత్యక్షుం బైన, నద్దేవుని శ్రుతిసీమంతినీ సీమంత సిందూరరజంబులగు శ్రీపాదారవిందంబులవలనం బ్రసరించు సరసిజోద్భవపురందర ప్రముఖ బృందారక పూజిత పారిజాత ప్రసూనదివ్య సౌరభ సౌభాగ్యంబును, శ్రీవత్సలాంఛన సులక్షితం బగువక్షస్స్థలంబున నిగుడు కౌతుకోత్సవ శ్రీపరిరంభ సంభ్రమ ప్రసక్త లక్ష్మీపయోధర గంధసార సురభిగంధ పరంపరా సారస్యంబును, జూర్ణకుంతల రేఖా బంధురంబగు ధమ్మిల్లవల్లీ బంధంబునం బొలయు గర్భకేతకీభూత కోమల శ్యామల తులసీ మంజరీమంజుపరిమళ ప్రవాహంబును, బహుప్రకారంబుల నాసికాపుట కుటీరంబులం బొగపులు వాఱు మనోహర శారీర భూరిరుచి నిచయచాకచక్యంబులును, దత్ప్రభల నల్లిబిల్లిగొను శంఖ చక్ర కనకాంబ రాభరణ కిరణ తరంగ

నమాందోళనంబులును, దన్మయూఖరేఖల నొరయు మంద స్మితకిరణ లోచనాంచల మరీచి చంద్రికా ప్రసరణంబులును, గప్పారి యొప్పు నవలావణ్య యౌవనసంపద్విలాసంబును, త్రైలోక్యసామ్రాజ్య మూర్ధాభిషేకలాంఛన ప్రాభవప్రసాద లక్ష్మీ ప్రభావాతిశయంబును, బెనుబండువు సేయం గన్నుల లానంద రసమగ్నంబులై నిగుడ సందర్శించుచు మోదమ్ముఁ గేలుదోయిమోడ్చి ప్రదక్షిణంబుచేసి యగ్రభాగంబున. 230

చ. సనకసనందన ప్రముఖసంయములూహ లొనర్చుతత్త్వము
న్వనజజముఖ్య దేవ పరివారము సేసెడు రాచవారలున్
ఘనతరభక్తియుక్తజన కామఫలప్రదదైవతంబునై
తనరెడునీవు నెచ్చెలి విధంబునఁ డోఁచితినాకు నచ్యుతా!

మ. దురితావాసము పుణ్యనాశనము చేతోజాడ్యమూలంబు సం
సరణం బాత్మకళత్రపుత్ర ధనదోష వ్యాధిపీడాకరం
బరయం జిక్కితి దీనఁ జాలు నిఁక నన్నుద్ధిం గటాక్షింపవే
హరి! నారాయణ కృష్ణ కేశవ ముకుందా దేవ దామోదరా!

క. ఈదుర్మోహపు సంసా
రోదధిఁ దరియింపఁజేయ నొండు గలదె మీ
పాదస్మరణప్లవ మొకఁ
డాదరువై నిలిచెఁ గాక యవ్యయపురుషా! 233

వ. అని మహాభాగవతశ్రేష్ఠుం డగుపుండరీకుండు పలికినఁ బుం డరీకాక్షుండు ప్రసన్నుండై గండమలంబునం గందళించు మందస్మితచంద్రికాపల్లవంబులపై జాఱిన ధవళధవళకటాక్ష

వీక్షణప్రసాదమధుర సుధాపూరంబున నభిషేకం బాచ్చి
ఘోరమాయా సంసారగహనదహనదందహ్యమానమర్మస్థా
నుండైన యతనిమనస్సంతాపంబు మాన్చి యిట్లనియె. 234

క. నీమనసు చూడఁ జేసిన
నామాయాకలన సుమ్మె నారదుఁ డలనాఁ
డీమేర నీకుఁ జెప్పఁడె
నీమది నటుగానఁ జూడు నిఖిలము ననఘా! 235

ఆ. అస్మదీయమాయ యఖిలజనంబును
మాయజగములోన మలఁగఁజేసి
పరఁగఁ గర్మపాశబద్ధులై సంసార
మోహదురితజలధి మునుఁగుచుండ్రు. 236

క. రాజసతామసమతములు
బీజంబులు మాయసోఁపు పెంపొనరింపన్
రాజిల్లుసాత్త్వికము ద
ద్వ్యాజముఁ దలఁగించి పరమధామముఁ జూపున్. 237

వ. కావున నహంకారమోహదూషితంబు లగు రాజసతామసం
బులు విసర్జించి యుత్తమసాత్త్వికజ్ఞానంబున నన్ను సాల
గ్రామస్వరూపు నారాధించిన నిన్ను మోహింపఁ దలంచి
కాదె నారదుని బంచి బ్రహ్మోపదేశంబు సేయించి యది
సోఁక వేఁడియు నీమనస్సంశయలేశంబు మాన్పుటకు నపూ
ర్వమాయావిలసితం బగు సంసారం బధిగమించి యేను బ్రతి
చ్ఛాయయుంబోలె దీపింపంజేసి దానఁ దగులుపెట్టి పూర్వ

జన్మాంతర కర్మశేషంబులు దొలంగించి యుచితపదం బొసం గుటకై యింతప్రయాసంబు నొందింపవలసె, నట్లు గావున నీవు నింక మోహవికార దూరుండవై యల్పసల్పాల కలుష వారిపంకంబున మునుఁగుచుఁ దేలుచుండు మహిమసంఘంబుఁ జూచు గోపాలుని చందంబున, నిద్రాముద్రితులైన వారి కెళవుననుండి చూచు జాగరూకుని మాడ్కి, మదిరాపానం బున మత్తిల్లి శిథిలీకృతాంగకములతో నింద్రియజ్ఞానంబు లేక నిద్రించు స్త్రీలనడుమ నింద్రియ భ్రంశంబు లేక పరి భ్రమించు శుద్ధాత్మునికైవడి, మాయావిషయ భోగంబులం జిక్కి మ్రక్కి పాపంబులం బొరలుచున్న మూఢుల నవలోకిం చుచు సమస్తవస్తు విస్తారంబునం దవంతర్బింబితతేజో విశేషుండ వగుచు సత్పురుషులం బ్రబోధించుచు భూలో కంబునం గొంతకాలంబు మహాభాగవతుండవై ప్రసిద్ధి వహించి తుది నాయం దైక్యముఁ జెందఁగలవని ప్రసాదించి హరి యంతర్హితుండయ్యెఁ, దద్వాక్యప్రమాణంబున నాపుం డరీకుండును బ్రహ్లాదనారద పరాశరప్రముఖ మహాభాగవత శ్రేష్ఠులతో జగద్వర్ణనీయుండై యట్లనె కొండొక కాలంబు బుధపుంగవులహర్షోత్కర్షంబుఁ గావించుచు హరి నారా ధించుచు నుభయకర్మ నిర్ముక్తుండై ధర్మకళత్రంబైన సావి త్రియుం దానును జ్వాలాసహిత ప్రదీపంబునుంబోలె సాల గ్రామగర్భబ్రహ్మ నిర్వాణ తేజస్సనాథుండయ్యె; నిది జగ ద్విఖ్యాతంబు. 288

క. ఈ పుండరీకచరితము
పాపపుసంసారతిమిర పటలం బడఁచున్
దీపింపఁజేయు బోధము
దీపము క్రియ మాయ యింటఁ దిరిగెడు వేళన్. 239

వ. అని యివ్విధంబున మార్కండేయ మహామునీంద్రుండు మునిబృందారకుల విస్మితులం గావించి విరించితో నిట్లనియె.

మ. జలజాతోద్భవ! పుండరీకుఁడు విశేషజ్ఞానియై యుండియుం
బలుపాట్లం బడె విష్ణుమాయ నీకఁ జెప్పన్వేఁడి నిర్వ్యాజని
శ్చలితబ్రహ్మవిదుండు గాఁడు నిలువన్ శక్తుండె తన్మాయకున్
వెలయం దత్కరుణాశ్రితుండు వెలిగా విశ్వంభరామండలిన్.

క. నావుడుఁ దద్వచనముఁ దన
భావంబునఁ దిరుగఁ దిరుగ భావించియు బో
ధావహితుఁడు గానేరక
యావిధి హరిమాయ ద్రిప్ప నప్పు డిట్లనియెన్. 242

మ. అకటా! యేమి మునీంద్ర! బాలుఁడవొ మూఢాత్ముండవో వెఱ్ఱివో, సకలబ్రహ్మమునీంద్ర దైత్యదివిషత్సంఘంబు నిన్మెచ్చునే, యొకమర్త్యాధముఁ బుండరీకుఁ దనమాయోపాయకృత్యంబులన్, వికలస్వాంతునిఁ జేసె నంచు గుఱిగా విష్ణుం బ్రశంసించినన్. 243

—♦{ బ్రహ్మదేవుఁ డహంకరించి యా విష్ణుమాయఁ దనపైఁ బన్నింపు మని మార్కండేయునితో వాదించుట }♦—

క. ఇన్ని కథ లేల చెప్పఁగ
విన్నఁచున్ మోసపుచ్చు టిది చిత్రం బే

పన్నిన మాయలు నాపైఁ
బన్నింపుము నిర్వహింపఁ బదిలుఁడ వైనన్. 244

క. ఆతనిచేఁ గాకుండిన
నీతపమునఁ గల్గు బల్మి నెరపుచు నైనన్
ఖ్యాతిగ నను భ్రమయింపుము
చూతము నీ కేమి యిదియె చోద్యము గాదే. 245

చ. హరి దనమాయ పన్నినను నందఱ వెఱ్ఱులఁ జేసినట్లు యీ
సురలు మునీంద్రులుం బొగడఁ జోద్యముగా భ్రమయించి
యో మునీశ్వర! యిఁక విష్ణుమాయ గెలువం దరమే యని
నీవు మెచ్చఁగాఁ । బరఁగెదుఁ గాక బ్రహ్మ మయి పద్మభ
వాండముఁ దాని యేలుచున్. 246

వ. అని క్రోధించి. 247

క. నేనున్ బ్రహ్మని హరిమా
యానాటకచక్ర విభ్రమాయత్తుఁడ నై
దీనుని గతిఁ దిరుగుదు నఁట
యీ నీచోక్తులును వింటిరే యెయ్యెడలన్. 248

క. ఈ సురసంఘము నీవును
నాసామర్థ్యంబు పద్మనాభుని నిజమా
యాసామర్థ్యముఁ జూచెద
రాసన్నం బైన వేళ యది యట్లుండెన్. 249

వ. ఇదిగో నేఁడు నేను జరాచర నిర్మాణ కర్మంబులు విసర్జించి
లోకపరిపాలనంబులు సాలించి నిర్విఘ్న పరబ్రహ్మ యోగా

ధీన మానసుండనై నిర్వాణ తత్త్వం బంగీకరించి యొక్క-విహిత పుణ్యస్థానంబునఁ దపంబు సల్పుచుండెద, నేఁ బాసి పోయిన వెనుక సృష్టి చీఁకట్లు గొని లోకంబులకు దిక్కు-లేక జంతులోకంబు చీకాకుపడకుండ నిర్వహింపఁజాలక నట్టి యింద్రజాలంబులు పన్నుకొని యాడుచు మిముబోంట్ల భ్రమియింపుచున్న విష్ణుండును నీవును, దేవముని సంఘంబు లతోడ వచ్చి జగత్పరిపాలనంబునకు నన్నుఁ బ్రార్థించు చున్నప్పుడు నిన్ను మందలించెదఁ గాక యని వృథాప్రతిజ్ఞ లాడ నేల యని దిగ్గునం గొలువు విచ్చి యా ప్రజాపతి యొక్క-రుండును ఖేచర గమనంబున మందరపర్వతంబునకుం జనియె నంత. 250

సీ. బ్రహ్మ పోయినఁ దోడిబ్రహ్మలు పోయిరి
సృష్టికిరియాటలఁ జిక్కు-పఱచి
వేదశాస్త్రాదిక విద్యలెల్లను మ్రింగి
యా సరస్వతి యత్త నాశ్రయించె
బ్రహ్మరథంబు నిర్వ్యాపార మైన నం
చేలు విచ్చి మానససరసి కరిగె
బ్రహ్మతేజస్ఫూర్తి పాసిన సత్యలో
కమునఁ జెంజీకటి గవిసియుండెఁ

తే. బద్మసింహాసనాగ్రంబు • పాడువాఱె
దాన సత్య తపో జ్ఞాన ధర్మపరులు

బ్రహ్మపదవాసులట భయభ్రాంతులైరి
తద్విధం బేమి చెప్పుదు ధర్మతనయ! 251

సీ. ప్రభ మాసె నర్కబింబంబునఁ జంద్రికల్
సడలెఁ జంద్రునియందు జాతవేదు
దాహకత్వము మానెఁ దారాగ్రహచ్ఛాయ
లెడలె నోషధులయం దంకె సత్త్వ
మబ్ధిఁ దరంగంబు లడఁగె నేఱులవేగ
ముడిగె వాయువులు వీయుటలు దక్కెఁ
గాలమార్గంబు వక్రత నొందె జనతపః
క్రతుకర్మధర్మసంగతులు పొలిసె
తే. జననములు లేక జంతుసంక్షయము గలిగె
దైత్య ముని దేవతా కోటి తల్లడిల్లె
బ్రహ్మతేజంబు వాసిన పద్మజాండ
మండలం బెల్లఁ జీఁకటి గ్రమ్మునపడియె. 252

— మార్కండేయునకు విష్ణుమూర్తి ప్రత్యక్షమౌట —

క. ఆ యజ్ఞుఁడు పోవ శూన్యం
బై యుండిన జగముఁ జూచి యచ్చెరువడుచుం
బోయిరి సురాసురాదులు
నాయెడ గమి విచ్చి బెగడి యన్యోగతులన్. 253

ఉ. అంతయు నామృకండుసుతుఁడాత్మఁ గనుంగొనిపద్మయోని న
త్యంతవిమోహుఁగా వగచియవ్విధిలోకము లెల్లమాయుచోన్

జంతువినాశ మై సృజన చాలక కాలము విన్న నైన శ్రీ
కాంతు భయాపహారిఁ ద్రిజగత్ప్రతిసంస్మరియించెభక్తితోన్.

వ. అట్లు కన్నులు మూసికొని యంతర్ధ్యానంబున సంస్మరించిన
నాక్షణంబ. 255

క. దినకరకోటి ప్రభతో
మునిముందటఁ దోఁచి పలికె ముదమున మేఘ
ధ్వనిఁ గేవలుఁ డవ్విష్ణుఁడు
జననాయక! యమృతధార జాఱెడుభంగిన్. 256

చ. పరమమునీంద్ర సంస్తవనపాత్రచరిత్ర ! మృకండుపుత్ర ! నీ
గురుపరమార్థబోధమునకున్ మది గోల్పక బ్రహ్మ దా నహం
కరణపరాయణత్వమునఁ గానక నన్ను నధఃకరించి దు
ష్కరతరపీడ చేసెఁ ద్రిజగంబుల కంచుఁ దలంక నేఁటికిన్.

వ. అని నిజాభిప్రాయం బెఱుకపడం బలుకుచు ముందట బ్రహ్మ
తేజోరూపంబున నున్నం గన్నులు విచ్చి మార్కండేయుండు.

క. అవ్యక్తుఁ డైన విష్ణుని
సువ్యక్తధ్యానయోగసుందరమూర్తిన్
దివ్యజ్యోతిర్మండలు
నవ్యాహతశంఖచక్రహస్తునిఁ గనియెన్. 259

చ. కనుఁగొని యశ్రుబిందువులుగాఱఁగ నంజలిబంధ మొప్పఁగాఁ
దనువునఁ గంటకాంకురవితానము లీనఁగ భక్తి గద్గద
స్వనమున వేదవాక్యముల సన్నుతిఁజేసె మహాద్భుతోత్సవం
బునఁ దనుఁదా నెఱుంగక ప్రమోదసుధాంబుధిఁ దేలలాడుచున్.

క. నారాయణ ! దేవ! కృపా
పారాయణ ! భక్తలోకపాలన ! విద్యా
కైరవచంద్రోదయ ! మా
యారమణీరమణ! యక్షయానందనిధీ ! 261

క. కేవల మగునీతత్త్వము
భావింపఁగ నెంతవాఁడ భవదీయకృపాం
భోవాహసుధాధారల
నీవిభవము గలిగెఁగాక యీశ్వర నాకున్. 262

వ. దేవా ! విధాతదుర్నీతింజేసి భువనంబులకు నపాయంబు వాటిల్లెఁ బ్రాణిగణంబు సంక్షీణం బయ్యె, భయభ్రాంతులై సురాసురవరేణ్యులు దిరుగుచున్నవారు, వీరిం గరుణించి లోకంబుల కభయదానంబు ప్రసాదింపవే యని ప్రార్థించిన నా పరమపురుషుం డిట్లనియె. మునీంద్రా ! లోకంబులు మదీయమాయానిర్మాణంబు లని కానక విధాత తనచేత సృష్టంబులైన వని యహంకరించి దురభిమానంబున నిట్లు చేసినవాఁడుగాక! లోకంబుల కతనిచేత నపాయం బెట్లు ప్రాప్తించు? నతనిదృష్టి కట్లుదోఁచె నంతియ, చక్కఁ జూడు మని దివ్యదృష్టిం బ్రసాదించినఁ జరాచర ప్రమోదధామంబులై చంద్రసూర్యపావక ప్రభాభిరామంబు లయి జగంబులు గానవచ్చిన నచ్చెరువంది మార్కండేయుండు వందనసహస్రంబు లాచరించిన, నతని మన్నించి వెండియు నిట్లనియె.

ఆ. అస్మదీయమాయ యఖిలంబు ననక తా
బ్రహ్మననుచు లోకపతి నటంచు
యోగి ననుచు నున్నయుబ్బెల్ల నడఁగించి
పిదప లోకమునకు ముద మెసఁగు. 264

వ. కొండొక కాలంబు చూచుచుండు మని తన యభిప్రాయం
బెఱిఁగించి హరి యంతర్హితుం డయ్యె నంత. 265

—♦ బ్రహ్మదేవుఁడు తపస్సు చేయ మందరగిరి కరుగుట. ♦—

సీ. రాజేంద్ర ! విను మట్లు రాజీవసంభవుం
డాగ్రహంబున మందరాద్రియందు
నుగ్రతపంబు సేయుటకునై పోవంగ
నడుమ ననేకవిఘ్నములు దోఁచె
మదిమది నుండి బ్రహ్మపదంబు వాయుట
గా దని మ్రోసె నాకాశవాణి
హరిమాయఁ గడవరాదని యెక్కువెట్టున
దర్పించి పలికె భూతవ్రజంబు

తే. తలఁప నట్లన యోగఁదా తండ్రి దైవ
మనక యవమాన మొనరించు నధమజాతి
కేఁటివిజ్ఞానసంపద ? యేఁటితపము ?
యేల సిద్ధింప నేర్చు నభీష్టఫలము ? 266

క. అతిరాజసతామసమతు
లతులానందప్రకాశ మగుయోగకళా

రతి నిర్వహింప శక్తులై
సతతబ్రహ్మజ్ఞశుద్ధసాత్త్వికులగతిన్. 267

క. కనుఁగొనిరి మెట్లు చని య
వ్వనరుహసంభవుఁడు మణిసువర్ణమయోద్య
ద్ఘనశృంగసంగత స్వ
ర్వనితాసాహస్రసుందరము మందరమున్. 268

వ. కని యమ్మహానగం బధిరోహించి. 269

సీ. సరళాదిపాదపచ్ఛాయలఁ జిన్ముద్ర
నురుతరధ్యానులై యున్నమునుల
సానుదేశంబుల సమధికనిష్ఠతోఁ
బంచాగ్నితప్తులై పరఁగుమునులఁ
దలక్రిందు గాఁగ శాఖలయందు వ్రేలుచు
నత్యుగ్రనియతిఁ బెంపారుమునులఁ
గందరాగర్భంబులందుఁ బాములు పాఁక
దృఢయోగరూఢి వర్తించుమునుల

తే. నిరశనవ్రతజపముల నెగడు మునులఁ
గేవలబ్రహ్మకళఁ బరికించు మునులఁ
గాంచె లక్షోపలక్షలఁ గమలభవుఁడు
ధరణినాయక ! యమ్మహీధరమునందు. 270

చ. అనలరవీందుమండలసహస్రసముజ్జ్వల దీప్తులోలిఁ బ
ర్వినక్రియనమ్మహీధర వరేణ్యమునందుఁ దపం బొనర్చున

మ్మునుల (నఖండతేజుల విమోహతమోహరణైకదక్షులన్
గనుఁగొనియప్పుడక్కమలగర్భుఁడుతద్దయుసుప్రసన్నుఁడై.)

ఉ. (ఎట్టిఫలంబులం బడయ నెంచి తపించుచు నున్నవారొ వీ)
రిట్టి తపఃప్రభావులకు నిచ్చునభీష్టవరంబు లెట్టివో
గట్టిగ వీరి కేను బొడకట్టి తదర్థము లిచ్చు టొప్పు ని
ప్పట్టున నంచు దివ్యరుచి పర్వఁగ డాసి విధాత యిట్లనున్.

క. మెచ్చితి మీతపముల కే
నిచ్చెదఁ బ్రార్థింపుఁ డెద్ది యేనియు ననినం
జెచ్చెర నతులై యమ్మును
లిచ్చిరి మాఱుత్తరంబు లెలన వ్వొలయన్. 273

క. మాకోరిన వర మొసఁగఁగ
నీకు నశక్యంబు పొమ్ము ! నీరజభవ ! నీ
కే కాదు నీవు మొదలుగ
శ్రీకంఠాదులకు నైనఁ జింతింపఁ దగన్. 274

వ. అది యెయ్యది యంటేని. 275

ఉ. దానము సత్యముం దపము ధర్మము యజ్ఞము బ్రహ్మవాదవి
జ్ఞానము ధైర్యముం గలిగి సాత్త్వికులై పరమార్థవేదు లె
వ్వాని కృపావిశేషమున వర్ధిలు చుండ్రు విమోహముక్తి,నా
శ్రీనిధిమాయ గెల్చుటకుఁ జేయుట మాతప మబ్జసంభవా!

వ. తన్నిమిత్తంబునంజేసి తదధినాయకుండు విష్ణుండు గావున
నద్దేవదేవునింగూర్చి తపంబుసేయుచున్నవారము, నిన్నుఁ
గోరికాదు, సమర్థుండ వైతివేని యధిదేవతవై మాతప

ఫలంబులు స్వీకరించి యవ్వరం బొసంగుము, నీకసాధ్యం
బగునేని నీవు పోయెడిక్రోధం బొమ్మనిన నవ్వరించి క్రోధించి.

సీ. సంయమీశ్వరులార ! సకలవేదాగమ
విద్యారహస్యముల్ వెదకినారు
ప్రాజ్ఞులు మహితతపస్విష్ఠు లిట్టి మీరా
రజ్ఞులభంగి నిట్లాడఁ దగునె
సచరాచరము లైన జగములు గల్పించి
యఖిలంబునకుఁ గర్తయైన నన్ను
బ్రహ్మదేవునిఁ గూర్చి ప్రార్థించునర్థమే
విష్ణుమాయాజయ వికటబుద్ధి ?

తే. మృత్యురాక్షస శత్రుదారిద్ర్యజయ మె
విష్ణుమాయాజయం బని వేఁడలార !
బ్రహ్మశివవాసవాదిత్యపదనిరూఢి
యడుగ కెట్లడిగితి రిట్టి యధమవరము. 278

క. దాకొని మార్కండేయుఁడు
ప్రాకృతులను బోలె మిమ్ము భ్రమయించెనొకో
కాక, యభేద్యము హరిమా
యాకల్పన మనుచు బ్రహ్మ మచ్యుతుఁ డనుచున్. 289

వ. అట్లు కాఁబోలుంగాక లేకున్న మీకు నీవృథావిష్ణుమాయా
భ్రాంతి పుట్టునే, మిమ్ము బోధించినట్లు విరతింబుట్టించి దివ్య
పదభ్రష్టులం గావించి యేకాకులం జేసి యనేకులఁ జీకాకు
పఱచె. నదియునుం గాక, దేవమునిసంఘంబులలో నేఁడ

నాసమ్ముఖంబున నాసృష్టియెల్లనుం దృణీకరించి సర్వంబును విష్ణుమాయగాఁ బ్రతిష్ఠించి విష్ణుని బరబ్రహ్మంబుగా నూఁది, నన్నుం దిరస్కరించె, దానికి నేఁ గోపించి శాపదగ్ధునిం జేయం దలంచి, శాపదగ్ధునింజేయుట పౌరుషహాని యని వితర్కించి యది విసర్జించి సర్వంబును విష్ణుమాయ యను నతని యవివేకంబు మాన్పి పిదపం జేయవలసినట్లు చేసెద నని లోకంబులు శూన్యంబులు గావించి యేకాంతంబునం దపంబుసేయువాఁడ నై వచ్చితి, మీఁదటిపనుల మాటం జెప్పనేల నాకంటె విష్ణుండు సమర్థుం డయ్యెనేని మీవరంబులు వేఁడుకొం డని వారికడం దొలంగి శిఖరాగ్రంబునకుం బోయి వజ్రకీటరూపంబున శిలాపటలంబు భేదించి తదగ్రంబున లోపలం జొచ్చి దశయోజనవిస్తారంబుగా నొక్క గుహాం గల్పించి. 280

—♦ బ్రహ్మ తప మారంభించుట. ♦—

సీ. తనపూర్వరూపంబు దాల్చి నిజప్రాభ
వంబున నొక్కనసనంబుఁ గొలనుఁ
గల్పించి తిమిరవికల్పనార్థము బ్రహ్మ
తేజము దివియగా నోజపఱచి
తత్సరస్తీరమందారభూజమునీడ
విమలచంద్రోపలవేదిమీఁదఁ
బంకజాసనబంధబంధురుం డచలుఁడై
యంతర్నిరీక్షణం బాచరించి

తే. బ్రహ్మ నిర్వాణతేజంబు భావవీథి
ధ్యానమొనరించునిలుకడ దప్పి యపుడు
లోకములు లోకగతియును లోకకృతియు
సంస్మరింపంగఁ దొడఁగె నాజలజభవుఁడు. 281

తే. అచలితధ్యాననియతి బ్రహ్మంబుఁ గాంచి
చిదమలానందరససుధాశీకరముల
నాత్మఁ దనుపంగ లేఁడాయె నబ్జసూతి
యట్లు సిద్ధించునే విషయాతురునకు? 272

క. విరతి యెఱుంగక యోగా
చరణంబున ధ్యాని యైన జనునకు బ్రహ్మ
స్థిరబుద్ధి యేల తోఁచెడుఁ
బొరిఁబొరి సంసారకృత్యములెకాక మదిన్. 283

మ. పరమబ్రహ్మము ధ్యేయముస్ ఫలమునున్ భావింపఁగా వైష్ణవో
ద్ధురయోగ స్ఫురణంబ, యోగితతికిన్ ద్రోవన్ విచారించినన్
సరసీజాసనుఁ డట్లెఱింగియును దన్మాయాపరిభ్రాంతి నా
పరమాత్మవ్యతిరిక్తయోగమె మదిన్ భావించె నుర్వీశ్వరా!

వ. ఇవ్విధంబున, ననన్యభేద్యం బగుమందరగిరిగర్భంబున నిశ్చల సమాధిం గన్ను దెఱవక పదివేల దివ్యవర్షంబులు తపంబు చేసె, నంత నొక్కనాఁడు సర్వాంతర్యామి యగువిష్ణుని మాయాబలంబున. 285

సీ. స్వర్ణరంభాతరుస్తంభసంభృతము వి
ద్రుమఖండవలభీ ప్రరోపితంబు

విలసితకుందకుట్మల మౌక్తికశ్రేణి
కరవీరదళవిటంకవ్రజంబు
మాలతీజాలకమార్గంబు నవకేత
కచ్ఛదఫలకప్రకల్పితంబు
కహ్లారతోరణకలితంబు మల్లికా
పుష్పవితానసంపూర్ణంబు

తే. పద్మకోరకకనకకుంభస్ఫుటంబు
చూతలతికాచతుర్ద్వార శోభితంబు
బహుళబహువిధపరిమళబంధురంబు
నగుచు నొకమేడ సంభూతమయ్యె నచట. 286

క. చంద్రాధిదేవత యనం
జంద్రసమానాస్యహాసచంద్రికశోడం
జంద్రకులేశ్వర ! వాణీ
చంద్రానన యయ్యె మాయ, శౌరిమతమునన్. 287

ఉ. శ్రీమదహార్యమఖద్యుమణి చెల్వున నుజ్జ్వలరాగరేఖఁ జూ
డామణి మీఱఁ దారలఁ దడంబడఁజేయఁగఁజాలుతారహా
రామలదీప్తి పర్వఁగ ననంగధనుర్గుణ భృంగఝంక్రియో
ద్దామ సువర్ణనూపుర పదద్వయితో సతి యొప్పెఁ జూడఁగన్.

చ. కనకముఁ జెక్కిపుచ్చిన ప్రకారమునన్ గిఱికొన్న నన్నియం
దనరునితంబబింబమును దామరమొగ్గల యగ్గలంబుఁ గా
దనుకుచకుంభయుగ్మము, నుదగ్రసుధారసపల్లవోష్ఠముం
గనుఁగొన నొప్పు నింతికి జగత్త్రయచిత్రచరిత్రసంపదన్.

సీ. నెత్తమ్మిఱేకుల నెఱిమించునడుగులఁ
గ్రొత్తలత్తుకనీరు గులుకుచుండఁ
గోమలరంభాభిరామంబు లగు తొడల్
బిగియారునునుఁజాయనిగల నిగుడఁ
గలికిజక్కవసోయగము మీఱు కుచకుంభ
సౌభాగ్యగర్వంబు సంభ్రమింప
మరునారసంబులమాడ్కి మిటారంపుఁ
గ్రొవ్వాఁడి కొసగోళ్లు నివ్వటిల్ల
తే. నలరుఁగెమ్మోవి నమృతపానంబు నోలఁగ
వెడఁదకన్నుల మదరేఖ విస్తరిల్ల
మనసునిండిన నిండు జవ్వనముతోడ
మరులుగొలుపంగఁ దొడఁగె నమ్మాయమగువ. 290
సీ. కుచముల మెత్తిన కుంకుమగంధంబు
నీ రనురాగంబు నెలవు చెప్ప
నిటలభాగంబున నెలవంకకస్తూరి
కారేఖ వలపుఁజేఁకట్లు గొలుపఁ
గొప్పునఁ దుఱిమిన గొజ్జంగరేకులు
నెత్తావిపవనంబు నిర్వహింప
వలుఁదపిఱుందుపైఁ జెలువారు వెలిపట్టు
వలువ వెన్నెలరేకవన్నెఁ దాల్ప
తే. నాసికారత్నతాటంక నవ్యహార
చారుకంకణ కాంచిమంజీరరుచులు

మేలి తనులక్ష్మి కొనఁగునివాళి గాఁగఁ
జెలువ రతియోగ్యభూషణశ్రీలఁ దోఁచె. 291

మ. మదగర్వంబును యౌవనోదయము రమ్యత్వంబు మాధుర్య
ము౯ మృదులాలాపదరస్మితాంశుకలనాస్మేరాననాబ్జంబు పెం
పొదవన్ మన్మథరాజ్యలక్ష్మి క్రియ నేత్రోత్సాహసంపత్కళా
సదనంబై విలసిల్లె నాకపటభాషాదేవి లీలాగతిన్. 292

ఉ. అంగనయంగదీప్తి యమృతాంశుమయూఖతరంగరేఖ ను
ప్పొంగుచు దీప్తమై యచటఁ బొల్పనలారెడు బ్రహ్మతేజమున్
భ్రమఁగఁ బడంగఁజేసె నభిరామ గుణం బెఱఁగఁ జెప్పనేల యా
య్యంగజదివ్యతేజమున కగ్గమె యావెడబ్రహ్మతేజమున్.

క. అమ్మాయపాలఁతిఁ జూచిన
నమ్మాయానాటకుండు హరి దానైనన్
నెమ్మది ధైర్యము వదలఁడె
యిమ్మెయిఁ జపలాత్మ బ్రహ్మ నేఁటికిఁ జెప్పన్ ? 294

తే. ఆవిలాసిని రసహావభావలీల
మరుఁడు బహురూపధారియై మానవేంద్ర !
నిశితపుష్పాస్త్రపూర్ణతూణీరసహితుఁ
డగుచుఁ గార్ముకగుణనాద మడరఁజేసె. 295

క. వెన్నెలరేకు విధంబునఁ
జెన్నగు వెలిదమ్మిపువ్వుచే నలరుచు న
త్యున్నతడోలాతల్పం
బన్నలఁతుకదండ రతులయానలఁ జూపెన్. 296

క. ఉల్లోల మదనసాగర
కల్లోలం బనఁగ డోలికాపర్యంకం
బల్లన గాడ్పునఁ దూఁగుచు
న ల్లలనాహంసి కాశ్రియంబై యొప్పెన్. 297

వ. ఇట్లు త్రిలోకవిజయధ్వజిని యగురతిరాజు తేజంబునకు వన్నె వెట్టుచుఁ గన్నులకు వెక్కసం బైన చందం బై యమ్మాయా సరస్వతి సనత్కుమారికావరునిశాసనంబు శిరంబునం దాల్చి వాసనావశంవదమదాళిజాతం బగుచు సురతసమర ఖురళీ నివాసం బై యొప్పు నప్పువ్వుమేడలోన మధ్యప్రదేశంబునఁ బువ్వుపీఠంబున సుఖాసీనయై పురోభాగంబున వాహన హంసంబును, గెలంకున వజ్రపంజరంబునం బ్రియకీరరమణి యు నుండ నియమించి, కుచకుంభంబునఁ బసిండివీణె మోపి జాజుపయ్యెదతోఁ గర్ణావతంసకహ్లారసురభిళమధూళిబిందు సందోహంబునకుం బరిభ్రమించు చంచరీకాంగనలు వట్టు శ్రుతు లంగీకరించి కరాంచలంబులం దంత్రులు మీటుచు మధురగానంబున బ్రహ్మనాదంబు గూర్చి బ్రహ్మవశీకార కామరాజమంత్రి కలితశృంగార గీతంబులు పాడుచుండె నప్పుడు. 298

క. గోపాల వేషధరుఁడై
శ్రీపతి వేణుస్వనంబు చెలఁగించు క్రియన్
బ్రాపించెఁ దన్మహామా
యాంపాటలగంధివీణియయు నునుమ్రోఁతన్. 299

వ. వెండియుం దనకుఁ దానే సంకల్పదశావిశేషంబున. 300

—♦ మాయాసరస్వతి మదనవికారములఁ గనఁబఱచుట.♦—

సీ. కన్నీరు నించుఁ దొంగలిరెప్ప లల్లాడ
నొకమాఱు ప్రియుఁడు రాకునికిఁ జేసి
కంపించు నొకమాఱు కౌఁదీఁగె చెమరింప
భర్త కౌఁగిటఁజేర్పఁ బట్టె ననుచు
నవ్వులఁ దేలు నానన మొప్ప నొకమాఱు
పతితోడ భావించు భావరతికిఁ
బులకించు నొకమాఱు వలపుఁజన్నుల క్రేవ
లదర వల్లభులీల లాత్మఁ గోరి
తే. యంగజుఁడు వెల్లిగొల్పంగ నంగకముల
నెల్లఁ గళ జాఱ ధైర్యంబు పల్లటిల్ల
బ్రహ్మదేవునిపైఁ బ్రేమఁ బాఱవిడిచి
వీణియను మీటి పాడుచు విద్రుమోష్ఠి. 301

వ. ఇవ్విధంబున నవయౌవనమదోద్రేకంబున నుప్పొంగుమన్మథ రసోల్లాసంబున నవ్విలాసిని యలవోకగా వీణె వాయించుచు బ్రహ్మదేవునిం బ్రేరేపఁ దివురుచుండె నాసమయంబున.

క. ఆరామపుష్పమాలా
శారీరసుగంధభరము సన్మందమరు
త్ప్రేరితమై పైఁ బర్విన
సారసభవు నింద్రియములు సంచలియించెన్. 303

క. పై గాలి వాఱినంతనె
యోగము చెడి మనసు గరఁగ నొగి బ్రహ్మకుఁ గాం
తాగురుకుచపరిరంభా
భోగంబున నేమి చెప్పఁ బురుషులతలఁపుల్ ? 304

క. తన దీర్ఘయోగభావన
కోనసాగక యింద్రియములఁ గోరెడు మది న
వ్వనజజుఁడు తాల్మి చాలక
తనువున మరుమోహాలహరి దగులుకొనంగన్. 305

వ. కొంతదడ వెద్దియుఁ దలంపనేరక యూరకుండి యీవివిక్త ప్రదేశంబునఁ జిత్తంబు మదనాయత్తం బయ్యె; దీనికిఁ గతం బేమి యనుచుఁ గన్నులు విచ్చి యచ్చట నచ్చవెన్నెల చాయం బ్రజ్వరిల్లుచు బ్రహ్మతేజంబు నధఃకరించి యమృత ప్రవాహంబుచందంబున నయనానందకందంబై దండడించు నమ్మించుఁదీఁగెఁబోఁడి మైచాయం జూచి యిది యేమిదీప్తి యొకో, తెలియవలయు ననుచు లేచి ముందట మన్మథ పుష్పకంబునుం బోని పుష్పమేడం గనుంగొని వెఱఁగుపడుచు డాయంబోయి. 306

మ. శ్రవణోత్తంసవినీలనీరజ గుణాశాసంభ్రమద్భృంగమం,
ద్విరావశ్రుతి వీణె మీటుచు సుధాధారామనోహారిగా
న విశేషంబునఁ గంటకాంకురవితానస్వేదముల్ పైకొనం
బువుగద్దెన్ విలసిల్లుచుం గలికియై పుష్పాస్త్రమేకొల్పుచున్.

క. గురుకుచములఁ బయ్యెదకొం
గర జాఱఁగ మేనుమఱచి యనురాగముతోఁ
బరిపరివిధములఁ దను నా
దరమున నంకించి పాడు తరుణిం జూచెన్. 308

—♦ బ్రహ్మదేవుఁడు మాయాసరస్వతిని జూచి మోహించుట. ♦—

క. కన్నులకు వెక్కసంబై
యన్నెలఁతుక మదనపరవశాకారవిలా
సోన్నతి శతధృతిధృతి యను
మున్నీటికి మందరాద్రిమూర్తి వహించెన్. 309

వ. ఇవ్విధంబున నుల్లంబు పల్లవింపంజేయునావల్లవచరణ చరణ రమణీయత్వంబును, నారంభోరు నూరుచారుభావంబును, నాపులినజఘన జఘనఘనత్వంబును, నానతనాభి నాభిసౌభాగ్యంబును, నాతనుమధ్య మధ్యానవద్యత్వంబును, నాలతాంగి యంగలాల్యంబును, నాగురుకుచకుంభ కుచకుంభ గాంభీర్యంబును, నాబిసరుహహస్త హస్తప్రశస్తలావణ్యంబును, నాకంబుకంఠి కంఠసముత్కంఠితవిభ్రమంబును, నాచంద్రవదన వదనప్రసాదమాధుర్యంబును, నాబింబాధర యధర సుధారసధారయు, నాసుదతి దంతపంక్తి సొబగుకాంతియు నామృదుకపోల కపోలపాలికాలాలిత్యంబును, నాచంపకనాస నాసికానిశ్వాససౌరభ్యంబును, నాచకోరాక్షి యక్షికటాక్ష తీక్ష్ణతయును, నాసుకర్ణ కర్ణవర్ణనీయశ్రీకారరేఖయు, నాం శీతాంశుఫాల ఫాలభాగపరభాగంబును, నానీలకచ కచనిచయ

చాకచక్యంబును, నాసుకుమారి సౌకుమార్యంబును, నా సుందరి సౌందర్యంబును, నాయువతి యౌవనగర్వంబును, నావిలాసిని విలాససామగ్రియుఁ గౌతుకాశ్చర్యధుర్యంబగు మనంబున నేకాగ్రదృష్టిం దృష్టించి వాంఛాతిశయంబున.

క. ఈ లీలావతికౌఁగిలి
చాలదె తాదాత్మ్య మొసఁగ సమధికయోగ
జ్వాలాముఖగతసౌఖ్యం
బేలా కాంక్షించెదరు మునీశ్వరు లాత్మన్? 311

క. ఈలలనయౌవనాంబుధిఁ
దేలక యోగాగ్నిశిఖలఁ దేలెడునామే
నేలాగునఁ జల్లాఱెడుఁ?
జాలు జితేంద్రియతఁ గల్గు సౌఖ్యము లింకన్! 312

వ. ఇదియ మదీయతపఃఫలంబు, నాతపోఽధిదేవతయ యీరూపంబునఁ బ్రత్యక్షం బైనయదిగాక, కేవలస్త్రీమాత్రంబున కీచటికిం బ్రవేశింప నెట్లువచ్చు నని తనప్రయత్నంబు మఱచి పట్టుకొనఁ దలంచి కదియంబోయి. 313

క. ఒకచో వాహనహంసము
నొకచోఁ బ్రియకీరరమణియును, జేత విపం
చికయును నుండఁగ భారతి
యొకో! యని యటఁ గొంతనిలిచి యొయ్యనఁ జూడన్. 314

ఉ. ఆచపలాక్షి యంతఁ దన యానన మించుక యెత్తి ముందటం
జూచె సరోజసూతి, మరుదొక్కునఁ బట్టఁ దలంచుచంచలుం

జూచి విపంచి డించి నగుచుం బుపుగద్దియ డిగ్గ మేఖలా
కాచ కలధ్వనుల్ చెలఁగఁగాఁ బయికొంచుదొలంగ గ్రక్కునన్.

క. పుపుగద్దె డిగ్గునడి నునుఁ
బువుఁదీగెంబోఁడి తుఱుము పువ్వులు రాలన్
బువువిలుతు నక్షయములగు
పువుఁదూపులువోలె బ్రిహ్మాబుద్ధి గలంగన్. 316

తే. అట్లు చని తూఁగుటుయ్యెల యవలికేఁగి
ముదిత తల్పంబుమాటున కొదుఁగఁ బోవఁ
దనమనం బూనపఱచి యాతమ్మిచూలి
యంగజోద్రేకమునఁ బైఁటకొంగు పట్టె. 317

ఉ. పట్టిన లజ్జయున్ భయముఁ బాటిల, మై గరుపాఱ లీలమై
గొట్టునఁ బట్టనీక పెనఁగొంచుఁ గరంగుచునున్నఁ, బోక యా
దిట్టమగండు ప్రేముడిఁ దదీయ విధం బరయంగఁ గోరి లోఁ
దొట్టెడుకోర్కి వెల్లువలఁ దోఁగుచు నిట్లనియెన్ మృదూక్తులన్

క. బాలా నీవెవ్వరు ? నీ
వేలాగున వచ్చియుంటి ? విచ్చట నీకీ
కేళీగృహ మెట్లాదవె? గు
ణాలంకృత ! చెప్పవే ప్రియంబున నాకున్! 319

క. నీపేరు చెప్పి మధురా
లాపసుధాధారచేత లలన ! మనోభూ
చాపధ్వని నిర్ఘాత మ
హాపరితాపంబు మాన్పుమా కృపతోడన్! 320

వ. అని కామార్తుండై యద్ధైర్యంబు దోఁపఁ బలుక నప్పలుకుఁ బోటి యిట్లనియె. 321

సీ. దేవ ! మహాత్మ ! నీదేవి నన్నెఱుఁగవే
సేవకురాలి వాణీవధూటి ?
నట్లు మార్కండేయుఁ డాడినఁ గోపించి
యబ్జజాండంబు శూన్యంబు చేసి
మీరు విచ్చేసిన మీతోడఁ గూడి యీ
గుహకు నేతెంచితిఁ గూర్మితోడ
బ్రహ్మవలోకనపరత నాపై దృష్టి
యునుప కుండితి గాక యుగ్రనిష్ఠఁ
తే. దావకాయల్లకార్తి సంతాప మంది
నాఁటనుండియు మిముఁగూర్చి నాన విడిచి
చేయుచుండుదుఁ దప మిట్లు చిత్తభవుని
బారిఁ బడలేక యాలీలఁ బరిఢవించి. 322

క. దేవ ! మహాయోగివి నీ
కీవిధమున నార్తిఁ బొంద నేఁటికి? నే నీ
దేవిని స్వకీయఁ గానే ?
కావింపుము చిత్తకాంక్షఁ గరుణాదృష్టిన్. 323

వ. అనిన నెవ్వరు నెఱుంగనియేకాంతస్థలం బగుటకు, నితర సామాన్యస్త్రీగాక స్వతంత్రకులపాలిక యగుటకు సంతోషించి యంతరంగంబున నుప్పొంగుననంగ సాగరకల్లోలంబుల మునింగి నిర్నిరోధంబుగ నయ్యంగనం గవుంగిలించి మించుఁ

దూఁగుటుయ్యేల యెక్కించి పంచశరకేళీప్రపంచంబు విస్త
రించి నలసినట్లు పెక్కువేలేండ్లు గ్రీడించె. 324

తే. ఊర్ధ్వగేతిస్కంధై దృఢయోగశక్తిఁ
బటుతపోజ్వాలఁ గ్రాఁగు తపస్వి యైనఁ,
జెదరు సతిఁ గన్న; వాణీశుఁ జెప్పనేల?
మనసు పండనిసన్న్యాసిమతమువాని? 325

సీ. అతిసూక్ష్మయోగ శాస్త్రార్థంబు శోధించి
విజ్ఞానసంపద విస్తరించి
కడఁ బ్రపంచము మిథ్య గాఁగ సిద్ధాంతించి
ద్వంద్వమోహంబుల తగులు విడిచి
యేకాంతియై యింద్రియేచ్ఛఁ బోవకయుండ
దృఢముగాఁ జిత్త మాత్మీకరించి
తనువులఁ బులకలు జనియింప నిర్మల
బ్రహ్మతేజోధ్యానపరత నొంది

తే. యక్షయానందరససుధ నాని యాని
తాన చిద్రూప మై యుండు తపము తపము
గాక, తన కేల సిద్ధించుఁ గమలజునకు?
బూమె బ్రమయింపఁ బోయిన బోడితపము! 326

సీ. అర్థార్థములమీఁద నరుచి పుట్టినదాఁక
సంసార మొకపాటి జరుపవలయు
నరుచిపుట్టినఁ బరుం డగుచు నాసంసార
విషయభోగము దిగవిడువ వలయు

విడిచి మనంబు నిల్కడఁ జెందునందాఁక
నుచితసజ్జనగోష్ఠి నుండవలయు
మనసు నిల్చిన దాని మఱచి బ్రహ్మముఁ గన్న
దాఁకఁ దపంబులఁ దలఁపు వలయు

తే. బ్రహ్మ మీక్షించి తపములభారఁ మెడలి
యవ్యయానందలహరి నింపారవలయుఁ
గాక, తమకించి వట్టియాగ్రహము పూని
సేయుతామస తప మెందు సిద్ధిఁ బొందు? 327

వ. అని యోగనిరూఢి యెఱింగించి గోవిందశర్మ ధర్మనందను
నకు నటమీఁది కథ యిట్లనియె. 328

తే. తనివి చాలక దినదినోత్సాహరతికి
మనసుగోలుపుచు మన్మథోన్మాద విక్రృతి
మఱచెఁ దన బ్రహ్మయోగ సమాధి బ్రహ్మ,
మన్మథ బ్రహ్మయోగ సమాధిఁ బొంది. 329

సీ. అంతకంతకు లతాంతాస్త్రరసాంభోధి
నోలలాడుచుఁ దృప్తి నొందలేక
బహువిధ రతులలోఁ బడి చిక్కు మగ్నుఁడై
దష్టాధరుండు నిర్దళితనఖుఁడు
గాఢపరిరంభ గంభీరకుచకుంభ
ఘర్మాంబు కలితవక్షస్స్థలుండు
నగుచు మన్మథ ముద్రి లవయవంబులకు నా
భరణంబులై యుండఁ గరము మెఱసి

తే. ఘనతపోధ్యాన సంధ్యాదికములు, విధుఁడుఁ
దనకు రతితంత్రములె కాఁగఁ దలఁపు నిలిపె
వేదవిద్యా రహస్య వివేక మెల్ల
దగ్ధమై పోవఁ బ్రాల్మాలి తమ్మిచూలి. 330

—◆ { మాయాసరస్వతి శతరూపములు ధరించి బ్రహ్మను మిక్కిలి మోహింపఁ జేయుట. } ◆—

ఆ. లోలుఁ డగుచు నిట్లు నాళీకజాతుండు
నిముసమైనఁ బాసి నిలువ కెనయ
గాఢరతుల కోర్వఁగాఁజాల కామాయ
లలన నూఱు రూపములు ధరించె. 331

సీ. తారహారంబులు ధరియించి వెలిపట్టు
వలువతో నొకమూర్తి వన్నె మెఱసె
నలిన నాగ విభూషణములు ధరించి చెం
గావితో నొకమూర్తి ఠేవఁ జూపె
నవరత్నభూషణోన్నతిఁ జెంది చిత్రాంబ
రంబుతో నొకమూర్తి రంగుమీఱె
విరులసొమ్ములును దామరనూలిచీరయుఁ
గైచేసి యొకమూర్తి కరముఁ దనరె

తే. మృగమదశ్రీల నొకమూర్తి మేళగించెఁ
గుంకుమాదృతి నొకమూర్తి కొమరుమిగిలె
మఱియు వేర్వేఱు విధముల మండనముల
నలరె మాయాసరస్వతి నలువమెదుట. 332

క. ఇందుముఖి నూఱురూపులఁ
జెంది మనోజాతకళలఁ జెలఁగినఁ గడునా
నందించి బ్రహ్మ ప్రీతిం
బొంది శతానందుఁ డనఁగఁ బొగ డొందె నృపా! 333

వ. అట్లు శతరూప విలాసంబులఁ గరంగించిన యమ్మొగముఁదీఁగెఁ బోఁడియందు శతానందుండు ననేక సంవత్సరంబులు సురత సౌఖ్యం బనుభవించె, నంత నారూపంబు లన్నియు నుపసంహరించి యెప్పటి రూపంబునెయ్యంబు చూపుచున్న గారవించి యొక్కనాఁడు సుఖపారవశ్యంబునఁ బట్టంబోయినఁ బట్టువడకకొలంకుల నొదిఁగియుఁ బొదరిండ్లఁదూఱియు నోలంబుల డాఁగియు నెలయించుచు గుహవెడలి తదీయద్వారంబున నిర్గమింప విరించి విరహాభారంబున కోర్వక వెనువెంట వెలికివచ్చిన, నచ్చట నగ్రభాగంబున నటమున్న యదృచ్ఛాగతుండైన యమ్మునిశ్రేష్ఠుండు మునులతోఁ బ్రత్యుత్థానంబు చేసె నప్పుడు. 334

క. వెనువెంట బ్రహ్మ దగులఁగ
వనజానన తగులువడక వచ్చి తదగ్రం
బున మెఱుఁగుఁదీఁగె వోలెం
జననాథ! యదృశ్య యయ్యె సభ్యులు చూడన్. 335

చ. పొలఁతి యదృశ్యభావమును బొందినఁ దాపసవర్యు లద్భుతా
కలితమనస్కులై దిశలుగన్గొని యొండొరుఁజూచి ముందటన్

వలపుల సోలుచున్ మరునివాలికతూపులగండ్లతోడ నా
విలమతి నున్న పద్మజు, వివేకవిహీనునిఁ జూచి రందఱున్.

క. ఆ దిగులుపాటుఁ గంపము
నా దైన్యము నావిలత్వ కాకారము నా
ఖేదము లజ్జయు నజు దుః
ఖోదధి కల్లోలచోల నూఁచె నరేంద్రా! 337

వ. అంత నది యంతయు విష్ణుమాయావికారంబుగా నెఱింగి హరిం దలంచి మోహనిద్రముద్రితుండగు చతుర్ముఖునిఁ బ్రబోధింప సమయం బగుటకు సంతోషించి బ్రహ్మవాది యగు మార్కండేయుండు మునిసంఘంబులతోఁ జేరంబోయి నమస్కరించి యవ్విరించి కిట్లనియె. 338

సీ. దేవ! మహాత్మ! నీదివ్యావతారంబు
పరిణుతింపఁ ద్రైలోక్యపావనంబు
సృష్టికిఁ గర్తవు సేవ్యుండ వఖిలవే
దాగమవిద్యారహస్యవేది
వరయ నీ విట్టి మహానుభావుఁడ వజ్ఞు
నట్లు చింతాక్రాంతి నలఁగఁ దగునె?
యమరసంయమికోటి కారాధ్యుఁడగు విష్ణు
నాజ్ఞఁ బూనుటయు నీ కనుచితంబె?

తే. నలఁగితివి పెక్కు విధముల నాన విడిచి
తెలియు మిఁక నైన హరిమాయ తేఁటపడఁగ

నది సరస్వతి గాదు మాయానధూటి
దానికై తపియింపకు మానసమున. 339

క. విడువు మహంకారము మదిఁ
బొడమింపుము బోధ; సకల భువనస్తుత్యమై
యడరెడు సాత్త్వికగుణమున
నడువుము హరిఁ దలఁపు మనమునన్ సేవ్యునిఁగాన్. 340

మ. విలసద్బోధ పథంబు సాత్త్వికగుణావేశంబు తద్వృత్తిఁ బు
ష్కలవర్త్మల్ చరియించుచోఁ నిరతసౌఖ్యశ్రీలు చేకొం(డ్రు, దు
ర్మలినాహంకృతి నిర్మథించి వినుమార్యస్తుత్య!సత్యం,బహం
యులుతత్సాత్త్వికపర్యలట్లుగశుభంయుల్గారుసూచూడఁగన్

సీ. హరిమాయ జగములు, హరిమాయ యాకాశ
మరుదగ్నిసలిల భూమండలములు,
హరిమాయ బ్రహ్మలు, హరిమాయ యింద్రాది
సురకిన్నరోరగాసురగణంబు,
హరిమాయ సూర్యుండు, హరిమాయ చంద్రతా
రాగ్రహాతపతిమిరవ్యవస్థ,
హరిమాయగుణములు, హరిమాయ పంచేంద్రి
యస్మరవికృతి కామాదికంబు

తే. ప్రాభవోత్సాహ వీర్య శౌర్యములు, జయము,
భయము, రక్షయు, హాని లాభములు, కృపయుఁ
గర్మతంత్రంబు హరిమాయ నిర్మలాత్మ
సత్యసాత్త్విక విజ్ఞాన సరణిఁ జూడు! 342

సీ. బ్రహ్మంబు హరిగాఁగ భావింపు బ్రహ్మాండ
మండలి హరిగాఁగ మతి నెఱుఁగుము
సత్యుండు నిత్యుండు శాంతుండు వేద్యుండు
చింత్యుండు హరి గాఁగఁ జిత్తగింపు
ముద్భవస్థితివిలయోత్పాదన క్రియా
నిష్ణాతు హరి గాఁగ నిశ్చయింపు
వేద వేదాంతాది విద్యార్థ తత్త్వంబు
హరి నిరంజనునిగా ననుమతింపు
తే. విమల విజ్ఞాన దీపంబు వెలుఁగఁజేసి
మూఢతాహంక్రియా క్రోధములు విడిచి
యాత్మనాయకు నవ్విభు నాశ్రయింపు
శాశ్వతైశ్వర్య సౌఖ్యంబు సంగ్రహింపు. 343

వ. అని సముద్ధి యగు నవ్వృద్ధముని యుపదేశించిన సత్య వాక్యంబులఁ బ్రబోధితుండై పితామహుండు విజ్ఞాన సుధాధౌత దురహంకార పంకకళంకంబై విమలంబైన హృదయంబున భక్తి నిల్పుకొని యశ్రుధారాపూరంబులు దొరఁగు నయనంబుల దైన్యంబుదోఁప నూర్ధ్వబాహుండై ముకుళిత హస్తంబులతోఁ గరుణాసాగరుం డగు హరి నుద్దేశించి. 344

—◆ { బ్రహ్మకు జ్ఞానోదయమై విష్ణుమూర్తిని స్తోత్రముచేసి యపరాధ క్షమ చేయు మని వేఁడుట. } ◆—

ఆ. ఓ యనాథనాథ! యో కరుణోదధి!
యో భయాపహారి! యో మహాత్మ!

యో జగత్త్రయేశ! యో సురాసురపూజ్య!
కలుషబుద్ధినైతిఁ గావవయ్య! 345

ఉ. నన్నపరాధిఁ గావుము వినమ్రుఁడ దీనుఁడ నీచకర్ముఁడన్
నన్నపుబుద్ధి వాఁడఁ గలుషక్రియుఁడన్ శరణాగతాన నా
భ్యున్నతమైన నీబిరుదు భూవినుతంబు మదీయమత్కృతం
బెన్నకు దివ్యచిత్తమున నెగ్గులుపెట్టునె తండ్రి పుత్రుపై ?

ఉ. నీ మహనీయమాయను గణింపఁగ నెంతటి వాఁడనేను మా
యామయదుర్వికారుఁడ నహంయుఁడ సంయమిభావితాత్మది
వ్యామరసేవ్య తావకశుభాకృతిఁ జూపి కృతార్థుఁ జేయవే
స్వామి సహస్రకోటి శిఖిచంద్ర దివాకరతేజ! సత్కృపన్!

సీ. సంతాప ముడుపవే జలజాయతేక్షణ!
కృపఁ జూడవే జగద్విపుల కీర్తి!
దీనత మాన్పవే త్రిభువనాధీశ్వర !
యభయ మీవే దేవతాగ్రగణ్య!
నిర్వేద ముడుపవే నిర్నిరోధానంద!
యండ గావే సముద్దండశౌర్య !
వికలత వారింపవే భక్తవత్సల!
సన్నిధి గావే ప్రసన్నహృదయ!

తే. దివ్యరూపంబు చూపవే దేవదేవ!
యాశ్వసింపవె సంరక్షితాశ్రితౌఘ!
గారవింపవె సుజనమందారభూజ!
యాత్మనాయక! నామొఱ యాలకించి. 348

—♦ బ్రహ్మాదులకు విష్ణుమూర్తి విరాడ్రూపము కనఁబఱచుట. ♦—

వ. అని యిట్లు బ్రహ్మ యాత్రబ్రహ్మంబు వేఁడినం గరుణించి. 348

క. పరమ విరాడ్రూపంబున
హరి సాక్షాత్కారమొందె నాదిత్య సహ
స్రరుచిన్ వెలుఁగుచు బ్రహ్మకు
వరదుండై మోహతమము వారింపంగన్. 349

వ. ఇట్లు పరమపురుషుం డగువిష్ణుండు బాలసూర్య ప్రభాపటల చటుల పద్మరాగ మణి మకుట విటంక విలంబమాన పారిజాత ప్రసూన(మాలికా?)సౌరభ సౌభాగ్యంబు విస్తరించు మస్తక సహస్రంబును, శరచ్చంద్రచంద్రికాసాంద్రపరిభాఖండ పుండరీకదళంబుల వెదచల్లు విలోచనసహస్రంబును, మంత్రకళాధిదైవతమధుకర నికర సంకలిత చ్ఛందోబృంద మంజీర మంజరీ రంజితంబైన చరణారవిందసహస్రంబును, శంఖ చక్ర కౌమోదకీ శార్ఙ్గ నందక ప్రముఖ దివ్యాయుధ మయూఖరేఖాసమాశ్రయంబైనదీర్ఘబాహుసహస్రంబునుశోభిల్లఁ,గనకమణిఖచిత మకర కుండల హార కేయూర కంకణ ముద్రికా కాంచీలతాది దివ్యాభరణ భూషితుండును, వక్షస్స్థలస్థిత నైజయంతీ సరిగావరణ మధ్య ప్రభాసిత కౌస్తుభ పదక ప్రేంఖోల్లలిత లీలాభినందితేందిరాసుందరీ మందస్మిత ద్యోతమానగండస్థలీ ముకుర బింబిత ముఖమండలుండును, దివ్య పీతాంబరధరుండును, దివ్య గంధానులేపమనోహరుండును, దివ్య సౌందర్య

ధుర్యుండునునై చరణాంగుష్ఠ నిష్ఠ్యూత సురసరిత్పూరంబుల నఖ కిరణ కదంబ కాదంబంబుల నోలలాడించుచు, దివ్య మాణిక్య శృంగసంగతంబై మూర్తిమంతంబై తోఁచిన మహామేరువు చందంబున నపరిమిత తేజోరాశియై శృంగార వీర కరుణాద్భుత రసస్వరూపం బగురూపంబునం బ్రదీపించుచు నిత్యముక్తులైన సనకసనందన సనత్కుమార వామదేవ నారదాది బ్రహ్మయోగీంద్రులు చామర ఛత్త్రి ధ్వజాది సేవావిధానంబుల నుభయపక్షంబులం గింకరులై సేవింప నాభివలన నంతరిక్షంబును, ప్రాణంబులవలనఁ బవనంబును, ముఖంబువలన బ్రహ్మనలేంద్రులును, స్వేదంబువలన నద నదీ సముద్రంబులును, పాదంబులవలన భూమియుఁ, జూపుల వలన సూర్యుండును, మనస్సువలనఁ జంద్రుండును, శ్రోత్రం బులవలన దిశలును గల్పించి, బ్రహ్మనాదంబున నోంకారం బును, దివ్యభాషణంబుల వేదంబులును, శ్రవణ నాసికారంధ్ర రోమకూపంబులవలన వసురుద్రాదిత్యవిశ్వేదేవయక్షరాక్షస సిద్ధవిద్యాధరోప్సరో గణంబులును, జతుర్విధ జంతుసం తానంబును నుద్భవింపంజేయుచు, నవాఙ్మానసగోచరప్రభా వంబైనయాతేజంబు చూడనశక్యం బని కరుణించి మార్కండే యాదిమునీంద్రసంఘంబునకును, నార్తుండై ప్రార్థించు న వ్విరించికిని దివ్యదృష్టిం బ్రసాదించె నప్పుడు. 350

ఆ. లక్షసూర్యమండలము లొక్కనడుమునఁ
గూడియున్న నైనఁ జూడవచ్చుఁ

గాని, యట్టి దివ్యమైన తేజముచూడ
నరిది వినుము పాండవాధినాథ ! 351

క. ఆతేజోమూర్తి సుమీ
భూతలవర ! నీమఱంది!, పురుషవరేణ్యుం!
డాతత కరుణాజలనిధి!
యాతురబాంధవుఁడమ! కృష్ణుఁ!; డరయుము బుద్ధిన్! 352

క. నయవంతులు దృఢయోగ
ప్రియతధ్యానానురూపధి భావములోనన్
నియమించి కాంచుతత్త్వ
దయ మాతేజంబు సువ్వె! ధర్మవిధిజ్ఞా! 353

క. ఆముని సంఘము, దానవ
దామరరాచూలి యద్భుతంబును భయముం
బ్రేమము భక్తియుఁ బొడమఁగ
భూమింబడి పొరలిపొరలి పొరిఁ బొరి మ్రొక్కెన్. 354

వ. ఇట్లు వా రెల్లరు సాష్టాంగదండప్రణామశతంబులు సమర్పించి;
రప్పుడు పద్మసంభవుండు, పరమవిరాడ్రూపంబునం దనవంటి
బ్రహ్మలను సురాసురాదిజంతు సంతానంబును బుట్టించుచుఁ,
దన చేసిన యంధకారంబు విరియించుచుండు తేజోరాశియై
యున్న యన్నారాయణుని నవలోకించి పులకించి దృగం
చలంబుల వెడలునశ్రువులు రెప్పలతుద నప్పళించుచు మో
దప్పుఁగేలుదోయితో నోంకారపురస్సరంబుగాఁ బురుషసూ

త్రంబును నారాయణోపనిషత్తును జదివి వేదశాస్త్రపురాణేతిహాసపర్యాయంబున నిట్లని స్తుతియించె. 355

సీ. జయ! పరబ్రహ్మ శాశ్వత నిరంజన నిర్వి
కల్ప నిత్యానంద కవివరేణ్య
జయ! త్రిగుణాతీత సత్యస్వరూప ని
ర్మల శాంత పుష్కలారాధ్యచరిత
జయ! మహాయోగీంద్ర! జయ! సాంద్రకారుణ్య
జయ! యగణ్యాకార జయ! యనంత
(జయ! సమస్తాధార! జయ సర్వసంచార!
జయ! విచిత్రవిహార! జయ! ముకుంద
తే. జయ! జయ! వినోదవిహిత విశ్వప్రపంచ!
జయ! జయ! వికారరహిత నిశ్చలమనోబ్జ!
జయ! జయ! నిరస్త సకలదోషప్రచార!
జయ! జయ! మహోజ్జ్వలా! జయ! జయ! పరేశ!) 356

సీ. వేదార్థములు నీవ వేదోపనిషదర్థ
రాద్ధాంత తత్త్వసారంబు నీవ
ధ్యానంబు నీవ ధ్యేయస్వరూపము నీవ
తత్ఫలారూఢ మోదంబు నీవ
ప్రకటిత బహుతరబ్రహ్మాండ నిర్మాణ
కుశలుండ వీవ తద్గురుఁడ వీవ
జననరక్షాలయాచరణ దక్షుఁడ వీవ
జీవాత్మపరమాత్మభావ మీవ

తే. పూజ్యపూజక పూజా విభూతి వీవ
పంచ తత్త్వాశ్రయంబు నీవ పరమపురుష
వర్తి వీవ చిదానందమూర్తి వీవ
త్రిభువనోదారచారిత్ర ! శ్రీకళత్ర ! 357

సీ. బ్రహ్మాండ కోటులు ప్రభవించు నీమహా
మాయఁ దద్బ్రహ్మాండమండలముల
కధిపతు లైన బ్రహ్మ లనేకు లఖిల చ
రాచర విధసృష్టి యాచరించు
వారు తత్సదృశు లుదార తేజులు బ్రహ్మ
మను మహేంద్రాదులు మఱియుఁ గలరు
పరికింప లోకాధిపత్యమాత్రము బ్రహ్మ
గాని సామర్థ్యంబుకలిమి నంత

తే. కంటె యోగీంద్ర దివ్యసంఘంబు గలదు
తలఁప నిటువంటి దగుసృష్టి కలనలోన
నొకఁడ రాజసదురహంక్రియోద్ధతుండ
నీశ! నీతత్త్వ మెఱుఁగ నే నెంతవాఁడ? 358

క. నీపాద సేవకులలో
నేపారఁగ నొకనిఁ గాఁగ నెఱుఁగుము కరుణా
రోపమున; బ్రహ్మపదవీ
వ్యాపారము చాలు నాకు నఖిలాధిపతీ. 359

చ. ఘనుఁడుమృకండుపుత్త్రుఁడుజగద్వినుతుండతఁడేమొచెప్పెఁజె
ప్పిన హితభాషణంబు లవి బేలతనంబునఁ జేయ నైతి నాఁ

డనుమతిఁ జేసి మత్సర మహార్ణవ మగ్నుఁడనై చలంబునన్
జనక! తదీయ దోషము మనంబునఁ బెట్టక ప్రోవవే దయన్.

క. నీతత్త్వ నిశ్చయస్థితి
నాతరమె యొనర్ప లోకనాయక! విద్యా
పేతులు యోగీంద్ర వరులు
నాతురమానసులు గారె నవ్యయపురుషా! 361

వ. అని విన్నవించిన విరించి ననుగ్రహించి క్రిమ్మఱ బ్రహ్మాధి పత్యంబును విజ్ఞానోదయంబును గరుణించి చతుర్దశ భువనం బులకుం బ్రమదం బొనర్చి సకల సురాసురార్చితుండై మా ర్కండేయునివిధమునఁ దన్నుఁగూర్చిమాయాజయంబునకై తపంబుసేయు నమ్మందర గిరివాసు లగుమునీంద్రులకు దివ్య సాయుజ్యంబు ప్రసాదించి యంతర్హితుం డయ్యె నప్పుడు.

—♦ బ్రహ్మ యథాప్రకారంబు బ్రహ్మాధిపత్యంబు సేయుట. ♦—

తే. బ్రహ్మతేజంబుతోఁ దొంటి పగిది బ్రహ్మ
బ్రహ్మసింహాసనాగ్రవిభాసి యగుచు
భువనములు నడ్పుచుండె విభూతిమెఱసి
బ్రహ్మముని దేవదానవ ప్రతతి గొలువ. 363

—♦ ఫలశ్రుతి. ♦—

క. బ్రహ్మస్వరూప మగు హరి
బ్రహ్మకుఁ దనకేళిచూపి పరఁగినపరమ
బ్రహ్మోపదేశచరితము
బ్రహ్మానందము నొసంగుఁ బార్థివచంద్రా! 364

వ. అని గోవిందశర్మ ధర్మనందనునకుం జెప్పె ననిన విని పరీక్షి
త్తట మీఁదటి కథాప్రసంగం బెట్లుండె నని శుకబ్రహ్మ
నడుగుటయును. 365

శా. గంగాసంగపదాంబుజద్వయయశోగంగాతరంగావళీ
రంగత్పద్మభవాండ! కుండలికులేంద్రప్రౌఢపర్యంక! సా
రంగాంకాభరణాద్భుతప్రిక్రుతకర్మస్ఫారసంసారఘో
రాంగారార్తసుధాపయోధర! జగద్వ్యాకీర్ణపుణ్యోదయా!

క. శుక సనక సనందన శౌ
నక భీష్మ వ్యాస విదుర నారద పవమా
నకుమార ప్రహ్లాద బ
లి కిరీటి వసిష్ఠముఖ ఫలిత సురభూజా! 367

తే. చతుర్వేదవేద్యా చతుర్వక్త్ర చోద్యా
చతుర్ముక్తి దాతా! (చతుర్వర్గనేతా!)
సతీయుక్తవక్షా! సతీవామపక్షా!
సతీమాతృపాదా! (సతీనేత్రమోదా!) 368

ఇది శ్రీ మదనగోపాల చరణకమల సేవాధురీణ సత్కళాపారీణ
కృష్ణభట్టారకపౌత్త్రి చింతలపూఁడి కామయప్రభుసుపుత్త్ర
సుకవివర్యరాధామాధవయెల్లనార్య ప్రణీతంబైన
విష్ణుమాయానాటకంబునందు
తృతీయాశ్వాసము.

శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ.

శ్రీరస్తు.

విష్ణుమాయానాటకము.

చతుర్థాశ్వాసము.

క. శ్రీరాధామదవద్వ
క్షోరుహామకరీకలాపశోభనముద్రా
ప్రారంభ విజృంభణాశిత
ధారానఖజాల! నవమదన గోపాలా! 1

తే. అవధరింపుము దేవ! సంయమివరుండు
సకల వేదాంత విద్యా విశారదుండు
శుకమహాయోగి పలికె నుత్సుకత మఱియు
నింపుగా నాపరీక్షిన్నరేంద్రుతోడ. 2

వ. ఈ విధంబున శతానందమునికథ చెప్పి గోవిందశర్మ ధర్మనంద
నునకుం విష్ణుమాయవలన శివుండు మోసపోయిన తెఱంగు
విశదంబుగా నెఱింగింప సమకట్టె. 3

మ. విను విశ్వక్షితిపాలమౌళినలభీవిస్ఫారరత్నప్రభా
కనదుద్దామపదారవింద! త్రిజగత్కల్యాణచారిత్ర! పాం
డునరేంద్రోత్తమపుత్ర! యీమునిగరిష్ఠుల్ నీవునుంగూడిమెం
దునకుం జిత్తముఁ బోవనీక హరియందున్నిల్పిసంప్రీతితోన్.

వ. అని కొలువు సావధానంబు గావించి. 5

— సముద్రమథనప్రశంస. —

సీ. ఆదికాలమున మాయాసక్రి యగుచక్రి
యనుమతి నమృతార్థ మమరగణము
నసురారిగణము దుగ్ధాంభోధి మందర
మంథానమునను సమగ్రశక్తి
నహిరాజ దామకం బడరించి మథియింపఁ
బుట్టె నుగ్రానలస్ఫూర్తిఁ దొలుతఁ
గాలకూటము, దానిగతి కోర్వఁగా లేక
దేవదానవు లార్తిఁ దిరుగుపడఁగ

తే. వారికిఁ బ్రియముగ వారికి నభయ మిచ్చి
యావిషజ్వాల ఫాలాక్షుఁ డాహరించి
కాలకూటాశనుండను నా ఖ్యాతివడసి
తారగిరి కూటమున కేఁగె ధర్మతనయ ! 6

సీ. కల్పపాదప పంచకము నప్సరస్త్రీలు
కామధేనువును జింతామణియును
నుచ్చైశ్శ్రవంబు, మదోత్కటం బగుచతు
ర్దంతియు జనియించెఁ దరువఁ దరువ
నవి యింద్రభోగ్యంబు లయ్యె వెండియు లక్ష్మి
యును దులసియు జనించిన విరించి
జనకుండు విష్ణుండు సంప్రీతిఁ గైకొనెఁ
గ్రమ్మఱ నమృతకుంభమ్ముతోడ

తే. సకలలోకైకరక్షా విశాలబుద్ధి
యంత ధన్వంతరియు నుదయంబు నొందె
మహితమందరమంథానమథ్యమాన
మానితాంభోనిధానంబుమధ్యవీథి. 7

క. కుముదమున జృంభితం బగు
హిమ జలపూరంబువోలె హృదయోత్సవమై
విమలస్ఫటికఘటంబున
నమృతము పరిపూర్ణరుచుల నమరెం జూడన్. 8

ఉ. అయ్యమృతంబుచూచియసురాసురసంఘములబ్ధిఁద్రచ్చుటల్
నయ్యన మాని రంత బలిశాసన మూఁది సురారు లుద్ధతిన్
గొయ్యతనంబుతోనమృతకుంభముఁగ్రక్కుననాక్రమించిమూఁ
కయ్యరుదెంచిరొక్కయెడ కందఱుఁబాలికకోర్హటింపఁగాన్.

క. వెలవెలఁబాఱిరి వేల్పులు
తల చెదరి, సుధాఘటంబు దైత్యులు గొనినన్
బలవంతులు గొనునర్థము
బలహీనులు మగుడఁ గొనుట భారము గాదే? 10

క. పాలిక యమృతకలశం
బాలీల సురారికోటి హరియించిన దే
వాళి యుపాయవిహీనత
నాలం బొనరింప సేన నడరించుటయున్. 11

తే. భూతభావిభవత్కాలముల విశేష
గతులు దెలిసిన యమ్మహాకార్యవేది

శౌరి యిది వేళ గా దని సంజ్ఞఁ జేసి
జంభమర్దనసైన్యసంరంభ ముడిపె. 12

చ. హరిహయుఁ డబ్జలోచనునియాజ్ఞ బలంబులఁగుస్తరించి సం
గర మెడలించి కయ్య మెసఁగన్ నయవాక్యవిశేషచాతురీ
గరిమను బాలు పెట్టుఁడు సగం బమృతంబని చేరివల్కుచున్
వెరవున రాక్షసేశ్వరుల వేఁడుచునుండఁగ నంత నవ్వలన్. 13

—♦ విష్ణువు మోహినీకాంత యగుట. ♦—

మ. త్రిజగన్మోహనమూర్తి యైనహరి నారీరత్నరూపంబునన్
గజయానంబున, నందియ ల్మొరయ వీక్షాపుండరీకచ్ఛద
వ్రజముల్ సల్లుచు మందహాస మెసఁగన్ వక్షోజముక్తావళీ
భజనన్ వే చనుదెంచెఁ గామకలనాపాథోధికల్లోలమై. 14

తే. అలసయానంబుతో వచ్చి యమరదైత్య
బలమునడుమ విలాసంబు పరిఢవిల్ల
మోహమాయాంధకారంబు ముంచుకొనఁగ
నిలిచె శృంగారమూర్తి నానీలవేణి. 15

ఉ. వెండియు దుగ్ధసాగరము వెల్వడి వచ్చెనొ లక్ష్మి నా మరు
న్మండలము న్మరుద్విమతమండలమున్ మదనార్తిఁబొందియొం
డొండ సమాకులం బగుచు నుల్లసిలన్ దరహాసచంద్రికా
మండితదృక్సుధాలహరి మానిని ముంచె సమస్తలోకముల్.

మ. తరళత్వంబు విలోచనంబులకుఁ జేతఃపంకజ శ్రేణి కా
తురభావంబు నిదాఘ మంగములకున్ దోడ్తోన పాటిల్ల నా

సరసీజానన పుష్పసాయక సహస్రశ్రీకశృంగార సా
గరమూర్తిం జనుదెంచి నిల్చెను దివౌకఃపూర్వదేవావళిన్.

సీ. తరుణారుణాంఘ్రిపద్మద్వయీలాక్షాప్ర
భాస్ఫూర్తు లింద్రగోపములు గాఁగ
నవరత్నఖచితమండనబహుచ్ఛాయా క
దంబంబు శక్రచాపంబు గాఁగఁ
గుచకుంభచిత్రితగోరోచనాపత్త్ర
లతలు సౌదామనీ లతలు గాఁగ
గమనలీలోచ్చలత్కచభారవిచికిల
సూనముల్ వడగండ్ల సొంపు గాఁగ,

తే. కాంచిఘంటానినాదంబు గర్జ గాఁగ
లలన కందర్పపర్జన్యలక్ష్మివోలె
దివిజ దైతేయ చాతకోత్సవము గాఁగ
వాలుఁజూపుల నమృతంపు వానఁ గురిసె. 18

సీ. ఆత్మసంజాతరోషానలచ్ఛట పెంపు
విరహానద్దావాగ్ని నిరవుకొనియె
వైరిబాణోన్ముఖత్వంబు నేత్రాపాంగ
పటుశాత శరపరంపరలఁ దోడరె
నన్యోన్యలక్ష్మీసమాహారణప్రీతి
యౌవన సంపత్తి నావహించె
సమరభూ జయసముజ్జ్వలకీర్తి సంసక్తి
వికచహాసేందు చంద్రికలఁ గలిసె

తే. నమృతకుంభంబుపై నున్నయాళి రుచుల
మించుకుచకుంభయుగళంబుమీఁద నిలిచె
నేమిచెప్పుదు? నింద్రాసురేంద్రముఖుల
కాజగన్మోహనాంగి ప్రత్యక్షమైన! 19

సీ. అభినవలీలాసితాంభోరుహం బని
కమనీయ ధవళశంఖం బనియును
శృంగారముగ నిండు చెంగల్వక చ్చని
ప్రభ మించు కౌస్తుభాభరణ మనియుఁ
బసుపుఁ గుంకుమచాయ పట్టు పుట్టం బని
సిరి మించు కనకకౌశేయ మనియుఁ
గ్రొత్త హత్తించిన లత్తుక రస మని
కమలరజోమిళద్గంగ యనియుఁ

తే. గామపరవశయై యున్న కామిని యని
విష్ణుకితవవిలాసినీవేష మనియుఁ
దలఁచు నసురామరర్షిసంతతి పొలంతి
యైన దైత్యారిమేనిచిహ్నములఁ జూచి. 20

—◆ మోహినీకాంతను జూచి సురాసురులు మోహపడుట. ◆—

తే. అటుల నమ్మోహినీదేవి నమరగణము
నసురగణమును వీక్షింప నసమబాణ
కల్పలతవోలె మదనాగ్నికళికవోలె
సంతసంబును దాపంబు సంభవించె. 21

శా. మాయానిర్మిత విశ్వలోకుఁడగు శ్రీమద్వ్యాసుదేవుండు తా
మాయామానినియై విలాసకలనా మాధుర్యముం జూపఁగా
నాయింద్రాసురరాజసైన్యముల యేలా? మోహవిభ్రాంతులై
శ్రేయస్సిద్ధ మునీంద్రులైన మదనార్చిస్ఫుర్చిఖిం గ్రాఁగరే?
శా. ఆలీలావతి సర్వమోహన కళాహంకార రేఖాస్థితిన్
లీలాలంకరణాభిరామ యగుచున్ లేఖాసురశ్రేణి తో
మేలంబాడుచురాఁగ నిండ్రబలులున్ మీనాక్షి వేడాసి ర
ట్లాలోకింపఁగఁ గర్మయుగ్మక మవిద్యం జెందు చందంబునన్.
వ. అప్పుడు. 24
చ. ఇది తన యిచ్చ నుండెనిదొ యెవ్వరికైన నధీన యైనదో
మదననిధాన దేవతను మాఱటయై విలసిల్లుచున్న దీ
మదవతి యెవ్వతేనియును మానక పట్టెద నేన నేన యి
య్యదనున నంచు నిద్దఱుఁ బ్రయత్నమునొందిరి రెండుసేనలన్.
క. ఆ మాయామోహినియును
నామెయి దరహాసచంద్రికామృతవీక్షా
దామముల వాని వానిక్
గామించిన యట్లు షేలు గైకొల్పె నృపా! 26
వ. అవ్విధంబున నాదేవేంద్ర బలిదానవేంద్రులు సాంద్రానురా
గంబున డగ్గఱిన యొగ్గరంబులువిరిసి సకలసైన్యంబులు నొక్క
పెట్టునఁ జెలియలికట్ట నతిక్రమించి వచ్చు సముయసముద్ర
తరంగ సంఘంబులభంగిఁ జుట్టుకొని యాలతాంగి యంగ
లావణ్య సరోవరంబున నోలలాడుచూపులును, వానికి

మున్నాఁడి యయ్యిందువదన దరహాస చంద్రికామృతపూరం
బాస్వాదింపం దివురునాలుకయును, దానిందలకడచి యాపద్మ
గంధి బంధురశారీర సౌరభం బాఘ్రాణింపం దలంచు నాసిక
యును దానిం ద్రోచి యాశుకవాణీవీణామధురభాషణమక
రందబిందు శైత్యంబునం బరిణమింపఁ దలపెట్టు వీనులును,
వాని నతిక్రమించి యాయువతి యౌవనమదోద్వృత్తపయో
ధరకుంభపరిరంభణంబునకు నభిముఖంబులై గరుపాఱుమేను
లున్నవై, పంచేంద్రియంబులు నిస్తంద్రంబులై హృదయం
బును బోధింపం జూచుచుండె నయ్యవసరంబున నాబింబా
ధరకు దేవరాజ దనుజరాజు లిట్లనిరి. 27

ఉ. ఎక్కడనుండి వచ్చితిటు లెయ్యది నీశుభనామ వర్ణముల్
నిక్కము చెప్పి వీనులకు నెయ్యమొనర్పుము! స్వేచ్ఛదానవో
యొక్కని యాలవో సురనరోరగముఖ్యులలోన; నీక్రమం
బక్కజమయ్యెడిన్ సరసిజానన! చూడము నిన్ను నెన్నఁడున్.

క. మాయంతఃకరణంబులు
నీయెడ ననురాగలీల నిలిచినని యన
న్యాయత్తములై చిత్తభ
వాయుధకృత్తంబులై సురాసురపూజ్యా! 29

వ. అనిపలికిన, నాకలికిచిగురాకుఁబోఁడి వాఁడిదేఱిన నిడువాలుఁ
జూపుల సేనపయిం గలువరేకులవాన గురియుచు మందహాస
మధురంబులైన మృదువాక్యంబుల నిట్లనియె. 30

శా. ఏనిచ్చానతిన్నై చరింతుఁ, బతిలేఁడెవ్వాఁడు నాకొక్కరుం,
డేనాఁడుంగనుదృష్టిపెట్టి మదిలో నెవ్వాఁడు నే వాని బ్రి
హ్మానందంబునఁ దేల్తు; వేఁడియొకచో నాసక్తుఁడెవ్వాఁడు దా
వానిం గ్రైకొని, తాపదగ్ధుఁ డయిపోనంజేతు నాపోకలన్. 31

సీ. నా నెఱిఁ జూచిన ననుపారి యతులైనఁ
దలఁ పొందుదిక్కులఁ దగులనీరు
నా నామవర్ణముల్ వీనులఁ బడెనేని
విజితేంద్రియులకైన వేడ్క నిలుచు
నా దృష్టి సోఁకిన మోదించి నిర్వాణ
మతులైన నాయొద్ద మరఁగి యుంద్రు
పొందుగా నామైత్త్రిఁ జెందిన బ్రిహ్మ యో
గీంద్రులకైనను నింపు పుట్టు

తే. చూచి చూడఁగ లేరు నాసొబగు జనులు
మేలు గలచోట వర్తింతుఁ గేళిగతుల
నెవ్వ రేలాగు ననుఁ గూడ నిచ్ఛగింతు
రట్ల నేనును వారల ననుసరింతు. 32

వ. ఇది యస్మదీయ ప్రవర్తనంబు, మీరలు దుగ్ధజలనిధి మథించి యమృతంబు సంపాదించి సహృదయత్వంబునం బంచుకొన నేరక విరసించి పోరఁదలంచితిరని గగనవాణివలన విని యీ యిరువాఁగునకుం బోరులేకుండ నమృతంబు పంచిపెట్టెదనని వచ్చితి, మీ రెండు దెఱంగులవారికి సమ్మతంబగునేని యొక్క పక్షంబున నానేర్చినట్లు పంచిపెట్టెదఁ గాదేని యెంచేనియుం

బోయెద నని యనురాగంబు నెఱపి తగవు దోఁపఁ బలికిన సందఱు నేకవాక్యంబున నిట్లనిరి. 33

ఉ. పీనులు సంతసిల్లె నరవిందదళేక్షణ! తావకీనవా
చానయమాధురిన్ సకల సమ్మతమయ్యె భవత్ప్రియోజసం
బీనిపుణత్వ మీజగతి నెవ్వరి కున్నది? మమ్ము మన్మథా
ధీనుల నీసురాసురుల నేలుము పుణ్యకటాక్ష దృష్టులన్. 34

క. అమృతము మా కేఁటికి నీ
యమృతోత్కృష్టంబు లైన యాలాపములున్
మమకారంబును జాలదె?
రమణీ! నీయాజ్ఞ మాశిరంబుల నిలిచెన్. 35

క. నీమాట కడుగు దాఁటము
నే మెవ్వర మిందు; మాకు నియమముగా నీ
కోమల చరణాబ్జంబులు
భామిని! ముట్టుదుమె నీకుఁ బ్రియ్యయ మొందన్? 36

వ. అని సమయంబుచేసి రప్పుడు. 37

మ. అమృతం బేఁటికిఁ బ్రాణమేమిటికి రాజ్యంబేలయన్యాఖిలా
వములంజెందు సుఖంబు లేలమదనోత్సాహోద్భవైతద్వధూ
కమనీయాధర పానసంజనిత సౌఖ్యం బబ్బినం జాలు నం
చమృతంబిచ్చిరిదానవుల్ హరికిమాయామోహినీమూర్తికిన్

ఆ. అమృతకుంభ మిచ్చి రంభోజపత్త్రాక్షి
కాత్మజీవరక్ష యనక యసురు

ఏణలోచనలకు నీరానివస్తువు
గలదె యెట్టిదైనఁ గాముకులకు? 39

వ. అట్లు ప్రముఖులైన రాక్షసులు దయాధర్మ విహీనులు గావునఁ జేతికందినఫలం బనుభవింపనేరక యయ్యమృతంబు మాయావి యైనహరిచేతి కిచ్చి యొక్క బంతిం గూర్చుండి రప్పుడు పురందరప్రముఖబృందారకులును దారొక్కవంక యైకూర్చుండి రిట్లు రెండు దెఱంగులవారును రెండుబంతులై యయ్యింతి తమ కమృతంబు వడ్డింపం గుతుకు వేడుక నుండి రంత. 40

చ. అమృతముహస్తపంకజమునందు వహించి మురారి దేవతా సమితికి నైజరూపమె ప్రసన్నము సేయుచుఁ జూపెఁ జేతి య య్యమృతము; దానవాళికిఁక నాఁడుదనంబె ప్రకాశమానమై యమరఁగఁజేసి చూపె దరహాసరసామృత మాదరంబునన్.

క. కనకాంబర పల్లవయును
కనకాభరణ ప్రసూనకళికయు నై యా
వనఫలభరమున నొప్పెన్
వనమాలిని దనుజకల్పవల్లికపోలెన్. 42

వ. అవ్విధంబున దేవతలు తూర్పుమొగంబునుం బూర్వదేవతలు పడమటిమొగంబును నై ముందటం గనకమణిపాత్రంబులు వెలుంగం గూర్చుండిన, నవ్వధూరత్నంబు ప్రయత్నంబున నమృతకుంభంబును నెత్తుగా వామహస్తపంకజంబున ధరించి

కనకదర్వీకలితదక్షిణకరారవిందయై యుత్తరముఖంబై నిలిచి రెండుబంతులుం గలయ నాలోకించి మొదలిబంతి నగ్రస్థానంబున నున్న దేవతాచార్యునకు బృహస్పతికి వడ్డించి, తదనంతరంబ యంతరాంతరవిశేషంబులు దెలిసి యాగంబులం బ్రిథమహావిర్భాగయోగ్యుం డైన యింద్రుండును, జతుర్విధాహారంబులును దనజిహ్వాముఖంబులం బరిపాకంబు చేసి తొలుతఁ జవిగొన నర్హుం డైన వైశ్వానరుండును, సకల ధర్మంబులకు నాధారభూతుం డైనధర్మరాజును, బుణ్యతపోవిభవంబున దేవభావంబు వహించిన పుణ్యజనుఁడును, వడప్రిసాధిపతియై యమృతజనకుండు నైన వరుణుండును, జగత్ప్రాణుం డైన పవమానుండును, నవ నిధానాధీశ్వరుం డైన పౌలస్త్యుండును, నిఖిలైశ్వర్యధుర్యుం డైన యీశానుండును మొదలుగాఁ గల వసురుద్రాశ్వినేయప్రముఖులకు వడ్డించుచు నప్పటప్పటికిం దనయొయ్యారంబు చూపుచు,

సీ. అమృతకుంభము తెప్ప్రిడ్డు నలవోక నొకచేతఁ
బట్టి పయ్యెదకొంగు బాగుపఱుచు,
నలవున నిలిచి యొయ్యన మేనిచెమటలు
మందానిలమునకు విందువెట్టు
ఫాలభాగంబునఁ బలుమాఱుఁ జెరలాడఁ
గొనగోళ్ల ముంగురుల్ గూడదువ్వు
నవనతయై లీల నమృతంబు వెట్టుచు
సందెలు మొరయించు మందగతుల

తే. దొడ్డపిఱుఁదున వేగంబు దొట్రుపడఁగ
వ్రేగుఁజన్నుల సందునఁ దూఁగలేక
మరుఁడు సహచరుఁడై తోడుమలయుచుండ
నమరకోటికి వడ్డించు నమృతరసము. 44

ఆ. "అత్తతలవి చేతు, లంగడియవి కన్ను"
లనెడుజాడఁ జూపె నబ్జవదన
యమృత మమరకోటి కలవోక వడ్డించు
దితిజవరులమీఁద దృష్టిఁ బఱపి. 45

సీ. తనకుచంబులు చూడఁ గను పెట్టువానికి
సన్నపయ్యెదకొంగు జాఱవిడుచుఁ
దనయాసమాటలు వినఁదలంచినవానిఁ
దగిలి యొయ్యన జాణతనము లాడుఁ
దనమనోభావంబు సెనయఁ గోరినవాని
కలఁతిమై దరహాసకలనఁ జేయుఁ
దన మన్మథోత్సుకత్వంబు నారయువానిఁ
గనుసన్నలోనన యనుమతించు

తే. నమృతమునకంటెఁ దీపిమై యాత్మలోన
నుభయ సైన్యంబులకు లోచనోత్సవముగ
నాఁడువారలవెడబూమె లాడుఁ గొంత
యమరకార్యాభిలాషి నారాయణుండు. 46

క. మాయా విలసనలీలల
నాయువతి సురారికోటి నటు బ్రమయించెన్

దోయజనేత్రిల వలపులు
మాయలు గా కవియు నిజమె మహి నూహింపన్. 47

తే. అమృతపూరంబుఁ గ్రోలునయ్యమరతతికి
నాత్మ కింపైన తృప్తి లేదాయె నపుడు
రమణిమందస్మితామృతరసముఁ గ్రోలు
నసురసంఘంబునకుఁబోలె నవనినాథ! 48

వ. ఇట్లు వడ్డించుచు వచ్చివచ్చి కడపటిబంతియందుఁ దనకీర్తి
ప్రతాపంబులుంబోలె వెలుఁగారు చంద్రసూర్యులకునమృతం
బొసంగి తనరాక కెదురుచూచుచు వేగిరపడుచున్న క్రవ్యా
దులు చెదరకుండ నభిముఖుండై మదనవికారలీలలు చూపు
చుఁ బరాకునఁ దోడిఁబడం దత్సమీపమున నున్న సింహికా
సూనునకు మాయాదేవభావకలితుం డగుటఁ దలంపక
యమృతంబు పెట్టిన, వాఁ డయ్యమృతం బుపయోగించు
సమయంబున నాచంద్రసూర్యులు వీఁ డమరారి రాహు
వని చక్రధరుని కెఱింగించి రప్పుడు. 49

చ. నరినమరారి రాహువని చంద్రుఁడుసూర్యుఁడుఁ బల్కుకంటె
మున్ హరియునెఱింగివీనిఁ దెగటార్పుదునన్నతలంపులోనె తా
నరసిసహస్రభానుసదృశారసహస్ర సుదర్శనంబు భీ
కరగతివచ్చి వానితల గ్రక్కునఁ ద్రుంచెనిమేషమాత్రలోన్.

క. రాహువుతలఁ ద్రుంచి మహో
త్సాహంబున బ్రిమరితిరిగి చక్ర మవార్యం

బై హారినిలయమునకు జగ
దాహాకారై కలిల నరిగె న్మింటన్. 51

క. కమలాక్షదత్త మగు నా
యమృతము పోఁకుటయు నమృతిత్వము రాహువును మ
స్తము వెలిఁగె నాఁటనుండియు
నమృతకరార్కులకు వైరియై యది యుండెన్. 52

ఆ. మాయ్యైన నెట్టిమతమునైన నే
మరులనైనఁ బగఱమనికిఁ జెఱిచి
ధర్మపరులఁ బ్రోవఁ దగు మహామతులకు
సాక్షి యౌనొ కాఁడొ చక్రధరుఁడు! 53

క. బృందారకులకు నమృతం
బందఱకు నొసంగి యపుడు హరియును జగదా
నందకర పురుషరూపము
నందుఁ బ్రకాశించె దివ్య మగురూపముతోన్. 54

వ. వెండియు దేవకార్య నిర్వాహకుండై నారాయణుండు తదవ
శేష సుధాకలశంబు సంరక్షింపుమని దేవేంద్రునిచేతి కిచ్చి
కౌస్తుభాభరణ భాసితుండును, శ్రీ తులసీ విలసితుండును
లక్ష్మీసమేతుండునునై విష్వక్సేనాదులు గొలువగరుడవాహ
నుండై వైకుంఠపురంబునకు విజయంబుచేసెనప్పుడు. 55

ఉ. అంతయుఁజూచి నివ్వెఱగునంది బలిప్రముఖుల్ నిశాచరుల్
కంతునిరిమ్మవాసి మదిఁ గంపము నొందుచుఁ గాలహీనులై

చింతయు వంతయుం గనలు జిక్కురు వక్కురు సేయలేచి దు
ర్దాంత సముద్రఘోషమునఁ దాఁకిరివానవదివ్యముఖ్యులన్.

—♦ దేవదానవుల కలహము ♦—

మ. అమరేంద్రుండును సుగ్రుఁడై శిఖియమాద్యాశాధిపశ్రేణితో
సమరోత్సాహరసప్రసన్నముఖుఁడై సైన్యంబు మున్నాడి దు
ర్దమదోర్ఖండితమండలాగ్రఘునకోదండాస్త్రసన్నాహసంభ్రమ
మొప్పన్ దఱుమంగఁ బోఁకఁ బోడిచెన్ రాత్రించరవ్యూహమున్.

క. కార్యంబు చెడినకతమున
వీర్యాధికు లయ్యు దనుజవీరులు మదిలో
ధైర్యములు దక్కి యుపగత
శౌర్యులగుచుఁ బఱచి రమరసంఘం బలరన్. 58

శా. ఆరీతిన్ దనుజవ్రజంబు గత శౌర్యాటోపసంరంభమై
పాఱన్, దైవతవల్లభుఁడును నిలింప వ్రాతసంస్తుత్యుఁడై
గారామార సుధాఘటంబుఁ గొని లోకంబుల్ ప్రశంసింపఁగా
ధీరుండై యమరావతీపురికి నర్థిం బోయెఁ జౌదంతిపై. 59

వ. అంత. 60

మ. దురహంకార మహానలార్చియగు నాదుర్వాసుశాపంబునన్
శరధింబడ్డ సురేంద్రలక్ష్మిఁ దిరుగన్ సాధించె, దైత్యేంద్రుల
న్మరులం బెట్టి సుధాఘటంబుఁ గొనియెన్, రక్షించె దేవావళిన్
సరిలే రాహరికాశ్రితావన సుహృత్సంరక్షలన్ దైవముల్. 61

వ. అని జగంబులు గొనియాడుచుండ నా వృత్తాంతంబంతయు
నెఱింగి కలహప్రియుండగు నారదమహామునీంద్రుండు తత్ప్ర

కారంబు శంభునకు విన్నవించి వెఱఁగుపఱతు నని గగన
ఘంటాపథంబునం జని. 62

—◆విష్ణుని మోహినీ రూపకథను శివునితో నారదుఁడు చెప్పుట.◆—

ఉ. కాంచన గర్భనందనుఁడు గాంచె విలంబపయోదగర్జితో
దంచిత రత్నశృంగ కృతతాండవమత్త శిఖండి సాంద్రమున్
చంచలగాంగభంగపరిషంగపయోధినిషంగ దేహరు
గ్వంచిత పూర్ణచంద్రము నకల్మషతారధరాధరేంద్రమున్.

సీ. పార్వతీశంభుదంపతుల కేళీ సౌధ
మమర కన్యకల క్రీడాచలంబు
కనకనగస్వామి కెనయైన చెలికాఁడు
భూకామినీ శిరోభూషణంబు
జలజజాండాధార సంభృత స్తంభంబు
దశకంధరునిచేతి తమ్మిబంతి
గగనగంగాపతాకామణిదండంబు
పుష్కరశ్రీదేవి పువ్వుగద్దె

తే. కీర్తనలు సేయఁదగు పార్శ్వవర్తమాన
మందపవమాన చలగరున్మధువ లీన
వినుత కల్పద్రుమవితానవికచసూన
వాసనా శ్రీధరంబు కైలాస ధరము. 64

ఉ. రావణుబాహుదండముల వ్రయ్యలువాసినరాలు రేకుల
ట్లై విలసిల్లఁగోణములయందు వెలింగెడు నింద్రనీలకే

ఖా విభవంబు తుమ్మెదలుగా రజతాచలరాజ మొప్పె ధా
త్రీవనితాలలామ కరదీపిత కేళి సితాంబుజచ్ఛవిన్. 65

చ. భుజబలలీల నారజతభూధరకూటముల న్మృగేంద్రముల్
గజములఁబట్టఁ గొన్ని భయకంపమునన్ వడిఁ గాలుజాఱి యు
క్కజముగ గండశైలముల కైవడి ద్రొల్లఁగ వానిఁ బట్టి వా
యుజవముతోడఁదూల్చుశరభోత్కరముల్ గగనాంగణంబునన్

మ. కటకాగ్రంబులఁ గేసరుల్ కరుల వీఁకం బట్టుచోఁ బుట్టు త
త్పటుగర్జల్ దిశలన్ బ్రతిధ్వనులు చూపం దారశైలంబు దు
ర్ఘట నిర్ఘోషము నొందు నుగ్రముఖజాగ్రన్నారసింహోదయో
త్కటహుంకారహిరణ్యదానవసభాస్తంభంబుచందంబునన్.

చ. ఘులఘులఁ బాఱునభ్రనది కాలువ లున్నతచంద్రమశ్శిలా
తలమునఁ బడ్డఁ బెల్లెగయుతత్కణమండలి మింట దట్టమై
యులవడు వెండికొండఁ గొలువై వసియించినచంద్రమౌళికిన్
జెలు వలరంగ మీఁదవిరచించిన ముత్తెపుమేలుకట్టునన్. 68

సీ. కుండలీకృత భోగమండి తోన్నతఫణా
దారుఁడై యున్న శేషాహివరుఁడొ
ప్రతికృష్ణపక్ష విభ్రష్టేందు కళలు ప
ద్మాసనుం డొకపోవ్రుఁ జేసినాఁడొ
యసమాత్ము లావణ్యరసము జాఱుచు నున్న
యుర్వీధరం బగుచున్నయదియొ
యొల్లనాఁ డురులింగమై మిన్నుగాఁడిన
శాంభవోజ్జ్వల రుచిస్తంభ మిదియొ

తే. యనుచు శతకోటిచంద్ర చంద్రాతపంబు
తళుకునిగనిగ లాశలఁ దగులుకొనఁగఁ
జూడ నొప్పారు సమ్మహాక్షోణిధరముఁ
బద్మసంభవభవుఁ డెక్కెఁ బ్రమద మెసఁగ. 69

వ. ఇట్లు కన్నులపండు వైన యవ్వెండికొండ నధిరోహించి తదగ్ర రత్నశిఖరాభోగంబునఁ గనకమణిమయ ప్రాకార గోపుర సౌధవీథికాబద్ధ తోరణ వైజయంతీ విరాజితంబును, సతత వికసిత సురభి సురతరు కుసుమవిసర విస్ఫుమరపరిమళ మిళిత తరు పవన సహచర ముఖర మధుకర నికర మృదు నినద హృదయంగమంబును, బ్రతిగృహ గర్భనిర్భర ప్రతిశబ్దబద్ధానద్ధఘుమఘుమధ్వానమానితంబును, బలిసమయ సమాందోళిత కనకఘంటా ఘణాత్కార మనోహరంబును, బ్రాసాద గోపురపురోభాగప్రతిష్ఠితవృషభధ్వజంబును, గనకకలధౌత దండ మండితాఖండమాణిక్య దీపమాలికా ప్రకాశితాంతర్గేహంబును, బంచాక్షరీప్రముఖ పాశుపతమంత్రజపధ్యాన పరాయణాభరితంబును, బ్రమథగణమహితముక్తిమండపసహస్రంబును, నందికేశ్వర దండనాయక సభాసీన పురందర ప్రభృతినిఖిలదేవతాముని మండల మండితంబును, బ్రతిద్వారద్వారపాలకరకలిత కనక వేత్రలతాశతదురవలోకితంబును, నై జగదేకపూజ్యం బైన శివాలయంబు ప్రవేశించి తదభ్యంతరంబున.

సీ. గంగాకణాకీర్ణఘనమాళితోడఁ బు
ష్పిత కల్పకములీల బెరయువానిఁ

గంతహాలాహలకచ్చురచ్ఛవితోడ
నుదితపూర్ణమృగాంకు నోరయువాని
స్వామిమౌళిస్థశేషాహిచూడామణిశ్రీల
తోడ సహస్రాంశు దొరయువానిఁ
గరుణారసోర్మికాగాంభీర్యములతోడ
నుదధిరాయని భంగి నున్నవానిఁ

తే. గామకళ యెడ్మదిక్కునఁ గడలుకొనఁగ
బ్రహ్మతేజంబు కుడివంకఁ బ్రజ్వరిల్ల
యోగసింహాసనంబున నున్నవాని
శివుని దర్శించె మునికులశ్రేష్ఠుఁ డపుడు. 71

వ. ఇట్లు దర్శించి జయజయేతివచనపురస్సరంబుగాఁ బ్రదక్షిణంబు చేసి బహుప్రకారంబులం బ్రస్తుతించినం గరుణించి కాలకూటహరణానంతరసముద్రమథనకథా ప్రసంగంబు వినఁ జిత్తగించి విరించిసంభవునకు శ్రీకంఠుం డిట్లనియె. 72

తే. ఉదధి మథియించువేళ నీవున్నవాఁడ
వే కదా కాలకూటంబు వెనుక నందు
సంయమీశ్వర ! యేమేమి సంభవించె
నెవ్వ రేమేమి గైకొని రెఱుఁగఁ జెపుమ. 73

క. అని విషకంధరుఁ డడిగిన
విని హర్షావేశ మొదవ వినయాంజలియై
ముని విన్నవించె నప్పుడు
తనచూచిన యంతవట్టుఁ దత్పరమతితోన్. 74

చ. గగనము మోచి బాడబశిఖానిచయంబుఁ దృణీకరించి క్రొం
బొగలు దిశావకాశములఁ బొంగ నభంగవిషాగ్ని యుగ్రమై
జగములు మ్రింగఁజూచినఁ, బ్రసన్నుఁడవై యుపసంహరించి దే
వగణముఁ గాచి దేవరవు వచ్చినవిమ్మట నాపయోనిధిన్. 75

మ. తరువందర్పఁగఁ బుట్టెఁ గౌస్తుభము చింతారత్నమున్ గల్పభూ
మిరుహైరావత లేఖవాజులును, లక్ష్మి నాకవేశ్యా సుధా
కర బృందావనముల్, సుధారసము, లోకఖ్యాతిగా; వాని శ్రీ
హరి దాఁ గొన్ని హరించి తక్కినవి దివ్యశ్రేణికిచ్చెన్ గృపన్.

శా. ఆకర్ణింపుము దేవ! యొక్కటి త్రిలోకాశ్చర్యకృత్యంబు నా
కౌకోద్వేషులు మున్ సుధాఘటము గర్వోద్రిక్తులై బల్మిఁ దా
రే కైకొన్న సురాళి విన్ననయి యూహింపంగఁ, గంజాక్షియై
యాకంజాక్షుఁడు గ్రమ్మఱం గొనియె దైత్యశ్రేణిచే లీలమై.

క. కొని తన త్రిభువన మోహన
వనితాలీలావిలాస వైఖరి చేతన్
దనుజులకు నిడక యమృతం
బనిమిషులకు నొసఁగెఁ జువ్వె యార్యారమణా! 78

క. ఆహరి లీలామాయా
మోహినియై మరులుగొలుప ముల్లోకములున్
మోహించె; నసురవీరుల
మోహాంధులఁ జెప్ప నేల మురజిన్మిత్రా! 79

సీ. అప్సరస్స్త్రీలు వ్రీడానమ్రలై తమ
మించు విభ్రమము నిందించుకొనిరి

యందఱు నాయల్లకార్తులఁ గావించు
    వెడవిలుకాఁడును వెత్త్రి యయ్యె
నూర్ధ్వరేతస్కులై యుండు తాపసులకు
    నధరరేతస్కంద మయ్యె నపుడు
తను వెత్తి పంచభూతంబులు సైతము
    విరహాభారంబున విహ్వలించెఁ

తే. బద్మసంభవముఖులు విభ్రాంతు లైరి
మొదల, నసురాధిపుల నతిమూఢజనులఁ
జెప్పఁగానేల లోకముల్ చిక్కువడియె
విష్ణుమాయావిలాసినీవిలసనమున. 80

క. ఎన్నఁడు విన్నది కన్నది
యెన్నినయది గాదు నువ్వొ యేయుగముల న
వ్వెన్నుని మాయాస్త్రీత్వము
పన్నగధర ! పొగడఁ దరమె బ్రహ్మాదులకున్. 81

వ. అని సర్వమోహనకృత్యం బైన విష్ణుమాయాచరితంబు విన్న
వించిన విని శివుండు వెఱఁగుపడి నారదుమొగంబు చూచి
చిఱునవ్వు నవ్వి నాసికావిన్యస్తహస్తాంగుళిపల్లవుండై తల
యూఁచి యెంత మృష పలికె నీమునీశ్వరుం డనుచుఁ
బ్రియకాంత నవలోకించి. 82

క. హరి యీ భువనత్రయమును
దరుణీలీలావిజ్ఞతలఁ గడు మోహా

తురముగఁ జేసినటే. యా
సరసత నేఁజూడ. కేల సమ్మతిపడుదుర్ణ. 83

క. వైకుంఠంబునకుం జని
శ్రీకాంతుని కపటసుందరీ విలసన మా
లోకించి వత్తు నిపుడ య
నాకులమతితోడ నుండు మంబుజనేత్రా ! 84

వ. అని ముక్కంటి పలికిన మందస్మితం బొనరించి యంబికా
మహాదేవి యిట్లనియె. 85

—◆ పార్వతి శివుని నివారించుట. ◆—

క. దేవరవు మిక్కిలియుఁ గాం
తావివశాత్ముఁడవు మనసు ధైర్యము చలనం
బై వచ్చెనేని మఱతువు
భావింపఁగ సర్వభూప్రపంచం బెల్లన్. 86

చ. జగములుమూఁడునాతనివశంబుననున్నవిమాయఁజిక్కియా
జగతిఁ బ్రధాన దైత్యసురసంయములుం గమలాసనుండు నా
దిగఁ గలవార లెల్ల వికృతిం బడుచుండ్రు తదీయలీల నే
మగునోసుమీమహాత్మ!జలజాక్షునిచేత భవత్ప్రతాపమున్.

తే. తలఁపు ధైర్యంబు పదిలంబుఁ గలిగెనేని
గట్టిగాఁ గామునకు బొమ్మగట్టితేని
నమ్మి పొమ్మని నగుచు నానగజ పలికె
హరుఁడు నప్పుడు నాయింతి కనియె మఱియు. 88

తే. సర్వమోహాంధ మైనయీజగముఁ జక్రి
మాయఁగొల్పుట యిదియెంత మహిమ చెపుమ
భూమి శిశువుల బ్రమయించు బూమెకాండ్రి
చేత నార్యుఁడు బ్రమయునే చిత్తవీథి. 89

ఉ. నాయవియింద్రియంబులు, మనం బెటుపోయినవానిసంగతిం
బోయెదు వాఁడఁగాను; నినుబోఁటుల లోకవిహారలీలకై
పాయకయుంటగాక మరుబారికి లోఁబడి యో!మృగాక్షి!నేఁ
డీయెడ నాజితేంద్రియత యెల్లను జూచెదు నిశ్చయంబుగన్.

వ. అని పలికిన హరుని యుద్యోగంబు నిశ్చయంబు సేయం గోరి
నారదుం డిట్లనియె. 91

—♦ శివుని నారదుండు తిరిగి పురికొల్పి రోషమెక్కించుట. ♦—

తే. ఆ మనోహర కామినీ హావభావ
విలసనంబును జూచిన వెఱ్ఱియెత్తి
దేవ! బ్రమసి తిరుగుదువు దీనవృత్తి
నింకఁ బదివేలమాటల నేలచెప్ప. 92

వ. అనినం గనలి యతనివచనంబు నిగాకరించి తన మహాను
భావత్వంబు ప్రకటించి యీశ్వరుండు ప్రమథగణములతో
నిట్లనియె. 93

—♦ శివుఁడు విష్ణుమాయకు లోఁబడనని పంతమాడుట. ♦—

ఉ. సిద్ధమతిన్ జితేంద్రియతఁ జెందితి దుర్విషయాభిలాషసం
బద్ధుఁడఁగాక దుష్కృతిని భావజు గెల్చినవాఁడ సత్తపో

వృద్ధ మనోవికాస మొదవించు చిదంశము, నిట్టినాకు దు
ర్బుద్ధులు కామినీజనులపోకలఁ జిత్తము సంభ్రమించునే. 94

క. నారదుఁ డద్వచనంబులు
భావించి విరించి సుతుని భాషణములు సం
భావింపక ప్రమథులు గిరి
జావల్లభుతోడ ననిరి సందడిపడుచున్. 95

ఉ. దేవరముందటం గపటధీయుతుఁడైన సరోజనేత్రు మా
యావికృతుల్ సురాసురులయందు బలెం బ్రసరింప నేర్చునే
భూవలయంబు దిక్కులు నభోగతియుం గబళించు సంధకా
రావృతు లేమియూఁ జెపుమయక్కనిముందర నిందుశేఖరా.

క. మిము నెక్కడ భ్రమయించెదు
మము బ్రమయించిననె చాలు మాయాతరుణీ
క్రమదుర్వికారముల నా
కమలాక్షుఁడు పెక్కువలుకఁగా నేమిటికిన్. 97

వ. అనిన మందహాసం బెసంగు సుందరాస్యంబుతో వారి నవ
లోకించి. 98

క. ఇప్పుడు మన కీపంతము
చెప్పఁగ నేమిటికి నతని చేడియరూపం
బొప్పారఁ జూచి భ్రమయుని
యప్పుడుగా యనుచు లేచె సభవుం డంతన్. 99

క. హరుఁ డా వైకుంఠమునకు
నరిగెను సంభ్రమము హృద్యమై నారదునిన్

బరితుష్టాత్మునిఁ జేసెను
సురదుందుభి నినద మెసఁగ సురపథవీథిన్. 100

సీ. భర్మసూత్రంబునఁ బదిలంబుగాఁగ ఘ
నవ్యాఘ్ర నాగాజినములు గట్టి
మంత్రపవిత్ర నిర్మలభూతి సర్వాంగ
కముల సాంద్రంబుగాఁ గలయ నలఁది
తరళజిహ్వాభీలదర్వీకరస్వామి
నలవోకఁ బేరుగా నలవరించి
పటుజటాజూటాగ్రభాగంబుపైఁ జంద్ర
ఖండంబు వెడపువ్వుగాఁగఁ దోఁపి
తే. దర్పకునిఁ దిన్నదహననేత్రంపు దీప్తు
లిఱియఁ గప్పిన రెప్పలయొడల నిగుడ
దివ్యయోగీంద్రమూర్తియై దివ్యతేజ
మెసఁగ రూపంబు గైకొనె నీశ్వరుండు. 101

క. ఆపాదఫాలభస్మో
ద్దీపితుఁడై నిర్వికల్పతేజోమహిమన్
బ్రాపించి యోగవిద్యా
రూపం బిది యనఁగ నపుడు రుద్రుఁడు పొలిచెన్. 102

వ. ఇట్లు నిర్వికారం బగురూపంబుదాల్చి నిజపంచాక్షరీ మంత్ర
విద్యాబలంబున దుర్విషయ కలుషేంద్రియ మహాభుజంగంబు
లకు వాకట్టు గట్టి పంచబాణుని బిరుదుపెండేరంబు వెట్టి

చిత్తంబు నుత్తమయోగంబునకుఁ దగులు పెట్టి దృఢనిశ్చయంబున. 103

క. హిమగిరిజా సహితుండై
హిమకరశేఖరుఁడు చనియె వృషభేంద్రమహో
ద్యమలీలాగతివిచల
ద్విమలశ్రీకుండలాంశువిభ్రమరేఖన్. 104

క. పేరకుఁ డై ముందర నా
నారదమునివల్లభుండు నడువఁగఁ బ్రమథుల్
చేరి యిరుగడల సేవా
పారీణతఁ జనిరి విజితభావముతోడన్. 105

శా. చూడం బోయిరి పావకేందురవితేజుల్ బ్రహ్మవిద్యాధికుల్
క్రీడాశూన్యకటీరమండలులు నిర్విఘ్నాత్మయోగుల్ పరి
వ్రాడీశుల్ విజితేంద్రియుల్ శివునిభావస్థైర్యమున్ వైష్ణవ
క్రీడామాయయు నెట్టులయ్యెడినో తర్కింపంగనంచున్వడిన్.

క. హరిమాయాచాతుర్యము
హరుఁ డేక్రియఁ దెలియఁ గలఁడొ యరయుద మనుచున్
సురలున్ నలుగడ నడచిరి
పరిఁ బొరి వైకుంఠ నగరమునకుం బ్రీతిన్. 107

వ. ఇట్లు చనుచు నందుఁ గొందఱు దివ్యపురుషులు విష్ణుమాయా
పరీక్షేచ్ఛుం డై యేఁగువిరూపాక్షుని యక్షీణతేజోరూపంబు
గనుంగొని తమలోన 108

శా. కుంఠీభూతదురింద్రియాగ్రహుఁడు చక్షుష్పీతపుష్పాయుధో
త్కంఠుం డుగ్రవిలోచనుండు ఘనయోగధ్యానచిన్మూర్తి శ్రీ
కంఠుం; డట్టి మహాత్మునిన్ భ్రమలఁ జిక్కం బెట్టునె ట్లెన్నవై
కుంఠుం డెవ్వరి మోసపుచ్చఁడు కనత్ క్షుద్రైకమాయాగతిన్.

వ. అని వితర్కించి రంత నమ్మందట 110

శా. భేరీశంఖమృదంగనాదములుఁ బ్రస్ఫీతాంబరాభోగభా
గ్ధీరోద్యద్విహగేంద్రకేతనముఁ బ్రీతిన్ జేసెఁ జక్షుశ్శ్రవో
హరశ్రోత్రవిలోకనంబులకు లోకానందకంబై కల
క్ష్మీరమ్యాచ్యుతరాజధాని కెదుటం జేరంగరా దవ్వలన్.

ఉ. మేలిమి ధూపధూమములు మించి మధువ్రతలీలఁ గ్రాల ను
త్తాల సువర్ణకేతన వితానదళంబులఁ దెల్లదీవిపైఁ
బోలఁగ మెట్టఁ జెంగలువపోల్కి ముదంబునఁ దేల్చు రత్నరే
ఖాలలితాంశు గోపురము కంజదళాక్షుపురంబు శంభునిన్.

క. ఆతత పుణ్యోపేతము
శ్వేతద్వీపము తదగ్రసీమఁ బరిఖీ
భూతాబ్ధిపురము లోక
ఖ్యాతం బది వేఱ పొగడఁగా నేమిటికిన్. 113

తే. నెఱిఁ జతుర్విధపురుషార్థనిధులు మిన్ను
ముట్టి యున్నట్లు లొప్పు నప్పట్టనమున
గుఱుతుమీఱఁ జతుర్ద్వారగోపురములు
వికచమణిమయ వైజయంతికలతోడ. 114

చ. అమలినహారిహాటకమయంబులు నగ్రినరోజరాగకుం
భములును నైనమేడలఁ బ్రభాకరబింబము దోఁచితన్మహో
ద్యమరుచిపుంజముల్ మెఱుఁగుటండము లీనఁగభానుకోటితే
జమున వెలుంగు నప్పుర మజస్రము ఖేచరదుర్నిరీక్ష్యమై.

చ. స్ఫటికమణి ప్రభాపటలభాసురగోపుర శృంగకోటి సం
ఘటనగ నేడు కోటలును గాక పదంపడి విశ్వకర్మ యు
త్కటమతిఁ బెట్టుకోటయనఁగాఁ గనుపండువుసేయు రాకలం
జటులసుధాబ్ధిభంగములసంఖ్యములాప్పురిచుట్టుఁదూలుచున్.

చ. వలయితరత్నవప్రము సువర్ణశిరోగృహరాజసంచయో
జ్జ్వలితము నైన యప్పురము సాగరమధ్యతటంబునందు ని
ర్మలపరివేషచక్రరుచిమండనమండితచంద్రభానుమం
డలిప్రతిబింబమోయనఁ గనం గడు నొప్పుఁ ద్రిలోకపర్వమై.

ఉ. సింగపుమోములుంగలుగు చిత్తరురూపము లప్పురోత్తమో
త్తుంగ సువర్ణ హర్మ్యములఁ దోరములై యటవేల్పుటేటినీ
టం గడు బింబితంబులగుటన్ గని నీళ్లకుఁ దెచ్చి యభ్రమా
తంగము భీతి మాన్పుదురు తచ్చలితాచలితప్రవాహులై.

చ. వననిధివీచికోచ్చలిత వారికణంబులు, నాపురంబులో
ఘనతరహర్మ్యకేతువులగాడ్పులఁ దూలుచు రాలు నభ్రవా
హిని జలబిందువుల్ చదలనింపగుఁ దన్మిథునోత్సవంబునన్
జన సురగామరాంగనలు చల్లెడుసేస లనంగ వెన్నెలన్. 119

చ. హరియెదుటన్ బురేందిర నటాంగనయై యలరించుమస్తభా
సురకనకాగ్రి దండపరిశోభిత పూర్ణఘటాలివోలెఁ ద

ద్ధురు గృహరాజసౌధమణికుంభపథంబుననూర్ధ్వలోకముల్
గరము వెలుంగు దిక్కులఁ బొగడ్తకు నెక్కె విచిత్రవైఖరిన్.

మ. హరినీలేందుశిలాభిరామ మగుచున్ హర్మ్యం బొకం డగ్రభా
స్వరమాణిక్యఘటంబుఁ గేతనపటీసంపత్తియుం గల్గి య
ప్పురి వామాంగముఁ దామ్రజూటము మహాభోగంబు హారంబు
నుం గర మొప్పారెడు నానదాశివుని రేఖన్ బొల్చు నత్యున్నతిన్.

చ. నవనలినప్రియోర్ధ్వకిరణప్రతతుల్ పురి వెండిమేడలం
బ్రవిమలరాగపల్లవవిభాసితలై లత లట్లు సాఁగఁగాఁ
బవడపుఁదీఁగె లెక్కడకుఁ బ్రాఁకెడు నంచుఁ దదగ్రసంచర
ద్యువతులు పట్టి చేఁ దగులకుండఁగ నవ్వుదు రద్భుతంబునన్.

చ. త్రిపథగయే చతుష్పథగ దేవతరంగిణి చూడుఁ డంచు రే
యి పురిఁ జతుష్పథాగ్రమున నిందుఁడు నిల్చిన నాల్గువీథులం
జపలతరస్ఫురత్కనకసౌధపరంపరలన్ సుధాకరా
తప రసపూరముల్ నిగుడఁ దద్దయుఁ జూతురు పౌరబాలికల్.

మ. హరిసౌధాగ్ర సుపర్ణనార కలితంబై చిత్రవర్ణాకృతిన్
సురుఁగన్ వ్రేలుచుఁ గేతనాంబరము వొల్చున్ నాఁడు రాహుగ్ర
హోద్ధురమూర్ధం బటఁ ద్రుంచి వైచు నెడ నెందుం బోక రక్తాంక
మై పరిభాసిల్లు తదీయభోగలతయున్ భావంబునం దత్పురిన్.

చ. బహుకుసుమోపహారములఁ బ్రస్ఫుటమౌక్తికరంగవల్లులన్
బ్రహితవిచిత్రతోరణపరంపరలన్ శశికాంత వేదులన్
రహిఁ బచరించు నప్పురవరంబు పథంబులు శ్రీకరంబులై
సహజమె శ్రీనివాసములు సంతతమున్ సదలంక్రియాస్థితుల్.

శా. కేళీసౌధముఁ, గేళివాటికయునుం, గేళీవనశ్రేణియుం,
గేళీశైలముఁ, గేళిదీర్ఘికయునుఁ, గేళీమరాళంబులున్
బోలన్ లేనిగృహంబు లే దొకటియుం బూఁబోండ్లుఁ బ్రాణేశులున్
శ్రీలక్ష్మీహరిమూర్తిభేదములు వర్ణింపంగ నిం కేటికిన్. 126

మ. బలభి న్నీలమణి ప్రతానకృత సోపానంబులుం బద్మరా
గ లసత్కంధర మందిరంబులు గళత్కల్పద్రు పుష్పావళీ
కలితస్వర్ణ విశాలసానువులు నై కన్పట్టు క్రీడాద్రులన్
లలనల్ మేఘవియుక్తచంచలలలీలం బొల్తు రవ్వీటిలోన్.

ఉ. రాకొమరుండు మన్మథుఁడు రాజన మొప్పఁగ నప్పురంబులో
నేకధనుర్ధరుం డగుచు నెమ్మలు చూపు గుణీకృతాళిలీ
లా కలఝుంకృతుల్ సుదతులం బతులంగడు నొంచు నవ్వుహో
భీకరమాని వైరి కతి భీకరభంగి చెలంగఁ జేయుచున్. 128

మ. హరినాభీనవపుండరీకమకరందాసారమున్ గ్రోలి త
ద్వరకర్పూరమయోరుసౌధసుమనోవాతాయనద్వారసం
చరణక్రీడ లొనర్చుచుం దిగుచు నిచ్ఛాభంగ సంగీతసు
స్వరభృంగీతతి మందమారుతము పజ్జం గ్రుమ్మరున్ దత్పురిన్.

సీ. పాలమున్నీటిలోపల నెంత దవ్వైన
జానుదఘ్నంబుగా సంచరించుఁ
దివుటఁ దొండము సాఁచి దిక్కరిశ్రేణి
చరమాంసదేశముల్ సంస్పృశించుఁ
గైలాసమేరుశృంగముల వప్రక్రీడఁ
గొమ్ముల నలవోకఁ గూలఁ ద్రోచు,

సమదఘీంకారనిస్వనములఁ జక్రవా
ళాచలగుహాల సింహములఁ గలఁచు

తే. సమదరక్షోధినాథవక్షఃకవాట
పాటనోద్దండతరచండబలభరమునఁ
బ్రకటకట దానపానసంభ్రమ దళీంద్ర
గానముల నొప్పు నప్పురికరివరములు. 130

చ. రూపముతోడి గాడ్పులు, గరుత్తులులేని ఖగంబు, లశ్వలీ
లాపరినర్త నోల్లసితలాసిక వర్గము శౌర్యవార్ధి వీ
చీవటలంబు నాఁగవిలసిల్లుచు నుండు మనోజవంబుతో
నాపురివాజిరాజి హరిదశ్వుని యశ్వము లన్న నవ్వుచున్.

ఉ. భూరిబలోగ్రహేమకశిపుప్రముఖాసురులన్ జయించి య
వ్వీరులబొమ్మ పెంజెములు వ్రేలఁగ నంఘ్రుల దిగ్వలీనని
స్సార విరోధులై సుభటసంజ్ఞకు మోహన చక్రలాంఛనో
దారభుజా కలాపులయి తత్పురిఁ గాల్వురు వొల్తురిమ్ములన్.

చ. పరభృతచంచుసంచలిత పల్లవమున్, మధులోలబంభరో
త్కరగతసూనమున్, శుకముఖప్రవిభిన్న ఫలంబుఁ, గేళిసం
చరదబలాప్రియప్రసవసద్మము నైసకలర్తు యోగ్యమై
పురి వనవైభవం బలరు భూరి మనోహరసౌరభస్థితిన్. 133

చ. రసికవధూవరుల్ కనకరత్నవిభూషణవిభ్రమంబు పై
విసిగి పరిత్యజించి వెడవిల్తుని కన్నులపండు వైనసొం
పెసఁగఁగఁ బువ్వుసొమ్ము ధరియించి పరస్పరరూపదర్శనో
ల్లసితపునఃపునస్స్మరతలంపటులై సుఖయింతు రాపురిన్. 134

చ. నిరతము నిర్మలామృతమునిండి తలంకుకొలంకు లంతరాం
తరముల నుండ వేల్పుకనుదమ్ములకుం బ్రియమాచరించుచున్
బరిఖ దనర్పుఁ దన్నగరపంకజవాస కటీస్థలంబునం
గరము వెలుంగువజ్రఫలకంబులమేఖలలీలఁ గ్రాలుచున్.

మ. పరమబ్రహ్మము విష్ణుఁ డీజగము లుత్పాదించి తద్రక్షకై
పురుషాకారముఁ దాల్చునాఁడు సిరితోఁ భోగింప నీదుగ్ధసా
గరమధ్యంబున సర్వమోహనముగాఁ గల్పించినాఁ డమ్మహా
పురి వైకుంఠము; దానియొప్పు పొగడన్ భోగీంద్రుఁడున్ జాలునే

—• శివుఁడు వైకుంఠములోఁ బ్రవేశించుట. •—

వ. ఇవ్విధంబున నపరిమితైశ్వర్యరేఖాలంకృతం బైనయావైకుంఠ దివ్యనగరం బట్లు త్రిలోచనుండు లోచనపర్వంబుగాఁ జూచి నంతసంబునం బ్రవేశించి రాజమార్గంబునం జనునప్పుడు.

తే. తోరణాంభోజమకరందధార నర్ఘ్య
మొసఁగి మధుకరమధుర రవోక్తిఁ గుశల
మడిగి బాంధవసంభావనానుకూల
యయ్యెఁ బురలక్ష్మి పార్వతీహారుల కపుడు. 138

తే. హారుని తనుదీప్తిచే నీలహర్మ్యచంద్ర
కాంతపాషాణముల జలకణము లురల
నాడెఁ బ్రోదినెమిళ్లు కేకారవములఁ
గనకనూపుర ఘుళఘుళాత్కార మొసఁగ. 139

సీ. మృగమదాలేపమ్ము మెఱయువేదిక నద్రి
కూలభాగం బని కొమ్ముఁ జిమ్ము

మరకతసౌధకోమలరుచులకుఁ దృణ
ప్రీతిమై నందంద మూతిఁ జాఁచు
నాపణగతనిర్మల సద్వర్ధదర్పణ
తృతిమైన నుఱికి లంఘింపఁ జూచుఁ
దన నీడ మణిభిత్తిఁ గని ప్రతీప కకుద్మ
దాశంకఁ గనలి గుఱ్ఱనుచుఁ దిరుగు
తే. వెండితగడున నినిచిన వీథులందుఁ
దాండవము చూపు నూపురధ్వనులతోడఁ
పసిఁడి మువ్వలపేరు జొంపంబు మెరయ
నందికేశ్వరుఁ డీశ్వరానందలీల. 140
సీ. ముత్తెంపుఁ జెఱఁగులఁ జిత్తంబు నిండించు
కనకాంశుకంబుల కట్టు దనరఁ
బసుపుఁగుంకుమచాయ నెసఁగు కుచంబుల
మందారపుష్పదామములు వ్రేల
నెలవంక తిరునామము గలనెన్నుదుళ్లఁ గెం
పుల చుక్కబొట్టులు చెలువు మీఱఁ
దాటంకవజ్రాంశుధాళధళ్యంబుతోఁ
జెక్కులఁ జిఱు నవ్వు చెంగలింప
తే. శంఖచక్రాంకభుజలతల్ చారుముఖులు
పురపురంధ్రులు సంభ్రమంబుమెయి వచ్చి
నిలయచత్వరవేదుల నిలిచి చూచి
రద్రిజాశంకరులను నెయ్యంబుతోడ. 141

సీ. శుకముఖోదితముక్తి సూచకభాగవ
తవిధేయులైన భాగవతవరులు
నుపనిషచ్ఛాస్త్రసముత్కృష్టగీతార్థ
గరిమ శోధించు భాగవతవరులు
ధృతివిశిష్టాద్వైతమతవైష్ణవాచార
గతి నివేదించు భాగవతవరులు
సావర్ణ్యముక్తిలక్షణము వచించు నా
గమయుక్తి మెచ్చు భాగవతవరులు
తే. నింటిముంగిళ్ల నరఁగుల నెనసి యున్న
యాసనంబుల విడి లేచి యచట నచటఁ
దమకు సముచిత సంభావనములు సేయ
నద్రిజయు నీశ్వరుండును నరిగి యరిగి. 142

వ. అంతఁ గొంతదవ్వునం బురమధ్యంబున ననేకకోటిసూర్యబింబ ప్రతిబింబకంబు లనం బ్రతిభాసిల్లుపద్మరాగమణిఖండంబు లెస నడం గలిగి, కనకరుచినిచయచకచకవ్యాకీర్ణంబై యగ్రభాగంబునఁ గృత్రిమమరాళద్వంద్వమధ్యంబులం గెందామర పువ్వుల మువ్వంబున నివ్వటిల్లు పసిండి కుండలచాలు శోభిల్ల నాకాశంబారయుప్రాకారంబుతోడంగూడి, ప్రత్యగ్రవిద్రుమ ద్వారస్తంభసముజ్జ్వలవజ్రకవాటఘటితంబును, ధళధళాయమాన నవరత్నకీలితంబును, బుష్పతోరణాభిరామంబును, బహిరంతర్వికచచంద్రోపలవితర్దికాశోభితంబును, దౌవారికసహస్ర దురవలోకంబును నగు ప్రథమగోపుర ద్వారంబు

ప్రవేశించి వెండియునుం గుంకుమపంకానులేపంబున నిగ నిగలువాఱుచు నకాల సంధ్యారాగంబు సంపాదించుచు వివిధకుసుమకోరక నికరవిరచిత రంగవల్లీసముల్లసితంబు లగు ననేకద్వారగోపురప్రాంగణంబులు చూచుచు నయ్యైద్వార పాలకకృతావధానంబుల నభినందించుచుం బోయి ముందట.

—♦ శివుఁడు నారాయణమూర్తి హజారము నొద్దకుఁ బోవుట. ♦—

సీ. శతధనుర్విస్తారచతస్వరరత్నకు
ట్టిమభూమి మెఱుఁగుతండముల నీన
మండితనవపుష్పమాలికాసంకీర్ణ
భృంగసంగీతప్రసంగ మడర
బహుపద్మరాగకుంభముల బాలాదిత్య
పాటలాంశువులు పైఁ బ్రబ్బికొనఁగ
నవరత్నచిత్రితప్రవిమలోల్లోలకాం
తులు క్రిందఁ బెక్కువన్నెలు రచింపఁ

తే. బసిఁడికంబాల వేయింట బాగుమీఱి
మరకతోపలసోపానమార్గ మిడిన
పెద్దమొగసాలమేడ సంప్రీతిఁ గాంచి
వాహనము డిగ్గె శివుఁడు పార్వతియుఁ దాను. 144

వ. ఇవ్విధంబున శంభుండు ప్రమథగణపరివృతుండై ప్రియకాంత యుం దానును వచ్చి పెద్దకొలువుకూటంబుముందర వాహ నావతరణంబు చేసి యుండుట ద్వారపాలురవలన విని నారా యణుండును, 145

— నారాయణమూర్తి శివపార్వతుల కెదురుగా వచ్చినప్పటి విధము. —

క. తనమాయాశ్రీలీలలు
విని క్రమ్మఱఁ జూడవచ్చు విధ మిది యని నె
మ్మనమున నవ్వుచు నెదురుగఁ
జనుదెంచెన్ లోననుండి సంప్రీతి దగన్. 146

మ. హరి యంతఃపురినుండి వచ్చుటయు నయ్యైసేనకై యున్నవా
రురువేగంబున వామదేవశుకముఖ్యుల్ చేరి ఫాళాంజలి యొ
క్కరుఁ డొక్కం డడపం బొకండు నిజఖడ్గంబున్వహింపంగ నొ
క్కరుఁ డొప్పారఁగఁ బట్టె నుజ్జ్వలితముక్తాచ్ఛత్రము న్నగ్రంబునన్.

వ. వెండియు విష్వక్సేనుండు కైదండ యొసంగఁ, గనకవేత్ర
పాణు లగుచుఁ జండప్రచండ జయ విజయ కుముద కుము
దాక్షులు ముందట "నితఇతో మహాదేవ" యను
నాలోకశబ్దంబులు పలుకం, బసిండిగొడుగుపావాలగిలుకల
కుం దోడై శ్రీపాదపద్మంబుల నిగమాంతనూపురఝుళం
ఝుళధ్వానంబులు చెలంగఁ, దరంగరేఖాభంగి నపాంగంబులం
గరుణారసంబు దొలంకఁ, బంకజలోచనాసహస్రంబులు ధవళ
చామరంబులు వీవఁ, గనకపీతాంబరమయూఖరేఖాలంకృ
తుండై, మూర్తిమంతంబు లై శంఖచక్రంబు లిరువంకలం
జనుదేర ననంతవిలాసవైభవంబున శుద్ధాంతకేళీభవనంబులు
వెలువడి గంభీరయానంబునఁ జనుదెంచి యా దంపతుల
నవలోకించి. 148

క. శ్రీరమణీగురుకుచకా
శ్మీరదరివసిక్త మగుచు మెఱయునురమునన్
వారిజనాభుం డప్పుడు
గారవమునఁ బ్రమథనాథుఁ గౌఁగిటఁ జేర్చెన్. 149

వ. ఇట్లు కౌఁగిలించి యన్యోన్యమధురాలోకనజనితకౌతుకంబునం బొదలి యద్రిజఁ గుశలం బడిగి పద్మనాభుండు సబహుమానంబుగా నయ్యిద్దఱం దోడ్కొని కొలువుకూటంబునకు విజయంచేసి వారికి నొక్క భద్రపీఠంబు చూపి నిజసింహాసనాగ్రంబు నలంకరించె, నంతఁ గ్రమక్రమంబునఁ బితామహప్రముఖదేవగణంబులు గంధర్వాప్సరస్సిద్ధవిద్యాధరవ్రాతంబు నరుగుదెంచి యద్దేవదేవునకుం బొడసూపి యుచితస్థానంబులం గొలిచి యుండి రాసమయంబున. 150

క. అవధానతత్పరం బై
యవనీశ్వర! చూడ నొప్పె హరికొలు వపుడా
శివపద్మోద్భవవాసవ
దివిజర్షిప్రమథపూజ్యదివ్యవిభూతిన్. 151

—♦ లక్ష్మీపార్వతులు కలిసికొనుట. ♦—

తే. గౌరి వచ్చుట యెఱిఁగి శ్రీకాంత దివ్య
కామినులు గొల్వ శుద్ధాంతసీమనుండి
కౌతుకస్మేరవక్త్రపంకజముతోడ
వచ్చెఁ గొలు వెల్ల సంతోషవార్ధిఁ దేల. 152

వ. ఇట్లు వచ్చి. 153

తే. కలిమిచూపులనెత్తమ్మికంటి యెదురు
గాఁగవచ్చిన నగజాతఁ గౌఁగిలించి
తగినపూజలఁ దనిపి సంతసముతోడ
నేకపీఠస్థ యయ్యె నయ్యింతితోడ. 154

—◆ నారదుఁడు విష్ణుమాయాగానము సేయుట. ◆—

క. ఆవేళ నారదుఁడు వీ
ణావాదనకేళిఁ దేల్చె నారాయణు నా
నావిధతన్నిజమాయా
వ్యావృత్తుల గీతసరణి నమరులు మెచ్చఁగ. 155

వ. వెండియుఁ బర్యాయంబున గంధర్వ యక్ష కిన్నర కింపురుష సిద్ధ విద్యాధరాదు లయ్యైవిద్యల వైశారద్యంబులు చూపిరి. తదనంతరంబ సముచితగోష్ఠి సలిపి తన వచ్చినరాక ముఖావలోకనంబునం బ్రియముఖులకు నెఱుకపఱచి యలఁతి నవ్వు నివ్వటిల్ల శివుండు పుండరీకాక్షునకు నిట్లనియె. 156

—◆ { విష్ణుమూర్తియొక్క మాయామోహినీరూపము చూడవలెనని సాంబమూర్తి కోరుట. } ◆—

చ. తరలకవార్ధిఁ ద్రచ్చి యమృతంబొడఁగూర్చి బలాఢ్యులై నిశా
చరులు హరింపనెంచినం గపటచంచలలోచనవై కరంచి నీ
వెరవునఁ బుచ్చి దివ్యులకు విందులువెట్టి త్రిలోకపర్వమై
తిరిగిననీవినోదము మదిం బ్రియమయ్యెడుఁ జూడ నచ్యుతా!

క. నారదుఁడు చెప్పె మదనో
దారభవత్కామినీ విహారవిలాస

శ్రీరామణీయకంబును
నారాయణ ! నామనంబునకుఁ బండువుగాన్. 158

ఉ. ఏమెయినింతిరూపము వహించితొ యెంతవిలాససంపదన్
గాముని నాక్రమించితివొ కౌతుక మొప్పఁగ నేక్రమంబునన్
బూమెలఁ దేల్చితో దనుజపుంగవదేవమునీంద్రవర్యులన్
దామరసాక్ష! నాకుఁ బ్రమదంబుగఁ జూపుము తద్వినోదముల్.

తే. హరివధూలీల మోహించె నఖిలజగము
నావిలాసంబు చూచిన నభవ ! నీవు
నంగజభ్రాంతిఁ జరియింతు వనుచు నన్నుఁ
బంతముగ నాడె నారదపారికాంక్షి. 160

క. దేవాసురమునులట్టులె
నీవును మోహింతు వనిన నీచోక్తులకున్
భావమునఁ గనలి వచ్చితిఁ
గావింపుము మాయ నీప్రగల్భతఁ జూతున్. 161

ఉ. దానవదేవసిద్ధమునితామరసాసనముఖ్యు లందఱున్
నీనలినేక్షణాంగరమణీయగుణంబుల మోహితాత్ములై
దీనత నొంది క్రుమ్మరుట తెల్లమి; వారలు వీరె; వీరిలో
నా నెఱియున్ భవత్కపటనాటకముల్ విభజింతమియ్యెడన్.

ఉ. నామది నిర్వికారమును నావిజితేంద్రియతానిరూఢియుం
నీమహనీయమాయయును నేఁ డమరుల్ గని మెత్తురందఱుం
దామరసాక్ష ! చూపు మెఱిదంబుగ నీకలమాయలెల్ల నా
దీమస మెల్లఁ జూపెద నతిస్థిరయోగనిరూఢి పెంపునన్. 163

వ. అని మహాయోగిపుంగవుం డైన యనంగదమనుండు, తన యొద్ద మున్ను విష్ణుమాయం బ్రకటించి సకలంబును హరి మాయామగ్నం బనియును బరమసాత్త్వికజ్ఞానవంతు లగు హరిభక్తులకుం దక్క దక్కిన వారెవ్వరికి నమ్మాయ గడవ రా దనియును మఱి యంతటం బోక సామాన్యదేవదానవు లంబలెనే మహానుభావుం డగు దన్నుం బరిగణింపక నీ వైన నమ్మాయవలనఁ దరింప లేవనియును దిరస్కారగర్భంబు గాఁ బలికినకలహప్రియు నప్పటికిఁ గోపింపక సైరించి కార్యానంతరంబున వారించువాఁడై మచ్చరంబున వచ్చి చిత్తక్షోభంబుతోడ వనజనాభుతో నంతఃకోపతామసుఁడై పలుక నవ్విరూపాక్షునిరూక్షవచనంబులకు ననుగుణంబుగాఁ బ్రమథశ్రేష్ఠులు క్రోధపరుషభాషణంబులం గడకన్నులం గెంపు దోఁప నిట్లనిరి. 164

తే. కూపమండూకమునుబోలెఁ గొంచెమైన
నీవు వెడమాయఁ దామున్గి నీచబుద్ధి
నధికగుణగణ్యుఁ డైన యీయభవు నాడె
నితరులనుబోలి యీమాని యెఱుకమాలి. 165

ఉ. మాయలముంచునిన్నయిన మచ్చరికించిన విష్ణుఁ డంచుమున్
బాయక రుద్రునిం బలికెఁ బల్కినయప్పుడె పండ్లు డుల్లఁగా
వ్రేయుదు మీవెడంగు ముని, వేగిరమేలనిభర్త మాన్పఁగాఁ
బోయెనుగాక; యీపనులు పోయినపిమ్మటఁ జెప్ప నేఁటికిన్.

ఉ. ఆతని కల్ల నేమిటికి నాతఁడు పల్కినయట్లు నీవు నీ
గాతలె పల్కి మాయలఁ బ్రగల్భతఁ జూపినఁ జూచి రోసి య
జ్ఞాతభవాదిదివ్యమునిసంఘము ముందటఁ బొల్లువుచ్చి వి
ఖ్యాతిగఁ గ్రమ్మఱం జనుటకార్యముగాక తలంచిచూచినన్.

క. నీమాయకోలఁది యీముని
యేమై మున్నెఱిఁగి నాఁడొ యెఱుఁగక యున్నన్
దా మెఱసి వంతమాడున
భూమిం గలచోట్ల నెల్ల బూమెలు గాఁగన్. 168

చ. మొదల నిశాచరాధముల మూఢుల దుర్విషయాభిలాషులన్
మదనవికారతత్పరుల మాయలఁ బెట్టుట చెప్పనేల? య
య్యదనున సిద్ధసంయమిమహావిజితేంద్రియులు స్మనోభవ
ప్రదరవిభిన్నులై రనుచుఁబల్కె మునీంద్రుఁడునీవధూక్రియన్.

ఉ. నీతరుణీవిలాసమున నెమ్మదిఁ దాలిమి దూలి యమ్మనో
జాతనిశాతబాణములఁ జంచలులైన మునీంద్రు లెవ్వరో
చూతము వీరు వారనుచుఁ జూపిన నీసభలోన వేఱె, కాం
తాతరళాత్ములు న్మనుల తాపసులే విజితేంద్రియాత్ములే ?

వ. అని ప్రమథులు పతిహితంబుగాఁ బెక్కుభంగుల నారదుని
భర్జించి హాదిని ధిక్కరించి బీరంబులు పలుకు చుండి రాసమ
యంబున. 171

చ. ప్రమథగణంబులాడుబహుభాషలు, శంకరుఁ డీరసంబునన్
దమకముతోడ వచ్చినవిధంబును నారదు నిశ్చయంపు భా

వము (గని మందహాస మొదవన్ వనతానన్ముఁడై నిమేషమా
త్రముహరియుగారకుండె నుచితక్రమమూరయుచున్మనంబునన్. 173

వ. అప్పుడు.

సీ. మా ఱుత్తరము లేక మాధవుం డున్నవాఁ
డది యేమొకో యని యరయువారు
మనబోంట్లఁగాక యీమాయలు సోఁకునే
దర్పకాంతకు నని తలఁచువారు
నేఁడేని యిద్దఱ నెఱిఁగినంబులు గాన
సమ్మ్యోడు నని మదినలరువారు
హరు నేవిధంబున నైన నీ హరి మాయ
నెలయించునని నిశ్చయించువారు

తే. నై రి సురమునిముఖులు తదనసరమున
నా పరితిజ్ఞా ప్రతిష్ఠ యొనర్పనున్న
భావ మిది యని విభుఁ డున్న భావ మెల్ల
నారదుఁడు తన్మనః పరిసన్నత నెఱింగె. 174

క. అందఱు నమ్మ్యోవిధముల
నందకధరు చిత్తవృత్తి నాటినతలఁపె
ల్లం దమ మతముల కొలఁదుల
నం దరయుచు నుండి రమరు లానమయమునన్. 175

వ. సర్వాంతర్యామి యగు నయ్యనంతుండు, తన యంతర్గతం
బున నమ్మృతార్థంబు దుష్టదానవవంచనంబున కై పూనిన
మదీయమానినీరూపవిలసనంబు చూచినవాఁడై నారదుండు

వార్తావాహుండు గావున సకలలోకంబుల బహుప్రకారం బులఁ బ్రకటించుచు వచ్చివచ్చి తనప్రమోాల వినోదంబుగాఁ బ్రసంగించినఁ బ్రమథులుం దానును నేమని యూత్షేపించి నాఁడో, దానికై కథానుకథనంబున దేవరవైనం జూచిన మోహింతు వని యత్యాశ్చర్యంబుగాఁ బ్రస్తుతించిన నది తన్నుం దిరస్కారంబుసేయుటగాఁ దలంచి యభిమానించి క్రమ్మఱ నాకపటసుందరీసౌందర్యంబు చూచి మోహింపక నిర్వికారంబునం బోవువాఁడ నని సంకల్పించుకొని వచ్చిన వాఁడు, సాంత్వవచనంబులం బోవువాఁడు కాఁడు, దీని కేమిసేయువాఁడ, నమ్మహాత్మునిచిత్తంబు సంక్షోభింపం జేయవలసె, నీతని తమకంబు కొలంది గాదు, ప్రమథులు నిర్వాణత్వంబు చూపి బీరంబులు పలుకుచున్నవారు, వీరి నెవ్విధంబుననైన నీవేళకుం దోఁచి పంపితినేని నారదునకుఁ దలయెత్తుకొనరాదు, నేఁడు వీరిని మోసపుచ్చి సిగ్గుపఱుప కుంటినేని గెంటసంబాడి నవ్వుదు రని నానావిధంబుల నూహించి మాధవుండు కొండొకప్రొద్దునకు మాయామంద స్మిత సుందరం బగువదనారవిందం బల్లన నెత్తి భూతభర్త కిట్లనియె. 176

—♦ నీపంతము మాను మని శివునితో విష్ణువు చెప్పుట ♦—

క. అమృతార్థం బసురులకై
కమలేక్షణ నై వికారకలనన్ మాయా

భ్రిమలం బెట్టితిఁగా క
ల్లమరున యోగీశ్వరుండ వగు నీయెదుటన్. 177

ఉ. నీవు మహానుభావుఁడవు నిర్మలయోగ నిరూఢ మానసం
భావితదివ్యమూర్తివి పరిభావనమగుఁడ విట్ట నీకు చే
తోవికృతి ప్రపంచములు దోఁచునె యింతలు దుర్వికారమా
యావిషమపరికారముల నన్యులకుం బలె భూతనాయకా!

మ. మము సఖ్యంబునఁ జూడవచ్చి హితసన్మానంబులం బూజలం
బ్రమదం బందక యల్పకార్యమునకై భావంబు వేఱొక్కచం
దము గావించుచు నీగణంబు గముఁజిత్తక్షోభమున్ జెంది దు
ర్దమవాఙ్నిష్ఠురవృత్తిఁ జూపుటకు నాత్మన్ మెచ్చెదిట్లేఁటికిన్.

క. కనకాక్షాదులకై చూ
పిన నామాయావిలాస పేశలగుణముల్
మును తెలియవె యా భంగిన
దనుజులకుం జూపినాఁడ దర్పకదమనా! 180

చ. అదియును నీకుఁ జూడఁ బ్రియమైన నొకానొక కార్యవేళఁ జూ
పెద నిపుడేల యింద్రియవిభేదముఁ బొంది మనంబు తాల్మిబి
ట్టదరఁగఁజేసి యారక మహాత్మవినిశ్చల దివ్యయోగ సం
పదఁ గుదియింప నీ సుజనమండలియందు నవేందుశేఖరా!

ఉ. నావుడు శంభుఁ డిట్లనియె నారదు పంతము నిల్చెఁబోండె నే
భావజు నేఁడు గెల్చి కృతిభంగిఁ బ్రసిద్ధికి నెక్కుటొండెఁ గా
కీ వెడమాటలం జనుదునే మురమర్దన! నేఁడు నువ్వొ కా
ర్యావసరంబు నీకును మదర్థము మాయల పెంపుచూపఁగన్

క. నామీఁదియానసుమిత్రా
తామరసదళాక్ష! యన్యథా చిత్తుఁడవై
నీమాయా స్త్రీరూపము
నాముందఱఁ జూపకున్న నమ్మెము దీనికా? 183

క. అని రుద్రుఁడు వాలాయము
తను నొత్తిలి పలుకఁబలుకఁ దగ! నిట్లనియెన్
వనజాక్షుఁడు బ్రహ్మామర
మునులకుఁ గర్ణోత్సవముగ మూర్ధేందుధరున్. 184

చ. పలుమఱు మాన్యుఁడంచు నిను భంగమొనర్చక సఖ్యమూఁది
నీయలుకకు నోర్చి నీప్రమథు లాడెడుకర్ణకఠోరభాషలన్
దలఁకక నీకు నేఁ బ్రియము తద్దయుఁ జెప్పిన నియ్యకోక నా
పోలఁతుకరూపు చూచుట కెపొంగెదు చూచెదుగాక యేమనన్

వ. అని పలికి భక్తవచనపరితిపాలకుండును జగన్నాటకసూత్ర
ధారుండును సత్యసంపన్నుండును నగునవ్వెన్నుండు చిన్ని
నగవుమొగంబునం జిగురుకొల్పి నారదునిప్రజ్ఞ నిల్పువాఁడై
యతని నవలోకించి. 186

క. ఫాలవిలోచనవహ్ని
జ్వాలల మరు నేర్చినాఁడు సర్వజ్ఞుఁడు కాం
తాలీలల మోహించునె
యేలా పంతంబు పలికె తీహరుతోడన్. 187

వ. అనినఁ గరంబులు ముకుళించి వినిచి సూనుండు కలహాభోజ

నుండు గావున నయ్యుద్దణము విహావదం బగుటకు సంతసించుచు
హరియభిప్రాయం బెఱింగి యిట్లనియె. 188

—♦ నారదుఁడు విష్ణుమూర్తిని, నాతనిమాయను నుత్కర్ష చేయుట. ♦—

శా. దేవా! దేవర దివ్యతత్త్వము మహాధీరుల్, పరబ్రహ్మవి
ద్యావేదుల్, నిజశాస్త్రకోత్తములు, సత్యజ్ఞానవంతుల్ మదిన్
భావింపంగల రేమొకాక యితరుల్ భావింపఁగా శక్తులే
యీవాణీశముఖామరుల్తెలియ నే యీయర్థ మాత్మేశ్వరా!

క. డెందంబునను వాక్కున
కందఁగరాకున్న నీ చిదాకృతి విద్యా
మందు లెఱుంగరు విజ్ఞా
నేందుజ్యోత్స్నాప్రసన్నహృదయులు దక్కన్. 190

తే. అట్లు బ్రహ్మాత్మక తేజ మై యలరునీవు
భూరిమాయాబలంబున భువనచయము
బహుచరాచరకోటిసంపదల నించి
ప్రభుఁడ వై యుంట యిది వేదభాషితంబు. 191

క. ఇటువంటి నీవు మాయా
నటనకళాప్రౌఢి చూపినన్ బ్రమయక యెం
తటివారు యోగవిద్యా
పటుబుద్ధివహించి నిల్వఁబడువా రర్విన్. 192

మ. అదియే యేలకొఱుంగరే మునులు నీయంభోజజాతుండునీ
మదవత్యుత్కటరూపవిభ్రమమునన్ మానంబు వే తూలినన్

మదమాద్యన్మదనాస్త్రనిర్దళితమర్మస్థానులై శోక బ
ల్లిదులై యెవ్వరు నిర్వికారమునఁదాల్మిన్ జెంద లేకుండుటల్.

వ. దేవర వల్లు సముద్రమథనసంభవం బైనయమృతకుంభంబు హరియించిన యసురుల మోసపుచ్చి యమృతంబు గొను టకై కపటకామినీరూపంబుఁ దాల్చి యానక్తంచరులు మున్నుగా సకలలోకంబులను మోహింపఁ జేయుట జగం బులం బ్రసంగించుచుఁ బోయిపోయి కైలాసంబునఁ బ్రమథ గణపరివృతుం డైనయమ్మహాదేవుని సన్నిధానంబున స్తుతి యించిన మిథ్యాలాపంబు లని నన్ను నపహసించి తన నిర్వి కారత్వంబు ప్రకటించుకొని యహంకరించిన. 194

శా. పంతం బాడితి ఫాలలోచనుని తో బ్రహ్మాదులుంబోలె నా వం తైనన్ గడువంగలేక హరిమాయామోహచక్రంబునన్ భ్రాంతిం బొందుదు వాఁజగత్పతివధూరత్నోల్లసత్క్రీడలన్ జెంత న్నిల్చిన నీవు నంచుఁ ద్రిజగత్ప్రసిద్ధంబుగాఁ దత్సభన్.

క. ఇది యపరాధం బని నీ
మదిఁ జూడక భక్తవరద! మనమున కింపై
నది యాచరింపు మనుచుం
దుదిఁ దోఁపం బలికె నారదుఁడు సకలంబున్. 196

ఉ. అంతయు దివ్యచిత్తమున నారసి మాయలు సంఘటించి శ్రీ
కాంతుఁడు తత్సభాసదులఁ గాలగళుం బ్రియమారఁజూచె వ
క్త్రాంతరసుప్రసాదదరహాసరసామృతవీచి దోఁపఁగా
నంతట నేమి చెప్పుదు ధరాధిపవల్లభ! యద్భుతంబుగన్.

— { విష్ణుమాయాప్రభావముచేత ముందుగానే శివునికి మన్మథవికారములు పుట్టుట. } —

క. ఆ యంగజ గురు నగవున
నాయంగజవైరి యంగజానందకళా
శ్రీయుక్తుఁ డయ్యె వెన్నెల
సోయగమునఁ గైరవప్రసూనము పోలెన్. 198

సీ. అవయవంబులు గరుపాఱె నానందాశ్రు
కణములు దొరఁగె మైకంప మడరె
జడత వాటిల్లె వైస్వర్యంబు జనియించెఁ
బులకాంకురంబులు పొడమెఁ గలయ
మోములు వైవర్ణ్యమును బొందె నందంద
శ్రమవారిపూరంబు జాలువాఱె
నుల్లాసమునుబొందె నుల్లంబు నంగజో
త్సాహానురాగముల్ సందడించె

తే. భావివైష్ణవమాయాసతీవిలాస
జాతపరితాపభారసూచకముగాఁగ
నప్పు డే మని చెప్పుదు నవనినాథ!
కొలువు వారికి నెల్లఁ గోర్కులు దలిర్ప. 199

— మాయామోహిని యవతరించి వచ్చుట. —

క. హరి యోగమాయ మది సం
స్మరియించినమాత్ర నపుడె మనుజేశ్వర! యా

పురహారముఖుల ముఖంబులఁ
గర మరుదుగ మదనకాంతికళ వైవాఱెన్. 200

చ. కలకల నవ్వునెమ్మొగముఁ, గాటుకరేఖలసోయగంపుఁ జూ
పులు, నెలవంక నెన్నుదురు, భ్రూలతికావలనంబు, మన్మథా
కులహృదయంబుఁ గల్గి కుచకుంభభరానతమధ్యవల్లితోఁ
జెలఁగుచు వచ్చె నొక్కమద సింధురయాన సభాగ్రసీమకున్.

సీ. నాసాపుటముల కానందసంపాదియై
ప్రచరించె నొకవింత పరిమళంబు
చెవులకుఁ బండువై చిత్తంబు ఝల్లనఁ
గెరలె నపూర్వభృంగీస్వనంబు
కనుఁగొనల్ మిఱుమిట్లుగొనఁ దళుక్కనఁ బర్వె
గుఱుతు సేయఁగరాని మెఱుఁగుదీఁగె
యంగంబు లుప్పొంగ హార్మ్యరత్నశ్రేణి
మోహనపుత్రికామూర్తి దోఁచె

తే. నతివ చనుదేర ముందఱ నంతనంత
నభినవసుగంధమును నూపురారవంబు
నంగదీప్తియు నతిరూపు నయ్యెఁ బిదపఁ
జోద్య మందుచు సభవారు చూడఁజూడ. 202

— మోహినీకాంతను జూచి యెల్లవారును మెచ్చుకొనుట. —

చ. మదననిధానదేవతయొ, మానినినైతిలకింపవచ్చుసమ్మద
రసపూరమో, సురతమంత్రనియంత్రితయంత్రమూర్తియో

సదమల దివ్యయోగిజన సంఘము పాలిటి విఘ్నశక్తి యో
యది యని యవ్విలాసవతి నందఱుఁ జూచిరి యుత్సవంబునన్.

శా. మందాందోళితకుండలద్వయముతోఁ, మందస్మితశ్రీలతోఁ,
మందారప్రసవాంచితాలకమిళ న్మత్తాళిగానంబుతోఁ
గందర్పక్షితిపాల గంధగజరాడ్గంభీర యానంబుతోఁ
సౌందర్యాలయ మైన యాపొలఁతి యాస్థానంబు వేడాసినన్.

చ. కొలువున నున్నయచ్చరలు గుందిరి వైందవచంద్రికారుచిన్
నలినులభంగి సిగ్గునఁ బెనంగిరి శ్రీ నగజా వధూమణుల్
వెలవెలఁబాఱఁ దద్భవనవిస్ఫుటకృత్రిమరత్నపుత్రికా
విలసన మవ్విలాసవతి విభ్రమకాంతులు మింటఁ దోఁచినన్.

—♦ మోహినీకాంతావిలాసవర్ణనము. ♦—

సీ. వేయుమన్మథులపూవింటికోలలు పాఱు
పరుసున దృక్పరంపరలు నిగుడ
లక్షపద్మములయుల్లాసంబు పాదిగొన్న
కరణి నెమ్మోముపికాస మడరఁ
గోటిచంద్రద్యుతుల్ గొనసాగుచున్నరూ
పంబునఁ దనుదీప్తి ప్రజ్వరిల్ల
శతకోటిరతివధూసౌభాగ్య మెసలారు
పగిది లావణ్యసంపద దనర్ప

తే. నఖలదివ్యాంగనానమభ్యర్చితాంగ
విభ్రమాసక్తి మరుఁడు వెన్వెంట రాఁగఁ

జొచ్చె నాస్థానసదనంబు శోభనాంగి
చంద్రకౌముది కుముదపుష్పంబువోలె. 206

వ. ఇట్లు మదనకామధేనువుచందంబున, ననంగమంగళాధిదేవత తెఱంగున, సంకల్పభవకల్పలతికలాగునఁ, గామసముద్రకల్లోలిక విధంబునం, గుసుమశరవర్షాగమతటిద్వల్లిమురిపెంబున, నిక్షుకోదండ వీరలక్ష్మి లక్షణంబున సాక్షాత్కరించి లత్తుకరసంబున జొత్తిల్లుచుం బ్రణయాపరాధనాయకవక్షస్తాడనప్రసాదదానశౌండంబులై వందనీయంబులైనయడుగుఁ గెందమ్ములును, బ్రసూనతూణీరలావణ్యంబు గణింపక భుజంగభయంకరంబులై మరునిముష్టిలకోలలుంబోలె రవ్వళింజూపు రవలయందియలు గలజంఘాకాండంబులును, నునుఁ బసిండినిగనిగలనలరారుచు వల్లభభద్రదంతావళంబుల బంధించు కట్టుఁగంబంబులైన మెఱుంగుఁదొడలును, ననంగమంగళగృహోపకంఠ నాభీసరోవర కనక సైకతంబై విటరాజహంసవిహారణపదంబైననితంబబింబంబును, మందపవన కంపితం బగు లేఁదీఁగె బాగున జలదరింపుచు యువశ్రేష్ఠులకు నస్తి నాస్తి వివాదహేతువైన తనుమధ్యంబును, రతిరాజపట్టాభిషేకసమయ సమభ్యర్చిత కనక కలశంబుల విలాసంబుల నవకుంకుమస్థాసకపుష్పమాల్యాలంకృతంబులై రసికకాముక గాఢాలింగనబంధభ్రమానుబంధ బంధురంబులైన గురుకుచకోరకంబులును, బంకజనాళ శంకాకరంబులైనహస్తంబులును, ద్రిరేఖావిలసితంబై వల్లభరతిరాజ్య ప్రవేశనమయవిజయ

శంఖంబైనగళంబును, ప్రణయరంహోనునయపరికరగ్రాహ్యంబై కోమలతాళీశలాటుబీజవిరాజితం బైన చుబుకంబును, బున్నమనిండుచందురుని చందంబునం బ్రసన్నం బై పాంథజనమనస్సంతాపహరణకారణసుధారసరసికమందస్మిత సుందరం బైన నెమ్మొగంబును, బరిపక్వబింబికాఫలరూపంబున రసమయం బై ప్రాణేశ్వరక్షుత్పిపాసాపరిశమనసమర్థం బగు నమృతం బాస్వాదింప నింపైన యరుణాధరంబును, మనోహరసౌరభసౌభాగ్యనిశ్వాసమారుతంబునం బ్రియులముఖకమలంబుల వాసించు నాసికాచంపకంబును, శ్రీకారసదృశంబు లై వియోగిదురభిమానలతోచ్ఛేదన నిరత మదన నిశాతచక్రంబు లనం బ్రజ్వరిల్లు వజ్రతాటంకచక్రంబులు గల శ్రవణంబులును, మందస్మితస్మేరంబు లై మనోరమణరమణీయముఖావలోకనముకురబింబంబు లై విడంబించుమృదుకపోలపాలికలును, ముత్తియంపుఁజిప్పలయొప్పిదంబున విప్పారి, హృదయకమలసముద్భూతమదనానురాగమకరందంబు చిందుచు వెక్కసం బైనవెన్నెలరసంబు పుక్కిలించుచకోరంబులన నలరు దరహసిత విలోచనంబులును, పారిజాతప్రసూనగర్భనిర్భరం బై విరహిజనమర్మభేదకం బై పెంజీఁకటిసిరుల నించుచునింద్రనీలఖండఖచితమయూరపింఛసమానం బైన సాలకకేశపాశంబును, దనకు సహజాలంకారంబు లై పొలుపార సముచిత దివ్యాంబరాభరణంబుల భూషితమైనమదాలసత్వంబును, మనోహరలీలా మధురిమంబును, వ్రీడానమ్రముఖభావం

బును, పీఠావిలసనంబును, నంత్ర్వాసంబును, ననంగ లౌల్యం
బును, క్షణక్షణసార్త్రి ప్రకోదయంబుఁ బుట్టింపంజాలు నెల
జవ్వనంపుసిరులును దైవాఱ సర్వమోహినియై సంసారసుఖ
సారం బైన మన్మథ బ్రహ్మవిద్యాతత్త్వంబే ప్రమాణం బని
చిదానంద కళలు తనయందకాని లే వను నుద్యోగంబు గలిగి
యక్కలువకంటి పురోభాగంబున నిలిచిన. 207

—• { మోహినీకాంతను జూడఁగానే శివునికిని బ్రహ్మర్షులు మొదలైన వారికిని జిత్తవైకల్యము పుట్టుట. } •—

మ. కలఁగెం జిత్తము; గుండె ఝల్లుమనియెం; గంపించె దేహంబు; క
న్నులు కెంపెక్కెఁ; జలించె ధాతువులు; వెన్నుండట్లు మాయాసతీ
కలనన్ గామకళానహస్రరసికోత్కంఠన్ విజృంభింపఁగా
వలరా జంటని దంటనంచు విరతిన్ వర్తించునాశూలికిన్.

తే. బ్రహ్మయోగీంద్రదేవదిక్పాలవరులు
మాన్పడి చూచుచుండిరి మగువచెలువు
ప్రమథు లన్యోన్యపరిరంభబద్ధు లైరి
వికలితేంద్రియు లై వెడవిలుతుచేత. 209

ఉ. ఎంతటివారు ధైర్యము వహింపఁగ, నెంతటివారు మోహావి
భ్రాంతులుగాక, యీజగతిపై నిఁక రుద్రునికంటె, యావనా
నంతవిలాసరేఖఁ దరళాక్షి రతోత్సవసంభ్రమంబునం
జెంత వసించి లేనగవుఁ జిల్కుచు మన్మథుఁ బ్రోదిచేసినన్?

సీ. నిశ్చలితధ్యానపియమంబు, లలితాంగి
తోరంపురూపంబు దోఁచుడాఁక

మహనీయజపనిష్ఠ మత్తేభగామినీ
శోభనాగమనంబు చూచుదాఁక
నిజకులాచారంబు, నీరేజపత్త్రాక్షి
కడగంటి చూపు పైఁబడెడుదాఁక
నుగ్రతపోవృత్తి, యువతీశిరోమణి
యౌవనసౌభాగ్య మబ్బుదాఁక

తే. సంతతేంద్రియనిర్బంధశక్తి, యబల
యులఁతిసిగ్గున సొబగుమే నదురుదాఁకఁ
గాక యామీఁద నాఁగునే కంతుచేతఁ
గాశిగళుఁ డైన బ్రహ్మర్షిగణము లైన. 211

ఉ. ఏ మని చెప్పుదుం గురుకులేశ్వర! వైష్ణవమాయ, కొల్వునం
దామరసాక్షుఁ డప్పటి విధంబున నున్నటులుండఁగాన బ్రి
హ్మామరమానికోటులకు నచ్చెరువై పరమాత్మయోగ వి
ద్యామణియైనశంభుహృదయంబుముదంబునఁదేల్చెనాక్రియన్

— మోహినీకాంతను జూచి శివుఁడు మెచ్చుకొని వర్ణించుట. —

తే. ఇవ్విధంబునఁ గొలు వెల్ల నిందువదన
భువనమోహనలీల నుప్పొంగ నపుడు
పూర్ణిమాచంద్రచంద్రికాస్ఫూర్తిచేతఁ
బాలకడలియుఁబోలె భూపాలచంద్ర ! 213

క. కొలు వెల్లఁ దనవశంబై
తిలకింపఁగఁ జేసి మదవతీరత్నము ని

ర్మలచంద్రదేవతాకృతిఁ
జెలువారఁగఁ జూచి శివుఁడు చిత్తములోనన్. 214

క. బళిరే ! సతి యై పుట్టిన
వలదా యిటువంటిరూపవైఖరి లీలా
విలసనముఁ జూపి పురుషుల
తలఁపులు భేదించి వలపు దలకొలుపంగన్ ? 215

శా. వందారుప్రియఫాలభాగమున నవ్యాజప్రసాదంబుతో
నందం బైనయలంక్రియాసరణిలాక్షాంకంబు సోఁకించుచున్
గొందమ్ముల్ దనయన్నదమ్ములయి రాఁగిల్ల న్మనఃప్రీతిఁ బెం
పొందున్ దీనిపదద్వయంబునరి కెట్లొప్పున్ జిగు ల్లెన్నఁగన్.

శా. బంగారంపుమెఱుంగులం దనరి రంభాభూజముల్ తొల్లి యే
భంగిం బంకజసంభవుం దగ భజింపం జాలెనో నిష్ఠమై
రంగన్మన్మథడోలికాస్థితసువర్ణస్తంభయుగ్మంబు లీ
లం గన్పట్టెడుదీనియూరువులఁ బోలం గల్గె భాగ్యంబునన్.

చ. కనకపునిగ్గులం గలిగి కాఁగిటికిం గడువెక్కసంబులై
నునుజిగి మీఱి గోరికొననొక్కులకున్ బిగియారి యున్నమ
ద్ఘనవనజాతకోరకయుగంబుక్రియన్ గొవవాఁడు లైనయీ
వనితపయోధరంబులకు వారణకుంభము లీడువచ్చునే ?

చ. సితకరబింబ మే తపము చేసెనొ? పంకజసూన మేమి స
ద్వ్రతమునమాచరించెనొ?సుధారసకాంతియుసౌరభంబుపూ
ర్ణతయు వికాసముం గలిగి నాఁడెముగా నొకవేళ నైన నీ
యతివమొగంబుఁ బోల్పఁ దగినట్టిపదార్థము లౌటకున్ భువిన్.

చ. అమృతము చాలువారు తుహినాంశుమరీచుల యల్లిబిల్లి;ము
త్తెములప్రచార, మబ్జవనదేశము కుంను, మెఱుంగుఁ దీఁగెతం
డము మొగసారి, యీసతిబెడంగు,కనుంగవచూపు లుత్కటా
సమశరమోహనాస్త్రములసంగతి మూర్ఛలపాలుసేయవే.

సీ. విజితేంద్రియుల మనోవిరతికంథములకు
గండకత్తెర దీనికలికిచూపు
సిద్ధయోగీంద్రులచిరయోగవారాశి
కౌర్వానలము దీనియలఁతినవ్వు
వటుతపోధనులతపఃపర్వతములకుఁ
గులిశాయుధము దీనికోమరువయసు
బ్రహ్మవేత్తల బ్రహ్మపరిబోధచంద్రిక
కరుణోదయము దీనిపరిచయంబు

తే. సకలనిష్ఠలు నీపూర్ణచంద్రవదనఁ
జేరి బిగియారుకౌఁగిటఁ జేర్చుదాఁకఁ
గాక యామీఁద ఫల మేమి కలదు చూడ ?
ననుచుఁ దర్కించె శివుఁడు మోహాంధుఁ డగుచు. 221

వ. అప్పుడు. 222

క. కోలు వెల్లఁ దన్నుఁ జూడఁగ
దళదరవిందాక్షి చూచెఁ దరళకటాక్షాం
చలములఁ బ్రేమముఁ దమకము
నెలనగవును నంకురింప నిందుకిరీటున్. 223

అసితపయోజపత్త్రములయంచుల మించులువాఱుచంద్రికా
రసకణరాజిచందమున రాజిలురాజనిభాస్యకజ్జల
ప్రసరలసత్కటాక్షములఁ బర్వెడు లేనగవుల్ గరంచె న
య్యసమశరారిడెంద మనఃకాంకురముల్ నవనీతముంబలెన్.

తన చూపుకంటె మిక్కిలి
వనితామణిమేలుచూపు వాంఛాలతలన్
బెనిచిన శంభుఁడు మదనుని
సునిశితబాణాగ్నిశిఖలసోఁకున నొచ్చెన్. 225

—♦ శివుఁడు వివేకశూన్యతచే మోహినియందు లోలుఁ డౌట. ♦—

సీ. నారదమౌనివంతము చిత్తగింపక
నలినాసనాదులు నగుదు రనక
ప్రమథులనెఱవాదిపలుకులు దలఁపక
గిరిజ యీరసమునఁ గెరలు ననక
హరిమాయయో యని యాత్మ శంకింపక
తన దృఢయోగవర్తనముఁ గనక
సర్వజ్ఞతాశక్తి సడలుట యెఱుఁగక
చిత్తసంక్షోభంబు చెందఁ గనక

తే. మించి కామాంధకారంబు ముంచిముంచి
మనసుఁ గప్పిన సకలంబు మఱచి శివుఁడు
బాలలీలావిలాసవిభ్రమపయోధి
లోలకల్లోలములలోన నోలలాడె. 226

తే. చూచు సతిరూపు వెండియు సొంపుమీఱఁ
బడఁతి ప్రేమంబు మూపునఁ బరిణమించు
నిట్టు లన్యోన్య దృష్టులు నేకమైన
భావ మాహ్లాద మొనరింప భావజారి. 227

ఆ. లేచి పోయి పట్టఁజూచుఁ గ్రిమ్మఱ మాను
నవసరంబు గామి కాత్మఁ గలఁగుఁ
దరుణిఁ జూచుఁ గొలువు పరికించిపరికించి
వెచ్చనూర్చి మిగుల విహ్వాలించు. 228

తే. ఎట్టకేలకు ధైర్యంబు మట్టుకొలిపి
వేళగామికి నమ్మహా వేగ ముడిగి
కొలువువీడ్కొని దీనినే బలిమి నెత్తు
కొని రయంబునఁ బోయెద నని తలంచి. 229

ఆ. ఒక్కభంగి ధైర్య మూఁది తత్క్రియలఁ
దగిలియున్నచూడ్కి మగుడఁ దిగిచి
వీడుకొలువడయు వినయంబు నంధించి
శూలి కొలువువంకఁ జూచె నపుడు. 230

క. హరియును సిరియును మొదలుగ
సరసిజగర్భాదిదివిజసంయము లచటన్
ధరణీశ ! లేకతక్కరి
హరుచూడ్కికి నేమిచెప్ప నచ్చెరు వందన్. 231

క. హరియును వేల్పులు నెమ్మెడ
కరిగి రొక్కో యనుచుఁ బార్శ్వ మవలోకింపన్

గిరిరాజసుతయుఁ బ్రమథులుఁ
బరిజనములు లేర యచటఁ బరికింపంగన్. 232

—♦ { శివుఁడు చూచుచుండఁగనే యాసభామందిరము
మాయమై యాస్థలము శృంగారవన మవుట. } ♦—

వ. వెండియు విస్మితుం డై కామఘస్మరుండు నలుదిక్కులుం గలయ నాలోకింప నప్పుడు కొలువుకూటంబు మొదలుగాఁ గల కనకకలధౌతచంద్రశాలాద్వారకవాటగోపురప్రాకారాది గృహసన్నాహంబు లేక,యాప్రదేశంబు చూతపనస రంభా ఖర్జూర జంబూ జంబీర నారికేళ కురవ కాశోక వకుళ కరవీర పారిజాత సింధువా రాదిపాదప ప్రతానంబును, నేలా లవంగ లుంగ మాతులుంగ తక్కోల ద్రాక్షా మాధవీ యూథికా మల్లీమతల్లికా ప్రముఖలతామండపకుసుమిత నికుంజపుంజంబులును, వికచకమల కైరవోత్పలమండమండితసరోవర దీర్ఘికాసముదయంబులును, మణిమయదరీగృహద్వారవేదికా శిలాఫలకకలితకేళీశైలంబును,బుష్పతరుశాఖాసమాందోళిత సువర్ణడోలాతల్పంబును,బల్లవోల్లసితకుసుమరసఫలరసధారా ప్రవాహంబులును,మందమారుతపరిపూరితదిశావకాశబహువిధామోదభారంబును,కోకిలారవకోలాహలంబును, శుకనికర కలాలాపంబులును, జంచరీకఝంకారంబులును, హరిణమిథునసంచారంబులును, మయూరనృత్తావధానంబులును, గలహంస లస దలస క్రేంకారనాదంబులునుం గలిగి యొక్కయభినవోద్యానం బై యుండె నంత. 233

క. అది సమాజోద్యానం బై
మది కింపొనరింపఁ దాను మగువయుఁ దక్కన్
వెదక మఱి యొరులు లేమికి
మదనారియుఁ బ్రమదమగ్నమానసుఁ డయ్యెన్. 234

క. తన రాకయు, హరికొలువున
నునికియు, నాస్థానభూమి యుద్యానం బై
తనరుటయు మఱచె శంభుఁడు
కనియును హరియింద్రజాలకౌతుకలీలన్. 235

శా. ఆచందంబున నిర్జనం బయిన యుద్యానంబుఁ బ్రాణేశ్వరిం
జూచెం గోర్కి ఫలించెనంచుహరుఁ డక్షుద్రైకపుష్పాస్త్రునా
రాచశ్రేణులతోడఁ గూడి పికకీరవ్రాతభృంగీరవ
ప్రాచుర్యంబు గలంచె నవ్విభుని శుంభద్ధైర్యసారాంశమున్.

వ. అంత. 237

శివుఁడు మోహినీకాంతను బట్టఁ దలఁచి లేవఁగా నామోహిని మాయ మగుట.

తే. ఏకతమున నున్నయింతిఁ బట్టుడు వేడ్క
నాసనంబు డిగ్గి యరిగె హరుఁడు
సతియు నొక్క తీఁగెచాటున వడి డాఁగి
పోయె నవలఁ ద్రోచి బొమ్మవోలె. 238

క. డాఁగిన యాలతమాటున
కేఁగి లలాటాక్షుఁ డచట నిందునిభాస్యన్

దాఁ గానక తల్లడపడి
వేఁగెడుచిత్తమును మేను విరవిరవోవన్. 239

ఉ. ఇక్కడ నన్ను డాయనెలయించిన దీలత మాటలోనె యీ
టక్కరికత్తె యేవలన డాఁగెనొ నవ్వుల కంచుఁ, బొంచి నల్
దిక్కులు చూచెనప్పు డెలదీఁగెలుగప్పిన పొన్ననీడ ను
న్నిక్కిన రత్నవేది నొకయిక్కువఁ బెంపెసలారు వేడుకన్.

సీ. పయ్యెద దిగజాఱఁ బసిఁడిచాయలుదేరు
చనుదోయి ముత్యాలసరము వెలుఁగ
బహుళతాడనాయాసభారజాతస్వేద
కణములు గండభాగముల నురల
ననుగతదృష్టిసంహతితోడ సౌరభా
గతమత్త మధుపసంఘములు చెలఁగ
గ్రహణ మోచన వేళ ఘుళఘుళత్కారపద్మ
మణికాచకంకణరణన మెసఁగఁ

తే. గంపితోత్కటకచభారకల్పభూజ
పుష్పములు రాలి దిశలఁ బుష్పాళ్లు చెదరఁ
గ్రీడమైఁ దాని పూబంతి యాడుచున్న
యవ్విలాసినిఁ గనియెఁ జంద్రార్ధమౌళి. 241

—◆ శివుఁడు మోహినిని మరలఁబట్టఁ జూచుట. ◆—

క. కని, పేద పెన్నిధానముఁ
గనిన ట్లుల్లంబు పరమకౌతుకలీలన్

గానసాగ నల్లనల్లనఁ
జని పట్టర నని తలంచి సరసవిశిఖిన్. 242

మ. చరణాబ్జంబులు భూమిభాగమున నిశ్శబ్దంబుగా మోపుచున్
దరుమండంబులు దండ నండ గొనుచున్ దత్కౌతుకోల్లాససుం
దరసంక్రీడల నేమఱించి యమితోత్సాహంబుతోఁ బట్టు త
త్పరతం జేరువఁబొన్న మాఱుగొనియుద్యద్వేగసంరంభుఁడై.

ఆ. మ్రానుచాటు విడిచి మగువ యున్నెడకు లం
ఘించి ప్రేమఁ గౌఁగిలించె నపుడు
పడఁతి లేక బట్టబయ లయ్యెఁ గలలోని
లేమఁ బట్టి గౌఁగిలించు టయ్యె. 244

శా. అస్తంయాతవివేకుఁడై యపుడు చంద్రాపీడుఁ డుల్లంబునన్
హస్తప్రాప్తధనంబు పోయినటు లత్యంతంబు చింతించి వి
ధ్వస్తేందీవరలోచనా ప్రియతమ వ్యాపారలీలా పరి
స్రస్తాంగంబులతోడ ధైర్య మెడలన్ సంతాపముం బొందుచున్.

వ. కొండొకతడ వెద్దియుం బరికింపం గానక నిర్వేదించి. 246

క. నిక్కముగఁ గౌఁగిలించితి
గ్రక్కున నది లేకపోయెఁ గౌఁగిటిలోనన్
జక్కెరవిల్తుఁడు పన్నిన
వెక్కస మగునింద్రజాలవిద్యయపోలెన్. 247

క. ఇప్పావ్పుఁబొదలలోపలఁ
జొప్పడునో చూత మరుచుఁ జూపులు దిశలన్

విప్పారఁ బెక్కు నెలవులు
తప్పక పరికించి మోహదశ పాఱ్పింపన్. 248

—◆ శివుఁడు విభ్రాంతుఁడై వనమందుఁ దిరుగుట. ◆—

సీ. మదశిఖావళి యొక్క పొదలోన మెలఁగినఁ
దొయ్యలి యని పోయి తొంగిచూచుఁ
గలకంఠనాద మెక్కడ నైన వినఁబడ్డఁ
జెలువ భాషణ మని చిత్తగించు
నెలదేఁటితండ మెయ్యెడ మ్రోలఁ బొలసినఁ
బడఁతుక నెఱు లని పట్టఁ దివురు
గాడ్పునఁ బూఁదీఁగె కదలిపై వ్రాలినం
గన వచ్చె నని పట్టి కౌఁగిలించుఁ
తే. జెదరి పూఁదేనె వాతెఱఁ జెంద నిందు
వదనయధరామృతం బని వలచి గ్రోలుఁ
జేతనాచేతసజ్ఞానశిథిలహృదయుఁ
డగుచు మదనారి మిథ్యావనాంతరమున. 249

వ. ఇట్లు పరిభ్రమించుచుం బోయిపోయి యొక్క సంఫుల్లమల్లి
కామండపంబున. 250

—◆ శివుఁడు తిరిగి మోహినీకాంతను దూఁగుటుయ్యాలపైఁ జూచుట. ◆—

సీ. జిగిగుబ్బపాలిండ్లఁ జేలాంచలంబును
దొడలపై ముంగొంగుఁ దొలఁగి యాడ
ధర మెట్టి యూఁగునుద్ధతి ఘల్లు మని బిట్టు
రమణీయమణినూపురములు మ్రోయఁ

బుష్పవ్వఁదీఁగెలఁ గరంబులఁ బట్టి నిగిడెడు
తీవ్రత మైచాయ తీఁగెసాఁగ
రాకపోకలతోద్రివ నాకాశలక్ష్మికిఁ
జరణాంబుజంబు లర్చనలు గాఁగ

తే. నెలమి వనదేవతలకు నింపెసఁగ నసమ
శరునిఁ బాడుచు మందహాసంబుతోడఁ
గేలిడోలామహోత్సవశ్రీలఁ దేలు
బాలఁ గ్రొమ్మెఱుఁ గనియె నాశూలపాణి. 251

క. ఏణాంకధరుఁడు, పోయిన
ప్రాణకళయుఁబోలె మగుడఁ బ్రాప్తించిన యా
ప్రాణేశ్వరిఁ గనుఁగొనియెన్
క్షోణీశ్వర ! రెప్పకప్పు నుడియనిచూడ్కిన్. 252

వ. ఇవ్విధంబున నిందుముఖీసందర్శనానందపారవశ్యంబునుం బొంది యెప్పటియట్ల వంచించి కానకుండం బట్టుకొనువాఁడై పశ్చాద్భాగంబునఁ బొదలమాటున నొదిఁగియొదిఁగి యా యుయ్యాల డాసి పట్టు నుంకించిన. 253

క. ఇందుధరుగమక మారసి
ముందఱికై యూఁగి యచట ముద్దియ యుఱికెన్
గందువ మణినూపురయుగ
మందంబుగ ఘల్లుఘల్లు మని మ్రోయంగన్. 254

—♦ మోహిని తిరిగి యదృశ్య యగుట. ♦—

శా. డోలాతల్పము డిగ్గదాఁటి మదనాటోపంబు దీపింపఁగా
బాలారత్నము సస్రస్తబంధకబరీభారంబునం బుష్పముల్
రాలన్ లంఘనచాతురిం జకితసారంగాంగనాభంగి నా
శూలిన్ గిక్కురు నెట్టి పోయె లతికాస్తోమాంతరాళంబులన్.

మ. తనువంచించి విహంగి యై యెగసి చేతం జిక్కక ల్లేఁగినన్
గని నిశ్చేష్టితలోచనాంబుజదళాగ్రవ్యగ్రబాష్పాంబువుల్
తనుకంపంబున రాల గద్గదికతో దైవంబు నిందించి వే
చని నిట్టూర్పులతోడడాఁకొనియె నాచంద్రాస్యడోలాలతన్.

వ. ఇట్లు డాఁకొని, తదీయ మనోహరాంగ శోభనాంగరాగ సత్త్వంబు గలిగి తద్విహరణలీలాయోగ్యం బైన యాతూఁగుటుయ్యెలతీఁగం గౌఁగిలించి. 257

క. ఏ పుణ్యంబులు చేసితొ
యాపువ్వుందీఁగెఁ బోఁడి నప్పుడు డోలా
రూపమున ననఁగి పెనఁగెడు
నీపరిశోషంబు గనఁగ నివ్వన భూమిన్. 258

వ. అని యభినందించి యమ్మొలకుంగుఁదీఁగెఁబోఁడి యుఱికిపోయిన కడకుం బోయి. 259

క. కచబంధంబున జాఱిన
విచికిలదామంబు ప్రణయవివశతఁ గొని యా
రుచిరాంగిఁబోలెఁ గౌఁగిట
నచలసుతావరుఁడు సేర్చి యానందించెన్. 260

క. తరుణీకుచనిపతితని
ర్భరపరిమళగంధసారపంకదళంబుల్
హారుఁ జేటి మదనరక్షః
పరిరక్షాతిలక మిడియె ఫాలాగ్రమునన్. 261

వ. వెండియు నమ్మిందట నయ్యిందు వదన పదారవిందంబులు గనుంగొని. 262

ఉ. చారుశిరీషకోమలము సారసపత్త్రమనోహరంబు వి
స్ఫారితభాగ్యరేఖము విభాసురకుంకుమపంకిలంబు నై
కోరికముంచు నీ సమదకుంజరయాన పదద్వయంబు సొం
పారఁగ నస్మదీయనిటలాగ్రిము సోఁకుట యెప్పుడో గదా.

క. అని సురభికుసుమముల న
వ్వనితామణిదివ్యపాదవారిజములు స
ద్వినయంబున నర్చించుచుఁ
జని యా శివుఁ డొక్కకేళిశైలముదండన్. 264

క. అరవిందేందీవరబం
ధురకేళీహంసగణమనోహరపద్మా
కరకల్లోలపరంపర
నరుదారఁగఁ దాను నొక్క హంసియుఁ బోలెన్. 265

—◆ మోహిని జలక్రీడలాడుచు శివునకుఁ గనఁబడుట. ◆—

సీ. గురుతరోన్నతకుచకుంభయుగ్మముఁ దాఁకి
వీచీపరంపరల్ విఱిగిపడఁగ

జలములనీఁదు నుత్సవకేళిఁ గని తద
భ్యాసవశంబులై యంచ లలరఁ
గమలముల్ దొఱఁగి, యుత్కటసౌరభముఁ జల్లు
మోమున నెలదేఁటిమొత్త మాడ
వలరాజు కేతనజలచరార్థము వైచు
పువ్వులువోలెఁ జూపులు దనర్ప
తే. మృదులపవమాన వీజన మేను చెంది
కంజకింజల్కమధురజః కాండ మలర
వేడ్కజలకేళి సలుపునవ్వేలఁదిఁ జూచె
నిందుశేఖరుఁ డద్భుతానందలీల. 266

వ. చూచి యవ్వేలంది యానో కాదో యను సంశయంబున.

క. అరవిందవదన మోమో
యరవిందమొ నీలవేణి యలకలొ తేంట్లో
తరళాక్షిచూపులో జల
చరములొ గుబ్బెతకుచములొ చక్రద్వయమో. 268

వ. అని భావించి. 269

ఉ. చేరి తదీయలీల తనచిత్తమునం గలశాంబురాశి వీ
చీరుచిరప్రవాళలత చెల్వన నింపెసలారుచున్న వి
స్ఫారితలోచనాబ్జముల సంతసమారఁగఁ జూచి యెట్లొ నే
ర్పారఁగఁ బట్టువేఁడుకఁ బ్రయత్నమునన్ సడిదాఁకినెమ్మదిన్.

ఉ. ఏగతిఁ బట్టువాఁడ నొకొ యిప్పుడు? మున్నొనరించినట్టియు
ద్యోగములెల్ల నిష్ఫలత నొందెఁ బదంపడి కంటి భాగ్యరే

ఖాగిరిమన్ దటాకమునఁ గంజ నివాసినిఁబోలె నంబుకే
ళీగతదివ్యచిత్తమున లేమ చరించెడు నూర్మిపంక్తులన్. 271

— ♦ శివుఁడు తిరిగి మోహినీకాంతను బట్టఁబోవుట. ♦ —

క. జలకేళీమహోత్సవ
కలనానందమున నొరులఁ గానక హంసా
వళిలోనఁ దేలు చున్నది
వెలఁదిం బట్టంగ నిదియె వేళ యటంచున్. 272

క. చరమప్రదేశమున నా
సరసిరుహాకరముఁ జొచ్చి సర్వజ్ఞుఁడు త
ద్విరహాగ్నితప్తదేహముఁ
బొరయుడు, నుసుకత్తి నీరుబుగ్గలు వొడమన్. 273

మ. హరచూడాహరిణాంకఖండరుచి నెయ్యంబారఁగాఁ గైరవో
త్కర ముల్లాసముఁ బొందెఁ, గుందె జలజాతశ్రేణి, హంసావళీ
గరుదోఘంబున మించె సోయగము, చక్రద్వంద్వమున్మన్మథా
తురవృత్తిం గవవిచ్చి పోఁదొడఁగెఁ దోఁచెం దత్తటాకంబునన్.

— ♦ మోహిని తప్పించుకొని శివున కగపడక పోవుట. ♦ —

వ. ఇట్లు రభసంబునం బట్టవచ్చు కామారి కామాతురత్వంబుఁ
గనుంగొని యంతర్హాసంబున నయ్యింతి వెఱసిగ్గుతో విలీన
యై, వివస్త్ర యై యున్నదాన రాకురాకు మని నివారించి
నీరువెడలి తీరంబుచేరి చీరఁగట్టుకొని. 275

క. బెడఁగారు పువ్వుసొమ్ములు
వెడవెడ నొకకొన్ని దొడిగి వెలిదామర పు

ప్పాడి మేన నలఁది వేఱొక
యెడ నవ్యనికుంజసుమసమీహితశయ్యన్. 276

శా. పూవుం గ్రోవులఁ దమ్మిమొగ్గలను సంపూర్ణంబుగా నిచ్చు నె
త్తావుల్ గ్రమ్ము మరందపూరము ప్రమోదం బారఁగాఁ గ్రోలు
చున్। భావోద్భూత మదప్రదీప్తయగుచున్ బాలిండ్లు ముక్తాం
బర। శ్రీవిన్యాసము నొందనుండె సురతక్రీడోన్ముఖస్వాంతయై.

వ. అంత నమ్మహాదేవుండు నట్లు నివారితుండై కొండొక నిలిచి
యచ్చపలలోచన మోమోట మాటకు నంతసించి. 278

మ. పలికెం దేనియలొల్క, నవ్వెఁ బ్రియమొప్పం, జూచె నాశాలతా
వళులన్ జిక్కఁగ, జెందమున్ గనియె నివ్వామాక్షి యంచుం బ్రి
యం। బలరం దమ్మికొలంకు వెల్వడి సరోజాక్షీశిరోరత్న మె
వ్వలివంకన్ మునునిల్చె నచ్చటికిఁ బోవం దత్ప్రదేశంబునన్.

మ. సతి లేకున్నఁ గలంగి గుండె చెదరన్ శంభుండు నిర్విణ్ణుఁడై
ప్రతి దిగ్భావితనేత్రపంకజగళద్బాష్పాంబువుల్ మీటుచున్
శతపత్త్రాకరసైకతోర్మిగతహంసశ్రేణులం గ్రమ్మఱన్। జతనం
బారఁగఁ జూచి యాత్మకృతదోషంబున్ బ్రశంసించుచున్.

ఆ. అపుడు పట్టనైతి నణకించి పోయె నా
మాయలాఁడి మగువ మరులుకొల్పి
యకట ! మోసపోతి నరయంగ లేనైతిఁ
దలఁపు కొలఁదిగాక తప్పిపోయె. 281

ఆ. విగతవస్త్రయైన వెలఁదిగాక, సవస్త్ర
యేల కాముకునకు ? నెఱుఁగ నైతి

సతి వివస్త్ర నన్ను జడిసితిఁ బట్టంగ
భాగ్యహీనుఁ డేల ఫలము నొందు? 282

వ. అని వగచి తదీయలీలాగుణంబులు దలంచి. 283

సీ. ఆమహాగంభీరయానంబు మురిపె మా
బలుపిఱుందునఁ గ్రిమ్ము వసిఁడినిగ్గు
లాగుబ్బుపాలిండ్లపై గబ్బిచంద మా
చిగురాకుమోవిపైఁ జిన్నినగవు
లాముద్దుమోమున నడరుసంతోష మా
నిడువాలుచూపులనిశితధార
లాలలాటాంతకాంతాలకశ్రేణి యా
చరణావతంసకజలరుహంబు

తే. లారతోత్సవలీలావిహారరసిక
మానసాహ్లాదభంగి నామానసమున
మఱవ రాకున్నయవి నన్ను మరుఁడుకొల్పి
యింక నేలాగు పాలింతు నిందువదన. 284

క. వేడుక నిది యలయించెడు
జాడయొ మాయామృగంబుసఖరైమె కపట
క్రీడల భ్రమియించి తుదిం
గూడక నను మొఱఁగెపోవు గుత్సితగతియో. 285

వ. మెఱుఁగుందీఁగె తెఱంగునం దోఁచియు, మృగతృష్ణికారూపంబునం బట్టువసలేకయు, నింద్రజాలంబుచందంబున నిజంబుగాకయు, స్వప్నావస్థలాగున భ్రమయించియు, దర్పణచ్ఛాయ

యుంబోలె దురవగమయయ్యెను,దగులువడక పోవుచున్నది.
దీని కేమిసేయువాఁడ నని విరహోన్మాదవికలచేతస్కుం డై
యచట నుండం గొలుపక వెండియు నన్వేషించుచు నక్కలువ
కంటియున్న పువ్వుటింటికిం బోయి. 286

క. తనుఁ జూచి సిగ్గుఁ బ్రేమయుఁ
బెనఁగొనఁ బూఁబొన్న డిగ్గి బిసరుహదళలో
చన నగవు దొలఁక నెడచే
సి నిలిచినం గోర్కు లడర శివుఁ డిట్లనియెన్. 287

ఉ. పానుపుడిగ్గ నేమిటికిఁ బంకజలోచన ! నన్ను మన్మథా
ధీను వియోగతాపశిఖిహేతినిపీడితుఁ గౌఁగిలించి యిం
పూని హిమాంబు శీతలపయోధరగంధరసార్ద్రదేహునిం
గా నొనరింపవే రతులకందువఁ జెంది కృపాతరంగిణీ ! 288

క. అని విరహాభారవిహ్వల
ఘనమదనోన్మాదవికృతిఁ గానక దీనా
ననుఁ డగుచుఁ బెక్కుమాటలు
వని యేమని యశ్రుజలము పయిపయిఁ దొరఁగన్. 289

ఉ. చిక్కితి దుర్వియోగమునఁ జిక్కితిఁ జక్కెర వింటి వాని చేఁ
జిక్కితి మోహబంధమున శీతకరానన ! కౌఁగిలింపవే|మ్రొ
క్కెదనంచుహస్తములు మోడ్చుచు శంభుఁడు డాయఁబోయి
యాచక్కని మాయలాఁడిబిగిచన్నులపయ్యెదఁబట్టెనుద్ధతిన్.

ఆ. ఫాలలోచనుండు పయ్యెదఁ బట్టినఁ
బట్టువడక పోయెఁ బద్మనేత్రి

పట్టువడుసె మెన్నిపాటులు వడ్డ నా
విష్ణుమాయ? శివుఁడు నెట్టిగాక! 291

క. ఆతటి నిలువక గ్రిక్కిస
చేతోభవకేళి లేక శివునకుఁ బెలుచన్
రేతఃపూరము గంగా
స్రోతోరూపమునఁ దొరఁగెఁ జోద్యం బడరన్. 292

క. అయ్యింద్రియరస మంతయు
నయ్యెడ రజతంబు శుద్ధహాటకమును నై
నెయ్యమున నొప్పెఁ గనుఁగొన
నయ్యాస్థానంబు వారి కచ్చెరు వగుచున్. 293

—♦ శివునకుఁ బరబ్రహ్మజ్ఞాన ముదయించుట. ♦—

క. రాజీవాక్షుం డాక్రియఁ
దేజము పాలిచెఱపి, మాయ తెరఁ దిగిచిన నా
రాజార్ధశేఖరున క
వ్యాజ పరబ్రహ్మబోధ మడరెన్ బుద్ధిన్. 294

శా. మారారాతి, విముక్తమోహుఁడయినన్మాయావనక్రీడలున్
నారీమోహనలీలలుం బోఱఁగె నానాదేవతాశ్రేణితోఁ
దోరంబై మునుపోలెఁ గొల్వుదనరెన్ దుర్వారతేజంబుతో
ధీరుండై మణిభద్రపీఠిఁ జెలువొందెన్ విష్ణుఁడున్ నవ్వుచున్.

క. కురిసెఁ బువ్వులవానలు
హరిపై నానందలీల నమరులు మెచ్చన్

బరిపరివిధముల ముందట
సరనాయక ! జడలు దూల నారదుఁ డాడెన్. 296

సీ. మ్రొక్కిరి సురముని మూర్ధాభిషిక్తులు
మోడ్చుఁజేతులు మస్తముల ఘటించి
పొగడిరి శేషాదిభుజగాధినాథులు
బిరుదప్రబంధగంభీరయుక్తిఁ
బాడిరి గంధర్వపతులు వీణావేణు
కలనాదములతోడిగానసరణి
నాడి రచ్చరలేమ లభినవనృత్యంబు
లభినయవిన్యస్తహస్తలీల

తే. బ్రహ్మ ప్రాంజలియై వేదభాషణముల
బ్రహ్మతేజోవిలాసంబుఁ బ్రస్తుతించెఁ
బ్రమథగణనాయకునిమ్రోల బహువిధముల
నాదివిష్ణునిగూర్చి యయ్యవసరమున. 297

—♦ శివుఁడు కైలాసమునకుఁ బోవుట. ♦—

క. హరిమాయావిభ్రమమును
బరమబ్రహ్మైకచిత్రభావము నత్యా
దరమున వర్ణించుచుఁ ద
త్పరిరంభణకేళిఁ దేలి ప్రమదం బెసఁగన్. 298

క. ప్రమథులు గొలువఁగ నార్యా
రమణీమణిఁ గూడి చనియె రజతాద్రికి నా
యమృతాంశుశేఖరుఁడు చి
త్తమునం దద్విష్ణుమాయఁ దలఁచుచు వేడ్కన్. 299

— ఫలశ్రుతి. —

క. నారాయణమాయాభా
మారూపముఁ జూచి శివుఁడు మఱఁగిన కథ యిం
పారఁగ విను ధీరుఁడు సం
సారమహామాయఁ బాసి సంతస మొందున్. 300

వ. అని గోవిందశర్మ ధర్మనందనునకుం జెప్పెననిన విని, పరీక్షిత్తట
మీఁదటి కథాప్రసంగం బెట్లుండె నని శుకబ్రహ్మ నడుగు
టయును. 301

మ. కలశాంభోనిధికన్యకాకుచతటీకస్తూరికాపంకసం
కిలసుస్నిగ్ధశరీర, నీలగళయోగిగ్రామణీమోహనో
జ్జ్వలమాయామహిళావినోద, ధరణీసంశ్లేషసంభావనా
విలసచ్ఛ్వేతవరాహ, భావితమహావేదాంతతత్త్వోదయా.

క. నారదవీణామధురగ
భీరధ్వనిముదితహృదయబిసరుహ శుకస
త్కారసమాశ్రితనిజతే
జోరూపఫలప్రపూర్ణసురతరురాజా. 303

తోటకవృత్తము. చతురాసన దివ్యలస న్మకుటాం
కితరత్నమరీచి వికీర్ణపదా
శ్రుతిరాగతరంగవిశుద్ధజగ
త్త్రితయా శ్రితలోకవిధేయగుణా. 304

ఇది శ్రీ మదనగోపాల చరణకమల సేవాధురీణ సత్కళాపారీణ
కృష్ణభట్టారకపౌత్రి చింతలపూఁడికామయప్రభుసుపుత్ర
సుకవివర్యరాధామాధవయెల్లనార్య ప్రణీతంబైన
విష్ణుమాయానాటకంబునందుఁ
జతుర్థాశ్వాసము.
శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ.

శ్రీరస్తు.

విష్ణుమాయానాటకము.

పంచమాశ్వాసము.

క. శ్రీకర! రాధాకైరవ
రాకాసితకిరణ! మునివిరాజితచేతో
వైకుంఠనిలయ! గుణర
త్నాకరకల్లోల! నవమదనగోపాలా! 1

తే. అవధరింపుము దేవ! సంయమివరుండు
సకలవేదాంతవిద్యావిశారదుండు
శుకమహాయోగి పలికె నుత్సుకత మఱియు
నింపుగా నాపరీక్షిన్నరేంద్రుతోడ. 2

వ. అవ్విధంబున సదాశివునికథఁ జెప్పి గోవిందశర్మ ధర్మనందను
నకు విష్ణుమాయవలన నారదుండు మోసపోయిన తెఱంగు
చెప్ప నుపక్రమించి. 3

మ. విను విశ్వక్షితిపాలమౌళివలభీవిస్ఫారరత్నప్రభా
కనదుద్దామపదారవింద! త్రిజగత్కల్యాణచారిత్ర! పాం
డునరేంద్రోత్తమపుత్ర! యీమునిగరిష్ఠుల్ నీవునుంగూడియెం
దునకుం జిత్తము పోవనీక వారియందున్నిల్పి సంప్రీతితోన్.

వ. అని కొలువు సావధానంబుఁ గావించి. 5

—♦ విష్ణు ప్రభావ వర్ణనము. ♦—

క. పరమాత్ముఁడు పరమేశుఁడు
పరమ బ్రహ్మైకమూర్తి ప్రకృతి పురుష సుం
తరుఁడు తదీశుఁడు నని మదిఁ
బరికింపుము విష్ణు సుప్రభావచరిష్ణున్. 6

క. తేజముల కెల్ల నుత్కట
తేజం బై తమముఁ జెఱచుతీవ్రాంశుక్రియన్
దేజోనిధి యగుహరి నిజ
తేజమునఁ బ్రపన్నమోహతిమిరముఁ జెఱచున్. 7

వ. అని హరిసామర్థ్యంబు సూచించి తదనురూప కథాప్రాయం
బుగ నిట్లనియె. 8

క. సకలబ్రహ్మాండకదం
బకఘటనాచతురలీల వాయని మదితో
నొకనాఁడు సనకశుకముఖు
లకునుం బోరానివేళ లలితక్రీడన్. 9

—♦ శ్వేతద్వీపమున విష్ణుమూర్తి కొలువై యుండ మాయాకాంత వచ్చుట. ♦—

శా. శ్వేతద్వీపమునందు సాగరతటోర్వీపారిజాతావనీ
జాతచ్ఛాయ సువర్ణపీఠమునఁ గంజాతాలయాకామినీ
భూతస్వీ సముపాశ్రితుం డగుచు సంభోజాయతాక్షుండు సం
ప్రీతిన్ దివ్యసతీమణుల్ గొలువఁగాఁ బేరోలగంబున్నడన్.

క. విదిత ప్రకృ త్యవిద్యలు
మొదలుగఁ బేరైన నామములుగల మాయా

మదిరాక్షి యైనవైష్ణవి
ముదమునఁ జనుదెంచి శౌరిముందట నిల్చెన్. 11

సీ. నెత్తమ్మిరేకుల నెఱిమించు నడుగులఁ
గనకమంజీరభృంగములు మొరయఁ
గారుకందువసిరి గలమేనుఁదీఁగెపైఁ
గుంకుమతటిదంశు వంకురింప
జక్కవ మురిపెంబు సనవచ్చుచనుదోయి
మౌక్తికబిసఖండమాల్య మడర
నిండుఁ జందురునివన్నియసొంపుమోమున
మందస్మితజ్యోత్స్న మాఱుమలయ

తే. నట్లు మోహనమూర్తి యై యరుగుదెంచి
కంకణక్రేంక్రియాశ్రీలఁ బొంక మొనఁగ
హరికిఁ గరములు మొగిచె, నయ్యతివఁ జూచి
సతులకొలు వెల్ల వేడ్కల నందడింప. 12

క. కరములు మొగిచిన మాయా
తరుణిం గరుణాప్రసన్నతం జూచె మహా
పురుషుండు విష్ణుదేవుఁడు
సిరి కైనం గలదె యట్టిచెలిమి విభునితోన్ ? 18

తే. అపుడు శ్రీహరిసుప్రసన్నాభిముఖత
విదిత బహుమానగుణకమై వేడ్కసేయఁ
దత్ప్రియస్త్రీల కుబుసుపోఁ దగినయింద్ర
జాలవిద్యావిశేషముల్ సంఘటించి. 14

వ. అమ్మాయాతరుణి తత్ప్రకారంబులు చూప నుద్యోగించు సమయంబున, సకలలోకసంచారి యగునారదమునీంద్రుండు పరమభాగవతోత్తముండు గావున భగవత్సేవాతత్పరుండై వైకుంఠదివ్యభువనంబున కరుగుదెంచువాఁడు, పురాకృత పుణ్యఫలవిశేషంబున నట్లు కొలువై యున్న దేవదేవునిం గనుంగొని మేను గరుపాఱ గగనంబు డిగ్గి నారాయణ నామోచ్చారణపారాయణమధురవీణానాదంబుతో జయ జయశబ్దపురస్సరంబుగా ననేకప్రణామస్తోత్రసహస్రంబులు సమర్పించి తదాదరణంబు వడసి కూర్చుండె నంత నయ్యింతి తన యుపక్రమంబున.

క. పురుషుఁడుఁ బ్రకృతియు జగదు
త్కరమును గాలంబు నైన కర్తకు నాత్మే
శ్వరునకుఁ దేజోరాశికి
హరికి నమస్కృతి యొనర్చి యద్భుతలీలన్. 16

— మాయాకాంత బహువిధంబులుగా నింద్రజాల విద్యలు చూపుట. —

సీ. బుద్బుదంబులఁబోలెఁ బొడమించు నడఁగించు
బ్రహ్మాండమండలపరికరముల
నింద్రుల మనువుల నెలయించుఁ బొలియించు
జంత్రంపు బొమ్మలసరవి మీఱఁ
బొలఁతులఁ బురుషులఁ బుట్టించు గిట్టించు
వెడబూమెరూపులవిధముగాఁగ
భూరిసంపత్కళల్ పొరయించు విరియించు
ఘననిదాఘమరీచికల తెఱఁగునఁ

తే. పంచభూతవిలాసముల్ నించుఁ దెంచు
సముచితస్వప్నదృష్టప్రచారములుగ
దుఃఖసుఖములు సముకూర్చుఁ దోలఁగఁ ద్రోచుఁ
గాలసరణులఁ జక్రియుగ్మంబుజాడ. 17

సీ. బహుమతంబులవారిఁ బ్రభవింపఁగాఁ జేసి
మూఢవాదంబుల మొనయఁ జేయుఁ
బెక్కువేల్పుల భూమిఁ బెంపారఁగాఁ జేసి
యల్పులఁ దత్సేవ కలరఁ జేయు
వర్ణాశ్రమంబులవారల సమకట్టి
కర్మానుగతబుద్ధిఁ గడలుకొలుపు
విద్యావయోధనవిభవముల్ గల్పించి
గర్వకోపోద్రేకగతులఁ బెనుచు,

తే. గజతురంగాంగనారత్న కలనఁ జూపి
రాజ్యభోగానురాగాభిరతి దొనర్చి
తామసులు రాజసులుఁ గాఁగఁ దగులు వెట్టు
సహజమోహాంధకారంబు సంఘటించి. 18

క. కూలంకషాపగాంబుధి
కేళీవనగిరుల మేలు గిటికొల్పి లస
న్మాలీకోత్పలఫలసుమ
జాలకసౌభాగ్యలక్ష్మి సమకొనఁ జేయున్. 19

క. చంద్రార్కవహ్న్యనిలభీ
సాంద్రతఁ బాలుపారఁజేయు జలధరవిద్యు

ద్రుంద్రనవరత్నరుచిరము
హేంద్రి ధనుర్లీలఁ జదల నెనయఁగఁ జేయున్. 20

క. అరిషడ్వర్గాతురులై
పరిబోధము లేక నరులు బహువిధకర్మా
చరణమున మెలఁగఁ జేయుచుఁ
బొరిఁబొరి జననాదిదుఃఖములఁ బడఁ జేయున్. 21

క. నరనాయకులై కొందఱు
పరిజనులై కొంద ఱుచితపదరాజ్యమనో
హరులై దుర్నయవర్తనఁ
గొఱలుచు దుష్కర్మవార్ధిఁ గూలఁగఁ జేయున్. 22

క. అతులితసాత్త్వికయోగ
ప్రతిపాదితభక్తిఁ బరమభాగవతుల సం
చితసేవాంజలితో స
న్మతి నెడనెడఁ బొగడి విభుని మన్ననవడయున్. 23

మాయాకాంత పన్నిన యింద్రజాలమును నారదుఁడు తిరస్కరించి తన ప్రభావమును బొగడుకొనుట.

వ. ఇవ్విధంబున ననేకవిద్యావైశారద్యంబు చూపి కౌతుకంబు నెఱపిన నవ్విభుండును, నయ్యిందిరా ప్రముఖ సుందరీ సహస్రంబును బహుప్రకారంబులం బ్రస్తుతించి సముచిత రత్నపారితోషికంబు లిచ్చి రప్పు డీమహాత్ముండు నారదుండు తదీయమాయారహస్యాదితిరస్కారగర్భంబుగా నలంతినవ్వు

నవ్వి తన తపోవిద్యానిర్వాహకత్వంబు ప్రేరేఁప హరికిఁ
బ్రాంజలి యై యిట్లనియె. 23

తే. ఈమహాదేవు లెఱుఁగరే యిటకు మున్ను
నీదుమాయల కొలఁదులు? నీరజాక్ష!
యింత భ్రమయుచు నున్నవా రింతలోన!
యతివ లబలలు, ముగ్ధలు ననుట నిజము. 24

క. మున్ను పలుచోట్లఁ జూపిన
దిన్నెరువు ప్రకృతి విద్యలివి వింత లోకో
పన్నగ నేతన్మాయో
త్పన్నము లగు కృత్యములకు బ్రమయం జనునే? 25

క. ఏ నొకఁడఁ దక్క నీమా
యానిర్మాణమునఁ జిక్కె నఖిలము విమల
జ్ఞానము చాలనికతమున
నీనెలఁతల భ్రాంతి చెప్ప నేమిటి కింకన్. 26

తే. బ్రహ్మరుద్రాదిదివ్యుల బ్రమయఁజేయు
నపుడు నినుఁ జూచుచుండుదు నరిదిపడక
యెఱుఁగుదువు నా మనోజ్ఞాన మెల్లకడల
నేను బ్రమయుట గల్గెనే యెన్నఁడైన? 27

— నారదుని వంచింపవలె నని విష్ణుమూర్తి తలఁచుట —

వ. అని యమ్మహాప్రభు కృత్యంబు మోహ మాయా
వ్యాపారంబు ననన్యభేద్యం బగోచరం బపరిమితక్రీడా సమ
ర్థంబు నని తలంపనేరక, ‘అతి పరిచయాదవజ్ఞ’ యను

వాక్యంబునం గల యర్థంబుచొప్పున, హరి యనుగ్రహించి చేరందిగిచిన మందెమేలంబునఁ బ్రవర్తింపక, బ్రహ్మరుద్రాదులఁ దిరస్కరించి, తన్మాయ గణింపక యిట్లు పలికిన యావెడంగుమునిం గనుంగొని మనంబున రోసి యతనికిం బురాకృతకర్మశేషంబు ననుభవింపం గారణంబు గల దని దివ్యచిత్తంబున నెఱుంగ నవధరించి, మాయామందస్మితం బడరనయ్యరవిందలోచనుండు గారవించి, నీ వట్టివాఁడవ యౌదు వని ప్రకటించి మొదరువేచి యొక్క సమయంబున మోసపుచ్చువాఁడై యతని నప్పటికి వీడుకొలిపి. 28

క. అంతర్వాణి శ్రేష్ఠస
దంతఃకరణప్రకాశితాత్ముఁడు విష్ణుం
డంతర్ధి నొందె; నారదుఁ
డంత న్మహతీ సమేతుఁడై మెఱవడితోన్. 29

—♦ నారదుఁడు బ్రహ్మాదులతో విష్ణుమాయ తన్ను సోఁకదని చెప్పుట ♦—

సీ. అట వాసి తాఁ దనంతటివాఁడు లేఁడుగా
యనుబుద్ధి నజుఁ డున్నయచటి కేఁగి
వైకుంఠపతియొద్ది వార్తలు పచరించి
తనమోహనిర్ముక్తి తగ వచించి
తద్బహుమానవాగ్గన్యతం బొగ డొంది
కైలాసమున కేఁగి శూలపాణి
దండ వైష్ణవమాయ తను సోఁక దని పల్కి
యమ్మహాత్మునియద్భుతాభినుతికిఁ

తే. బాత్రమై యింద్రిముఖదిశాపతులకడకు
యక్షగంధర్వసిద్ధ సంయములకడకు
నరిగి తన విష్ణుమాయా జయంబు నొక్క-
నొడివి తద్వందనాది సన్నుతులఁ గాంచి. 30

తే. పాడు, హరిమాయ వీనొప్పెఁ బ్రిస్తుతించి
తన్ను సోఁకదటంచు సంతసము నొందుఁ,
దన్మహామాయఁ బడువారిఁ దలఁచి నవ్వు,
జగ మవిద్యామయం బని తెగడు నాత్మ. 31

క. ఇతఁ డోకఁడ విష్ణుమాయా
ప్రతిపన్నుఁడు గాక మోహపాథోధి నమం
చితబోధనౌక దాఁటిన
కృతకృత్యుఁ డనంగ వెలసె గీర్వాణులలోన్. 32

వ. ఇట్లు మోహమగ్నంబులైన బ్రహ్మాండమండలంబులలోనఁ
దా నొక్క-రుండును గులాలకీటకంబునుంబోలె భవపంకంబు
నం బొరయక కొంతకాలంబు ప్రవర్తించి, యంత ననంత
మాయాప్రేరితుండై మహీమండలంబున ననేకతపోవనదివ్య
పుణ్యక్షేత్రింబులు చూచుచుండె నట్టియెడ. 33

సీ. అబ్జభవాండసహస్రసంఖ్యలకు ని
దానమై తత్ప్రభుత్వమునఁ బొల్చి
ధాతృరుద్రాది మూర్తత నొంది తద్వ్యతి
రిక్తతేజమునఁ జరింప నేర్చి

యణుమహాద్వ్యాపారమై నిర్వికల్పత
నద్దివ్యపరశక్తియందు వెలిఁగి
సత్త్వాభిధానుఁడై సాత్త్వికబ్రహ్మయో
గీంద్రబోధాబ్ధిపూర్ణేందుఁడు నగు
తే. ప్రకృతి పురుషాధినాథుండు పద్మనేత్రుఁ
డితని వెడఁగుందనంబు మాయించి పూర్వ
కర్మశేషంబుతో నహంకార మడఁచి
యాత్మవిజ్ఞాన మడరింతు నని తలంచి. 35

—◆{ నారదుని మోసపుచ్చుటకు విష్ణుమూర్తి సర్వవరమనెడు స్థలమునందుఁ గృత్రిమ తపస్సు చేయుట. }◆—

క. చిత్రంబుగ శేషాహిప
విత్రితపోనిష్ఠ మున్ను వెలసినముక్తి
క్షేత్రము సర్వవరము; త
ద్ధాత్రీస్థలియందుఁ గపట తాపసమూర్తిన్. 36
క. వేల్పులకు నద్భుతంబు గఁ
గల్పించెన్ మాయపెంపు గడు దీపింపం
గల్పానోకహసదృశా
నల్పకుసుమఫలభరితవనాశ్రమ మొకటన్. 37
క. అందు నొకనిండు కొల నర
విందేందీవర పరాగ విస్ఫుమర విలస
త్సుందర తరంగ డోలా
నందిత కలహంస మై తనర నిర్మించెన్. 38

వ. ఇట్లు పుణ్యాశ్రమ సరోవరంబు లుత్పాదించి తత్తటంబున సుస్థిరయోగాభిరతుండై యనేక మునిసహస్రంబులు సేవింపఁ దపోనియతి నుండె నంత. 39

క. నేదిష్ఠ దక్షిణాశా
ప్రాదుర్భూతార్ద్ర తుల్యభాగా జలజా
మోదభర భరిత మారుత
మాద్రైత్యారాతి హృదయ మలరఁగఁ జేసెన్. 40

క. సవిధప్రాచీన మహో
లవణజలధి ఘుమఘుమిత కలధ్వని కెనయై
సవనాస్త్రశోషణ్ముఖ
వివిధరవం బా వనమున వీనులఁ దనిపెన్. 41

క. అతినిబిడ జలదమాలా
ప్రతిమానక్రతుసముత్థ బంధురధూమ
ప్రతతుల గగనం బాచ్ఛా
దిత మయ్యెం దద్వనమున దివిజులు పొగడన్. 42

సీ. కాశీ గయా ప్రయాగములకంటెను నైమి
శారణ్య ముఖ్యపుణ్యాశ్రమముల
కంటెను పాండురంగంబునకంటెను
సరయూతట ప్రభాసములకంటె
ద్వారావతీ భృగుద్వార భూములకంటెఁ
జారుబృందావనస్థలముకంటె

శ్రీపురుషోత్తమ సింహాచల లోభళ
స్థానాది దివ్యదేశములకంటె

తే. వర్ణ్యమై పుణ్యమై చతుర్వర్గఫలద
మై కరంబు జగన్నేన్య మయ్యె నాది
విష్ణుఁ డచ్చోట యోగియై వెలసియున్న
సన్నుతక్షేత్రరాజ మాసర్పవరము. 43

వ. ఇవ్విధంబునం దిగ్భువనైక పవిత్రంబైన యప్పుణ్యాశ్రమం బునఁ బరమ మాయాతపశ్చరణంబు సేయుచు నయ్యచ్యు తుండొక్కనాఁడు, స్వకల్పితసరసీతీరపిప్పలతరురేఖామధ్యం బునఁ గృష్ణమృగాజినకృతాస్తరణుం డై పరిబుద్ధముని వృద్ధులం గూడుకొని బ్రహ్మబోధరహస్య గ్రంథావలోకనంబు సేయుచున్న సమయంబున నీ హిరణ్య గర్భనందనుండు తదీయ మాయాప్రేరితుం డై యట్లుఁ దిరుగుచు వచ్చి య య్యాశ్రమంబు ప్రవేశించి. 44

మహాస్రగ్ధర

కనియెం దీరావనీజోత్కటకుసుమరజఃకాండధారాళవాత్యా
ఘనవేగవ్యగ్ర భృంగీగణచరణపత త్క్రమపుష్పోపహార
స్వన దంభోభంగరంగ జ్జలఖగపరిష చ్చారుసంచారలీలా
జనితోల్లాసాచ్యుతర్షి శ్వరవరసుమనస్సారసంబున్ సరంబున్.

చ. సురుచిరకుట్మల స్తబకశోభితశాఖల గుంపుసొంపునం
బురు వగుపొన్న లీ కమలభూసుతు సొంపులఁ దేల్చె షట్పద

స్వరములతో రతిక్రమ సుశబ్దపదాంగద నాద మేదుర
స్మర నృపసార్వభౌమ ననమౌక్తిక హారత్రయములట్లఁద త్రటిక్.
మ. అకలంకాత్ముఁడు చూచె నీముని తటాశాభ్రింలిహానోకహ
ప్రకరస్కంధ గభీర కోటర కుటీ పర్యంక శాఖా మిళ
చ్ఛుకయుగ్మంబులు మన్మథోత్సవవచస్ఫూర్తుల్ ప్రవర్తించివే
డుకఁ గ్రీడించెడుసంభ్రమంబుకడుఁజూఁష్టాల్ వేష్టలందేలఁగన్
మ. కలపుంస్కోకిలముల్ రసాలదళముల్ ఖండించిచంచూపుటం
బుల నల్లల్లన నల్లభాంగనల కింపుల్ చూపుచున్ మేటికొ
వ్వుల మన్వంబున రెట్టిమైనమగుచెయ్యుల్ నివ్వటిల్లంగఁ గొ
మ్మలపైఁజారుకుహూరవంబు లవరింపంజూచెఁ దీరంబునన్.
ఉ. మందమరుచ్చలాచలిత మంజుల నంజుల మంజరీ మిళ
త్సుందరవల్లియొక్కెడఁజూడఁగనొప్పె; లతాంగిమై శతా
నందసుతుండు జవ్వనమునన్ విఱవీఁగు కుచద్వయంబుతో
నందముచూపు నిట్లయని యూక్రియఁజూపి నటించుకైవడిన్.
చ. కుటిలలతా ప్రభావమునఁ గోమలచూతలతాంతశాఖ యొ
క్కటియొకయింతసాఁగియొకకందువనొప్పెమునుండునారదుం
డటఁ జనుదెంచి యాకొలన నంగనయైనను బిట్టు నాటనే
యుటకయి వింటి పువ్వునకు నోలి నమర్చినబాణమోయనన్.

—♦ సరోవర వర్ణనము. ♦—

ఉ. నారదు పుంస్త్వ మీసరసునం బరిముక్తముసేసి యంగనా
కారముసేయ మాయ సమకట్టిన వస్తుచయంబ నాఁగ సొం

పారుచుఁ జూడనొప్పె చరణాది శుభావయవాభిరామముల్
సారస సైకతోర్మి పటుచక్రి నవోత్పల భృంగసంఘముల్.

చ. సరసిజగర్భనందనునిసాత్త్వికబోధముఁ గప్పియున్న ని
ర్భరతర రాజస ప్రకృతిఁ బాయని కామకృతాది దుర్గుణో
త్కర చరణప్రచారముల కెవడిఁ జూడఁగ నొప్పె నాసరో
వరవిమలోదక స్ఫురిత వారిజరేణు తరంగ సంఘముల్. 52

మ. భ్రమరద్వంద్వము లంబుజాతములపైపైఁ దన్మరందాసవ
భ్రమవిభ్రాంతముతోచుఁగూడుటలుచెప్పంజూపఁగానొప్పనీ
కమలోద్భూతసుతుందు కాంతయయివేడ్కన్ భర్తతోఁబుష్ప
చాపమహోద్రిక్తతఁ గేలినుల్లసిలుతద్భావిక్రియల్ దెల్పుచున్.

వ. వెండియుం గనకగర్భాత్మభవుని విమల హృదయంబుం బొదు
నంగల భవిష్యన్మోహతమోవికారం బభినయించుచుఁ బుం
డరీక షండంబుల నాక్రమించు చంచరీకజాలంబును, విధాతృ
పుత్త్రుని భావిభావజకేళీ సుఖపారవశ్యంబు సూచించుచు
బిసరసాస్వాదలహరిం జొక్కుచక్రవాకంబులును, శతానంద
నందనునకు ముందటం బ్రాప్తించు సామ్రాజ్యలక్ష్మీ మనో
హార హార్మ్య వీథీవిహారణంబు లెఱింగించుచు సమున్నత
సైకతవేదికలం గ్రీడించు రాయంచకొదమలును, స్వయం
భూతనూజుని యంతఃకరణంబు దహింప నడరు మీఁదటి
మాయాసంసార భర్తృపుత్త్ర మిత్త్రాద్యపాయజనిత శోకా
నలస్ఫులింగకరాళత్వంబుఁ దెలుపుచుఁ గంజకింజల్కపుంజంబు
వెదచల్లుచుం దిరుగు నభినవప్రభంజనంబును, జతురానన

సుతునకుఁ బునఃప్రసాదదానం బొసంగు బిసరుహాక్షుని కరు
ణాకటాక్ష వీక్షాసుధారసబిందు బృందంబులవిస్తారంబు ప్రశ
స్తంబుచేసియు ముక్తాఫలానుకారి శీకర నికరంబు లెగయించు
జలచరపరంపరలును గన్నులకు నింపు సొంపు సంపాదించె
నప్పుడు. 54

చ. అనుపమకౌతుకం బడర నాకములాకర వైభవంబు ని
మ్మునివరు డర్థిఁ జూచె నతిమోహనమూర్తి దటాకలక్ష్మియున్
మన మలర న్మరాళగతమంజులతాగతిఁ దేల్చె నాదరం
బునఁ దనకుం దనూజ యయి పుట్టఁగలం డని వత్సలక్రియన్.

క. జలజాకరంబు బహువిధ
ములఁ బొగడుచుఁ గమలగంధముదితభ్రమరీ
లలిత శ్రుతులకు మారుత
చలతంత్రి విపంచి మొరయ సమ్మదలీలన్. 56

— నారదుఁడు మాయామునియైన విష్ణువును జూచి వర్ణించుట —

క. అల్లల్లనఁ జని ముందట
నుల్లమునకు నేత్రములకు నుత్కటమై శో
భిల్లెడు తేజోనిధి ముని
వల్లభు హరిఁ గనియె నభినవశ్రీమూర్తిన్. 57

తే. బ్రహ్మముని పారిషద మధ్య భాసి యగుచు
గ్రహగణాశ్రితుఁడైన భాస్కరుఁడు వోలె
బ్రహ్మతత్త్వంబు తానయై ప్రతిఫలించు
హరి నపూర్వర్షివరుఁ జూచి యరుదు నొంది. 58

ఉ. ఎన్నఁడుఁ జూడ నీమునికులేశ్వరు, నీమహితాశ్రమాఢ్యు;నా
కన్నుల కెంతొ యెక్కుడయి కానఁగనయ్యెడు నేతదీయ ది
వ్యోన్నత చిద్విలాసము, గుణోత్తరు నీఘనుఁ జూచి బ్రహ్మ ప
శ్యన్నిటలాదులైనఁ బరమార్థము వేఁడుదు రేమిచెప్పుదున్!

తే. లలితపద్మాక్షమాలికాలంకృతుండు
గోపిచందనతిలకపరిదీపితుండు
నగుచు నిమ్ముని విష్ణుమూర్త్యంతరంబు
కరణి నున్నాఁడు సాత్త్వికాకారమహిమ. 60

శా. ఈదివ్యాశ్రమభూమిమోక్షపదమై యింపొందు వైకుంఠమో
యీదివ్యర్షి నరుండు బ్రహ్మమయుఁడై యేపారుపద్మాక్షుఁడో
భేదింపన్ మతి దూఱకున్న దనుచుం బెల్లుబ్బు నుల్లంబుతో
నాదైత్యాంతకుఁ జేరఁబోయి తగనియ్యార్యుండు నమ్రక్రియన్.

వ. అనన్య మునిసామాన్య పరిభావ భావిత తపోధనుం డగు న
మ్మహాముని నంతరాత్మన్ బ్రశంసించుచుఁ దనకు మహా
మునులు ప్రత్యుత్థానం బొనర్ప మాయామునివేషధారి
యగు హరి డాయంబోయి యథోచితాన్యోన్యసంభావనా
ప్రశంసుండై యుండునంత. 62

— మాయాముని నారదుని సంభావించి సంభాషించుట —

తే. యతితనూభవు లాసనార్ఘ్యాది విధులు
సలిపి పూజించి రంభోజజాతసుతుని
హరియుఁ గుశలోపచారవాక్యములఁ బ్రీతిఁ
జేసి వెండియు ననియె విశేషఫణితి. 63

సీ. అస్మత్తపోవనం బతివిశ్రుతం బయ్యె
భవదీయతేజఃప్రభావకలన
నేతన్మదీయ మునీంద్రపవిత్రము ఫలి
తం బయ్యె యుష్మత్సుదర్శనమున
మన్మనోనిహిత సమాధి మూర్తం బయ్యె
నతిదుర్లభత్వదాగతినెపమున
మామకోత్కృష్టాభిమతము సిద్ధించుట
గాదె భవాదృశా గమనలీల?
తే. అంతరరుల జయించి మోహంబడంచి
పాపసంసారతాపంబు పరిహరించి
బ్రహ్మ నిర్వాణ నిర్వృతిపదవి నడసి
యున్నవాఁడవు నీవ కా కోరుఁదు గలఁడె? 64
క. మాయామోహవిముక్తము
శ్రేయస్సుఖపదము బోధశశిరమయూఖ
ప్రాయమును నీదురూపము
ధీయుత ! నినుఁ బొగడఁ దరమె దివ్యులకైనన్? 65
ఆ. ఈతపఃప్రయాస మెల్లను గడతేఱె
నీసమాగమమున నేఁడు మాకు
నింక మాతలంపు లెల్లను ఫలియించుఁ
ద్రిభువనైక కీర్తి విభవ మొసఁగ. 66
క. అంబుజగర్భేంద్రాదిప
దంబులు నీ కాటపట్లు తగ నంతర్లో

కంబులఁ గలిగినవృత్తాం
తం బెల్లను నీక తెలియుఁ దాపసవర్యా! 67

క. వ్యామోహాగాధవిష్ణుమ
హామాయాచక్రవిక్రియాపన్నుఁడు గా
కే మహితాత్ముఁడు లోకము
లో ముక్తుం డయ్యె దివ్యలోకము పొగడన్? 68

క. అని మునివేషధరుం డగు
వనరుహదళనేత్రుఁ డడుగ వారిజభవనం
దనుఁ డనియె బ్రహ్మవిద్యా
జనితప్రాభవము వాక్యసంపద వెలయన్. 69

ఉ. ఓమునినాథ! నీ వెఱుఁగకుండుట గల్గునె వేదశాస్త్రవి
ద్యామహితార్థనిశ్చితరహస్యపదంబులమేలు, వర్తమా
నామరసంయమీశ్వరులయందలి వృత్తము, శంకరస్వయం
భూమధుసూదనేంద్రసురముఖ్యులలోకవిశేషవార్తలున్. 70

—◆విష్ణుమాయకు లోఁబడనివాఁడను నేనే యని నారదుఁడు చెప్పుట◆—

వ. తక్కిన లోకవార్తలలోన నేమి విశేషంబు చెప్పనున్నయది? మూఁడులోకంబుల దేవదానవమునీంద్రాదులలో విష్ణుమాయం బడక ముక్తుండై చిదానందకందంబై యదృచ్ఛం జరించువాఁ డెవ్వం డని యడిగితి రట్టి కృతార్థుండ నేన కాఁ దలంపుం డది యెట్లంటేని. 71

క. ఒకనాఁ డే వైకుంఠము
నకుఁ బోయితి నచటఁ బద్మనాభుఁడు శ్రీభూ

శుకవాణీముఖకాంతా
ప్రకరముతో నొక విచిత్రపదమున లీలన్. 72

చ. కొలు వొనరించియున్న లతాంగి గూరిమి వైష్ణవమాయయింతియై
నిలిచి తదగ్రభాగమున నేరుపుతో వివిధేంద్రజాల వి
ద్యలు పచరించి పంకజభవాండచరాచరసృష్టిమార్గముల్
వెలయఁగఁ జూపినా సతులువిస్మయమంనుచు వేడ్కఁ జూడఁగన్

చ. అది యొక కొండ చేసికొని యవ్విభుఁడుం దనమాయచేత న
మ్మదిలతలం గన్నుఁ బ్రాముతతి మోమున లేనగవంకురింపఁగా
నిది యొకవింతగాఁ దలఁచి యూనతులేటికి విస్మయంబు నొం
దెద రని పద్మలోచనుని దిక్కుమొగంబయియుంటి నేనొగిన్.

క. నీమాయచేత బ్రమయరె
యామున్గలు, బ్రహ్మశంకరేంద్రమునీంద్ర
స్తోమములు భ్రమయుచోఁ బ్రతి
భామహిమ న్నీన కాక బ్రమయని వాఁడన్. 75

వ. అని పలికిన నామొగంబు చూచి, మాయావిహారి యగు
నారాయణుండు సిగ్గుపడినవాఁడునుంబోలెఁ గొండొకతడ
వెద్దియుం బలుకక యూరకుండి నావిజ్ఞానంబునకు మెచ్చి
శిరఃకంపంబు చేసి నన్నుం బ్రశంసించి "నామాయం జిక్కు
పడక తిరుగు మహాయోగిపుంగవుండవు నీ వొక్కరుండ"వని
సంభావించి వీడుకొలిపె నట్లు నేనును దన్మాయారహస్యంబు
లన్నియుం గరతలామలకంబు చేసికొని గతరజస్తమో
మోహుండనై బ్రహ్మమునిసేవ్యమానుండనై విహరించు

చున్నవాఁడ ననిన, మందస్మితపూర్వకంబుగా సభ్యుల వినుం
డని పలికి యా తపోధనుం డగు వనజలోచనుం డి ట్లనియె.

—♦ మాయాముని ప్రత్యుత్తర మిచ్చుట. ♦—

క. మాతలఁచినట్లు చెప్పితి
మీతత్త్వజ్ఞానసిద్ధి యేరికిఁ గలదు? ద
త్త్వాతత వైష్ణవమాయల
చేతం బడకునికి నీక చెల్లు మహాత్మా! 77

వ. అని పలుక రయంబున సత్యాశ్చర్యంబుగా నొక్క వెడనవ్వు
నవ్వి గగనవాణి నారదు నుద్దేశించి యి ట్లనియె. 78

—♦ ఆకాశవాణి నారదునిఁ దిరస్కరించి యొకకథ చెప్పుట. ♦—

క. నీ వెంతవాఁడ! వయ్యెద?
హావిష్ణుమాయఁ బడినయార్యులలోనన్
భావింప బ్రహ్మఋషి రా
జీవాసనరుద్రదివిజసిద్ధులలోనన్. 79

ఉ. ఏ మని పల్కితీ? మునుల కిట్టులు సమ్మత మయ్యె? మాయనీ
వే మెయి గెల్చి లోకముల నెల్లను ముక్తుఁడ వైతి? విష్ణుమా
యామహితాబ్ధి నీకుఁ దరమాన తరింపఁగ? నిన్నుఁ బోలకే
యీమునులున్ సురోత్తములు ని ట్లని పల్కిరె గర్వసంపదన్?

తే. పలికిపోయితిగాక! నీ పలికినట్లు
మాయఁ బడకుండ వచ్చునే? మౌనినాథ!
నీవుబలెనె ప్రతిజ్ఞలు నెఱపి పలికి
సిగ్గుపడిన మునీంద్రులఁ జెప్ప వినవె? 81

—♦ చండదమనుని కథ. ♦—

వ. ఒక్కకథఁ జెప్పెద వినుము. తొల్లి చండదమనుం డనుముని
వరేణ్యుం డయోధ్యానగరంబునకుం బోయి మాంధాతచేత
నర్చితుం డై యతని నగరంబునఁ గరితురగస్యందనసుభట
సన్నాహసామగ్రియుఁ, గనకపీఠశయ్యాందోళికాచ్ఛత్రచా
మరవ్యజనంబులును, మణిమయాభరణాంబరపరిమళద్రవ్య
సంపదయును, రూపయౌవనలావణ్యగుణాగ్రణ్యం బగువిలాసినీ
వర్గంబును గలయ నాలోకించి దేవేంద్రలక్ష్మికిం బ్రతినిధి
యైన యన్నరేంద్రుని యైశ్వర్యంబునకు నిచ్చమెచ్చి
యివ్విధంబున రాజ్యసుఖం బనుభవింపవలయు నని కోరి
మరలి నిజాశ్రమంబునకు వచ్చి గంగాతీరంబున సంకల్ప
పూర్వకంబుగాఁ బద్మాసనుం గూర్చి సమర్చితపంచాగ్ని
మధ్యంబున నుగ్రతపంబు సేయుచుండె నతని తపోవహ్ని
జ్వాలాకరాళధూమావళి ద్యావాపృథివ్యంతరాళంబునం
దంభోళివిద్యుజ్జలధారాడంబరంబు గావింప నిలింపులు భయ
భ్రాంతు లగుచుండి రట్టి సమయంబున నొక్కనాఁడు
సనత్కుమారుండు వచ్చి యమ్మహాతపోధనునిచేతం బూజి
తుం డై యి ట్లనియె. 32

ఆ. ఓమహాత్మ! యింత యుగ్రతపోనిష్ఠ
యేమికాంక్ష నయ్యె నెఱుఁగవలయు
ననుడుఁ జండదమనుఁ డా బ్రహ్మసుతునకు
ననియె మనసుకోర్కి కొనలు సాగ. 33

ఆ. ఒక్కనాఁడు నే నయోధ్యకుఁ బోయి మాం
ధాతృధరణినాథుచేతఁ బూజి
తుండ నై తదీయమండితసామ్రాజ్య
విలసనంబు లెల్ల వేడ్కఁ గంటి. 84

సీ. సూర్యవాజులకంటె సొబగైన యుత్తమ
హయములఁ గంటి వాహ్యాళిభూమి
దిక్కరీంద్రములను దెగడు మత్తద్విప
చయముల ద్వారదేశములఁ గంటిఁ
జామరచ్ఛత్త్ర వీజన దీపికాందోళి
కాదు లాస్థానపార్శ్వములఁ గంటి
బహువిధపరిమళాంబరభూషణశ్రేణిఁ
బ్రకటితధర్మపేటికలఁ గంటిఁ

తే. బుష్పతల్పంబులును బువ్వుఁబోండ్ల యొఱపుఁ
జంద్రశాలాగ్రవేదులఁ జాలఁ గంటిఁ
గంటి మాంధాతరాజ్యసుఖంబు లెల్ల
నిందిరాసామ్రాజ్యవిభవంబు నేల చాలు? 85

చ. మృగమదచందనద్రవము మెత్తిన బిత్తరి గుబ్బచన్నులున్
నగవు దొలంకుమోములు, ననంగనిశాతశిలీముఖంబులం
దెగడు కటాక్షకోణములుఁ జేటలపాటలుఁ గల్గుకామినుల్
తగవుల నమ్మహీధవునిదండఁ జరింపఁగఁ గంటి వేడుకన్.

క. ఆ లీలాసామ్రాజ్య
శ్రీ లాత్మకు నింపుఁ జేసెఁ జేసిన నాథా

పాలుని శ్రీయ సామ్రాజ్య
శ్రీలన్ విహరింపఁ దపము సేసెద ననఘా ! 87

వ. అనిన విని యతని దుర్విషయాభిలాషంబునకు వగచి సనత్కుమారుం డిట్లనియె. 88

క. హరిమాయామోహాబ్ధిం
దరంగ సంఘంబులైన ధరణీరాజ్యం
బర పరిమళ భూషా స్త్రీ
వరవాంఛల మునుఁగ కుండువాడుం గలఁడే? 89

సీ. పటుధైర్యబాడబోత్కటవహ్నికీలయు
నాశాపయోధిఁ బీల్లణఁపలేదు
పరమశాంతి త్విషాంపతి మహారశ్మియు
నీహాతమము విరియింపలేదు
రూఢసమాధిగారుడమంత్రకళయును
దృష్ణాహివిషమూర్ఛఁ దెలపలేదు
ఘనతరవిజ్ఞానకలితదంభోళియు
దృఢకామనగము భేదింపలేదు
తే. లేదు సంసారవిషయకేళీవిరక్తి
బ్రహ్మరుద్రాదులకు నైనఁ బద్మనాభు
చరణసేవాసుధారసాస్వాదజనిత
చిత్సుఖానందసంధానసిద్ధి లేక. 90

వ. అని సనత్కుమారుండు వెండియుఁ జండదమనున కిట్లనియె.

ఉ. ఓడక, శీతవాతదహనోష్ణభరంబుల నాఁడునాఁటికిన్
వాడి కృశించి యోగతి నవారణఁ జేయుతపంబు వ్యర్థ మై
బూడిదెలోనిహోమమయిపోయెఁగదా యిటు లైననక్కటా!
చూడవె యోగమార్గపరిశుద్ధమునీంద్రతపఃప్రకారముల్?

తే. తగిలి బ్రహ్మంబు ముట్టంగఁ దపము చేసి
బ్రహ్మపదసౌఖ్యసంసిద్ధిఁ బాముకొనక
పాపసాంకర్యజనితభూపాలరాజ్య
పదసుఖంబులు గోరుతపస్వి గలఁడె? 93

శా. ఈజాడం దప మాచరించి తుది నెంతే మూర్ఖచందంబునన్
రాజత్వంబున నల్పభోగములు చేరం గోరు నే మాని ని
ర్వ్యాజబ్రహ్మపదైకసౌఖ్యములుపోవంద్రోచి,నీవెన్నఁడున్
'రాజాంతే నరకం వ్రజే' త్తనెడు శాస్త్రంబుల్ పరీక్షింపవే!

క. ఆరూఢపాతకౌఘము,
దూరీకృతసత్య, మనృతదుర్లోభదురా
చారాది కితవ కృత్యముఁ
. గోరుదురే రాజ్యసుఖముఁ గోవిదవర్యుల్? 95

క. సురుచిరసాత్త్వికమార్గా
చరణంబునఁ దపము చేసి సమధిగతానం
దరసాబ్ధిఁ దేలుచుండెడు
విరజస్తము లైన మునుల వినవే ధాత్రిన్? 96

తే. ధన్యసాత్త్వికయోగంబు దక్క నితర
విపులకర్మానుభవములు విష్ణుమాయ

విష్ణుమాయకును వెలియైన విరతి విరతి
మాయఁ గడచిన ముక్త సమాధిఁ గనుము. 97

వ. అని చెప్పి సనత్కుమారుండు సత్యలోకంబునకుం జనియెఁ దదనంతరం బాచండదమనుం డాబ్రహ్మసుతుని బ్రహ్మబోధ సుధాధారం గడుఁగంబడి మోహకళంకనిర్ముక్తం బైన మనం బున భూలోకసామ్రాజ్యసుఖంబులు దుఃఖభాజనంబులుగాఁ దలంచి సంసారసుఖానుభవసారం బైనవిష్ణుమాయావికారం బునం బొరయక ముక్తి నడయుట యిది మెంతపెద్ద యని యవ్విష్ణుమాయం దిరస్కరించి రాజ్యకాంక్ష యుడిగి మో క్షాపేక్ష నక్షయతపోనియతినున్నం గొన్నాళ్లకు నలువ సన్నిధి యై వరంబు వేఁడు మనినఁ బ్రాంజలియై యతం డిట్లనియె.

క. అత్యంతవిష్ణుమాయా
కృత్యము లగు సుఖము లెల్లఁ గీడ్పఱచి ననున్
సత్య మగుమోక్షపదవికి
నిత్యునిగాఁ జేయవయ్య నీరజగర్భా! 99

వ. అని వేఁడిన నవ్విరించి యించుక నవ్వి మునీంద్రా! యేమి గోరి యీయుగ్రతపంబు చేసితి, వేమి యడిగెదు, ప్రకృతం బున ననుభవింపఁ దగినది విష్ణుమాయావిలసనం బైనసంసా రంబు, దానికిం దోడు రాజ్యసుఖం బనుభవింపఁ గోరి తపంబు సేసిన నీకు నది యనుభవింపక మోక్షం బేచందంబునం బడయవచ్చు? నది మున్ను నీ వనుభవించి తదనంతరంబు నిర్విషయాభిలాషం బగు మనంబున శుద్ధసాత్త్వికజ్ఞానం బవ

లంబించి విష్ణుభక్తివలన మోక్షంబు వడసెదవుగాని యిప్పు డీరాజ్యసుఖంబు కోరినట్ల యిచ్చెదం గాను మనిన నిర్వే దించి నీ విచ్చు వరంబు నేనొల్లఁ బొమ్మనిన నతం డంత ర్హితుం డయ్యెఁ గ్రిమ్మఱ విరూపాక్షునింగూర్చి తపంబు నేసిన. 100

క. సరసిజగర్భుని యట్లనె
హరుఁడుం బ్రత్యక్ష మైన నమ్ముని యడిగెన్
హరిమాయావిలసనసం
సరణము వెలి యైనమోక్షసంపద వెలయన్. 101

క. అడిగిన నవ్వర మీరా
దుడుగుము నీకోరినట్ల యుర్వీరాజ్యం
బడుగు మన నొల్లకొండిన
మృడుఁడును దన యిచ్చ నరిగె మిన్నక యంతన్. 102

క. అమ్మునినాథుం డుడుగక
నెమ్మనమున నచ్చలంబు నిగుడుచు నుండం
గ్రిమ్మఱ రవిఁగూర్చి తపం
బిమ్ములఁ గావించుచుండె నిల చలియింపన్. 103

క. గొనకొని తప మేభంగుల
నొనరించినఁ బూర్వకర్మ ముడుగునె తన చే
సిన యంతవట్టు గుడువక
వనజాసన ముఖ్యదివిజవర్యుల కైనన్? 104

వ. అంతం గొంతకాలంబునకు సూర్యనారాయణుండును సన్ని

ధియై "మోక్షం బడిగిన రాదు, నీవు మున్ను చేసిన తపంబున సంభూతంబు లైన రాజ్యవైభవంబులు తరతరంబ నిన్నుఁ జుట్టిముట్టికొనం గాచి, కాలంబు వేచి యున్నయవి, కైకొని తద్భోగంబులఁ బరితుష్టి నొంది మఱి సాత్త్వికతపోనియమంబున హరి నారాధించి తత్ప్రసాదంబున మోక్షంబు వడయు"మనిన నమ్ముని యిట్లనియె. 105

క. అవి యెల్ల విష్ణుమాయలు
వివరింపఁగ వాని ననుభవింపు మనిన నా
తివిరినపూనిక దప్పద
యవి గైకొన కమృతపదవి నందఁగ వలయున్. 106

క. నే నొల్ల రాజ్యసంపద
నానిశ్చయ మిదియ; వినుము నలినప్రియ! నా
పూనికఁ దప్పింపఁగలం
డే నీరజనాభుఁ డైన నిఁక నెట్లనన్? 107

వ. అనిన నమ్మహామునిప్రతిజ్ఞఁ దప్పింపలేక కర్మసాక్షియుం బోయె, నప్పారికాంక్షి మత్సరంబు పెచ్చుపెరుఁగు మనంబున నెవ్వరిం గోరక యేకావధానపరమయోగాధీనమానసుండై విష్ణుమాయం బడక ముక్తి వడసి, హరిహరబ్రహ్మాదుల సిగ్గుపఱిచి నిరుపమానందంబున విహరింతు నని యున్న నతనిఘోరప్రతిజ్ఞాతపంబులకునద్భుతంబంది నిఖిలబృందారకమునీంద్రబృందంబులును "విష్ణుఁ డితని, నేపదంబు నొల్లని వాని, సామ్రాజ్యపదంబునకుం దార్చి తదనురాగభోగ మగ్ను

నిం జేయునొకో" యని వితర్కించుచుండునంత, హరి తన
యంతర్గతంబున. 108

ఆ. నిష్కళంక దివ్యనిర్వికల్పబ్రహ్మ
తేజ మైన యస్మదీయమూర్తిఁ
దలఁచి చిన్ముదమునఁ దనియు ధన్యుఁడు గాక
ముక్తుఁ డగునె యితరమూఢజనుఁడు? 109

క. ముని దన యభిమతవరమున
నొనరినసామ్రాజ్యలక్ష్మి నొల్ల నటన్నం
జనునే భూషాసక్తం
దనవనితాద్యనుభవములఁ దనియక యెట్లున్? 110

ఆ. ఒల్ల నన్న నితనియుల్లంబు రాజ్యసం
పదల వెల్లిఁ గొలిపి ముద మొనర్చి
యవల మోక్ష మిత్తు నని దివ్యచిత్తంబు
నందుఁ దలఁచెఁ దలఁచినంతలోన. 111

క. ఏమని చెప్పుదు హరిమా
యామహిమఁ దదాశ్రమంబు హాటకరత్నో
ద్దామగృహసౌధలసదభి
రామం బగు నొక్కపురవరం బై యొప్పెన్. 112

సీ. మదమత్తవేదండమండలగ్రైవేయ
ఘంటికాఘణఘణాత్కారరవము
నన్యోన్యసముపాశ్రితావిర్భవత్పటు
జవనోత్తమాశ్వహేషారవంబుఁ

గేళిసంచారవికీర్ణ కాంచనపుష్ప
రథవిభ్రమచ్ఛళ శ్రీరాకరనము
నుద్దామదర్పభారోత్కటభటబిరు
దప్రశంసాలాపతరళరవముఁ

తే. బటహభేరీమృదంగశంఖధ్వనంబు
సౌధవీథీవిపంచికాచారురవముఁ
గామినీపాదమంజీరకలరవంబుఁ
బ్రమద మొనరించె నమ్మహాపట్టనమున. 113

క. కేళీసరోవరంబులుఁ
గేళీవనవాటికలును గేళీగిరులుం
జాలఁగఁ గన్నుల కింపై
యాలీలాపట్టనమున నలరెం జూడన్. 114

చ. సురుచిరకేళిశైలమణిసుందరకందరకేళిలోలకి
న్నరకలగానమేదురనినాదము లంగజుఁ బ్రోదిసేయఁగాఁ
గెరలుచుఁ గూర్మిదంపతులు క్రీడ లొనర్తురు పుష్పడోలికో
త్కరరమణీయహర్మ్యతలకాంచనవేదుల నప్పురంబునన్.

క. అగరుఘనసారకుంకుమ
మృగమదగోరోచనాదిమేళనమున మే
లగుపూవుల నెత్తావుల
నగరాపణవీథు లింపొనర్చుం బ్రజకున్. 116

—♦ రాజమందిర వర్ణనము ♦—

వ. ఇవ్విధంబున నమరావతికిం బ్రతియై "యతికంఠపాశం"బను పేరనొప్పు నప్పురమధ్యంబునఁ గనకప్రాకారగోపురసౌధ చంద్రశాలామండపమణికుట్టిమ మార్గతోరణ మంగళ రంగ వల్లీ సముల్లసితంబును, కుల్యాసరోవర కేళిదీర్ఘికాతరంగచక్ర వాకకలహంససారసక్రౌంచసంచయక్రేంకార సంకులంబును, సవిధోద్యానవాటికాశాకోణకుటజ చూతపనసరంభా ఖర్జూర నారికేళకురవకాశోకమాధవీయూథికాజాతి లతాది పల్లవ సుమనఃఫలరసోల్లసిత కలకంఠమధురశుకనికరకలకలంబును, గనకమణిమయద్వారకవాటదేహళీ జాజ్వల్యమానంబును, దౌవారికవేత్రదండ తాడన నిరుద్ధ సకలసామంతభూకాంత సమ్మర్దదుర్గద్వారదేశంబును, ప్రధానదండనాయకదుర్గాధ్యక్ష వీరభటసహస్ర సంశ్రితాస్థాన మండప సామ్రాజ్య లక్ష్మీ విలాసంబును, గంధగజతురంగశతాంగసువర్ణాందోళికాపర్యంక ఛత్త్రచామరసింహాసనోపశోభితంబును, గర్పూరశలాకాజాల కాయాత మందమారుత చలాచలీకృతవితానపుష్పమాల్యా లంకృతంబును, సంగీతతాళవాద్యహృద్యానవద్యనాట్యశాలా ప్రవర్తిత నర్తకీకింకిణీకంకణఝుణఝుణత్కారమనోహరంబును, గురుకుచనితంబభారాలసవిలాసినీసహస్రసంచారశుద్ధాంతమం దిరంబును నగురాజభవనంబున నొక్కపుష్పసౌధాగ్రమండ పంబున. 117

క. కనకమణిపీఠికం దనుఁ
దనప్రియకామినులు గొలువ ధరణీపతియై
ముని యుండెఁ గనకభూషణ
కనదుజ్జ్వలమూర్తి తోడఁ గౌతుకలీలన్. 118

క. ఏకాగ్రనిష్ఠతోడ ని
రాకులమతిఁ దపము సేయు నమ్మునిచందం
బే కైవడి నడఁగెనొ నాఁ
డాకస్మిక మేమిచెప్ప నాహరిమాయన్! 119

క. అల దండ కమండలు వ
ల్కల జపమా లాజినములు ఖడ్గ క్రీడా
జలరుహ చీనాంబర మణి
వలయ కనకకంబళముల వైఖరి నొప్పెన్. 120

తే. మఱచెఁ దన బ్రహ్మయోగంబు మౌనివరుఁడు
కపటసామ్రాజ్యమదిరావికాసలీల
నమృతవిజ్ఞానసరసి నోలాడుతలఁపు
మోహసంసారజలరాశి మునిఁగె నపుడు. 121

ఆ. మోక్షలక్ష్మిఁ గోర్కె ముడివడుచిత్తంబు
రాజ్యలక్ష్మిపై విరాళిఁ బడియె
యోగి ననెడు బుద్ధి యుడిగి యాతపసికి
భూవరుండ ననెడు బుద్ధి వొడమె. 122

సీ. అవధారు! దేవ! చక్రాద్రిపర్యంతభూ
పతిశిరోమకుటపూజితపదాబ్జ!

జయ! మహారాజ! యష్టాదశద్వీపసం
స్థాపితశాసనస్తంభయూప!
విన్నపం బీశ! గర్వితశత్రురాజన్య
దర్పాంధకారమార్తండబింబ!
జోహారు! సర్వజ్ఞ! సుస్నిగ్ధశివజటా
జూటగంగాభ యశోవిహార!
తే. యనుచుఁ బ్రాంజలులై వేత్రహస్తవరులు
కదిసి యర్థోపచారవాక్యములు వలుక
మహిమఁ గొలువుండె నాస్థానమండపమునఁ
జండదమనావనీనాథచక్రవర్తి! 123
క. శరణాగతు లగు రాజుల,
నరుదుగ గజవాజిభూషణాంబరగంధో
త్కరములు కానుక లొసఁగెడు
నరనాథులఁ జూచి మునిజనప్రభుఁ డోలిన్. 124
క. అరిషడ్వర్గము మనమున
నురురాజనవిభవములకు ను బ్బానరింపం
బరమదయాసత్త్యోక్తుల
పరిచయ మది యుడిగి పరుషభాషలు నేర్చెన్. 125
క. కొందఱకు నలుగు, మఱియొక
కొందఱఁ గృప నాదరించుఁ, గొందఱఁ బ్రోచున్,
గొందఱఁ జెఱుచుఁ బ్రభుత్వము
నంది నిజాజ్ఞాబలమున నవనీజనులన్. 126

సీ. దివ్యవిమానంబు తెఱఁగునఁ దే రెక్కి
తిరుగుచునుండు నాదిత్యుభంగి
మదగర్వరేఖతో మత్తవేదండంబు
నెక్కి భూలోకదేవేంద్రుఁ డనఁగఁ
బసిఁడిపుత్తళుల సొంపెసలారు రత్నాల
పాలకి నెక్కఁ బ్రాభవము మీఱ
హయరత్నముల నెక్కి యాడించు నగఘుల
నంగనామణుల కాహ్లాద మెసఁగఁ
తే. కేళిగిరికందరంబులఁ గ్రీడసలుపు
నుపవనంబులఁ జరియించు నుత్సవమున
నాట్యశాలల నుండు నానంద మొదవఁ
దనకు నింపైన విధమున ధరణివిభుఁడు. 127

సీ. కలకంఠి యొక్కతె కర్పూరతాళవృం
తముఁ ద్రిప్పఁ గలికి నెత్తావు లీనఁ
దరళాక్షి యొక్కతె తాంబూలఖండోత్క
రం బిచ్చు మందస్మితంబుతోడ
నలివేణి యొక తె పదాబ్జముల్ వట్టఁ గం
కణకాచఘుళఘుళత్కార మలర
మగువ యొక్కతె దండమణిపీఠముననుండి
మదనోన్ముఖము లైన మాట లాడుఁ
తే. కేళిగృహమున నవపుష్పడోలికాగ్ర
శాయి యై యున్న యమ్మహీనాయకునకు

నింపు నింపుదు రనురాగ మిగురుకొల్పి
చారులీలల శుద్ధాంతచంద్రముఖులు. 127

క. సమధికరాజ్యాంభోజ
ప్రమదాక్రీడామరందపానసుఖశ్రీ
రమణీయమధుకరం బై
పరిమదమ్మున నమ్మునీంద్రపార్థివుఁ డలరెన్. 129

క. వలసిన తొడవులు తొడుగున్
వలసిన గంధములు పూయు వలసినపుష్పం
బులు ముడుచు, నింపు సొంపుల
వలసినకాంతల రమించు వలసినవేళన్. 130

క. తాపముల కెల్ల నిల్లగు
భూపత్వముఁ గాముకత్వమును బెట్టిద మై
యేపార నతని యోగము
ప్రోపఱుఁ బోఁకొత్తులోనిపోఁకయుఁబోలెన్. 131

క. హరిమాయామారుతమునఁ
దిర మగునే బ్రహ్మబోధదీపకళిక, త
చ్చరణధ్యానఘటంబున
వెరవున నెలకొలుపకున్న వెడఁగుమునులకున్? 132

క. తనపూనికయును, దనతప
మును, దనదుమహామునిత్వమును, బ్రహ్మసుతుం
డొనరించినమార్గము మఱ
చినయాతనిఁ జూచి జగము చిత్రము నొందెన్. 133

క. హరిమాయ గడవరా దని
పరమాశ్చర్యంబు నొంది బ్రహ్మయు శివుఁడున్
సరసిజవనబాంధవుఁడును
గర మభివర్ణించి రధికకౌతుకశీలన్. 184

—♦ సనత్కుమారుండు తిరిగివచ్చి, చండదమునుని బోధించుట. ♦—

వ. అంత. 185

ఆ. మరల నా సనత్కుమారుండు చండద
మను విధమ్ముచూతమనుచు వచ్చి
రాజ్యమహిమతోడి రాజనంబున నడు
రేఁగుదెంచి పూజ లిచ్చువాని. 186

ఆ. రాచబోము నున్నవాచంయమశ్రేష్ఠుఁ
జూచిచూచి మిగులఁ జోద్య మంది
విష్ణుమాయపెంపు వినుతించి వినుతించి
యనియె బ్రహ్మసుతుఁడు నతనితోడ. 187

ఉ. ఏమి మహానుభావ ! నిను నించుక నైన నెఱుంగనేర్తువే?
నీమునుపంటి రూప మది నీహృదయంబునఁ దోఁచుచున్నదే?
భూమిపతిత్వరాజ్యసుఖముల్ కరమిష్టము లౌచునున్నవే?
నీమన సెట్టు లున్నయది నిక్కము నాకెఱిఁగింపు నావుడున్.

వ. విని వెఱఁగుపడి యిది యేమొకో నన్ను నే నెఱుంగకునికి
యెట్లు, నామునుపటి రూపం బెయ్యది, నాకు భూపతిత్వ
రాజ్యసుఖంబులు కరం బిష్టంబులు గాకుండుట యెట్లు
దీనికిఁ బ్రత్యుత్తరం బేమనియిచ్చువాఁడ నిమ్మహాత్ముని

వచనంబు లత్యద్భుతంబులై తోఁచుచున్నవి యని భయం
పడి ప్రాంజలి యై రా జిట్లనియె. 139

క. దేవమునీశ్వర ! యిది యే
భావంబున నన్ను నిట్లు పలికితి, నాకే
భావంబును దోఁపదు, నీ
భావంబున నున్న యట్లు పలుకు మహాత్మా ! 140

వ. ఏను రాజ నగుటయు నీరూపంబుదక్క మఱియొండు రూపంబు
లేకుండుటయు నెల్లరాజులకుంబలెనే భూపతిత్వరాజ్యసుఖం
బులు కరం బిష్టంబులగుటయు నెఱుఁగుదు నింక నెద్దియు
నెఱుంగ, మీచిత్తంబునం గలతెఱంగు నా కానతిచ్చి నా
మనఃకళంకంబు వాయంజేయు మనవుడు నవ్వి యవ్విరించి
నందనుం డిట్లనియె. 141

తే. చండదమన మహామునీశ్వరుఁడ వీవు
రాజ్యకాంక్షఁ దపం బొనర్పంగ, నిన్ను
మాన్చిపోవుట మఱచితే మానసమున
నాతపఃఫల లీల లియ్యవియె కావొ. 142

క. హరిమాయ యిట్లెఱుంగక
నిరసించి విరించిముఖుల నెఱిఁ గూర్చి తప
స్స్ఫురణమున మెలఁగఁ దగునే?
దురహంకారమునఁ జేయుదురె తపః మనఘా! 143

వ. పరమేష్ఠిపశుపతిపద్మబాంధవుల యానతిఁ గైకొని సాత్త్వికొ
జ్ఞానంబున మోక్షప్రదాయకు నారాయణు నారాధించుచు

నతఁ జేకొలందిఁ గర్మబంధంబు లనుభవింపఁజేసె నట్ల యను
భవించుచు నప్పరమపురుషునను బ్రసన్నుండ వైన నింత
మూఢుండ వై నిస్సారసంసారపంకమగ్నుండ వై యుండు
దువే ? యింక నయిన నిష్కళంకహృదయుండ వై యీ
సామ్రాజ్యవికారంబులు హరిమాయాకల్పితంబులుగా నెఱింగి
హరిం దలంచి కృతార్థుండ వగు మని సనత్కుమారుం
డానర్చిన బ్రహ్మోపదేశంబున. 144

క. జ్ఞానోదయ మగుటయు న
క్ష్మానీంద్రుఁడు సంచలించి మనమున భక్తా
ధీనుఁ డగు హరిఁ దలంచి కృ
తానతియై భక్తిఁ బులక లంకూరింపన్. 145

క. కరుణాసముద్ర ! ముద్రిత
దురితోదయ ! యుభయకర్మదూర ! మునీంద్రో
త్కరవాంఛాఫలద ! మహా
పురుష ! పరబ్రహ్మమయ ! విభుత్వమహత్త్వా ! 146

మ. గతదుష్కర్ములు సంగవర్జితులు రాగద్వేషదూరుల్ మహా
మతు లాత్మీయతపోధిదైవముగ సమ్మానించి నిన్నాత్మసం
స్థితుఁ గావించి భజించి మోక్షపదముం జేకొంద్రుగా కిట్లు దు
ర్మతికి న్నాకెట్లు లబ్బు? నాతరమె నీమర్మం బెఱుంగన్ హరీ!

క. అగణితదుఃఖనిదానం
బగు సంసారమున కోప కలఁజడిఁబడు నా

వగ లుడిపి కావవే నను !
జగదేకశరణ్య ! కృష్ణ ! జలరుహనేత్రా ! 148

క. అని భక్తిపరవశుండై
కనుఁగవ నశ్రువులు దొరుఁగఁగాఁ దను వినుతిం
చిన, భక్తవత్సలుఁడు హరి
యనుకంపాయత్తచిత్తుఁ డై యావేళన్. 149

సీ. పుష్పవృష్టియుఁ దనభువన రక్షాదక్ష
కారుణ్యదృష్టియుఁ గడలుకొనఁగ
నప్సరోనాట్యవిన్యాసంబుఁ దనవన
మాలావిలాసంబు లీల మెఱయ
ననుకూలగంధవాహంబును దనసహ
జాంగగంధప్రవాహంబు నొలయ
సహచర సురమునీశ్వర తరళత్వంబుఁ
దనభక్తవత్సలత్వంబు నొరయ

తే. వినుత గంధర్వగానంబుఁ దనమనోజ్ఞ
భూషణస్వానమును వేడ్కఁ బొదలఁజేయ
దివ్యమంగళమూర్తియై దివ్యతేజ
మలరఁ బ్రత్యక్షమయ్యె నారాయణుండు. 150

తే. అబ్జనేత్రుండు ప్రత్యక్షమైనఁ దెలివి
గలిగి తొల్లింటి యట్టులఁ గాంచె మాని,
పుర నరేంద్రత్వ సామ్రాజ్య పరికరములు
వన మునీంద్రత్వ తపములై వఱలు చునికి. 151

క. సాక్షాత్కరించిన నరో
త్తముని శ్రీపాదములకు నానతుఁ డగుచున్
లక్షవిధంబులఁ బొగడెం
బక్షున్నివదంబుబిందు సందోహముతోన్. 152

క. హరియును నప్పుడు మానీ
శ్వరుతామసభావ ముడిపి సాత్త్వికవిజ్ఞా
నరతిన్ మతిఁ గూర్చి తన
శ్చరణమునకు నియ్యకొలిపి సద్గతికొలిపెన్. 153

క. అంత ప్రతిజ్ఞావంతుని
పంతము వారించి కర్మఫలముఁ గుడిపి య
త్యంతజ్ఞానం బొసఁగి య
నంతుఁడు సురవరులు గొలువ నరిగె నిజేచ్ఛన్. 154

క. ఈవృత్తాంతము విను స
ద్భావవిధేయులకుఁ గలుగు బ్రహ్మజ్ఞాన
ప్రావీణ్యంబును మారిమా
యావరణవిముక్తియును గృతార్థత్వంబున్. 155

మ. అని యయ్యంబరవాణి పల్కుటకునత్యాశ్చర్యముంబొందిర
మ్మునుఁ; లీనారదుఁ డేమి చెప్పుదు మహామోహాంధకారం
బునందనచిత్తంబుభ్రమింపఁగాఁదెలివిఁజెందఁగ లేకదుర్మానసం
జనితక్రోధమునన్ హసించి పలికెన్ సర్వంసహాధీశ్వరా!

తే. పట్టఁ బసలేని యీబట్టబయటిమాట
కకట ! బ్రమసితి లేకదా యనఘులార !

యామునీంద్రునివంటి మోహాతురుఁడనె
యేను ? సాదృశ్య మెఱుఁగ కిట్లన్నెఁగాక ! 157

క. న న్నెఱుఁగు విష్ణుఁ, డావిభు
పన్నిక లే నెఱుఁగుదుం బ్రపంచవికార
క్లిన్నత నాకుం గలదే ?
యిన్నిచదువులేల? మీఁద యెఱిఁగెదరు తుదిన్ ! 158

వ. అని హరిమాయ యెన్నక గగనవాణి ననత్యవాణిగా దూషించి, తనవిజ్ఞానమహిమ యెఱుఁగుటకు నిమ్మను లెంత వా రని నిరాకరించి, వీరిముందటఁ బంతంబు పలుక నేల యని తనలోనఁ దన్నుఁ దానే ప్రశంసించుకొనుచు, వీడుకొని పోవనుద్యోగించునతనితలంపు గని మాయామునివేషధారి యగు నవ్వెన్నుండు చిన్నినగవు దొలంక బలువలకెలంకులం జిక్కిన మెకంబయ్యెఁగాక తా నింక నెక్కడకుంబోవంగలవాఁ డని యతనిచిందిలిపాటు మందలించి, కొలంది యెఱుంగక యభ్రవాణి పలికెంగాక, చందదమనుండు భవత్సమానుం డేని యంతబుద్ధిమంతుండు మాయం బడునే?యది యట్లుండ నిమ్ము, మమ్ము బహుమానంబుసేసి యీవేళ మాయాశ్రమంబున భిక్షసేయ వలయు నని ప్రార్థించిన నెట్టకేల కియ్యకొని. 159

—◆ మాయామునియైన విష్ణుమూర్తి నారదుని మోసపుచ్చుట. ◆—

క. తనచేతియక్షమాలయుఁ
గనకకమండలువివంచికలుఁ గుంచెయు న

ల్లన నచటి రావిఁ దగిలిచి
ముని తీర్థంబాడు నియమమునఁ జనుదెంచెన్. 160

క. తన విజ్ఞానము తనతప
మును దనవిరతియును దన యమోహాత్వంబుం
దను రక్షింపఁగ నోపున
వనజాక్షునికరుణ దప్పినచ్చినవేళన్? 161

సీ. నారాయణోచ్చారణశ్రీవ్యదివ్యనా
దము వీణియందు యంతర్భవించెఁ
జిదమలానందసంపద నాడునాట్యవి
హారంబు కుంచియు నాశ్రయించెఁ
దత్త్వవిజ్ఞానసుధారసపూరంబు
దోలఁకియాడుట కమండలువుఁ జెందె
బీజాక్షరన్యాసపృథులాబ్జదృఙ్మంత్ర
కళ యక్షమాలికఁ గడలుకొనియె

తే. నారదుని చిత్తమున నహంకారజనిత
నిబిడమోహాంధకారంబు నిండుకొనియె
విష్ణుమాయాపరిభంజనవిహతిచే వి
వేకదీపంబు మలుగుట వే నరేంద్ర! 162

వ. అట్లు కొలనికి డిగ్గి దానిచెలువు పరికటించుచు నాచమన
పూర్వకంబుగా జలంబు ప్రవేశించి నాభిదఘ్నపయఃపూరం
బున నిలిచిమహాకాళరాత్రిసమయాంధతమసంబున మునింగు
చంద్రసూర్యాదిజ్యోతిర్మండలంబునుం బోలెఁ దన విజ్ఞాన

వ్రీకారంబు విష్ణుమాయాపటలంబున మునుంగ సంసార
సముద్రంబున మునుంగుటకు నీళ్ల మునింగె నప్పుడు. 163

క. జననాథ ! యరిదిసుమ్మీ
వనజాక్షునిమాయపెంపు వర్ణింప నిలిం
పనికాయ కాయజాంతక
వనజాసన దివ్యమౌనివరులకు నైనన్ ? 164

—♦ నారదుఁడు కొలనిలో మునింగి స్త్రీ యగుట. ♦—

ఆ. నీటుపాఁయి యయ్యె నృపవర ! తొల్లింటి
తపముకలిమి యెల్లఁ దత్క్షణంబ
మునిఁగి లేచి భువనమోహనమూర్తితో
నలినసేత్ర యయ్యె నారదుండు! 165

ఆ. ఆమునీంద్రవేష మాబ్రహ్మవర్చసం
బామహత్త్వ మామహావివేక
మెల్ల నణఁగె శౌరియింద్రజాలంబున
వినుము ధర్మతనయ ! విస్మితంబు. 166

క. పాలకడలి నుదయించిన
శ్రీలక్ష్మియుఁబోలెఁ గళలఁ జెలువారుచు లీ
లాలసగతి వెలువడెఁ గొల
నాలీలావతి పసిండియంచయు పోలెన్. 167

వ. మఱియు నజ్జలాశయంబున నీరు గ్రోలి వ్రాలిన నీలజలధర
ఖండంబు లన నొప్పుపెన్నెఱుల కొప్పును, నీలజలధరఖండం
బుదండఁ గన్నులపండువై యెసంగు చంద్రరేఖ యన మీఱు

నెన్నుదురును, జంద్రరేఖ చెలిమిని జెంగటఁ జెలువారునీలోత్ప లమ్ములనఁ జెన్నారునిడువాలుఁగనుదోయియు, నీలోత్పలం బులవలనం దొరంగు మకరందపూరం బన విలసిల్లుతియ్య కెమ్మోవియు, మకరందపూరంబు పూరింప నిడిన కనకకలశంబు లన నుల్లసిల్లుగురుకుచకుంభంబులును, గనకకలశంబులు మా యఁ దెచ్చిన పసిండిమూఁకుళ్ల నందగు మృదులబాహుమూలం బులును, బసిండిమూఁకుళ్ల నిగుడు మెఱుంగుఁదీఁగె లనన్ మెఱయు చేతులును, మెఱుంగుఁదీఁగలతళ్కునం బ్రదీపించు గగనం బనం దోఁచు చిన్నినెన్నడుమును, గగనంబునం దొలంకియాడువేల్పుటేటికలికితరఁగంబులతాఁకునం బొంకం బైన సువర్ణసైకతం బన వెలయుజఘనంబును, సువర్ణసైక తంబు కెలంకున మొలచిన పసిఁడియనఁటికోదములనం బొదలు నునుఁదొడలును, బసిండి యనంటి కోదముల ప్రోవున నొప్పు చెఱకువిలుకాని పువ్వుటంపపొదు లన ముదం బొనర్చు చిఱు తొడలును, బువ్వుటంపపొదుల నలంకరించిన ముక్తాఫలంబు లనం దేజరిల్లు పదనఖంబులును, గ్రమక్రమంబునం గనంబడ నప్పడంతి గట్టున వచ్చి నిలిచె నప్పుడు. 168

క. జలకేళి సలిపి వచ్చిన
పొలుపున వేఱొక్కపట్టుపుట్టముఁ గైసే
సి లతాంగి యంగకంబుల
నలరులసొమ్ములు ధరించి యలరెం జాలన్. 169

క. వనజాకరలక్ష్మియొ య
వ్వనలక్ష్మియొ మరుని నెడసి వచ్చినరతియో
యన నవయౌవనలీలల
వనిత సరస్తీరపుష్పవాటిక నొప్పెన్. 170

సీ. ఒకమాఱు తనచరణోద్గతద్యుతులచేఁ
జరమసంధ్యాచ్ఛాయ ధరణి ముంచు
నొకమాఱు తనమేనియుజ్జ్వలప్రభలచేఁ
దీఁగెమెఱుంగుల దిశలు ముంచు
నొకమాఱు తన ముద్దులొలుకునవ్వులచేత
వెన్నెలఁ గాయించు విపినవాటి
నొకమాఱు తన మంచి యొఱపుఁజూపులచేతఁ
గలువ తోరణములు గట్టు నెదుటఁ

తే. బాడుఁ బూఁజొంపములమీఁద నాడు గండుఁ
దుమ్మెదలమోఁత శ్రుతి గాఁగఁ దోయజాక్షి
కలికి జవ్వనమున కలంకార మగుచు
మదనలీలావికారసంపద దనర్చ. 171

క. ఆకొలనికెలన నాకస్త్రియ
నాకలికిచకోరనేత్ర యంగజలీలా
శ్రీకిఁ గరాళింపుచుఁ దన
లోకం బై పువ్వుఁ దోఁటలో విహరింపన్. 172

సీ. చంద్రకేతుం డను జగతీతలేంద్రుకు
మారుండు మదనావతారమూర్తి

వీరరత్నము జగద్విఖ్యాతమై యుప్పు
బిరుదాంకపుర మేలు బిరుదరాజు
చతురంగబలమహా సన్నాహసంపద
వేఁటమైఁ జనుదెంచి వికటదుష్ట
మృగబాధ లణఁగించి మగిడి యవ్వనమున
విడిసి తరుచ్ఛాయ విశ్రమించి
తే. కేళిమై గొడ్గుపావల గిలుకు లడర
నొక్కఁ-డాలుండు కైదండ యొసఁగ వచ్చి
యలరుఁదీఁగెవిధంబున నలరుచున్న
యలరుఁబోఁడి విలోకించెఁ గొలనిదరిని. 173
క. కని బిట్టుకట్టిదుర నా
జననాథసుతుండు నిండుజవ్వనమునకుం
దనుసౌందర్యంబునకును
దనలో నాశ్చర్య మంది తలయూఁచి యనున్. 174
శా. ఔరా! చన్నులచెన్ను! కన్నుఁగవతీరాహా! బళీ! వేణికా
భారశ్రీ! ముఖచంద్రబింబరుచి! చెప్పన్ వచ్చునే? చిన్నిక్రా
నేరీతిన్ సృజియించె బ్రహ్మ? కటిసొంపెట్లుంటెఁ!జారూరుశృం
గారంబెవ్వఁడు మెచ్చనేర్చు?నిదెపో కంజాక్షియన్నన్ భువిన్!
క. కలికినునుసోగవెన్నెల
తళుకు గులుకు నవ్వు, నవసుధారసధారం
జిలుకు నునుఁబలుకు, పూములు
కులకలికలు దీని కన్నుఁగొన లగ్గలికల్! 176

ఉ. కొండల కీడు, జక్కవలకున్ సరి, మారెడుపండ్లజోడు, వే
దండపకుంభతుల్యము, లుదంచితహేమఘటాభముల్, సము
ద్దండపయోజకోరకవిధస్ఫుటముల్, శకటాంగమూర్తు లీ
ఖండశశాంకఫాల కుచకాంచనచంపకపుష్పగుచ్ఛముల్. 177

తే. ఇంచువిలుకాని కేళిరాయంచకొదమ—
కాదు, మరుఁ జెక్కఁ బట్టిన కలికిచిలుక—
కాదు, వన్నెలబొమ్మ కొక్కట విరించి
జీవకళ నిచ్చి నిలిపిన చెలువ చెలువ. 178

ఆ. లలితనీలమణిశిలాక యనా నూఁగారు
నిలిపెఁగాక నలువ నిలువ కున్న
గురునితంబబింబకుచకుంభభరమున
వెలఁది యసదు నడుము విఱుగ కున్నె. 179

తే. మానినీరాకరోన్మాథిమందరంబు,
ధైర్యకందనిశాతకుద్దాలధార,
మర్మకంచుకకర్తరి, మహితబోధ
వనజచంద్రిక, యీయింతివాలుఁజూపు. 180

సీ. అమృతాంశుఁ డెంత దానము తా నొనర్చెనో
పొలఁతినెమ్మోముతోఁ బోల్పఁబడియె
నళు లెట్టి పుణ్యాటవుల నిష్ఠ మెలఁగెనో
యింతిపెన్నెఱులకు నీడువచ్చెఁ
దమ్ము లెన్నెన్ని తీర్థంబులం దోఁగెనో
సతి కాలుఁగన్నులసాటి నొందె

గజము లేకక్షేత్రిమార్గముల వర్తించెనో
చెలి నడకకు సరి చెప్పవలసెఁ

తే. గాంచనము భూమి నేమని కర్మములకు
వచ్చెనో చానమ్మిచాయ వన్నెకెక్కఁ
జిలుక లేసత్యవాక్యముల్ పలికినవియొ
యబలమధురోక్తులకు సన తమ్యె నిపుడు. 181

వ. అని బహువిధప్రకారంబుల దాని యభినవయౌవనసౌందర్య
విలాసంబులు చూచి చూచి, చూపానిన నేచి, ధైర్యంబు
తొలంగం దోచి, యంచంచలాత్మని డాయంబోయి, తన
చక్కందనంబునకుఁ జిక్కిన తలంపుచూపు గని, యను
రాగంబు నెరయ, నెఱజాణతనంబు గల తగవుమాటల
నొడంబఱిచి, కైకొని తనపురంబునకుఁ గొనిపోయి యభిమత
రతిక్రీడలం దేలుచుండె. 182

క. కొడుకుల నూర్వురఁ గనె న
ప్పడఁతుక సౌందర్యనిధుల బాహాబలులన్
గడిమి గలవారి; వారుం
గడఁగిరి వివిధాస్త్ర శస్త్ర కౌశలలీలన్. 183

క. పతిమేలు సుతులకలిమియు
నతులిత సామ్రాజ్యవైభవాభ్యుదయంబున్
సతి యైన నారదునకున్
బ్రతిదిన సంతోషసిద్ధి వరఁగఁగఁ జేసెన్. 184

క. కంసారిరచితమాయా
సంసారపయోధి మునిఁగె సన్మని, భూపో
త్తంస! విను నీమఱందిఁ బ్ర
శంసింపఁగఁ దరమె పద్మజాతున కైనన్? 185

వ. ఇవ్విధంబున నపరిమితైశ్వర్యవిలసితంబు లగుసామ్రాజ్యవైభవంబులును, మన్మథావతారుం డగు ప్రాణేశ్వరుండును సుగుణవంతు లగుకోమాళ్లునూర్వురు, ననుఁగుంగోడండ్రు,ననుకూలదాసదాసీజనంబులును, మణిమయకనకవిభూషణాంబరసృక్చందనతాంబూలచంద్రశాలావిహారపుష్పశయ్యాదులుఁగలిగి యప్పుడంతుక తనయభినవసౌందర్యంబునకుం దగినవైభవంబున నే వెలితియు లేని సంసారంబు సేయుచుం గొంతకాలంబు ప్రవర్తించు చుండె నంత. 186

— చంద్రకేతునిమీఁదికి జ్ఞాతి దండెత్తి వచ్చుట. —

మ. వినఁ జిత్రంబుగఁ జంద్రకేతుని భుజావీర్యంబు నైశ్వర్యమున్
గొనసాగం గని యోర్వఁజాలక మదిం గోపించి తద్జ్ఞాతినం
దనుఁ డొక్కండు ఫణీంద్రకేతుఁ డను భూనాథుండుదండెత్తి వ
చ్చె ననేకోద్భటవిక్రమక్రమనటత్సేనాసహస్రంబుతోన్.

ఉ. వచ్చినఁ జంద్రకేతుఁడు నవార్యబలంబులఁ గూర్చి పేర్చి కా
ర్చిచ్చు మిణుంగురుల్ సుతులు చిందఱ రేఁగి రథాధిరూఢులై
చెచ్చెర సంభ్రమించుటకుఁ జిత్తమునున్వికసింపమెచ్చుచున్
వచ్చెఁ బురంబు వెల్వడి ప్రవల్గదనర్గళధైర్యసంపదన్. 188

క. పతిఁ బాయలేదు సతియున్
సతిఁ బాయఁగ లేదు పతియు సమముమకార
స్థితిఁ గావునఁ బతిఁ బాయక
సతియును జనుదెంచె సమరసంపదఁ జూడన్. 189

వ. ఇట్లు ప్రాణేశ్వరీసమేతుం డై యుభయపార్శ్వంబులఁ బ్రతాప
దీపితు లగు కొడుకులు వచ్చి చండకోదండభుజాదండు లై
సంపూర్ణ బాణతూణీరంబులతో రత్నకవచశిరస్త్రాణంబులు
వెలుంగారఁ దేరు లెక్కి యిరుగెలంకుల నుక్కుమీఱి
యేతేర ననేకానేకరథసందోహంబులును, బహుకోటిఘోటక
వ్రాతంబులును, బంధురమదాంధగంధసింధురబృందంబులును
నేల యీనినట్లు వెల్లివిరిసిన కాల్బలంబులు నెడలేక నడు
వం బుడమి గంపింప వచ్చి మచ్చరంబునం దన్నెత్తి
వచ్చిన ఖగేంద్రకేతుండును, దానును సమయంబు చేసికొని
సర్వవరక్షేత్రంబున నారీరూపంబున మున్ను నారదుం డుద
యించినకొలంకు కెలంకున విడిసి రప్పుడు. 190

ఉ. సేనలు రెండు నిల్చి రథసింధురసైంధవసద్భటోద్భట
ధ్వానము దిక్కటాహముల వ్రక్కలు సేయ నుదగ్రహేతిసం
తానరుచుల్ వెలుంగ గగనంబునఁ గేతనపంక్తు లాడఁగాఁ
బూనిక నిల్చె మోహరము భూరిభయంకరలీలఁ గ్రాలఁగాన్.
ఉ. భేరులమ్రోఁతయున్, సుభటభీకరహుంకృతులుం గరీంద్రఘీం
కారతురంగహేషలు, నఖండరథోత్కటనేమిరావముల్

ఘోరకలంగె దిగ్గనముల్ గబళించె ధరాపరాగ మ
ప్పోరు గనంగ నచ్చెరువుపుట్టె వియచ్చరకోటి కత్తఱిన్.

వ. ఇట్లు రెండుబలంబులు మెఱసి చలంబునం బోరుచుండ నభోమండలంబున నప్సరోంగనలు నిలిచి కన్నులపండువుగాఁ జూచి వలసినవీరపురుషుని వరియింపం దివురుచుండి రప్పుడు.

ఉ. కొండలు వజ్రపాతమునఁ గూలుక్రియన్ రథికాళిచేత వే
దండము, లబ్ధిభంగముల తాఁకున నోడలువోలెఁ దేరులు
ద్దండమదేభ చండతరదంత హతిం బడఁ దుండెతుండెమై,
పాండుకులేశ ! యశ్వములపాటును గాల్వురచావు నేమనన్?

క. కొండలవలెనే వచ్చు న
ఖండగతిన్ మంచువలెనె కడపల విచ్చున్
రెండుబలంబులుఁ దమ వే
దండ తురంగమ సుభటరథప్రకరముతోన్. 195

వ. అట్టి సంకులసమరసమయంబుననసమానశౌర్యదోర్వీర్యంబుల నెదిరి, యెదిరి బలంబులం దఱిమి, ప్రతివీరయోధ సముద్దామదారుణ బాణపాతంబులఁ గొడుకులు నూర్వురు నొక్కపెట్టునంబడినఁ, గనుంగొని, పుత్రశోకంబునం దజ్జనని రథంబుపైఁ బడి మూర్ఛిల్లిన నెట్టకేలకు మూర్ఛఁ దేర్చి కార్చిచ్చు నిదాఘసమయంబునం గాఱడవుల దహించు చందంబునఁ జంద్రకేతుండు ఫణీంద్రకేతుని మొగ్గరంబు నుగ్గునూచ గావించిన. 196

తే. అడె నట్టలు పెక్కు, రక్తాంబునదులు
పాఱె, భూతంబు లార్చె, నభస్థలమున
కెగసెఁ బెంధూళి యవ్వేళ; నేమి చెప్ప!
భువన సంక్షోభకర మయి పొల్చె రణము. 197

చ. కొడుకులు సూర్యరుంబడినఁ గోపముదుఃఖమునంకురింపఁ బె
ల్లడరుచు నాత్మసైన్యనివహంబుల నోర్చుచుచంద్రకేతునిం
దొడరి లయాంతకాకృతి నెదుర్కొనిపేర్చి ఫణీంద్రకేతుఁ డా
యెడఁదునుమాడెఁదద్బలము నెల్లనొకంచమునుజిక్కకుండఁగన్.

క. బల మెల్ల నడఁచి యాతని
బల మెల్ల నడంచి సురలు ప్రస్తుతిసేయం
దలఁ దున్ముంచి నప్సరస లా
తలఁ బూవులు చల్లి పెల్లు తాండవమాడన్. 199

వ. ఇట్లు ఫణీంద్రకేతుండు చంద్రకేతు నింద్రనికేతనంబున కనిచి
విజయశంఖంబు పూరించి చతురంగబలసహస్రంబులు గొలువ
మహోన్నాహంబునం జని యతని సామ్రాజ్యంబు గైకొని
యేలుచుండెఁ దదనంతరంబ. 200

క. రణమండలహత గత దా
రుణవీరవ్యూహదేహరుధిరాసారో
ల్బణతనుతఁ దీర్థమాడ న
రుణుఁడు సనియె ననఁగఁ గ్రుంకెఁ బ్రాద్దపరాబ్ధిన్. 201

ఆ. ప్రొద్దు గ్రుంకుమున్ను పురుషుండు వడుటయే
ప్రొద్దు గ్రుంకినట్ల పొగులుసతికిఁ

గదిరె భీకరాంధకారంబు దృష్టి, శో
కాంధకార మాత్మయందుఁ బోలె. 202

—♦ యుద్ధభూ వర్ణనము. ♦—

సీ. కఠిన భీకర ఫేరు కంక గృధ్ర వ్రాత
కలహ పరస్పరకలకలంబు
భగ్నర థాయుధప్రకర కేతన వేణు
వీణా శకలచూర్ణవిషమతలము
రక్తప్రవాహ సంసిక్త శిరః కబం
ధ కరాంఘ్రి తనుఖండ దారుణంబు
కంఠగతప్రాణ కరటి ఘోటక భట
చటుల ఫూత్కార నిశ్వాసభరము

తే. నయిన రణమండలమున నయ్యబ్జవదన
కన్నకొడుకులపైఁ నిజకాంతుపైఁ బ్ర
భూత దుఃఖార్తయై పడి పొరలి పొరలి
వేలుపులఁ దిట్టుచును బలవింపఁ దొడఁగె. 203

ఆ. ఎన్నిపాట్లఁ బడియె నీనారదుఁడు పద్మ
నేత్రు మహిమఁ గనక నీరసించి
ఘనుఁ దిరస్కరించు కలుషచిత్తుఁడు పుణ్య
ఫలము పొలిసి యెన్నిపాట్లఁ బడఁడు? 204

క. హరిమాయలోన సకలము
పరిమగ్నం బైన యట్లు బంధురతిమిర

స్ఫురణమున నడఁగె నఖిలము;
హారిభక్తులు వోలెఁ దార లడఁగుచు నుండన్. 205

— చంద్రోదయవర్ణనము. —

క. నారదముని యజ్ఞానము
దూరంబై పోవఁ దెలివి దూకొను నుదిలో
నీరీతి ననెడుపగిది న
పారతమం బడఁగ నమృతభానుఁడు వొడిచెన్. 206

ఉ. నారదమానికిన్ నలిననాభుఁడు సన్నిధి యైనఁ బైపయిన్
భూరికృపానుధారసము పొంగెడు కైనడిఁ బొంగెఁ జంద్రికా
సారము తత్ప్రమోదమున నంయమికోటి చెలంగునట్ల చా
కోరకముం జెలంగ ముదిరోరిక యుల్లసిలంగ నొల్లెడన్. 207

— సూర్యోదయవర్ణనము. —

వ. అంత. 208

చ. నలినవిలోచనుండు కరుణానిధి శ్రమ్మఁ సుప్రసన్నుఁ డై
నలినభవాంగజాతునిఘనం బగుతొల్లిటి బ్రహ్మనర్చనం
బలఘుతమం బడంచుదయ నంతయుఁగూడఁగఁజేసితెచ్చెనా
నలినహితుండు దోఁచె నలినప్రకరోల్లసనంబు మీఱఁగన్.

వ. ఇట్లు సూర్యోదయం బయ్యె, నయ్యరుణకిరణపరంపరల
రక్తపంకపంకిలం బగు నమ్మహారణమండలంబు తేటిచూడ
భయంకరంబై యుండె, (నట్టియెడ) నెండతాఁకున విరవిర
వోవుచు వాడఁబాఱు మైదీఁగెయు, ధారాకారంబున నెడ
తెగక చన్నులపయిం దొరంగు కన్నీరును,విరిసి కన్నీళ్లఁదడిసి

ముసుంగు పడిన పెన్నెఱులును, గ్రొవ్వేఁడి నిట్టూర్పులం
గందిన కెందలిరాకుమోవియును, జేరుగడ లేక యేకాకులంబై
కుందు డెందంబును గలిగి దైన్యంబు పెంపునఁ గంపించుచుఁ,
దోడు లేమి నెద్దియుం జేయనేరక, పలవించుచుండి, చండ
మరీచిమండలంబు నుప్పరంబున కెగసి నిప్పు లుమియం జెప్ప
రానిదప్పియు నాఁకలియు నుప్పతిల్ల, నోర్వలేక యక్కలువ
కంటి నలుదిక్కులుం గలయ నాలోకించి. 210

క. ఆ చేరువ హారిక్రృవ మా
యాచూతం బొకటి దట్టమై సొంపారం
జూచి బ్రతుకాస విడువక
యాచల్లని నీడ కేఁగి యత్తరుశాఖన్. 211

క. చేరువ ఫలమొకఁ డుండఁగఁ
గోరికతోఁ జేయిసాఁచి కోయుదు ననుచుం
జేరి యది యంద కించుక
దూరం బైయున్న యబల దుఃఖిత యయ్యెన్. 212

వ. ఇట్లు దుఃఖించి వెండియుఁ జేయిసాఁచి పండు గోయనుంకిం
చుచు నేవిధంబునం గోయుదు నని తిరిగితిరిగిచూచుచుఁ,
జెట్టెక్కి కోయనేరక యాఁకటిచిచ్చార్పం జాలక చచ్చిన
కొడుకులలో నొకని నీడ్చుకొనివచ్చి యచ్చట వైచి వాని
పై నెక్కి, కోయంబోయి, యందక వ్రేలెఁడు గడమయైన,
మఱియు నొక్కనిఁ దిగుచుకొనివచ్చి వానిపై వైచియెక్కి
కోయంబోయినఁ, నెప్పటియట్ల యందకున్న, మానక యా

క్రమంబున నూర్ధ్వరకోదుకులం దెచ్చి దెట్టిగాఁ జేర్చి
యందఱిపైని మగని నైచి మగని తోమెమ్మెక్కి కోయంబోయి
యప్పటియట్ల యందక యమ్మాయయాచూతఫలంబు నిర్ఘాత
ప్రియత్నంబైన నచ్చెరువంది కుందుచున్నసమయంబున,
నొక్కవృద్ధబ్రాహ్మణుండై నారాయణుండు, నారాయణ!
కృష్ణ! కృష్ణ! కృష్ణా! యనుచుఁ జెమ్మటలు దొరఁగ నలసిన
వాఁడునుంబోలె వచ్చి, యాచెట్టునీడ నిలిచి, క్రొన్నెత్తురుల
జొత్తిలులోకంబైనకోకతో నేకతంబ శవనివహంబు నెక్కి
మృత్యుదేవతయుంబోలె నున్నయస్త్రీలవేశిం జూచి తల
యూఁచి యాశ్చర్యంబునం బొందుచు దానితో నిట్లనియె.

క. ఇది యెక్కడి శవనివహం?
బిది యేఁటికిఁ గూడఁబెట్టి యెక్కితి? వీఁక నె
య్యది యాచరింపఁ దలఁచెదు?
సుదతీ! నినుఁ జూడ భయముఁ జోద్యము నయ్యెన్. 214

—♦ వృద్ధబ్రాహ్మణునితో స్త్రీ తన వృత్తాంతము చెప్పుట. ♦—

తే. అనుచుఁ బలికిన నపుడు బ్రాహ్మణునిపలుకు
చెవులు సోఁకిన నొకకొంత నేదఁదేఱి
చెప్పె వృత్తాంత మెల్ల నాచిగురుఁబోణి
దైన్యసంభూత బాష్పాంబుధార దొరఁగ. 215

వ. అట్లు చెప్పిన. 216

క. విని నవ్వి ధర్మనందన!
వనరుహదళలోచనుండు వనరుహదళసం

జనితమరందము చూడ్పునఁ
గనుఁగొనలం గరుణ దొరుఁగఁగా నిట్లనియెన్. 217

వ. అబలా! నీకు నీకర్మంబు పురాకృత కర్మంబునఁ బ్రాప్తించిన యది, యింక దీనికి వగవం బనిలేదు. పోరికలన నిట్టి పుత్ర రత్నంబులును మనోవల్లభుండును బుణ్యలోకంబునకుం బోవుట కన్నులారం జూచియు నెవ్వరిం జూచి ప్రాణంబులు నిలుపుకొని, క్రమ్మఱ బ్రతుక నాసపడితివి? పండు దిన నోరి కెట్లు చవియయ్యె?విడువు మీదురాశ,యిది శేషాహి తపోవనం బీ వనంబున ఫలం బఱచు లగు వారి కంట రాదు. తత్ఫలాపేక్ష యుడిగి వీరలకుం బరలోకసంస్కారంబు లొనర్చి యాత్మేశ్వరునికై దహనముఖంబున నీదేహంబు విసర్జించి భువనంబులు నుతింప దివ్యమూర్తి వగు మీచేరువ నొక్కకొలను చూపెదఁ దీర్థం బాడి నత్తువు గాని రమ్మనిన సమ్మతించి యమ్మగువ శవనిహంబు డిగ్గి డగ్గఱి డగ్గుత్తిక తోఁ బ్రాంజలియై యిట్లనియె. 218

తే. విప్రపుంగవ! ప్రత్యక్షవిష్ణునట్ల
నన్నుఁ గృపఁ బ్రోవ వచ్చితి, నాదుపూర్వ
పుణ్యమును నేఁడు ఫలియించెఁ, బోయె దుఃఖ
మనఘ! నినుఁ జూచినపుడ శ్రీహరియ సాక్షి. 219

తే. మానవిభుఁడైన పెనిమిటి, మానధనులఁ
గొడుకులను గోలుపోయితిఁ బడితి నిడుమ

నరిగదా! యీఁదుజన్మంబు చాలు, నాఁదు
జన్మ మే నొల్ల నేఁటేదు జన్మములకు! 220

సీ. సకల సంపదలతో సామ్రాజ్య మేలితి
మనసార మగనితో మదనకేళి
సౌఖ్యంబు లెల్లను జలిపితిఁ గొడుకులఁ
గంటిఁ బెంచితిఁ గదు గారవమునఁ
గనునన్నుఁ గోడండ్రు పనిసేయు దాన దా
సీజనంబులు పనిసేయుచుండ
రాజసంబున నుంటిఁ గ్రిమ్మఱ నిటునంటి
సంసార మరనిముసంబులోన

తే. నము సెఁ గలగన్నగతి నింద్ర జాలమట్లు
వేసరితి నింక నీయాజ్ఞఁజేసి కడఁకఁ
దీర్థమాడి నావిభున కీదేహ మిచ్చి
దివ్యరూపంబు గైకొందు దివిజు లలర. 221

క. మోహము విడిచితి విను మీ
దేహముపై నాస విడిచితిని నీసత్య
వ్యాహారామృతపానో
త్సాహంబునఁ బరమధర్మతత్త్వజ్ఞమ్మణీ! 222

వ. అని పలికిన, నమ్మహీసురేందు్రుండు తనవగ లుడుపుచుఁ
దోకొనివచ్చి సరోవరంబు చూపిన. 223

---

* తీర్థమా డాత్మవిభునకు—వ్రా. ప్ర.

క. వారిజలోచన గనియెన్
వారిజకహ్లారకైరవ శ్రీకరమున్
వారిరుహాకరము న్నవ
వారిరుహామోదగంధవాహోత్కరమున్. 224

క. దేవనదీ ముఖ్యమహా
పావనతటినీ సరః ప్రభావం బెల్లం
బోవిడినవాఁడునుమిగ్ల
యావనజాకరము గాఁగ నచ్యుతుఁ డధిపా! 225

ఉ. చల్లని మందమారుతము చల్ల, నిజాంగము చల్లనైన ను
త్ఫుల్లమనోంబుజాతయయిపూర్వకృతోత్కటదుష్కృతంబుల
ల్లల్లన జాఱ నీళ్లదరి క ల్లలనామణి చేరఁ బోయి శ్రీ
వల్లభుఁ డయ్యెడన్ విహగవల్లభు నెక్కఁ బ్రసన్నుఁడౌటకున్.

చ. వనరుహ గర్భుఁడున్ శివుఁడు వారిజబంధుఁడు దేవబృందమున్
సనకసనందన ప్రముఖ సంయములున్ జనుదెంచి పద్మలో
చనుని భజించుచుండిరి బిసప్రసవాకరతీరభూమి మానినియ
యి యున్న నారదమునిం గని యవ్విభు మాయ మెచ్చుచున్.

తే. చిత్రతర కపటనాటక సూత్రధారి
శౌరి నాఁ డాకొలంకునఁ జానఁ జేసె
మగుడ నేఁ డీకొలంకున మానిఁ జేయు
నతని మాయకు నిది యెంత యద్భుతంబు? 228

వ. వెండియు నాపుణ్యసరోవరంబునఁ బూర్వకర్మనిర్ముక్తి యొ
నర్చి దుఃఖమాలిన్యస్వరూపం బగు నాఁడురూపంబుమాని

తొల్లింటియట్ల నారదుని బరమయోగీంద్రుని జేసి యతనికి సాత్త్వికబ్రహ్మోపదేశం బొసంగి కరుణించు నారాయణుని భక్తవత్సలత్వంబు చూడవలయు నని గరుడగంధర్వసిద్ధ విద్యాధరాదులు నంతరిక్షంబున శంఖకాహళమృదంగవేణు వీణాదివాద్యంబుల నాయితంబు చేసికొని వచ్చి పొడసూపి నిలిచిన నప్సరస్స్త్రీలు లీలాపుష్పకాధిరూఢలై తత్పార్శ్వం బులఁ బసిండిపళ్లెరంబుల నిడుకొని తెచ్చిన మందారపుష్ప మంజరులు సమయం బెఱింగి చల్ల నుండి రట్టియెడ నప్పంక జాక్షి కొలంకుఁజొచ్చి కన్నీళ్లు దుడిచికొని పుక్కిలించి యునిసి కట్టినచీర వదిలిచి కలయం దడుపుకొని కరిమ్మఱఁ గట్టుకొని కుచకుంభప్రమాణపయఃపూరంబున నిలిచి నారా యణ నారాయణేతి వచనపూర్వకంబుగా మునింగిన. 229

క. హరిమాయ యేమి చెప్పుదుఁ?
దరుణీమణి నీళ్ల మునిఁగి తత్క్షణమాత్రన్
సుర లచ్చెరువడ లేచెన్
నరనాయక ! దివ్యమౌని నారదుఁ డగుచున్. 230

క. నారదుఁ డా సరసి మునుఁగ
వారిజదళనేత్ర వెడలె; వడి నీ సరసిన్
వారిజనేత్రి మునుంగఁగ
నారదుఁడై వెడలె! నిట్టినైపుణి గలదే ? 231

క. ఆకొలను పొలఁతిఁ జేసెను
నీకొలనుం బురుషుఁ జేసె నిరుగొలఁకులు లో

కై కాశ్చర్యకరంబులు
శ్రీకరములు వాంఛితార్థసిద్ధికరంబుల్. 232

క. పాండు కులేశ్వర ! విను మ
య్యండజపతిగమనుచేత నా సర్వపురీ
మండలిఁ దనరెన్ నారద
కుండిక యొకఁ, డొకటి ముక్తికుండిక యనఁగన్. 233

వ. అప్పుడు. 234

—◆ నారదునకు నారాయణమూర్తి ప్రసన్నుఁడౌట. ◆—

ఉ. మాయ యెడల్చి దివ్యమునిమండలముల్ దనుఁజేరికొల్వఁగాఁ
దోయదముక్తమైన దివిఁ దోఁచు సతారకచంద్రు నట్ల నా
రాయణుఁ డార్త రక్షణ పరాయణచిత్తుఁడు దోఁచె ధారణీ
నాయక ! దివ్యయోగి యగు నారదమౌనికి సుప్రసన్నుఁడై.

చ. కురిసిరి పుష్పవర్షములు గుంపులు గుంపులు గట్టి దేవతా
తరుణులు శంఖకాహళ మృదంగ ముఖధ్వను లుల్లసిల్ల నం
బరమునఁ దత్సరోవర సముంచిత కాంచన పద్మగంధ బం
ధుర మృదులోర్మిశీతల మనోహర వాయువు వీచె నింపుగన్.

క. పాడిరి గంధర్వాధిపు,
లాడిరి రంభాదు,లంబుజాసనసుతునిం
జేడియ రూ పుడిపి హరి
ప్రోడీశ్వరుఁ జేసినట్టివనజాక్షుకడన్. 237

శా. జేజే యంచుసురల్ భజింపఁగ,మునిశ్రేష్ఠుల్ నుదుల్లాఘ గరాం
భోజాతంబులు చేర్చుచుం బొగడ, నంభోజాస నేశాన పం

కేజాపుల్ పరమాత్ముఁడంచు మదిఁదర్కింపంగ నాస్వామియా
తేజోరాశి మురారి కోటిరవిదీప్తిం బొల్చు భూవల్లభా! 238

సీ. పావనశ్రీపాదపంకజంబున మఱిం
దన్యందమై సురతటిని పొరుఁగ
నిర్మలతర దేహనీలమేఘంబునఁ
గ్రొమ్మెఱుంగై సిరి యెమ్మెచూప
ముఖచంద్ర మండలంబునఁ జంద్రికాసమం
బై సుధా సుమధురహాస మెసఁగ
పటుశిరః పూర్వాద్రిఁ బద్మాప్తబింబమై
పాటల రత్నకిరీట మొప్ప

తే. శంఖచక్ర గదాఖడ్గ శార్ఙ్గముఖ్య
వివిధ దివ్యాయుధములు బాహువుల వెలుఁగఁ
జారుభూషణదీప్తిపుంజంబు దనరఁ
దేజరిల్లెడు హరిఁ గాంచి దివ్యమౌని. 239

క. ఆనిందుఁ గొలను వెలువడి
యానారదుఁ డేఁగుదెంచి హరిఁ గాంచి సుధాం
భోనిధి నుదయించు సుధా
భానునికిఁ బ్రియ సురచకోర పంక్తులు చెలఁగన్. 240

సీ. నారాయణేతి నినాదామృతముఁ జల్లు
మణివీణె భుజముపై మనసు గరఁపఁ
నానందరసవీచికాకృతిఁ గుంచియ
మఱియొక్క భుజమున మరులుకొలుప

మోక్షలక్ష్మీహారకముం బోనిపటికంపు
జపమాల కర్ణదేశమున వెలుఁగ
బ్రహ్మవిద్యాసుధాపరిపూర్ణకలశంబు
నాఁ గరంబునఁ గమండలువు దనర

తే. నమ్మహామాయ మెచ్చుచు నరిదిపడుచుఁ
దన్నుఁ దా నవ్వుకొనుచు నంతసముతోడ
నారదుఁడు వచ్చి వేవేల నతు లొనర్చె
గరుడవాహనుఁ డైన శ్రీకాంతునకును. 241

ఉ. వేయువిధంబులం బొగడు, వీణియ మీటి నటించుఁ, బాడు, జే
జేయను, నవ్వు, నద్భుతముఁ జెందుచు నొందలయూచుఁ జూచు న
మ్మాయ సడల్చి దేవమునిమండలి గొల్వఁగ నున్నయాదినా
రాయణదేవు మోము దరహాసరసామృత సుప్రసన్నమున్.

వ. ఇట్లు తద్దర్శనానందసుధాసరసీతరంగంబుల నోలలాడుచు నభివాదనసహస్రంబు లాచరించుచుఁ బ్రాంజలియై బ్రహ్మాదిదేవముఖ్యులు దత్తకర్ణావధానులై విన నద్దేవదేవు నుద్దేశించి.

ఉ. మూఢులు నీచవాదముల ముంచఱవెన్క యొఁదోఁపకున్న దు
ర్గాఢతమోహతాత్ము లయి కానరు కానరు, బ్రహ్మయోగవ
త్ప్రౌఢులు శాస్త్రదృక్కు లయి బ్రహ్మమయున్ నినుఁ గాన, రన్న
చోఁ బ్రీక్షయు లేదు నాకిఁక ధరిత్రి నినుం గనలేమి నచ్యుతా!

ఉ. జాతియు రూపు నామములు సంభవనాశనముల్ సుఖార్తిసం
భూత వికృత్యవస్థలును బొందక యెందును లేక యుంటయుర్

నేతృత గల్గియుండుటయు నిత్యతఁబాయఁగలేక యెవ్వ రి-
జ్జాతు రవిద్యఁ బాసిన నిశుస్థమతుల్ నిరతంబు నచ్యుతా!
చ. సమత భజింపనేర్చి విరజస్కముల్లై నిజసాత్త్వికత్వమున్
శమమును గల్గి నిత్యమును సత్య మనంతము జ్ఞాన మాత్మ త
త్త్వము నని వేదశాస్త్ర విదితం బగు నీవిభుసుప్రసన్న తే
జముఁ గని చిత్సుఖామృతరసజ్ఞతఁ గాంతురు ధీరు లచ్యుతా!
సీ. పద్మయు విధియు నీప్రకృతి పంకజరజః
పటలంబునను బుంగి భ్రమసినారు
మృత్యుంజయుండును మితిలేని నీమహా
మాయాతమోరాశి మగ్నుఁడయ్యె
నంయముల్ నీయింద్రజాల మార్గాటవి
జాడ యెఱుంగక జాల్మలైరి
వేదవేత్తలు నీయవిద్యావిహారసం
గతికి నేమేరయుఁ గానలేరు
తే. మతవివాదులు త్వన్మోహమహాతులు; నిన్ను
ఘనుఁడు నీభక్తవర్యుఁ డొక్కరుఁడు దక్క-
నెఱుఁగువా రెవ్వరో యింక నెఱుఁగ వారి
తామరసనేత్ర! దివ్యతేజోమహాత్మ! 247

—♦ { నారాయణమూర్తి నారదునకు దివ్యదృష్టి దయచేసి శ్వేతద్వీపమునకుఁ బోవుట. } ♦—

చ. అని తనుఁ బ్రస్తుతింపఁగ దయానిధియై నిజదివ్యరూపముం
గనియెడు దివ్యదృష్టి యిడి కంజదళాక్షుఁడు దేవకోటితోఁ

జనియె సుపర్వకామినులు చల్లెడు పువ్వుల సోనతోన యీ
మునియును గొల్చి రా, భువనమోహనసీమకిఁ దెల్లదీవికిన్.

క. నా విని నారదుఁ డిట్లను
భూవర ! యింతయు నిజంబు భువనము లెఱుఁగున్
గోవిందశర్మ సాక్షా
ద్గోవిందుం డితనిఁ బొగడఁ గొలఁదియె మనకున్. 249

మ. హరికిం బ్రాణసఖుండు తత్ప్రియపయోజాక్షీమణుల్ వేడ్కతో
వరుసన్పూజలొనర్చు దైవము జగద్వంద్యుండు వేదాగమాం
తరతత్త్వజ్ఞుఁడు పూజసేయుమితనిన్ ధాత్రీశ!యీసంయమీ
శ్వరసాహస్రముపంపున న్మది సరోజాతాక్షుఁగాఁ జూచుచున్.

ఆ. ఇతనిఁ బూజసేయు టిందిరానాథునిఁ
బూజసేసినట్లు బుద్ధిఁ దలఁపు
కువలయేశ ! వినుము ! గోవిందశర్మచే
నేఁడు ధన్యమయ్యె నీగృహంబు. 251

వ. అని పలికిన నమ్మహామునిపలుకు లంగీకరించి సభాసదు లగు బ్రహ్మమునుల యనుమతంబున ననేకమణిమయాభరణాదు లర్పించి పూజించిన ధర్మనందను నభినందించి, జగద్వంద్యుండును, జగదేకనాథుండును, జగదేకశరణ్యుండును, చతుర్విధముక్తిదాయకుండును, చతుర్వేదవేద్యుండును, నిగ్రహానుగ్రహసమర్థుండును, భక్తవత్సలుండును నగు నీముద్దుమఱంది కృష్ణుండె స్వయంప్రకాశపరబ్రహ్మవస్తువిలసనంబుగా భావించి కృతార్థుఁడవు గ మ్మని బ్రహ్మోపదేశంబు నేసిన, ధర్మనంద

నుండు, పరమవిజ్ఞానంబుతో నానందరసమయుం బగు మనం
బున మాయామానుషవేషధారి యగు శ్రీకృష్ణుని జగన్మో
హనమదనగోపాలశ్రీరాధికామాధురీలోలలీలారూపంబు పర
బ్రహ్మస్వరూపంబై తోఁచిన రోమాంచకంచుకితదేహుం
డై మోదమ్మున గేలుదోయితో నిట్లని స్తుతించె. 252

దండకము.

జయజయ! నవకామగోపాల! శ్రీరాధికామాధురీలోల!
లీలాజగన్మోహనాకార! కారుణ్యపూర్ణహృదయాధార!
దూరీకృతాత్మీయసద్భక్తనిస్సారసంసారసంతృష్ణ! శ్రీ
కృష్ణ! శ్రీదేవకీపుత్ర! లోకత్రయానందకందంబునందంబు
నై యొప్పు బృందావనీవీథి గోవర్ధనాద్రీంద్రదేవండ
గండస్థలీ నిస్సరద్దానధారారసాళిందాత్మజాసింధు తీరంబునం
దత్తరంగావళీజాత మందానిలవ్రాతలోలప్రఫుల్లప్రసూన
శ్రీమద్భృంగ సంగీతలీలాలసత్పారిజాతావనీజాతమూ
లోజ్జ్వలచ్చారుచింతామణీ వేదికామధ్య సంశోభిత స్వర్ణ
పద్మంబునం బద్మరాగోన్నమత్పాదుకాగ్రంబున న్నిల్చి
వ్యత్యస్తపాదారవిందంబుతోడం ద్రిమూర్త్యాత్మకంబైన
మువ్వంకతో మూఁడువేదంబులు స్సాక్షిగానై మూఁడు
లోకంబులంగల్గుమేలెల్లను స్సాక్షిగానై చూపులం బుండరీక
చ్ఛదంబుల్ వెదల్ చల్లుచున్ బాలసూర్యాతి దేహప్రభల్
రత్నమంజీర కాంచీలతా ముద్రికాకంకణ వ్యక్తముక్తావళీ

కౌస్తుభస్వర్ణ కర్ణావతంసారవింద ద్వయీ కుండల స్థూల నాసాగ్ర ముక్తాఫలోద్యత్కలాపాది నానాపరిష్కార కాంతిచ్ఛటాశ్రీలతో మేళవింపంగ రంగత్కిరీటాగ్ర మాణిక్యకోణాంబులన్ సాంద్రతేజోమిళచ్చంద్రికంబుల్ చలింపంగ సొంపారఁగా నొసలం జుట్టుకొన్నట్టి మాయూరపింఛంబు గ్రొమ్మించుఁ దళ్కుల్ పిసాళింప, సర్వాంగ సంసక్త కాశ్మీర కర్పూర కస్తూరికాగంధసారాంగరాగంబు సౌరభ్య మాగుబ్బతిల్లన్, లసత్ఫాలభాగంబునం జిత్రజాతార్ధచంద్రాస్త్రముంబోని కస్తూరి దిర్నామముం గ్రాల, నొయ్యారమై పన్నిమీఁఱఁ బదార్వన్నె బంగారు కెంబట్టుకట్టాణిముత్యాల ముంగొంగురింగుల్ కటిన్ జౌకళింపంగ, సంపెంగలున్ బైఁడిగేదంగులున్ మేలిచెంగల్వలున్ సజ్జకం బైన గొజ్జంగలున్ జాజులున్ మున్నుగాఁ గల్గు పూగుత్తులుం గ్రొత్త పన్నిల్ పచారింపఁగన్ శ్రీతులస్యాయత స్రగ్వితానంబుతోఁగూడఁ జూడాంఘ్రి పర్యంత సౌందర్య ధుర్యామరద్రూపమానోల్లస ద్వైజయంతీవిలాసంబు శోభిల్ల నుత్ఫుల్లవక్త్రాబ్జ మందస్మిత శ్రీసుధాసారసారస్య మొప్పంగ, శృంగార వార్ధాన్నిధిన్ దేవదేవేంద్రముఖ్యామరానీక సేవ్యంబు భవ్యంబు నవ్యంబు దివ్యంబు నై యొప్పు నీయొప్పు కందర్పసౌందర్యదర్పంబు గుప్పించి విప్పారు ; నీదివ్యతేజోలవం బబ్జమిత్రుండు, నీదీప్తిలేశంబు సప్తార్చి, నీమందహాసాంకురం బిందు

బింబంబుగా, భవదభినవరూపలావణ్యలీలాసరోహంసియై
కామకేళీరిరంసారతిక్రీడ నీతోడఁగూడున్న రాధావధూటీ
లలామంబు రాకాసుధాధామ బింబంబునం జంద్రికారేఖ
లేఖావనీజంబునం జిన్నిపూఁదీగె, మేఘంబునన్ లేమెఱుం
గంబుజాతంబునం దేఁటి నా మిక్కిలిం జక్కనై కోర్కులం
దేల నాలింగనప్రేమయై వామదోఃకంజ మంసప్రదేశంబు
నం జాఁచి మేలారు వాలారు కెంజాయకుం దావికిం జెందు
లాడంగఁ గ్రీడాపయోజాత మాడింపుచుం గెంపునింపు
ల్పచారింప నింపారు నీచిన్నిమోవిన్ సుధాబిందునిష్యం
దముల్ జిందఁగా వేణునాళంబు పొందించి కేల్దమ్మి
జోడొక్కచో నీడుగాఁ గూడఁగాఁ బట్టి సద్రత్నవన్ముద్రి
కాజాలలోలాంశువుల్ మోమునం దాండవింపంగ లీ
లాంగుళీపల్లవన్యాసవైచిత్రిఁ దద్రంధ్రమార్గంబులన్
మంద్రముఖ్యస్వరోదారమానంబులన్ మాత్రి సప్తశ్రుతుల్
మేళవింపంగ నింపార వాయింప నీవేణునాదంబు పుట్టించు
నుత్కంఠచేఁ గంఠనాదాభినందత్ప్రికల్ గోపికల్ పార్శ్వ
భాగంబులం జోకగా మక్కువన్ జొక్కుచున్ సోలుచుం
బ్రాలుచుండంగ, నొండొండ నీకేళిగోపాలకుల్, మించి
వాయించు నీపిల్లఁగ్రోల్నేర్పు లేర్పాటు గావించు నా
దానుమోదంబునం గ్రీడయై నాదునాగంబులుం బోలెఁ
బూర్ణానురాగంబునం జంచలత్పింఛరింఛోళికాశ్రీవెలార్పం
దలల్ ద్రిప్పుచుం దత్ప్రకారంబుఁ దా రభ్యసింపంగ,

నన్యోన్యచిత్తాభిలాష క్రియల్ చెప్పుకొంచుండఁ, బశ్చాత్ప్రదేశంబునఁ డాసి రోమంథముల్ మాని ప్రేమానుబంధోత్కటత్కర్ణమై స్వర్ణభూషామిళద్బిందువచ్ఛృంగకోణాగ్రమై దివ్యమాణిక్యపుష్పస్రగాబద్ధమై కామధుగ్ధేనుబృందంబు గానామృతస్యంద మానందముం బొందుచుఁ గ్రోల, నుర్వీనుహాశ్శైలపాషాణమాణిక్యజాలంబులుం జాలువాఱంగఁ దాఁ బాడుటల్ దక్కనిక్కంపుఁ బ్రేమంబునం దొట్టి పెన్నిటిసీసై ముదం బంది కాళిందిమందానిలాందోళ నోత్తుంగ రంగత్తరంగైకహస్తంబులం దత్పదాంభోజముల్ కౌఁగిలింప న్మృగంబుల్ ఖగంబుల్ నిజగ్రాస కాంక్షన్విసర్జించి మోదింప వైరాగ్యచిత్తాదృతశ్రీ వనశ్రీ చలత్పల్లవోష్ఠంబునం గోరకోల్లాసహాసంబు భాసిల్లఁ బూగుత్తి పాలిండ్లపైఁ దత్పరాగోత్తరీయంబు జాఱన్ భ్రమద్భృంగదృగ్జాలకంబుల్ నివాళింప, నవనవమణికాంతిమత్పుష్పకారూఢ లింద్రాదిదిక్పాల నాళీకనేత్రల్ సురస్త్రీలు గంధర్వకాంతామణుల్ నాగకన్యల్ మహాసిద్ధ విద్యాధరాబ్జాననల్ దేవవారాంగనల్ వేణువీణామృదంగాదివాద్యధ్వనుల్ తాళమానంబులన్ మ్రోయఁగాఁ దావకీనస్ఫురద్వంశసంపూర్ణసంగీత జాతస్మరస్ఫీత చేతోవికారంబులన్ బాడుచున్ మేఘపంక్తిన్ దటిద్వల్లికల్ వోలెఁ జెల్లాడుచు న్మే గగుర్పాటు మ్రాన్పాటు వాటిల్లఁగా నుబ్బు నాగుబ్బఁగాఁ

బుష్కలాంభోద మామోదవత్పుష్పవృష్టుల్ ప్రవర్షింప
మార్గంబునం బంచభూతంబులుం బొంగ నాకాశగంగానదీ
పంకజాతాక్షి నా నంతరిక్షంబునం జక్షురుత్సాహ మే
పారం బ్రీత్యర్థమై నిల్చి యందంద బంగారుకెందమ్మి
పుష్పాళ్లుపైఁ జల్లఁగా జల్లనై మెల్లనై గంధపుంగొండ
మందానిలాంకూరముల్ మీఁదఁ బైకాడ నల్లాడు
పూదండలు న్వేణుదండంబునన్ వ్రేలుపూగుత్తులు న్మె
చ్చుపుట్టింప సొంపారు నీయాకృతి శ్రీసముద్దామ సీమంత
సిందూర రంజత్పదాంభోజ మందాకినీ సన్మరందావగా
హాకుల బ్రహ్మయోగీశ్వ రేందిందిరవ్రాత సంప్రీతి యా
దివ్యతేజోమయఖ్యాతి యానంతతానందలీలాసుధాం
భోధిసంరంభకృద్వక్త్రచంద్రోదయం బామహానిత్య
సత్యాకృతి శ్రీనయుం బాజగద్రక్షణోత్ఫుల్ల వేల్లత్కృపా
దృష్టి యావేణుదండ స్ఫుటోష్ఠ ప్రసన్నాత్మధుగీవృష్టి యా
యావనారంభ మావిభ్రమాడంబరం బామహారాజసం
బారసజ్ఞత్వ మాభవ్యమాయామనుష్యావతార క్రి
యాలీల లాలించినన్ లోఁ గిలించిన న్వాంఛితార్థంబు
సిద్ధించునంచుం దగ న్వేదవేదాంతవేదుల్ పరబ్రహ్మ
విద్యావివాదుల్ ఘనుల్, సరసిజభవరుద్ర దేవేంద్రము
ఖ్యుల్ సుఖప్రాప్తికై నీకు వాక్పుష్పపూజల్ సమర్పించి
నీవే పరబ్రహ్మయోగీంద్ర హృద్ధ్యేయచిద్వస్తువిస్తార మం
చుం బ్రశంసింతు రంచున్ శ్రుతుల్ చెప్పఁగా విందు

గోవింద నీకేళిబృందావనక్రీడ త్రైలోక్యసామ్రాజ్యలక్ష్మీ కళాప్రాప్తి కిం జాడ, నీవేణునాదంబు బ్రహ్మైకనాదంబు, నీభద్మకందర్పగోపాలరూపంబు సద్భక్తహృచ్చంద్రశాలా ప్రదీపంబు; నీరూపలావణ్యలీలావిలాసంబు నీమందహాసంబు నీవక్త్రచంద్రప్రసాదంబు నీయాశ్రితాయత్తచిత్త ప్రమోదంబు నీవేణువిద్యావిశేషంబు (నీగోప) గోపాల నారీ మనోహారివేషంబు నీచొప్పు నీయొప్పు డెందంబులం (బెక్కుచందంబులం) దోంచు వారే కదా (ధన్యులున్ బుణ్యులున్ గణ్యులున్?) శ్రీశుక బ్రహ్మయోగీంద్రుం డాత్మ ప్రకాశ ప్రమోదంబుం(గా నీదు రూపంబుం) బ్రేమంబుతో (నాత్మలో)నిల్పి యూహించు (మోహించు) నుంకించు (నంకించు) భావించు (సేవించు నెల్లప్పుడున్;) నీవు "నే నీవు" గానట్లుగాం గోరికల్ చేరికల్ సేయ లీలా వనీ (కేళులం గోపికల్ గోపకుల్ దేవ) దేవు న్నినున్ గూర్చి (తా రాత్మంబ్రేమించి భావించి సేవించి) లోకైకసంపత్కళాభోగభాగ్యంబులం (గాంచి మోదించి; రత్యంతసద్భక్తితో రక్తితో నెమ్మి) నిన్నాత్మ భావించు నీవారి కెవ్వారి కేమేమి నీ వీవు? నీవంటి కారుణ్య సంపాది, నీవంటి దాక్షిణ్య సంమోది, నీవంటి భక్తావనాయత్తచిత్తుండు, నీవంటి యిష్టార్థదానప్రవృత్తుండు, నీవంటి నిత్యుండు, (నీవంటి సత్యుండు,) నీవంటి సంసారతాపత్రయాభీలరుగ్దివ్యవైద్యుండు, నీ వం టి

వేదాంతవేద్యుండు, నీవంటిమాయాజగన్నాటకప్రక్రియా సూత్రధారుండు, నీవంటి విశ్వైకదృగ్మహానాకారరేఖా విహారుండు, లేఁ; డాదిమధ్యాంతపర్యాయకాలంబులుం గాలముం గాల చక్రక్రియాకృన్మహాపూరుషుండు న్మహామాయయుఁ సృష్టియుఁ నీవ నీయింద్రజాలంబు విశ్వప్రపంచంబు పంచాస్త్రగోపాలకృష్ణా ననుంబ్రోవుమీ భక్తిముక్తిప్రదా మాధవా రాధికామాధవా దేవదేవా నమస్తే నమస్తే నమస్తే నమః. 253

వ. అని సన్నుతించిన నమ్మహామునిమండలమధ్యంబున నున్నట్ల యప్పుడప్పుండరీకాక్షుం డక్షిగోచరం బైనయట్లయిన నందఱు జయజయధ్వానంబు లొనర్చిరి. దివిజపుష్పవర్షంబులు గురిసె నంత నతనియందలి భక్తి కభినందించి (ధర్మనందనుండు) గోవిందశర్మను వీడ్కొలిపిన (నతండును) ద్వారకానగరంబు నకుం బోయి శౌరిజగపాణియాలింగనాది సంభావనలు గైకొని యుండె; నారదాది యోగీంద్రులును, నమ్మహామునీంద్రులు ను ధర్మనందను దీవించి యాతనికి గోవిందశర్మ యుపదేశించినబ్రహ్మోపదేశంబు తమతమక యుపదేశించుటగాఁ దలంచి హరిని సంస్మరించుచుఁ దమతమనెలవులకుంబోయిరి. ధర్మపుత్రుండును సహోదరబంధుమిత్రవ్రాతంబుతో హరి నారాధించుచు సమస్తసామ్రాజ్య లక్ష్మీవిభవంబు లనుభవించుచు సుఖంబున నుండె; నని పరీక్షిన్నరేంద్రునకు శుకబ్రహ్మ చెప్పుటయును. 254

మ. నలినోద్భూతసుతోల్లస త్కనకవీణా బ్రహ్మనాదామృతో
చ్ఛలవీచీపరికర ప్రఫుల్లహృదయాబ్జాత ప్రవత్సత్కృపా
*కలనామందమరందపారణమిళత్కౌతూహలాక్రాంత ని
శ్చల భావోజ్జ్వలనిత్యముక్త మధులిట్చక్రోపకంఠక్షమా! †

స్రగ్విణి. సామజపరిస్తుతా! సన్మనీందార్చితా!
హైమపీతాంబరా! స్వాంఘ్రిపీతాంబరా!
కామలీలాకృతీ! కౌస్తుభాలంకృతీ!
కోమలాస్యాంబుజా! కుందదంతవ్రజా! 256

క. వేదాంతతత్త్వనిశ్చయ
వేదిమనోవేద్య! మదన విద్యాలీలా
మోదితరాధాముఖకమ
లోదరతాంబూలరస సముత్సుక హృదయా! 257

ఇది శ్రీమదన గోపాలచరణకమల సేవాధురీణ సత్కళాపారీణ
కృష్ణభట్టారకపౌత్ర చింతలపూఁడి కామయప్రభుసుపుత్ర
సుకవివర్య రాధామాధవ యెల్లనార్య ప్రణీతంబైన
విష్ణుమాయానాటకంబునందు సర్వంబును
పంచమాశ్వాసము.

శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ.

* కలనాచారుమరందపోషితమిళత్కౌతూహలక్రాంతిచే
వలనొప్పం నినుఁగొల్చి భక్తజనులున్ వర్ణింతురనిన్నెప్పుడున్. వ్రా. ప్ర.

† శ్రౌతల్చక్రోపకంఠక్షమా. ప్రా. పా.